
'అవినీతి, అసత్య వార్తలు క్యాన్సర్ కన్నా ప్రమాదకరం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 109

మంగళవారం 3-1-2023



కుర్రాళ్లతో కొత్త సమరం
నేడు శ్రీలంకతో భారత్ తొలి టి20.. టీమిండియాకు హార్దిక్ సారథ్యం -12లో




భారత్ ఎకానమీ దూకుడు!
క్లిష్టకాలంలోనూ నెట్టుకురాగలదంటూ అసోచామ్ నివేదిక -13లో

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | VIJAYAWADA | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



సిరియాపై ఇజ్రాయెల్ దాడి
ఇజ్రాయెల్ మరోసారి సిరియాపై దాడులకు తెగబడింది. డమాస్కస్‌లోని అంతర్జాతీయ ఎయిర్‌పోర్ట్‌పై క్షిపణి దాడులకు దిగింది.
వివరాలు 6లో ▸



ఒక్క క్షిపణితో 400 మంది హతం!
తమ సేనల భారీ క్షిపణి దాడిలో 400 మంది రష్యా సైనికులు చనిపోయారని, 300 మంది గాయపడ్డారని ఉక్రెయిన్ తెలిపింది.
వివరాలు 6లో ▸



ఆస్ట్రేలియాలో హెలికాప్టర్లు ఢీ
ఆస్ట్రేలియాలోని గోల్డ్‌కోస్ట్‌లోని మెయిన్ బీచ్‌లో రెండు హెలికాప్టర్లు ఢీకొనడంతో నలుగురు మరణించారు.
వివరాలు 6లో ▸

ఏజెన్సీలతో ఈడీ అనుసంధానం
సీబీఐతో పాటు వివిధ ఏజెన్సీల డేటాతో సులభంగా యాక్సెస్ చేసుకునేలా ఈడీ ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను సిద్ధం చేసుకుంది.
వివరాలు 6లో ▸

నిలువెత్తు నయవంచన

భారీ కానుక ఇస్తామంటూ టోకెన్లు పంచి మరీ జనాన్ని రప్పించిన బాబు

4 గంటలకు పైగా వేచి చూసేలా చేసి.. తరవాత ఇస్తామంటూ మోసం

- దాంతో ఆందోళన చెంది... తోసుకుంటూ ప్రాణాలు కోల్పోయిన నిరుపేదలు
- సభకు అనుమతి కోరింది టీడీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్
- అందులో చంద్రన్న సంక్రాంతి కానుక పంపిణీ గురించి ప్రస్తావనే లేదు
- ప్రైవేట్ కార్యక్రమమైనా 207 మందితో బందోబస్తు కల్పించిన పోలీసులు
- అదనంగా మరో 30 మంది కూడా.. సిద్ధంగా అక్కడే రెండు అంబులెన్స్‌లు
- గ్రౌండ్‌లో ఒకే ద్వారం ఉన్నా... గోడ పగలగొట్టి మరో మూడు ఎంట్రన్స్‌ల ఏర్పాటు
- పరిస్థితి చేయి దాటుతోంది.. కిట్లు పంచాలన్న పోలీసుల సూచనలు బేఖాతర్
- వేచి చూసి... కానుక ఇవ్వరేమోననే ఆందోళనతో జనం తోపులాట
- ముగ్గురు మరణించినట్లు తెలిసినా వెను దిరగకుండా హైదరాబాద్ వెళ్లిపోయిన బాబు
- సీఎం జగన్, వైఎస్సార్‌సీపీని దూషిస్తూ సోషల్ మీడియాలో 'ఉయ్యూరు' పోస్టులు
- ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా అదుపులోకి తీసుకుని విచారిస్తున్న సీసీఎస్ పోలీసులు
- మోసం, వంచన బాబు పేటెంట్లని.. మరోమారు బయటపడ్డాయని జనం వ్యాఖ్యలు



'సంక్రాంతి కానుక' ప్రస్తావన లేకుండా సభకు అనుమతి కోరుతూ టీడీపీ నేత శ్రావణ్‌కుమార్ రాసిన లేఖ

సాక్షి ప్రతినిధి, గుంటూరు: కానుకలంటూ ఆశ పెట్టి రప్పించిన అక్క చెల్లెమ్మలకు వెన్నుపోటు పొడిచారు.. రూ.300 నాసిరకం వస్తువులను రూ.వేల విలువైనవంటూ ఊరించారు.. చివరకు అవి కూడా ఇవ్వకుండా ఐదు గంటల పాటు నిర్బంధించారు.. ఆ మోసాన్ని భరించలేక కుప్పకూలిన మహిళల చావుకు చంద్రబాబు కారకుడయ్యారు! ప్రచార వ్యామోహం.. పేదల ప్రాణాలంటే లెక్కలేనితనం.. నిలువెత్తు నిర్లక్ష్యానికి మూడు నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. గుంటూరులో ఆదివారం టీడీపీ నిర్వహించిన చంద్రన్న కానుకల పంపిణీ కార్యక్రమం ఆద్యంతం
మిగతా 3వ పేజీలో ▶



సభాస్థలి వద్ద టీడీపీ నేతలు నామమాత్రంగా ఏర్పాటుచేసిన బారికేడ్లు

రాజకీయాల కోసం పేదల ప్రాణాలు తీస్తారా?

- చంద్రబాబుపై వైఎస్సార్‌సీపీ నేతల ఆగ్రహం.. బాబును ఏ–1గా చేర్చాలని డిమాండ్

బాబు సభలకు బలి పశువులు!

3 లో

విద్యుత్తు, నీళ్లు, డ్రైనేజీ

తప్పనిసరి

ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేకొద్దీ సదుపాయాలను కల్పించాలి: సీఎం జగన్

- నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకానికి అత్యంత ప్రాధాన్యం
- టిడ్కో కాకుండా ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు రూ.6,435 కోట్లు వ్యయం
- పేదల గృహ నిర్మాణాల్లో నాణ్యతపై ఏమాత్రం రాజీ పడొద్దు
- లబ్ధిదారులతో సిబ్బంది ఎప్పటికప్పుడు మాట్లాడుతుండాలి
- న్యాయ వివాదాలతో ఆగిన చోట్ల ప్రత్యామ్నాయాలను అన్వేషించాలి



సాక్షి, అమరావతి: వైఎస్సార్ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేకొద్దీ కరెంట్, నీటి సరఫరా, డ్రైనేజీ లాంటి కనీస సదుపాయాలను అందుబాటులోకి తేవాలని అధికారులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. కొత్త ఇళ్లలోకి ప్రవేశించే ముందు ఎవరైనా తొలుత వీటినే కోరుకుంటారని, అందువల్ల ఈ మూడింటిని తప్పనిసరిగా కల్పించాలని సూచించారు. పేదల గృహ నిర్మాణాలకు సంబంధించి నాణ్యత విషయంలో ఏమాత్రం రాజీ పడొద్దని స్పష్టం చేశారు. సోమవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో గృహ నిర్మాణ శాఖపై
మిగతా 2వ పేజీలో ▶

పింఛను లబ్ధిదారులతో నేడు సీఎం జగన్ ముఖాముఖి

- రెండురోజులుగా కోలాహలంగా పింఛను పెంపు వారోత్సవాలు
- నేడు రాజమహేంద్రవరంలో జరిగే కార్యక్రమంలో పాల్గొననున్న సీఎం

2 లో

న్యూస్‌రీల్

నిరాహార దీక్ష విరమించిన జోగయ్య



కాపులకు రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరాహార దీక్షను మాజీ మంత్రి హరిరామ జోగయ్య విరమించారు. జనసేన అధినేత పవన్ విజ్ఞప్తి మేరకు దీక్ష విరమిస్తున్నట్టు ఆయన ప్రకటించారు.
వివరాలు 2 ▸

డీజే ముసుగులో డ్రగ్ పెడ్లింగ్



దేశంలోనే ఘరానా ఈవెంట్ల డీజే సప్లయర్ మోహిత్ అగర్వాల్ అలియాస్ మైరోన్ మోహిత్‌ను డ్రగ్స్ కేసులో హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అరెస్టు చేశారు. అతని భార్య నేహా దేశ్ పాండే పలు టాలీవుడ్, బాలీవుడ్ చిత్రాల్లో హీరోయిన్‌గా నటించారు.
వివరాలు 14 ▸

నేడు గోదావరి బోర్డు భేటీ



అనుమతి లేకుండా చేపట్టిన ప్రాజెక్టుల డీపీఆర్ మదింపు, గెజిట్ నోటిఫికేషన్‌పై ఏకాభిప్రాయ సాధనకు గోదావరి బోర్డు మంగళవారం సమావేశం కాబోతోంది. నిబంధనలకు విరుద్ధంగా తెలంగాణ చేపట్టిన చనకా–కొరటా, చిన్న కాళేశ్వరం, గుత్ప ఎత్తిపోతలకు ఇచ్చిన సాంకేతిక అనుమతులను పునః సమీక్షించాలని ఏపీ డిమాండ్ చేయనుంది.
వివరాలు 14 ▸

వెలుగు జిలుగుల భారత్ సృష్టిస్తాం



బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే రెండేళ్లలో వెలుగు జిలుగుల భారత్‌ను సృష్టిస్తామని ఆ పార్టీ అధినేత, తెలంగాణ సీఎం కేసీఆర్ ప్రకటించారు. ఏపీకి చెందిన పలువురు నాయకులు సోమవారం హైదరాబాద్‌లో కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.
వివరాలు 14 ▸

నోట్ల రద్దు సబబే

నిర్ణయ ప్రక్రియలో లోపాల్లేవు: సుప్రీంకోర్టు

- ధర్మాసనం మెజారిటీ తీర్పు
- విభేదించిన జస్టిస్ నాగరత్న
- రద్దు చట్టవిరుద్ధమంటూ తీర్పు



రూ.500, రూ.1,000 నోట్లను రద్దు చేస్తూ కేంద్రం ఆరున్నరేళ్ల కిందట తీసుకున్న నిర్ణయాన్ని సుప్రీంకోర్టు సమర్థించింది. 'ఈ నిర్ణయం తీసుకునే ముందు కేంద్రానికి, ఆర్‌బీఐకి మధ్య ఆర్నెల్ల పాటు సంప్రదింపులు జరిగాయి. కనుక పిటిషనర్లు ఆరోపించినట్టుగా నోట్ల రద్దు నిర్ణయ ప్రక్రియలో న్యాయ, రాజ్యాంగపరమైన లోపాలేవీ చోటుచేసుకోలేదు' అని స్పష్టం చేసింది. నోట్ల రద్దును సవాలు చేస్తూ దాఖలైన 58 పిటిషన్లను కొట్టేసింది. న్యాయమూర్తులు జస్టిస్ నజీర్, జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ ఏఎస్ బొపన్న, జస్టిస్ వి.రామసుబ్రమణియన్ నోట్ల రద్దులో లోపాల్లేవని చెప్పగా.. జస్టిస్ నాగరత్న విభేదిస్తూ విడిగా తీర్పు వెలువరించారు. 'ఇది కేవలం 24 గంటల్లో తీసుకున్న హడావుడి నిర్ణయం. అందుకు అనుసరించిన తీరు కూడా పూర్తిగా చట్టవిరుద్ధం. ఇది ఆర్‌బీఐ స్వతంత్ర ఆలోచన కాదని స్పష్టమవుతోంది. పార్లమెంటులో విస్తృతంగా చర్చించి ఈ మేరకు చట్టం చేయాల్సింది. కానీ, ఇది ఆరేళ్ల క్రితం నాటి నిర్ణయం కనుక దీనిపై స్టే ఇవ్వలేం' అని జస్టిస్ నాగరత్న తీర్పులో పేర్కొన్నారు.

6 లో

ఇప్పటికీ.. క్యాషే కింగ్!

- నోట్ల రద్దుతో చెల్లకుండా పోయిన 86 శాతం కరెన్సీ.. ఆరున్నరేళ్ల తర్వాత 83 శాతం పెరిగిన నగదు చలామణి

రాహుల్ క్షమాపణలు చెప్పాలి: బీజేపీ

కేంద్రానికి చెంపదెబ్బ తీర్పే: కాంగ్రెస్

6 లో

తిరుమలలో స్వర్ణరథంపై ఊరేగుతున్న మలయప్ప స్వామిని దర్శించుకుంటున్న భక్తులు



స్వర్ణ రథంపై సర్వాంతర్యామి

తిరుమలలో వైభవంగా వైకుంఠ ఏకాదశి మహోత్సవం

- గోవిందనామ స్మరణతో మార్మోగిన సప్తగిరులు
- రాష్ట్ర వ్యాప్తంగా వైష్ణవాలయాలకు పోటెత్తిన భక్తులు

తిరుమల/మంగళగిరి/సింహాచలం/శ్రీశైలం టెంపుల్/నెల్లిమర్ల: ఇల వైకుంఠం తిరుమలలో సోమవారం వైకుంఠ ఏకాదశి మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వర్ణరథంపై సర్వాంతర్యామి అయిన శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. గోవింద నామ స్మరణతో సప్తగిరులు పులకించాయి. శ్రీవారికి ప్రాతఃకాల ఆరాధన అనంతరం వైకుంఠ ఏకాదశి ఆస్థానాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. సామాన్య భక్తులకు సైతం గంట ముందుగానే ఆరు గంటలకే సర్వదర్శనం ప్రారంభించారు. అలంకార ప్రియుడైన శ్రీనివాసుడి సన్నిధిని అరుదైన పుష్పాలు, ఫలాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ నుంచి ప్రత్యేకంగా తెప్పించిన పుష్పాలను వినియోగించారు. పది టన్నుల పుష్పాలు, లక్ష కట్ ఫ్లవర్స్ అలంకరణకు వాడారు. ఆలయ మహాగోపురానికి పుష్పాలతో ఏర్పాటు చేసిన విష్ణుమూర్తి, శంఖుచక్రాలు..
మిగతా 5వ పేజీలో ▶

ఆ వ్యాజ్యాలనూ మేమే విచారిస్తాం

- పేదల ఇంటి స్థలాల వ్యాజ్యాల విచారణపై హైకోర్టు త్రిసభ్య ధర్మాసనం స్పష్టీకరణ
- ద్విసభ్య ధర్మాసనం ముందున్న వ్యాజ్యాలనూ తమ ముందుంచాలని ఆదేశం
- తదుపరి విచారణ ఫిబ్రవరి 27వ తేదీకి వాయిదా
- కోర్టు ధిక్కార వ్యాజ్యాలపైనా విచారణ వాయిదా



సాక్షి, అమరావతి: రాజధాని ప్రాంతంలో ఇతర ప్రాంతాల వారికి సైతం ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు వీలుగా సీఆర్‌డీఏ చట్టాన్ని సవరిస్తూ ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాన్ని సవాల్ చేస్తూ రాజధాని రైతు పరిరక్షణ సమితి, అమరావతి రాజధాని సమీకరణ రైతు సమాఖ్య, మరి కొందరు వేర్వేరుగా దాఖలు చేసిన
మిగతా 2వ పేజీలో ▶



..ఎలాగోలాగా ప్రచారం మాత్రం వస్తుంది సార్!!

రోడ్లపై సభలు, ర్యాలీలు నిషేధం

ప్రజల భద్రత కోసం ప్రభుత్వం కీలక నిర్ణయం

- రాష్ట్ర, మున్సిపల్, పంచాయతీరాజ్ రోడ్లు, మార్జిన్లకు నిబంధన వర్తింపు
- ప్రత్యామ్నాయ ప్రదేశాలు ఎంపిక చేయాలని అధికారులకు ఆదేశం
- రోడ్లకు దూరంగా, ప్రజలకు ఇబ్బంది లేకుండా ప్రదేశాలను ఎంపిక
- ఎంపిక చేసిన ప్రదేశాల్లోనే సభలు, ర్యాలీలు.. అత్యంత అరుదైన సందర్భాల్లో షరతులతో అనుమతి
- షరతులు ఉల్లంఘిస్తే నిర్వాహకులపై కఠిన చర్యలు
- ఇటీవలి రెండు దుర్ఘటనల నేపథ్యంలో హోం శాఖ ఉత్తర్వులు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో రహదారులపై బహిరంగ సభలు, ర్యాలీలను రాష్ట్ర ప్రభుత్వం నిషేధించింది. ఇకపై జాతీయ, రాష్ట్ర, మున్సిపల్, పంచాయతీరాజ్ రహదారులపైన, మార్జిన్లలో సభలు, ర్యాలీలకు అనుమతించేది లేదని స్పష్టం చేసింది. అత్యంత అరుదైన సందర్భాల్లో జిల్లా ఎస్పీలు లేదా పోలీస్ కమిషనర్లు కచ్చితమైన షరతులతో అనుమతి ఇవ్వొచ్చని మినహాయింపునిచ్చింది. ఈమేరకు హోం శాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. 1861 పోలీస్ చట్టం ప్రకారం హోం శాఖ ముఖ్య కార్యదర్శి హరీశ్ కుమార్ గుప్తా సోమవారం ఈ ఉత్తర్వులు జారీ చేశారు. రోడ్లపై బహిరంగ సభలు, ర్యాలీలతో ప్రజలకు అసౌకర్యం కలిగిస్తుండటంతోపాటు, వాటి నిర్వహణలో లోటుపాట్లు, నిర్వాహకుల నిర్లక్ష్యం ప్రజల ప్రాణాలను బలిగొంటున్న నేపథ్యంలో 30 పోలీస్ యాక్ట్‌ను అమలు చేస్తూ ఈ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో జాతీయ, రాష్ట్ర, మున్సిపల్, పంచాయతీరాజ్ రహదారులు పూర్తిగా ప్రజల రాకపోకలు, సరుకు రవాణా కోసమే ఉపయోగించాలని స్పష్టం చేసింది. గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో సభల నిర్వహణకు ప్రత్యామ్నాయ ప్రదేశాలను ఎంపిక చేయాలని ప్రభుత్వం జిల్లాల ఉన్నతాధికారులకు సూచించింది. రహదారులకు దూరంగా, సాధారణ ప్రజలకు ఇబ్బంది కలగకుండా సరైన ప్రదేశాలను
మిగతా 2వ పేజీలో ▶

స్మార్ట్ మీటర్లపై ఇంధన శాఖకు

అభ్యంతరం లేదు

స్మార్ట్ మీటర్ల ప్రాజెక్టును మేమే ముందుండి నడిపిస్తున్నాం

- ఆర్థిక శాఖ సందేహాల నివృత్తికి రాసిన లేఖను వక్రీకరిస్తున్నారు
- ప్రజలపై ఆర్థిక భారం పడుతుందనేది అపోహే
- స్మార్ట్ మీటర్ల ఏర్పాటు రాష్ట్ర నిర్ణయం కాదు
- దేశమంతా స్మార్ట్ మీటర్లను కేంద్రం తప్పనిసరి చేసింది
- ఇప్పటికే 15 రాష్ట్రాల్లో వీటి ఏర్పాటు మొదలైంది
- కేంద్రం స్టాండర్డ్ టెండర్ డాక్యుమెంట్‌నే అనుసరిస్తున్నాం
- రూ.5,484 కోట్లు కేంద్రం గ్రాంట్‌గా ఇస్తుంది
- వాస్తవాలను పూర్తిగా పక్కనపెట్టి అవాస్తవాలు రాయొద్దు

ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో స్మార్ట్ విద్యుత్ మీటర్ల ఏర్పాటుకు ఇంధన శాఖకు అభ్యంతరం లేదని, నిజానికి తామే ముందుండి ఈ ప్రాజెక్టును నడిపిస్తున్నామని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ స్పష్టంచేశారు. కొన్ని నెలల క్రితం ఆర్థిక శాఖ లేవనెత్తిన సందేహాలను నివృత్తి చేయాలని తాను డిస్కంలకు అంతర్గతంగా రాసిన లేఖలను కొన్ని పత్రికలు వక్రీకరించాయని, ఆ లేఖలు పూర్తిగా
మిగతా 14వ పేజీలో ▶

క్లుప్తంగా...

నేడు, రేపు తేలికపాటి వానలు!

మరోవైపు క్షీణిస్తున్న కనిష్ట ఉష్ణోగ్రతలు

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంపైకి వీస్తున్న ఈశాన్య గాలుల వల్ల రానున్న రెండు రోజులు దక్షిణ, ఉత్తర కోస్తాంధ్రల్లో ఒకటి, రెండు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని భారత వాతావరణ విభాగం సోమవారం రాత్రి నివేదికలో తెలిపింది. రాయలసీమలో పొడి వాతావరణం నెలకొంటుందని పేర్కొంది. మరోవైపు ఏపీలోనూ రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుతున్నాయి. చలి క్రమంగా పెరుగుతోంది. అల్లూరి సీతారామరాజు, అన్నమయ్య, చిత్తూరు, శ్రీసత్యసాయి జిల్లాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. ఆయా జిల్లాల్లో 11 నుంచి 14 డిగ్రీల మధ్య రాత్రి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు జి.మాడుగులలో 11.6 డిగ్రీలు, వాల్మీకిపురం (అన్నమయ్య)లో 12.6, ముంచంగిపుట్టు (అల్లూరి సీతారామరాజు)లో 13.1, మడకశిర (శ్రీసత్యసాయి)లో 13.2, సోమాల (చిత్తూరు)లో 13.7, బెలుగుప్ప (అనంతపుర)లో 14.9 డిగ్రీల చొప్పున కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న రెండు, మూడు రోజుల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు మరింత తగ్గే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు.

బీఎస్సీ అగ్రికల్చరల్ సీట్ల భర్తీకి మూడోదశ కౌన్సెలింగ్

5వ తేదీ నుంచి 8వ తేదీవరకు నిర్వహణ

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో మిగిలిన బీఎస్సీ అగ్రికల్చరల్ సీట్ల భర్తీకి మూడోదశ కౌన్సెలింగ్‌ను నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల ఐదోతేదీ నుంచి ఎనిమిదోతేదీ వరకు మూడోదశ కౌన్సెలింగ్‌ను గుంటూరు నగర శివారులోని లాం ఫాం వ్యవసాయ పరిశోధన స్థానంలో ఉన్న ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు వివరించారు. గతంలో రిజిస్టర్ చేసుకున్న విద్యార్థులు ర్యాంకుల ఆధారంగా తమకు కేటాయించిన తేదీల్లో హాజరుకావాలని కోరారు. వివరాలకు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. ఏఎన్‌జీఆర్‌ఏయు. ఏపీ.ఇన్ వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

1,629 దాడులు.. 541 కేసులు..

- 36మందిపై బైండోవర్ కేసులు
- 2022లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం దూకుడు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వివిధ ఉత్పత్తుల బ్లాక్ మార్కెటింగ్, ప్రభుత్వ శాఖల్లో అవకతవకలపై విజిలెన్స్–ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం కొరడా ఝుళిపిస్తోంది. విజిలెన్స్–ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం పనితీరును ఆ శాఖ కమిషనర్ శంకబ్రాత బాగ్చీ విజయవాడలో సోమవారం నిర్వహించిన సమావేశంలో సమీక్షించారు. 2022లో విజిలెన్స్ విభాగం రాష్ట్రవ్యాప్తంగా 1,629 దాడులు నిర్వహించింది. 541 కేసులు నమోదు చేసింది. పలు క్రిమినల్ కేసులు నమోదు చేయడంతోపాటు బ్లాక్ మార్కెటింగ్‌కు అలవాటుపడిన 36మందిపై బైండోవర్ కేసులను కూడా నమోదు చేశారు. ఎటువంటి అవకతవకలపైన అయినా సరే వాట్సాప్ నంబర్ 9440906254కు ఫిర్యాదు చేయాలని విజిలెన్స్–ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం కోరింది.

కాపులను అడ్డుపెట్టి కుట్ర రాజకీయాలు

- కాపు కార్పొరేషన్ చైర్మన్ శేషు



సాక్షి, అమరావతి: కాపులను అడ్డుపెట్టుకుని మరోసారి కుట్ర రాజకీయాలకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, కాపులను మోసం చేసిన చంద్రబాబు ట్రాప్‌లో పడొద్దని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషగిరి (శేషు) విజ్ఞప్తి చేశారు. ఆయన సోమవారం తాడేపల్లిలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాపులను మళ్లీ రెచ్చగొట్టి లబ్ధి పొందడానికి, వారిని ఇబ్బందుల్లోకి నెట్టడానికి ప్రయత్నం జరుగుతోందని అన్నారు. చంద్రబాబు కుట్రలకు పవన్ తోడ్పాటునందిస్తున్నారని ఆరోపించారు. రంగాను టీడీపీ వాళ్లే హత్య చేయించారని తన పుస్తకంలో రాసిన మాజీ మంత్రి చేగొండి హరిరామ జోగయ్య ఇప్పుడు కాపు జాతిని రెచ్చగొట్టేలా దీక్షకు దిగడం బాధాకరమన్నారు. 87 ఏళ్ల జోగయ్యతో పథకం ప్రకారం దీక్ష చేయిస్తున్నది ఎవరని అనుమానం వ్యక్తం చేశారు. కాపు రిజర్వేషన్ల కోసం ముద్రగడ ఉద్యమం చేసినప్పుడు పవన్, జోగయ్య, జీవీఎల్ ఎక్కడున్నారని నిలదీశారు. కాపులకు రిజర్వేషన్లు ఇవ్వడం తన చేతిలో లేని పని అని, వారికి ఆర్థికంగా, సామాజికంగా ప్రోత్సాహం అందిస్తానని కిర్లంపూడి సభలో ప్రకటించిన సీఎం వైఎస్ జగన్.. ఇచ్చిన మాటకు కట్టుబడి కాపుల సంక్షేమానికి పెద్ద ఎత్తున కృషి చేస్తున్నారని వివరించారు. చంద్రబాబు ఐదేళ్ల కాలంలో కాపుల సంక్షేమానికి రూ.1,200 కోట్లు ఖర్చు చేస్తే సీఎం వైఎస్ జగన్ మూడున్నరేళ్లలోనే రూ.1,500 కోట్లు ఖర్చు చేశారన్నారు. బాబు పాలనలో జన్మభూమి కమిటీలు సిఫారసు చేస్తే పథకాలు అందేవని, సీఎం వైఎస్ జగన్ కులం, మతం, ప్రాంతం, పార్టీ చూడకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్, చంద్రబాబు ఇద్దరిలో కాపులకు నిజమైన మేలు చేసింది ఎవరో బహిరంగ చర్చలకు తాను సిద్ధమని అడపా శేషు సవాల్ విసిరారు.



అమలాపురంలో చికిత్స పొందుతున్న మామిడికుదురు మండలం పెదపట్నం గ్రామానికి చెందిన కొమ్ముల పుత్రరావుకు పింఛను అందజేస్తున్న వలంటీర్ ప్రశాంతి



విజయనగరం జిల్లా రామభద్రపురం కూరాకుల వీధికి చెందిన తాళ్లవీరమ్మకు పింఛను అందజేస్తున్న వలంటీర్ చొక్కాపు అక్కమ్మ



గుంటూరు పశ్చిమ నియోజకవర్గం ముత్యాలరెడ్డి నగర్‌కు చెందిన మోహన్‌కు దివ్యాంగ పింఛను అందజేస్తున్న వలంటీర్ సీత



శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మండలం బుడ్డేపుపేటలో ఆసి జయమ్మకు వృద్ధాప్య పింఛను అందజేస్తున్న వలంటీర్ చిన్ని బైరి



ఒంగోలు నగరం వడ్డెవానికుంటలో దివ్యాంగురాలు పద్మావతికి పింఛను అందజేస్తున్న వలంటీర్ రేణుక



నెల్లూరు ప్రభుత్వాస్పత్రిలో రాపూరు మండలం పులిగిలపాడుకి చెందిన చెన్నయ్యకు పింఛను అందజేస్తున్న వలంటీర్ నాగరాజు



విజయవాడ వన్‌టౌన్‌లోని చిట్టినగర్‌లో డి.అచ్చాయమ్మకు పింఛను అందిస్తున్న వలంటీర్ శ్రీలక్ష్మి



కర్నూలు నగరంలోని పెద్దపడకానలో టి.బాబు అనే వృద్ధుడికి పింఛను అందజేస్తున్న వలంటీర్ అనిత



నర్సీపట్నంలో చికిత్స పొందుతున్న అనకాపల్లి జిల్లా చినబొడ్డేపల్లికి చెందిన నాగభూషణానికి పింఛను అందజేస్తున్న వలంటీర్ దుర్గాప్రసాద్

పింఛను లబ్ధిదారులతో నేడు సీఎం జగన్ ముఖాముఖి

- రెండురోజులుగా కోలాహలంగా పింఛను పెంపు వారోత్సవాలు
- నేడు రాజమహేంద్రవరంలో జరిగే కార్యక్రమంలో పాల్గొననున్న ముఖ్యమంత్రి
- పింఛను రూ.2,750కి పెంచడంతో రాష్ట్రవ్యాప్తంగా లబ్ధిదారుల్లో ఆనందోత్సాహాలు
- పలుచోట్ల పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలు

సాక్షి, అమరావతి: అవ్వాతాతలకిచ్చే పింఛను మొత్తాన్ని రూ.2,750కి పెంచిన సందర్భంగా రెండురోజులుగా రాష్ట్రవ్యాప్తంగా కోలాహలంగా పింఛను పెంపు వారోత్సవాలు కొనసాగుతున్నాయి. పలుచోట్ల మంత్రులు, ఎమ్మెల్యేలు పింఛన్ల పంపిణీలో పాల్గొని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా వివక్ష, పక్షపాతం లేకుండా సంతృప్తస్థాయిలో పింఛన్లు ఇస్తున్న తీరును లబ్ధిదారులకు వివరిస్తున్నారు. మంగళవారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో జరిగే పింఛన్ల పెంపు వారోత్సవాల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారు. ముఖ్యమంత్రి ఉదయం 10 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి 11 గంటలకు రాజమహేంద్రవరం చేరుకుంటారు. 11.20 నుంచి మధ్యాహ్నం 1.10 గంటల వరకు ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో వైఎస్సార్ పెన్షన్ కానుక పెంపుదల, లబ్ధిదారులతో ముఖాముఖి కార్యక్రమానికి హాజరవుతారు. అనంతరం బహిరంగసభలో ప్రసంగిస్తారు. మధ్యాహ్నం 1.40 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 2.40 గంటలకు తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

లబ్ధిదారులకు ఇప్పటికే రూ.1,555.22 కోట్లు

సోమవారం సాయంత్రానికే రాష్ట్రంలో అవ్వాతాతలకు రూ.1,555.22 కోట్ల పింఛను డబ్బులు చేతికి అందాయి. ఈ నెలకుగాను రాష్ట్రవ్యాప్తంగా 64.06 లక్షలమంది అవ్వాతాతలు, వితంతు, దివ్యాంగ, ఒంటరి మహిళ, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు తదితరులకు ఇచ్చే సామాజిక పింఛన్లను ప్రభుత్వం విడుదల చేసింది. ఒకటో తేదీ తెల్లవారుజామునుంచే వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి సోమవారం సాయంత్రం వరకు 56,45,548 (88.13 శాతం) మందికి పింఛన్లు పంపిణీ చేశారని సెర్ప్ అధికారులు చెప్పారు.

విద్యుత్తు, నీళ్లు, డ్రైనేజీ తప్పనిసరి

▶ మొదటి పేజీ తరువాయి

సీఎం జగన్ ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. ఆ వివరాలివీ..

నిర్ణీత దశకు రాగానే కరెంట్ కనెక్షన్

నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు పథకానికి అత్యంత ప్రాధాన్యమిస్తూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో టిడ్కో ఇళ్లు కాకుండా రూ.6 వేల కోట్లకు పైగా నిధులను ఇప్పటికే ఇళ్ల నిర్మాణాల కోసం ఖర్చు పెట్టాం. గృహ నిర్మాణాలు పూర్తవుతున్నకొద్దీ కనీస సదుపాయాలను కల్పించాలి. ఇళ్ల లబ్ధిదారులతో క్షేత్ర స్థాయి సిబ్బంది ఎప్పటికప్పుడు మాట్లాడుతూ ఉండాలి. నిర్మాణం నిర్ణీత దశకు చేరుకోగానే ఇళ్లకు కరెంట్ కనెక్షన్ ఇవ్వాలి. ఇందుకు తగ్గట్టుగా తగిన ప్రణాళికతో ముందుకు వెళ్లాలి.

ప్రత్యామ్నాయ స్థలాలు..

రాష్ట్రవ్యాప్తంగా వేల సంఖ్యలో ఏర్పాటైన కాలనీల్లో లక్షల ఇళ్లను నిర్మించడం ద్వారా నిరుపేదలకు గృహ యోగం కల్పిస్తున్నాం. కొన్ని చోట్ల న్యాయ వివాదాల కారణంగా ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోయాయి. వాటిపై దృష్టి సారించాలి. కోర్టు వివాదాలతో ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోయిన చోట్ల వెంటనే ప్రత్యామ్నాయ స్థలాలను అన్వేషించి ఆ స్థలాల్లో పేదల ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించాలి.



గృహనిర్మాణశాఖపై నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

లేఅవుట్ల సందర్శన.. 4 రకాల పరీక్షలు

రాష్ట్రవ్యాప్తంగా నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకం ప్రగతిని సమీక్షలో అధికారులు వివరించారు. వైఎస్సార్ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం వేగంగా సాగుతోందని తెలిపారు. టిడ్కో ఇళ్లు కాకుండా ఈ ఆర్థిక సంవత్సరంలో గృహ నిర్మాణాల కోసం ఇప్పటివరకు రూ. 6,435 కోట్లు ఖర్చు చేసినట్లు ముఖ్యమంత్రికి వివరించారు. క్రమం తప్పకుండా లేఅవుట్లను సందర్శించి ఇళ్ల నిర్మాణ ప్రగతిని పరిశీలిస్తున్నామని, డిసెంబర్‌లో రాష్ట్రవ్యాప్తంగా నాలుగు దఫాలు లేఅవుట్లను పరిశీలించినట్లు వెల్లడించారు. ఇళ్ల నిర్మాణంలో నాణ్యత కోసం ప్రత్యేక చర్యలు చేపట్టి మొత్తం నాలుగు రకాల పరీక్షలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అన్ని లేఅవుట్లలో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందుకు అవసరమైన ల్యాబ్‌లను కూడా సిద్ధం చేసుకున్నట్లు చెప్పారు. సమీక్షలో గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, సీఎస్ డాక్టర్ జవహర్‌రెడ్డి, ప్రత్యేక కార్యదర్శులు అజయ్‌జైన్, సాయిప్రసాద్, విజయానంద్, ఏపీ టిడ్కో ఎండీ సీహెచ్ శ్రీధర్, సీసీఎల్‌ఏ కార్యదర్శి ఇంతియాజ్, ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ లక్ష్మీ షా, గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి మహమ్మద్ దివాన్ పాల్గొన్నారు.

ఆ వ్యాజ్యాలనూ మేమే విచారిస్తాం

▶ మొదటి పేజీ తరువాయి

వ్యాజ్యాలపై హైకోర్టు త్రిసభ్య ధర్మాసనం కీలక నిర్ణయం తీసుకుంది. ద్విసభ్య ధర్మాసనం ముందున్న ఆ వ్యాజ్యాలను సైతం తామే విచారిస్తామని త్రిసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. ఆ వ్యాజ్యాలను తమ ముందుంచాలని సీజే నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం హైకోర్టు రిజిస్ట్రీని సోమవారం ఆదేశించింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 27వ తేదీకి వాయిదా వేసింది. ఇదిలావుంటే రాజధాని నగరాన్ని, రాజధాని ప్రాంతాన్ని 6 నెలల్లో అభివృద్ధి చేయాలంటూ ఇచ్చిన తీర్పును ముఖ్యమంత్రి, మంత్రులు, ఇతర అధికారులు ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘిస్తున్నారని, వీరి చర్యలను కోర్టు ధిక్కారంగా పరిగణించి, వారిని శిక్షించాలంటూ రాజధాని రైతులు దోనె సాంబశివరావు, తాటి శ్రీనివాసరావు, మరికొందరు దాఖలు చేసిన కోర్టు ధిక్కార వ్యాజ్యాలపై విచారణను కూడా ఫిబ్రవరి 27కి వాయిదా వేసింది. రాజధాని వ్యవహారంపై సుప్రీంకోర్టులో విచారణ జరుగుతున్న నేపథ్యంలో ఈ అంశంపై తాము ఇప్పుడు విచారణ జరపడం సబబు కాదని స్పష్టం చేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తులు జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు, జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్‌రాయ్‌తో కూడిన త్రిసభ్య ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టు స్టే ఇచ్చింది

రాజధాని నగరాన్ని, రాజధాని ప్రాంతాన్ని 6 నెలల్లో అభివృద్ధి చేయాలంటూ ఇచ్చిన తీర్పును ముఖ్యమంత్రి, మంత్రులు, ఇతర అధికారులు ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘిస్తున్నారని, వీరి చర్యలను కోర్టు ధిక్కారంగా పరిగణించి, వారిని శిక్షించాలంటూ రాజధాని రైతులు దాఖలు చేసిన కోర్టు ధిక్కార వ్యాజ్యాలు సోమవారం విచారణకు వచ్చాయి. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది చింతల సుమన్ స్పందిస్తూ.. అమరావతి రాజధాని విషయంలో హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో ప్రభుత్వం స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసిందని తెలిపారు. విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు రాజధాని అభివృద్ధి విషయంలో హైకోర్టు నిర్దేశించిన కాల పరిమితులపై స్టే విధించిందన్నారు. ఈ నెల 31న సుప్రీంకోర్టు ఈ వ్యవహారంపై మరోసారి విచారణ జరపనున్న దృష్ట్యా విచారణను ఫిబ్రవరికి వాయిదా వేయడం మేలన్నారు. అదనపు అడ్వొకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, సీఆర్‌డీఏ న్యాయవాది కాసా జగన్‌మోహన్‌రెడ్డి తమ వాదనలు వినిపిస్తూ.. రాజధాని ప్రాంతంలో ఇతరులకు సైతం ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు వీలుగా ప్రభుత్వం చట్ట సవరణ చేసిందన్నారు. ఈ నేపథ్యంలో ఆ వ్యాజ్యాలన్నీ నిరర్థకం అవుతాయని, ఆ మేరకు మెమో కూడా దాఖలు చేశామన్నారు. ఈ మెమోకు కౌంటర్ దాఖలు చేయాలని పిటిషనర్లను ధర్మాసనం ఆదేశించిందని, అయినప్పటికీ కౌంటర్ దాఖలు చేయలేదని తెలిపారు. కౌంటర్ దాఖలు చేయకపోవడమే కాక, ప్రధాన అభ్యర్థనను సవరిస్తూ అనుబంధ పిటిషన్ దాఖలు చేశారన్నారు. అంతేకాక చట్ట సవరణను సవాల్ చేస్తూ పిటిషనర్లు ద్విసభ్య ధర్మాసనం ముందు పిటిషన్లు దాఖలు చేశారని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. ఈ వ్యాజ్యాలను జీవో 107ను సవాల్ చేస్తూ దాఖలు చేసిన వ్యాజ్యాలతో జత చేయాలని వారు త్రిసభ్య ధర్మాసనాన్ని అభ్యర్థించారు. దీంతో ద్విసభ్య ధర్మాసనం ముందున్న వ్యాజ్యాలను తమ ముందుంచాలంటూ ధర్మాసనం ఉత్తర్వులిచ్చింది.

ఆ విషయం ఎందుకు చెప్పలేదు

పిటిషనర్ల తరఫు న్యాయవాదుల్లో ఒకరైన సాయి సంజయ్ సూరనేని వాదనలు వినిపిస్తూ.. చట్ట సవరణపై తాము దాఖలు చేసిన వ్యాజ్యాలపై ద్విసభ్య ధర్మాసనం విచారణ జరుపుతోందన్నారు. విచారణ ముగిసేంత వరకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయబోమంటూ ద్విసభ్య ధర్మాసనం ముందు ప్రభుత్వం హామీ ఇచ్చిందని, ఆ హామీని గతంలో దాఖలైన వ్యాజ్యాలకు సైతం వర్తింప చేయాలని కోరారు. దీనిపై త్రిసభ్య ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. ఇదే అంశంపై ద్విసభ్య ధర్మాసనం ముందు పిటిషన్లు దాఖలు చేసిన విషయాన్ని తమ దృష్టికి తీసుకురావాల్సిన బాధ్యత పిటిషనర్లపై ఉందని తేల్చి చెప్పింది. ఇళ్ల స్థలాల కేటాయింపు వ్యవహారంపై త్రిసభ్య ధర్మాసనం విచారణ జరుపుతున్న విషయాన్ని ద్విసభ్య ధర్మాసనానికి ఎందుకు చెప్పలేదని ప్రశ్నించింది. ద్విసభ్య ధర్మాసనం ముందున్న వ్యాజ్యాలను కూడా తామే విచారిస్తామని స్పష్టం చేసింది.

రోడ్లపై సభలు, ర్యాలీలు నిషేధం

▶ మొదటి పేజీ తరువాయి

ఎంపిక చేయాలని పేర్కొంది. వివిధ పార్టీలు, ఇతర సంస్థలు సభలను ఎంపిక చేసిన ప్రదేశాల్లో నిర్వహించుకోవచ్చని చెప్పింది.

అత్యంత అరుదైన సందర్భాల్లో..

అత్యంత అరుదైన సందర్భాల్లో జిల్లా ఎస్పీలు/పోలీస్ కమిషనర్లు సంతృప్తి చెందితే షరతులతో సభలు, ర్యాలీలకు అనుమతినివ్వొచ్చు. అందుకు నిర్వాహకులు ముందుగా లిఖితపూర్వకంగా అనుమతి తీసుకోవాలి. సభను ఏ ఉద్దేశంతో నిర్వహిస్తున్నారు, ఏ సమయం నుంచి ఏ సమయం వరకు నిర్వహిస్తారు, కచ్చితమైన రూట్ మ్యాప్, హాజరయ్యేవారి సంఖ్య, సక్రమ నిర్వహణకు తీసుకుంటున్న చర్యలను వివరిస్తూ దరఖాస్తు చేసుకోవాలి. వాటిపై జిల్లా ఎస్పీ/పోలీస్ కమిషనర్ సంతృప్తి చెందితే నిర్వాహకుల పేరిట షరతులతో అనుమతిని స్తారు. సభ, ర్యాలీ నిర్వహణలో షరతులను ఉల్లంఘిస్తే నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారు.

ప్రజల ప్రాణాలు కాపాడేందుకే

రాష్ట్రంలో రహదారులపై నియంత్రణ లేకుండా సభలు, ర్యాలీల నిర్వహణ వల్ల సామాన్య ప్రజానీకం ప్రాణాలు కోల్పోతున్నారు. పలువురు తీవ్రంగా గాయపడుతున్నారు. ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా కందుకూరులో రోడ్డుపై టీడీపీ నిర్వహించిన బహిరంగ సభలో తొక్కిసలాట జరిగి 8 మంది సామాన్యులు దుర్మరణం చెందారు. గుంటూరులో టీడీపీ నిర్వహించిన సంక్రాంతి కానుకల పంపిణీలో ముగ్గురు మహిళలు ప్రాణాలు కోల్పోయారు. ఈ రెండు దుర్ఘటనల్లో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. రహదారులను ఆక్రమించి వేదికల నిర్మాణం, ఇష్టానుసారం ఫ్లెక్సీలు, సౌండ్ సిస్టమ్స్ ఏర్పాటు, చివరి నిమిషాల్లో రూట్ మ్యాప్‌ల మార్పు, ఇరుకుగా బారికేడ్ల నిర్మాణం మొదలైన లోపాలతో ఈ దుర్ఘటనలు జరిగాయని అధికారులు నిర్ధారించారు. ఈ దుర్ఘటనలపై మెజిస్టీరియల్ విచారణ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం రహదారులపై బహిరంగ సభలు, ర్యాలీల నిర్వహణపై నియంత్రణ విధించింది.

అధికశాతం బిల్లులు చెల్లించేశాం

- గ్రీన్ చానల్ ద్వారా ఆస్పత్రుల్లో డైట్ బిల్లులు ప్రభుత్వం చెల్లిస్తోంది
- గత నెల 26నే రూ.6 కోట్లు చెల్లించాం
- ఇంకా చెల్లించాల్సింది రూ.94 లక్షలే.. ఇదీ త్వరలో చెల్లిస్తాం
- అన్ని రాష్ట్రాలకంటే ఏపీలోనే వైద్య రంగానికి ఎక్కువ నిధులు
- ప్రజలను తప్పుదోవ పట్టించడానికే ఈనాడు తప్పుడు కథనాలు
- వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్యకార్యదర్శి కృష్ణబాబు



సాక్షి, అమరావతి: ప్రభుత్వాస్పత్రుల్లో డైట్ కాంట్రాక్టర్లకు గత నెలలోనే అత్యధిక శాతం బిల్లులు చెల్లించామని, ఈ విషయం తెలుసుకోకుండా రూ.లక్షల్లో బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయంటూ ఈనాడు తప్పుడు కథనాలు రాసిందని వైద్య, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు మండిపడ్డారు. ఆయన సోమవారం విజయవాడలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఆస్పత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడానికి ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందని తెలిపారు. అసత్య ప్రచారాలతో ప్రజల్లో ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం సన్నగిల్లి ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి, ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. డీఎంఈ, ఏపీవీవీపీ ఆస్పత్రుల్లో షెడ్యూల్ ప్రకారం గతనెల 26నే రూ.6 కోట్ల మేర డైట్‌బిల్లులు చెల్లించామన్నారు. ఇంకా రూ.94 లక్షలు మాత్రమే చెల్లించాల్సి ఉందని, త్వరలోనే చెల్లిస్తామని అన్నారు. జనని సురక్ష యోజన కింద రూ.13.69 కోట్లు గత నెల 22నే కలెక్టర్లకు మంజూరు చేశామన్నారు. సాలూరు ఆస్పత్రిలో పెండింగులో ఉన్నది రూ.1.40 లక్షలు కాగా, రూ.12 లక్షలు పెండింగ్ ఉన్నాయంటూ రాశారన్నారు. పార్వతీపురం మన్యంలో రూ.12 లక్షలకు గాను రూ.9.70 లక్షలు డిసెంబర్ 26న చెల్లించామన్నారు. బాడంగి ఆస్పత్రిలో రూ.4.80 లక్షలు పెండింగ్‌లో ఉందన్నారు. ఇవన్నీ తెలుసుకోకుండా తప్పుడువార్తలు రాయడంవెనుక ఉద్దేశం ప్రజలను తప్పుదోవ పట్టించడం, ప్రభుత్వ ప్రతిష్టను దిగజార్చడమేనన్నారు. గ్రీన్ చానల్ ఏర్పాటుచేసి మరీ డైట్ బిల్లులను ప్రభుత్వం చెల్లిస్తోందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో డైట్ చార్జీలను రోగికి రూ.40 నుంచి రూ.80కు పెంచామన్నారు. పెంచిన చార్జీలకు అనుగుణంగా కొత్త కాంట్రాక్టర్ల ఎంపిక జరుగుతోందని చెప్పారు. వివిధ రాష్ట్రాల్లో బడ్జెట్‌లో 3.4 శాతం నుంచి 4 శాతం మేర మాత్రమే వైద్య రంగానికి ఖర్చు చేస్తుండగా, మన రాష్ట్రంలో 7.3 శాతం ఖర్చు చేస్తున్నట్టు తెలిపారు. 2018–19లో ఏపీవీవీపీలో రూ.కోటి మేర నెలకు ఆరోగ్యశ్రీ కింద బిల్లు చెల్లింపులు ఉండేవని, ప్రస్తుతం నెలకు రూ.12 కోట్లు ఆరోగ్యశ్రీ బిల్లులు చెల్లిస్తున్నామని తెలిపారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడం కోసం ప్రభుత్వం రూ.16 వేల కోట్లకు పైగా నిధులతో నాడు–నేడు చేపట్టిందని, 47 వేలకుపైగా పోస్టుల భర్తీ చేపట్టిందని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మార్పును తెలుసుకోవడానికి జనవరి 26 నుంచి ప్రజాప్రతినిధుల ద్వారా ఆస్పత్రుల్లో తనిఖీలు చేపట్టి ఆడిట్ చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారన్నారు.

నిరాహార దీక్ష విరమించిన జోగయ్య

- పవన్ కళ్యాణ్ సలహాతోనే దీక్ష విరమించా
- కాపు రిజర్వేషన్లపై హైకోర్టుకు వెళ్తానని ప్రకటన

ఏలూరు టౌన్: కాపులకు రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ మాజీ మంత్రి హరిరామ జోగయ్య చేపట్టిన నిరాహార దీక్షను సోమవారం విరమించారు. పవన్ కళ్యాణ్ విజ్ఞప్తి మేరకు దీక్ష విరమిస్తున్నట్టు ఆయన ప్రకటించారు. కాపులకు రిజర్వేషన్‌పై హైకోర్టును ఆశ్రయిస్తానని తెలిపారు. కాగా పాలకొల్లులో ఆయన స్వగృహంలో ఆదివారం రాత్రి జోగయ్యతో చర్చించిన పోలీసులు దీక్షను విరమింపజేసేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో ఏలూరు కేంద్ర ప్రభుత్వాస్పత్రికి తరలించిన సంగతి తెలిసిందే. కాగా జోగయ్య చేపట్టిన నిరవధిక దీక్షకు ఒక వర్గం కాపు నేతలు దూరంగా ఉండడం చర్చనీయాంశంగా మారింది. జోగయ్య చేపట్టిన దీక్ష జనసేన డైరెక్షన్‌లోనే నడుస్తోందా అనే అభిప్రాయాలకు ఆయన మాటలే నిదర్శనమని అంటున్నారు. ముద్రగడ పద్మనాభంకు కాపుల్లో ఉన్న ఆదరణను దారి మళ్లించేందుకే ఇలా జనసేన ముసుగులో చంద్రబాబు ప్లాన్‌తో జోగయ్యతో దీక్ష చేయిస్తున్నారనే అభిప్రాయాన్ని కొందరు కాపు నేతలు వ్యక్తం చేస్తున్నారు. కాగా ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో ఆహారం తీసుకునేందుకు, మందులు వేసుకునేందుకు హరిరామ జోగయ్య నిరాకరించారు. సోమవారం ఉదయం టీడీపీ, జనసేన, బీజేపీల్లోని కాపు నేతలు జోగయ్యను పరామర్శించేందుకు ప్రయత్నించగా పోలీసులు లోనికి అనుమతించలేదు. జోగయ్య కుమారుడు సూర్యప్రకాష్ తండ్రి వద్ద ఉండి పరిస్థితిని పరిశీలించారు. కాగా టీడీపీ మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తన పుట్టిన రోజున రక్తదాన శిబిరం ఏర్పాటు చేసేందుకు జిల్లా ఆస్పత్రి ప్రాంగణంలోని రెడ్‌క్రాస్ భవనం వద్దకు వెళ్లేందుకు తనను అనుమతించాలని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దీంతో పోలీసులు ఆయనను అరెస్టు చేశారు. వ్యాన్‌లో తరలిస్తుండగా మార్గమధ్యంలో వారితో గొడవపడి వ్యాన్ నుంచి దూకి పారిపోయారు.



ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో దీక్ష విరమణ అనంతరం మాజీ మంత్రి హరిరామజోగయ్య

చంద్రబాబు, పవన్‌లతో మ్యాచ్‌ఫిక్సింగ్

హరిరామజోగయ్యపై మాజీమంత్రి పేర్ని నాని



సాక్షి, అమరావతి: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్‌లతో మాజీమంత్రి హరిరామజోగయ్య మ్యాచ్ ఫిక్సింగ్ చేసుకుని కాపు రిజర్వేషన్ల పేరుతో నాటకమాడుతున్నారని మాజీమంత్రి, ఎమ్మెల్యే పేర్ని నాని ఆరోపించారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎన్టీఆర్ మంత్రివర్గంలో హరిరామజోగయ్య మంత్రిగా పనిచేసినప్పుడు కాపులను ఏం ఉద్ధరించారని ప్రశ్నించారు. కాపుల అభ్యున్నతి కోసం ఏనాడూ పాటుపడని ఆయన ఇప్పుడు చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌ల స్క్రిప్ట్ మేరకే డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు.

రాష్ట్ర హక్కులను హరిస్తున్న బీఆర్ఎస్

ఇక బీఆర్ఎస్ పార్టీపై పేర్ని నాని స్పందిస్తూ.. దేశంలో పిరమిడ్ పార్టీ గతంలో అన్ని పార్లమెంట్ స్థానాలకు పోటీచేసిందని.. అలాగే, కేఏ పాల్ పార్టీ రాష్ట్రంలో 175 స్థానాల్లోనూ పోటీచేసిందని.. అదే రీతిలో 175 స్థానాల్లోనూ బీఆర్ఎస్ పోటీచేసే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలో సీపీఐ, కాంగ్రెస్‌తో ఆ పార్టీ పోటీపడుతుందంటూ ఎద్దేవా చేశారు. శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతలలో నిబంధనలకు విరుద్ధంగా విద్యుదుత్పత్తి చేస్తూ.. కృష్ణా జలాలపై ఏపీ హక్కులను హరిస్తున్నది బీఆర్ఎస్ కాదా అని ప్రశ్నించారు. అలాంటి బీఆర్ఎస్ ఇక్కడి రాష్ట్ర ప్రయోజనాల కోసం ఏం చేస్తుందో చెప్పాలని నాని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా...

చంద్రబాబు పదవీ కాంక్షతోనే గుంటూరు ఘటన

- ప్రచార పిచ్చితో ప్రజల ప్రాణాలు తీస్తున్నారు
- ట్వీట్‌లో మండిపడ్డ బీజేపీ ఏపీ

సాక్షి, అమరావతి: పదవీ కాంక్ష, ప్రచార పిచ్చితో బహిరంగ సభల్లో ప్రజల ప్రాణాలతో చంద్రబాబు చెలగాటమాడుతున్నారని బీజేపీ మండిపడింది. ఈ మేరకు బీజేపీ ఏపీ శాఖ సోమవారం ట్వీట్ చేసింది. చంద్రబాబును రాష్ట్ర ప్రజలు ఎప్పటికీ క్షమించరని తెలిపింది. 'గుంటూరులో జరిగిన టీడీపీ బహిరంగ సభలో ఉచిత కానుకల పంపిణీలో ముగ్గురు మహిళలు మరణించడం అత్యంత బాధాకరం. వారం రోజుల్లో ఇది రెండో సంఘటన' అంటూ బీజేపీ ఏపీ ట్వీట్ చేసింది. కాగా, ఇదే ఘటనపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. నిర్వాహకుల వైఫల్యం వల్లే గుంటూరు ఘటన జరిగిందన్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటం సరికాదని తెలిపారు. రాబోయే రోజుల్లో ఇలాంటి ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

బాబూ.. మాకు ఇదేమి ఖర్మ: కేఏ పాల్



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కేఏ పాల్

నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్): 'మొన్న కందుకూరులో ఎనిమిది మంది, నిన్న గుంటూరులో ముగ్గురిని పొట్టన పెట్టుకున్న చంద్రబాబూ.. మాకు ఇదేమి ఖర్మ' అంటూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ ప్రశ్నించారు. చంద్రబాబు ముసలి రాజకీయాలు చేస్తూ ప్రజలు ప్రాణాలు తీస్తున్నారంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈ ఘటనపై న్యాయం కోసం హైకోర్టును ఆశ్రయిస్తానని చెప్పారు. చంద్రబాబు మీటింగ్‌కు హాజరై మరణించిన నిరుపేద మహిళల కుటుంబ సభ్యులను కేఏ పాల్ సోమవారం పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ చట్ట విరుద్ధమైన సభలు ఏర్పాటు చేయడమే ఈ పరిస్థితికి కారణమన్నారు. ఇంత జరుగుతుంటే దత్తపుత్రుడు ఏమయ్యాడంటూ పవన్ కళ్యాణ్‌కు చురకలేశారు.

గుంటూరు ఘటనపై చర్యలు చేపట్టండి

ఎస్పీకి మైనార్టీ కమిషన్ చైర్మన్ ఇక్బాల్ అహ్మద్ ఖాన్ సూచన

సాక్షి, అమరావతి: గుంటూరులో టీడీపీ నిర్వహించిన కార్యక్రమంలో ఇద్దరు ముస్లిం మహిళలు సయ్యద్ ఆసియా, షేక్ మస్తాన్‌బీ మరణించడం బాధాకరమని ఆంధ్రప్రదేశ్ స్టేట్ మైనారిటీస్ కమిషన్ చైర్మన్ కె.ఇక్బాల్ అహ్మద్ ఖాన్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఘటనపై గుంటూరు అర్బన్ ఎస్పీ ఆరిఫ్ హఫీజ్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నానన్నారు. గాయపడినవారికి మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. నిర్వాహకులు సరైన ఏర్పాట్లు చేయకపోవడం వల్లే ఈ దుర్ఘటన సంభవించిందన్నారు. ఘటనకు బాధ్యులైనవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీకి సూచించినట్టు తెలిపారు.

కానుకలు ఆశపెట్టి బలి తీసుకున్నారు

- గుంటూరులో తొక్కిసలాటపై జిల్లా ఎస్పీ నివేదిక కోరాం
- మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ



గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో బాధితురాలిని పరామర్శిస్తున్న వాసిరెడ్డి పద్మ

సాక్షి, అమరావతి/గుంటూరు ఈస్ట్: చీరల పంపిణీ, కానుకల ఆశ చూపి ముగ్గురు నిరుపేద మహిళల ప్రాణాలను చంద్రబాబు బలి తీసుకున్నారని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ మండిపడ్డారు. సాయమనేది ఆత్మగౌరవాన్ని పెంచేదిగా ఉండాలన్నారు. చిల్లర సరుకులు ఆశ చూపి పేద మహిళలకు నరకం చూపించారని ధ్వజమెత్తారు. ఈ మేరకు సోమవారం ఆమె గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నవారిని పరామర్శించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. బాబు దర్శకత్వంలోనే గుంటూరులో సభ జరిగిందన్నారు. ఇప్పుడు ఆయన తప్పించుకోవడానికి ట్రస్ట్ పేరు చెబుతున్నారని ఆరోపించారు. గుంటూరు ఘటనపై జిల్లా ఎస్పీని సమగ్ర నివేదిక కోరామని తెలిపారు. పిచ్చి ముదిరి డ్రోన్లను చంద్రబాబు తలకు కట్టుకున్నట్టు ఉందని ఎద్దేవా చేశారు. కాగా టీడీపీ నేతలు పద్మను అడ్డుకున్నారు. పోలీసులు టీడీపీ నాయకులను అడ్డుకుని పక్కకు పంపివేయడంతో వివాదం సద్దుమణిగింది.

బాబు సభలకు బలి పశువులు!

అమాయకుల ప్రాణాలతో చంద్రబాబు చెలగాటం

- జనం రాకపోవడంతో రకరకాల ఎత్తుగడలు
- నిజంగా జన ప్రభంజనం ఉంటే విశాలమైన రోడ్లు లేవా?
- ఇరుకు సందులో సభ వల్లే కందుకూరులో 8 మంది మృతి
- గుంటూరు సభకు 15 రోజుల ముందే ఇంటింటి ప్రచారం..
- కానుకల పేరుతో మభ్యపెట్టి తరలించిన టీడీపీ నేతలు



బాబు కందుకూరు సభలో తొక్కిసలాట బాధితుడు (ఫైల్)

సాక్షి, అమరావతి: తనది 40 ఏళ్ల రాజకీయ అనుభవమని తరచూ చెప్పుకునే చంద్రబాబు రాజకీయ లబ్ధి కోసం వేసిన ఎత్తుగడలు ప్రజల పాలిట శాపాలుగా మారాయి. ఆయన తీరు కారణంగా అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నా ఏమాత్రం పట్టనట్లు చేతులు దులుపుకొని వెళ్లిపోతుండడం సర్వత్రా విస్మయం కలిగిస్తోంది. చంద్రబాబు సభలకు స్పందన లేదనే విషయం అర్థమవడంతో ఇరుకు ప్రాంతాలను ఎంపిక చేసుకుని ప్రజలు వచ్చినట్లుగా ప్రచారం చేసుకుంటున్నారని, అందువల్లే రెండుసార్లు తొక్కిసలాటలు జరిగాయని ఆ పార్టీ నాయకులే అంగీకరిస్తున్నారు. కందుకూరు, గుంటూరు సభలే ఇందుకు నిదర్శనం.

విశాలమైన రోడ్లు లేవా?

టార్గెట్లు నిర్దేశించి తన సభకు ప్రజలను తేవాలని చంద్రబాబు ఆదేశిస్తున్నట్లు ఆ పార్టీ నేతలు వాపోతున్నారు. ఎంత ప్రచారం చేసినా ప్రజలు పట్టించుకోకపోవడంతో ఏదో ఒక ఆశ చూపి తరలిస్తున్నారు. ఇందుకోసం ఇరుకు సందులు, చిన్న రోడ్లను ఎంచుకుంటున్నారు. కందుకూరు సభను అనుమతి తీసుకున్న విశాలమైన రోడ్డులో కాకుండా పక్కనే ఉన్న ఇరుకు సందులోకి చంద్రబాబు మార్చారు. అక్కడ తొక్కిసలాట జరిగి 8 నిండు ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. విశాలమైన రోడ్డు పక్కనే ఉండగా దాన్ని కాదని ఇరుకు రోడ్డులో సభ నిర్వహించడంలోనే చంద్రబాబు ఉద్దేశం స్పష్టంగా కనబడుతుతోందని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. నిజంగా చంద్రబాబు చెబుతున్నట్లు జన ప్రభంజనమే ఉంటే విశాలమైన రోడ్లలో సభ ఎందుకు నిర్వహించడం లేదనే ప్రశ్నకు టీడీపీ ముఖ్య నేతల నుంచి సమాధానం లేదు.

గుణపాఠం నేర్చుకోలేదు

కందుకూరు సభలో జరిగిన ఘోరం నుంచి గుణపాఠం నేర్చుకోకుండా మళ్లీ అదే తప్పులను చంద్రబాబు పునరావృతం చేస్తున్నట్లు స్పష్టమవుతోంది. గుంటూరులో తాజాగా చంద్రన్న కానుకల పంపిణీ సభకోసం 10–15 రోజుల నుంచే పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. నిజంగా ప్రజాదరణ ఉంటే ఇంటింటికీ తిరిగి కానుకలు ఇస్తామని ప్రచారం చేయాల్సిన అవసరం ఉంటుందా? జనం రారని గ్రహించే టోకెన్లు ఇచ్చి మరీ ప్రజలను, పేదలను మభ్యపెట్టారు.

మొహం చెల్లకే..

గుంటూరు ఘటనపై చంద్రబాబు నోరు మెదపకపోవడాన్ని బట్టి ఆయనకు మొహం చెల్లడంలేదని అర్థమవుతోందనే వాదన వినిపిస్తోంది. ఒక పత్రికా ప్రకటన విడుదల చేసి చేతులు దులుపుకొన్నారు. ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొన్నానని, అక్కడ తొక్కిసలాట జరగడం దురదృష్టకరమని పేర్కొంటూ అది టీడీపీ సభ కాదని అడ్డంగా అబద్ధం ఆడేశారు. అదే నిజమైతే సభకు అనుమతుల నుంచి నిర్వహణ దాకా పూర్తిగా టీడీపీ నేతలే దగ్గరుండి పర్యవేక్షించడం నిజం కాదా?

నిలువెత్తు నయవంచన

▶ మొదటి పేజీ తరువాయి

ఆ పార్టీ కనుసన్నల్లోనే జరిగింది. సభ నిర్వహణకు పోలీస్‌శాఖకు దరఖాస్తు చేసుకోవటం నుంచి సంబంధిత చలాన్ల చెల్లింపు వరకు ఏర్పాట్లన్నీ టీడీపీ నేతలే స్వయంగా పర్యవేక్షించారు. ఉయ్యూరు ఫౌండేషన్ పేరుతో తెరచాటున వ్యవహారాలు నడిపించారు. చంద్రన్న కానుక పంపిణీలో పాల్గొనాలంటూ పది రోజులు ముందు నుంచే పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. నిత్యం సభా ప్రాంగణాన్ని సందర్శిస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలంటూ పిలుపునిచ్చారు. రెండు రోజుల ముందు ఇంటింటికి తిరిగి మహిళలకు కూపన్లు ఇవ్వడంతో పాటు ఆధార్ జిరాక్స్‌లు తీసుకున్నారు. రూ.మూడు వేల విలువైన కానుకలు అందచేస్తున్నామంటూ ఊరించారు. చివరకు తొక్కిసలాటలో ముగ్గురు మహిళలు ప్రాణాలు కోల్పోయిన మరుక్షణమే అది ఓ ప్రైవేట్ కార్యక్రమమని, స్వచ్ఛంద సంస్థను ప్రోత్సహించేందుకు వెళ్లానని, తమ పార్టీకి దాంతో సంబంధం లేదంటూ స్వరం మార్చి టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు తన నిజ స్వరూపాన్ని మరోసారి చాటుకున్నారు. తాను స్వయంగా పాల్గొన్న కార్యక్రమంలో ముగ్గురు పేద మహిళలు మృత్యువాత పడితే కనీసం పరామర్శించేందుకు కూడా ఆయనకు మనసు రాలేదు. కందుకూరులో బాధితుల వద్దకు వెంటనే వెళ్లిన ఆయన గుంటూరులో మాత్రం చనిపోయింది పేద మహిళలు కావడంతోనే మొహం చాటేసి హైదరాబాద్ వెళ్లిపోయినట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఘటన అనంతరం రాత్రి నుంచి పరారీలో ఉన్న ఉయ్యూరు ఫౌండేషన్ ఎండీ శ్రీనివాస్‌ను పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

దరఖాస్తులో కానరాని "కానుకలు"

గుంటూరు ఓల్డ్ వికాస్ క్యాంపస్‌లో మాజీ సీఎం చంద్రబాబు పాల్గొన్న సభకు అనుమతుల కోసం టీడీపీ జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్ స్వయంగా గుంటూరు సౌత్ డీఎస్పీకి దరఖాస్తు చేసుకున్నారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఎనిమిది గంటల వరకూ పది వేల మందితో సభ నిర్వహించుకుంటామని అందులో పేర్కొన్నారు. అయితే అందులో ఎక్కడా చంద్రన్న సంక్రాంతి కానుకలు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొనలేదు. అది కేవలం చారిటబుల్ ట్రస్ట్ కార్యక్రమం అయితే అన్నగారి జనతా వస్త్రాలు – చంద్రన్న సంక్రాంతి కానుక అని ఎందుకు పేరు పెట్టారు? సభ నిర్వహణ అనుమతుల కోసం టీడీపీ తరఫున పోలీస్ శాఖకు ఎలా దరఖాస్తు చేశారు? పార్టీ కార్యక్రమంగా ఎందుకు మార్చారు? స్వచ్ఛంద సంస్థ కార్యక్రమానికి టీడీపీ నాయకులు జన సమీకరణ ఎందుకు చేశారని బాధితులు నిలదీస్తున్నారు. రాజకీయ పార్టీకి కొమ్ము కాసే ట్రస్టుల గుర్తింపును రద్దు చేయడంతోపాటు నిధుల సేకరణపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

పోలీసుల సూచనలు బేఖాతర్..

ఇది పూర్తిగా ప్రైవేట్ కార్యక్రమం కావడంతో అధికారులు పరిశీలించి పలు సూచనలు చేశారు. క్యాంపస్‌కు ఎంట్రన్స్, ఎగ్జిట్ ఒకే గేటు ఉండటంతో మూడు చోట్ల ప్రహరీ పగలగొట్టించి ద్వారాలు ఏర్పాటు చేయించారు. ప్రభుత్వ కార్యక్రమాలకు బారికేడ్లు ఆర్ అండ్ బీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తారు. వ్యక్తిగత కార్యక్రమానికి నిర్వాహకులే అన్ని ఏర్పాట్లు చేసుకోవాలి. పోలీసులు వాటిని పరిశీలించి పలు సూచనలు చేసినా నిర్వాహకులు పట్టించుకోలేదు. మధ్నాహ్నం ఒంటి గంట నుంచి నగరంలోని వివిధ ప్రాంతాల మహిళలను కానుకలు పంపిణీ చేస్తామంటూ వాహనాల్లో మీటింగ్ ప్రదేశానికి తరలించారు. రాగానే వాటిని అందచేస్తే తొక్కిసలాటకు అవకాశం ఉండేది కాదు. కానుకలు ఇస్తే మహిళలు వెళ్లిపోతారనే భయంతో చంద్రబాబు సభ ముగిసేవరకు సాయంత్రం ఆరు గంటల దాకా బలవంతంగా కూర్చోబెట్టారు. చంద్రబాబు సభ జరుగుతున్న సమయంలో పరిస్థితిని గమనించిన పోలీసులు వెంటనే కిట్‌ల పంపిణీ ప్రారంభించాలని వేదికపై ఉన్న నాయకులను ఫోన్‌లో కోరారు. ఓ ట్రాఫిక్ సీఐ వేదికమీదకు వెళ్లి మరీ పరిస్థితిని వివరించినా ఆలకించలేదు. బారికేడ్లు సరిగా లేకపోవడంతో తొక్కిసలాటలో ఒరిగిపోయాయి. పోలీసులు సకాలంలో స్పందించి కానుకల పంపిణీని నిలిపివేసి తొక్కిసలాటలో చిక్కుకున్నవారిని కాపాడటంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. లేదంటే పదుల సంఖ్యలో మరణాలు ఉండేవని బాధితులు చెబుతున్నారు.

237 మందితో బందోబస్తు..

నూతన సంవత్సర వేడుకలతోపాటు మంగళగిరి, తెనాలిలో వైకుంఠద్వార దర్శనం బందోబస్తుకి పెద్ద సంఖ్యలో పోలీసులను సమకూర్చాల్సి వచ్చినా చంద్రబాబు సభకు ముగ్గురు డీఎస్పీల నేతృత్వంలో 207 మంది సిబ్బంది విధుల్లో పాల్గొన్నారు. సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో పరిస్థితి గమనించి మరో 30 మంది సిబ్బందిని అదనంగా రప్పించారు. వీరంతా ఉండబట్టే పరిస్థితి వెంటనే అదుపులోకి వచ్చింది. ముందు జాగ్రత్తగా పోలీసులు రెండు అంబులెన్స్‌లను కూడా సిద్ధం చేశారు. ప్రైవేట్ కార్యక్రమం అయినప్పటికీ బాధ్యతగా వ్యవహరించారు. ప్రైవేట్ కార్యక్రమాల్లో బందోబస్తు కోసం పోలీసుశాఖకు యూజర్ చార్జీలను చెల్లించాలి. టీడీపీ నాయకులు ఆ పని చేయకపోగా పోలీసులపైనే ఆరోపణలు చేయడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కనీస పశ్చాత్తాపం కరువు

చంద్రబాబు అరగంటకు పైగా మాట్లాడి నలుగురికి చంద్రన్న కానుక కిట్లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన వెళ్లిపోయిన నిమిషాల వ్యవధిలోనే తొక్కిసలాట చోటుచేసుకుంది. ఆ సమయానికి చంద్రబాబు కాన్వాయ్ మంగళగిరి కూడా చేరుకోలేదు. కొందరు నేతలు ఈ విషాదం గురించి ఆయనకు సమాచారం ఇవ్వడంతో మీరే చూసుకోవాలని స్పష్టం చేసి విమానాశ్రయానికి వెళ్లిపోయినట్లు తెలిసింది. రాత్రి 7.02కి గన్నవరం విమానాశ్రయం చేరుకున్న ఆయన 7.59 నిముషాలకు ఇండిగో విమానంలో హైదరాబాద్ బయలుదేరి వెళ్లారు. తాను పాల్గొన్న కార్యక్రమంలో ముగ్గురు మహిళలు చనిపోవడంతోపాటు పలువురు తీవ్రంగా గాయపడ్డారనే విషయం తెలిసి కూడా కనీస మానవత్వం, పశ్చాత్తాపం లేకుండా చంద్రబాబు వెళ్లిపోవడంపై విస్మయం వ్యక్తమవుతోంది. బాధిత కుటుంబాలను జీజీహెచ్‌లో స్థానిక నేతలు మినహా అధినాయకత్వం పరామర్శించిన పాపాన పోలేదు.

పోలీసుల అదుపులో నిందితుడు



గుంటూరు ఘటనలో తల్లిని కోల్పోయిన ఏటీ అగ్రహారం 4వ లైనుకు చెందిన గోపిదేశి నాగరాజు ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు ఉయ్యూరు ఫౌండేషన్ ఎండీ శ్రీనివాసరావుపై 304 క్లాజ్ 2, 34 ఐపీసీ, సీఆర్‌పీసీ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఆదివారం రాత్రి నుంచి పరారీలో ఉన్న నిందితుడిని ఫోన్ సిగ్నల్స్, నెట్ సిగ్నల్స్ ఆధారంగా గుర్తించారు. మూడు బృందాలుగా ఏర్పడి గాలింపు చేపట్టిన సీసీఎస్ పోలీసులు సోమవారం నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

బాబు కీలుబొమ్మ 'ఉయ్యూరు'

తమకు అత్యంత సన్నిహితుడైన ఎన్నారై ఉయ్యూరు శ్రీనివాస్ ద్వారా సంక్రాంతి కానుకల పంపిణీ కార్యక్రమాన్ని చంద్రబాబు, లోకేశ్ నిర్వహించారు. ఈ కార్యక్రమ నిర్వాహకుడిగా తెరపైకి తెచ్చిన ఉయ్యూరు శ్రీనివాస్ టీడీపీలో క్రియాశీల నేత. పార్టీ జెండా మోసిన నేతలను పక్కనబెట్టి విదేశాల నుంచి డబ్బు సూట్‌కేసులతో దిగే ఎన్నారైలను ఎన్నికల బరిలోకి దించాలని భావిస్తున్న చంద్రబాబు కొంతకాలంగా ఉయ్యూరు శ్రీనివాస్‌ను ప్రోత్సహిస్తున్నారు. గుంటూరు వెస్ట్, పొన్నూరు నియోజకవర్గాల్లో టికెట్ ఆశ చూపిస్తూ ఆయన ద్వారా పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగానే కొత్త సంవత్సరం సందర్భంగా చంద్రబాబుకు మీడియాలో ప్రచారం కల్పించేందుకు గుంటూరులో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

సీఎం జగన్‌పై విద్వేషపూరిత పోస్టులు

టీడీపీ తరఫున సోషల్ మీడియాలో చురుగ్గా ఉండే ఉయ్యూరు శ్రీనివాస్.. సీఎం జగన్, మంత్రులు, వైఎస్సార్‌సీపీ నేతలపై విద్వేషపూరిత పోస్టులు పెడుతుంటాడు. లోకేశ్ ఆధ్వర్యంలో నడిచే టీడీపీ సోషల్ మీడియా విభాగం సూచనల మేరకు వర్గ విభేదాలు రెచ్చగొట్టేలా, ఘర్షణలను ప్రేరేపించేలా వ్యవహరిస్తుంటాడు.



సోషల్ మీడియాలో ఉయ్యూరు శ్రీనివాస్ పోస్టులు

నాసిరకం సరుకులు.. చిరుగుల చీరలు



ఉయ్యూరు ఫౌండేషన్ ఇచ్చిన చిరిగిన చీర

గుంటూరు రూరల్: చిరుగులు పడిన చీరలు.. పురుగులు పట్టిన కందిపప్పు.. నీరుగారుతున్న ఉల్లిపాయలు.. పనికిరాని బెల్లం ముక్క.. ఎండిన చింతపండు... ఇవి పేదలకు చంద్రన్న సంక్రాంతి కానుక పేరుతో గుంటూరులో ఇచ్చిన వస్తువులు. కనీసం రూ.300 కూడా విలువ చేయని సరుకుల కోసం అన్నెంపున్నెం ఎరుగని అమాయక మహిళల ప్రాణాలను టీడీపీ నేతలు బలిగొన్నారు. చెప్పింది కొండంత.. ఇచ్చింది గోరంత అన్న చందంగా ఉయ్యూరు ఫౌండేషన్ సరుకుల పంపిణీ జరిగింది. కేవలం ప్రచారార్భాటానికి తప్ప ఆ సరుకులు ఏమాత్రం పనికిరావు. పేదలు అంటే చిన్నచూపుతో చూడటం టీడీపీ అధినేత చంద్రబాబుకు పరిపాటే. అందుకు నిదర్శనమే ఈ 'చిల్లర' సరుకులని చెబుతున్నారు. కేవలం ప్రచారార్భాటం కోసం ఉచితంగా సరుకులు పంపిణీ చేస్తున్నామని పేదలను కాలనీల నుంచి టీడీపీ నేతలు తరలించారు. రూ.3 వేలు విలువ చేసే నిత్యావసర సరుకులు, చీర ఉచితంగా ఇస్తున్నామని గ్రామాల్లో ఆటోలతో ప్రచారం ఊదరగొట్టారు. అదేవిధంగా ప్రజలకు టోకెన్‌లను పంపిణీ చేశారు. ఇందుకు మహిళలకు చెందిన ఆధార్ జిరాక్స్‌లు తీసుకున్నారు. అసలు ఆధార్ ఎందుకు తీసుకున్నారో.. దాంతో ఏం చేయబోతున్నారో అని కొందరు ఆందోళన చెందుతున్నారు. గుంటూరులోని వికాస్ నగరలో ఘటనా స్థలికి చేరుకున్న ప్రజలకు అందజేసిన కిట్‌లలో చిరిగిన చీర ఒకటి, అరకిలో కందిపప్పు, కిలో ఉల్లిపాయలు, పావు కిలో బెల్లం, పామాయిల్ ప్యాకెట్, అరకిలో ఎండిన చింతపండు సంచులలో పెట్టి అందజేశారు. ఇవన్నీ కలిపినా రూ.300 కూడా ఉండవని వీటిని అందుకున్న ప్రజలే బాహాటంగా విమర్శిస్తున్నారు. ఇచ్చిన చీరలు సైతం చిరిగి ఉండటంతో తమకు చిరిగిన చీరలు ఇచ్చి అవమానించారని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చంద్రబాబును ఏ-1గా చేర్చాలి

గుంటూరు అర్బన్ ఎస్పీకి వైఎస్సార్‌సీపీ నేతల వినతిపత్రం



ఎస్పీకి వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

నగరంపాలెం: కొత్త సంవత్సరం నాడు గుంటూరులో జరిగిన తొక్కిసలాటలో ముగ్గురి మృతికి, పలువురు గాయపడటానికి సూత్రధారి చంద్రబాబేనని వైఎస్సార్‌సీపీ నాయకులు మండిపడ్డారు. ఆయనపై కేసు నమోదు చేసి ఏ–1గా చేర్చాలని డిమాండ్ చేశారు. చంద్రబాబుతోపాటు ఉయ్యూరు ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాస్, వికాస్‌నగర్‌లోని స్థల యజమానిపై కూడా కేసులు నమోదు చేయాలని కోరారు. ఈ మేరకు సోమవారం గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీవో)లో అర్బన్ ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్‌కు వినతి పత్రం అందించారు. ఈ దుర్ఘటనకు కారణమైన చంద్రబాబుని అరెస్ట్ చేయాలని కోరారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే ముస్తఫా, మేయర్ కావటి మనోహర్‌నాయుడు, మిర్చి యార్డు చైర్మన్ చంద్రగిరి ఏసురత్నం, పలువురు నేతలు పాల్గొన్నారు.

రాజకీయాల కోసం పేదల ప్రాణాలు తీస్తారా?

చంద్రబాబును నిలదీసిన మాజీమంత్రి పేర్ని నాని

సాక్షి, అమరావతి: 'పేద ప్రజలకు సంక్రాంతి కానుక పేరుతో ఆశ చూపి, మీరు ఆడిన దుర్మార్గపు రాజకీయ క్రీడలో ముగ్గురు పేద మహిళలు అసువులు బాసిన వెంటనే.. ఆ కార్యక్రమంతో మాకెలాంటి సంబంధంలేదని ప్లేటు ఫిరాయించడం కంటే నీచం మరొకటి ఉంటుందా?.. రాజకీయాల కోసం పేదల ప్రాణాలు తీస్తారా..' అని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబును మాజీమంత్రి పేర్ని నాని ప్రశ్నించారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం పేర్ని నాని మీడియాతో మాట్లాడారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

- పేదల ముగింట్లో 15 రోజుల ముందే వచ్చిన సంక్రాంతి పేరుతో ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5లు భారీఎత్తున ప్రచారం చేశాయి.
- ఈ కార్యక్రమాన్ని నిర్వహించడానికి అనుమతివ్వాలని గుంటూరు డీఎస్పీ (పశ్చిమ)కు డిసెంబర్ 29న గుంటూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్ దరఖాస్తు చేశారు. సభ నిర్వహించుకోవడానికి ఎలాంటి అభ్యంతరంలేదని ఓల్డ్ వికాస్ కాలేజ్ క్యాంపస్ మైదానం యజమాని చిరుమామిళ్ల వెంకటకృష్ణ డీఎస్పీకి ధృవపత్రం ఇచ్చారు. ఈ సభలో మైక్ పర్మిషన్ కోసం గుంటూరులో అరండల్‌పేటలోని టీడీపీ కార్యాలయం చిరునామాతో నాయుడు ఓంకార్ దరఖాస్తు చేశారు.
- ఎనిమిది వేల మంది పట్టే ఈ మైదానంలో టోకెన్లు ఇచ్చి మరీ 30 వేల మందిని రప్పించారు. సరిపడాలేని కానుకల కోసం పేదలు ఎగబడటంతో తొక్కిసలాట జరిగి ముగ్గురు మరణించిన వెంటనే.. చంద్రబాబుకు సంబంధంలేదని ఎల్లో మీడియా ప్లేటు ఫిరాయించడం దుర్మార్గం.
- ఈ కార్యక్రమంతో టీడీపీకి సంబంధంలేకపోతే.. సభ నిర్వహణకు ఎందుకు దరఖాస్తు చేసుకున్నారు? ఆ ముగ్గురు మరణానికి కారణం ముమ్మాటికీ చంద్రబాబే. ఉయ్యూరు ఫౌండేషన్ ఎక్కడిది? ఇదంతా చంద్రబాబు ఆడిన డ్రామా కాదా?
- ప్రతిపక్షాలన్నీ గుంపులు గుంపులుగా కలిసి వచ్చి యుద్ధం చేసినా.. ప్రజల గుండెల్లో బలమైన స్థానం సంపాదించుకున్న సీఎం జగన్‌ను రాజకీయంగా ఒక్క అంగుళం కూడా కదల్చలేరు.

ఆ చావులకు చంద్రబాబే బాధ్యుడు

మంత్రి ఆర్కే రోజా ఫైర్



సాక్షి, అమరావతి: పేదవారి ప్రాణాలంటే చంద్రబాబుకు లెక్కలేదని, 40 ఏళ్ల ఇండస్ట్రీ అని ఆయన 40 మందిని చంపాడని పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి ఆర్కే రోజా మండిపడ్డారు. ఈయన చంద్రబాబు నాయుడా.. శవాల నాయుడా? అని ప్రశ్నించారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం మంత్రి మీడియాతో మాట్లాడారు. ఆమె ఏమన్నారంటే.. కానుకల పేరుతో చంద్రబాబు అమాయకుల ప్రాణాలను బలి తీసుకున్నారు. కందుకూరు, గుంటూరు ఘటనలకు చంద్రబాబే బాధ్యుడు. బాబుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. ఈ ఘటనలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. బాబు సభలకు జనాలు రావడంలేదనే తాయిలాల పేరుతో పేదల ప్రాణాలు తీస్తున్నారు. బాబు పబ్లిసిటీ మరణాలపై ప్యాకేజీ స్టార్ నోటికి ప్లాస్టర్ వేసుకున్నాడా? ఈవేవీ ఆయనకు కనిపించడం లేదా? ముగ్గురు ఆడవాళ్లు చనిపోతే ఆయనెందుకు స్పందించడంలేదు? లోకేశ్ పాదయాత్ర ప్రకటించగానే ఘోరాలు, చావులు ప్రారంభమయ్యాయి. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే ఎవరినైనా వదిలే ప్రసక్తేలేదు.

పోలీసులవల్లే ప్రమాద తీవ్రత తగ్గింది

గుంటూరు ఘటనలో పోలీసుల వైఫల్యం అని మాట్లాడటం సిగ్గుచేటు. అక్కడ పోలీసులు సరిపడా ఉండబట్టే ప్రమాద తీవ్రత తగ్గింది, వెంటనే పోలీసులే సహాయ చర్యలు చేపట్టారు. ముప్పై నలభై వేల మందికి చీరలిస్తామని ప్రచారం చేసి అరకొరా ఇచ్చారు. అందుకే ఇలా జరిగింది. ప్రజలకు ఇబ్బందులు కలిగించే కార్యక్రమాలు చేస్తే పవన్ అయినా.. చంద్రబాబైనా ప్రజాగ్రహం ఎదుర్కోకతప్పదు. గతంలో వైఎస్ జగన్ పాదయాత్ర సభలకు లక్షలాదిమంది తరలివచ్చినా ఒక్క చిన్న సంఘటన కూడా జరగలేదు. ఇక సీఎం జగన్ అప్పులు గురించి ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారానికి మొన్ననే చెప్పుతో కొట్టినట్లు కేంద్రం బుద్ధిచెప్పింది. ఎవరెన్ని విష ప్రచారాలకు పాల్పడినా, పొత్తులతో ఎంతమంది కలిసి వచ్చినా మా నాయకుడు సింగిల్‌గా 2024లో అనూహ్యమైన మెజార్టీతో సీఎంగా గెలవడం ఖాయం.

శని గ్రహాన్ని మించిన గ్రహం చంద్రబాబు

మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి నాని



గుడివాడ రూరల్: శని గ్రహాన్ని మించిన జామాతా దశమ గ్రహమే చంద్రబాబునాయుడు అని మాజీమంత్రి, గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కృష్ణాజిల్లా గుడివాడలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పబ్లిసిటీ పిచ్చితో అమాయకులను పొట్టనపెట్టుకుంటున్నాడని ఆరోపించారు. ఏడాది చివరిలో కందుకూరులో 8మందిని, న్యూఇయర్ రోజు ముగ్గురిని బలిగొన్న నరరూప రాక్షసుడైన చంద్రబాబు మాయమాటలను ప్రజలు నమ్మిబలి కావద్దని విజ్ఞప్తిచేశారు. గుంటూరు సభలో తొక్కిసలాట జరిగి ముగ్గురు అమాయక మహిళలు చనిపోవడానికి కారణం చంద్రబాబేనని ఆరోపించారు. పనిపాటా లేని ఆలపాటి రాజా, ఓ పిచ్చి ఫౌండేషన్ ఏర్పాటుచేసిన కార్యక్రమంలో తొక్కిసలాట జరిగేలా చేసిన వ్యక్తి చంద్రబాబు కాదా అని ప్రశ్నించారు. అమాయకులైన మహిళల చావుకు కారణమైంది కాకుండా ఇది ప్రభుత్వ, పోలీసుల వైఫల్యమని చెప్పడం దారుణమన్నారు. సభలకు అనుమతివ్వకపోతే 'పోలీసులు ఆంక్షలు పెట్టారు, మమ్మల్ని ప్రజల్లో తిరగనివ్వడంలేదు ఇబ్బందులు పెడుతున్నారు'ని చంద్రబాబు దొంగ ఏడుపులు ఏడుస్తున్నారని ఎద్దేవా చేశారు. ఇది ప్రభుత్వ, పోలీసు వైఫల్యం కానేకాదని.. ఇప్పటికైనా చంద్రబాబు కార్యక్రమాలకు పోలీసులు అనుమతి ఇవ్వకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కొడాలి నాని కోరారు.

రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభావం ఉండదు..

రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ విస్తరణపై కొడాలి నాని స్పందిస్తూ.. దాని ప్రభావం ఇక్కడ కనిపించదన్నారు. అంశాల వారీగా మాత్రమే జాతీయ పార్టీలకు మద్దతు తెలుపుతామని స్పష్టంచేశారు. కేసీఆర్ ఎక్కడ పోటీచేసినా తమకు అభ్యంతరంలేదన్నారు.

చంద్రబాబువి చీప్ పాలిట్రిక్స్



చిలకలూరిపేట: చంద్రబాబునాయుడు చీప్‌ట్రిక్స్ మానుకోవాలని, అధికార దాహం తగ్గించుకుని ప్రజల ప్రాణాలతో చెలగాటమాడటం మానుకోవాలి. గుంటూరు ఘటనలో తప్పంతా చంద్రబాబుదే. పదివేల మందికి కానుకలు సిద్ధంచేసి 30 వేల మందికి టోకెన్లు పంపిణీ చేయటం కుట్రకాదా? నిజంగా సేవా కార్యక్రమమే అయితే డ్రోన్ కెమెరాలు ఎందుకు? పేదలపై అంతగా ప్రేమ ఉంటే పేదల ఇళ్లకే వెళ్లి పంపిణీ చేయాల్సింది. పోలీసులు సకాలంలో స్పందించబట్టే ప్రాణనష్టం తగ్గింది. ప్రజల ప్రాణాలు అంటే టీడీపీకి ఎంత నిర్లక్ష్యమో ఇలాంటి సంఘటనలు ఉదాహరణగా నిలుస్తాయి. ఇలాంటి దుర్ఘటనల విషయంలో కఠినంగా వ్యవహరించక తప్పదు.

– విడదల రజిని, వైద్య ఆరోగ్య శాఖ

పేదల ప్రాణాలతో చంద్రబాబు చెలగాటం



పాతగుంటూరు : చంద్రన్న కానుక పేరుతో చంద్రబాబు సభలో ముగ్గురు మృతిచెంది, 20 మందికి పైగా గాయపడడం దురదృష్టకరం. కానుక పేరుతో కూపన్లు ఇచ్చి పేదల ప్రాణాల మీదకు తేవడం దుర్మార్గపు చర్య. ప్రజలు సంతోషంగా ఉన్న సమయంలో సరుకుల పంపిణీ పేరుతో పొట్టనబెట్టుకున్నారు. బాబును నమ్ముకున్న ఉయ్యూరు శ్రీనివాస్‌ను జైలుకు పంపాడు. సంఘటన జరిగిన తర్వాత నాకు సంబంధంలేదనడం సిగ్గుచేటు. చంద్రబాబును నమ్ముకుంటే నట్టేట ముంచుతారు. సంబంధం లేకుంటే సరుకుల సంచిపై నీ బొమ్మ ఎందుకు వేశారు? టీడీపీని నమ్ముకున్న ఎవరూ మోసపోవద్దు. ఎన్‌ఆర్‌ఐలు కూడా చంద్రబాబుకు దూరంగా ఉండాలి. గుంటూరులో ఇంత పెద్ద సంఘటన జరిగితే పరామర్శకు కూడా రాలేదు.

– మంత్రి జోగి రమేష్

చంద్రబాబు ఉన్మాదిలా మారాడు



సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): ప్రచార ఆర్భాటంతో చంద్రబాబు ఒక ఉన్మాదిలా తయారయ్యాడు. గోదావరి పుష్కరాల సమయంలో ఇదే చంద్రబాబు 29 మంది అమాయకుల ప్రాణాలు బలి తీసుకున్నాడు. అలాగే, ఇటీవల కందుకూరులో 8 మందిని పొట్టన పెట్టుకోగా.. ఇప్పుడు మరో ముగ్గుర్ని బలి తీసుకున్నారు. చంద్రబాబు ప్రచార ఆర్భాటానికి ఇంకా ఎంతమంది అమాయకులు బలికావాలి? నిరుపేదలకు మేలు జరుగుతుంటే చంద్రబాబు తట్టుకోలేకపోతున్నారు. పింఛన్లను తీసేశారని చంద్రబాబు అబద్ధపు ప్రచారం చేయడం విడ్డూరంగా ఉంది. ఇక సీఎం వైఎస్ జగన్ మంగళవారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో పర్యటిస్తారు. మున్సిపల్ స్టేడియం నుంచి రోడ్‌షో ద్వారా ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో సభా స్థలికి చేరుకుని 11.20కు పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు.


– మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ

గుంటూరు ఘటన దురదృష్టకరం

జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్



సాక్షి, అమరావతి: గుంటూరులో చంద్రన్న కానుకల పంపిణీ కార్యక్రమంలో చోటు చేసుకున్న తొక్కిసలాట దురదృష్టకరమని జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఘటనలో ముగ్గురు పేద మహిళలు మృత్యువాత పడటం దిగ్భ్రాంతి కలిగించిందన్నారు. ఇటువంటి కార్యక్రమాల విషయంలో నిర్వాహకులు పటిష్ట చర్యలు చేపట్టాలని కోరారు. పోలీసు యంత్రాంగం కూడా తగిన భద్రత కల్పించాలని సూచించారు. కందుకూరులో ఎనిమిది మంది మృతి చెందిన ఘటన మరువక ముందే ఇప్పుడు గుంటూరులో తొక్కిసలాట చోటు చేసుకోవడం ఆందోళనకు గురి చేసిందన్నారు. కాగా జనసేన పార్టీ జనవరి 12న శ్రీకాకుళం జిల్లా రణస్థలంలో నిర్వహించబోయే 'యువశక్తి' కార్యక్రమం పోస్టర్లను హైదరాబాద్‌లోని కేంద్ర కార్యాలయంలో పవన్ కళ్యాణ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాలసీలు ఎలా ఉంటే ఉత్తరాంధ్ర అభివృద్ధి సాధ్యమవుతుందనే విషయాలను యువతకు తెలియజేసేందుకు యువశక్తి వేదిక గళమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నేతలు నాదెండ్ల మనోహర్, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.



సుఖపడడం మాయ ఐనా బాధ పడడమనేది మాయ కాదు.
– చలం

సాక్షి
మంగళవారం, జనవరి, 3

వలస ఓట్లపై హడావిడి

ఎన్నికల్లో ఓటర్ల భాగస్వామ్యం పెంచడానికి చేస్తున్న సరికొత్త ఆలోచన చర్చ రేపుతోంది. దేశీయంగా వలస వెళ్ళిన ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకొనేందుకు వీలుగా రిమోట్ ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఆర్వీఎం)లను తీసుకురావాలనే ప్రయత్నంపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. భారత ఎన్నికల సంఘం జనవరి 18న ఈ కొత్త యంత్రాల ప్రయోగాత్మక ప్రదర్శన జరుపుతోంది. అది చూసి, నెలాఖరులోగా తమ సూచనలు తెలియపరచాలని రాజకీయ పార్టీలను ఆహ్వానించింది. ఏడు పదులు దాటిన భారత ప్రజాస్వామ్య ఎన్నికల చరిత్రలో ఇలా దేశంలోని లక్షలాది వలసజీవుల్ని సైతం భాగం చేయాలనే ఆలోచన స్వాగతనీయమే. కానీ, ఇప్పుడున్న ఈవీఎంల వినియోగంపైనే సందేహాలు ముసురుతున్న వేళ... కొత్త ప్రయత్నం ఏ మేరకు లోపరహితమన్నది చూడాలి. ఇప్పటికే, కాంగ్రెస్, తృణమూల్, డీఎంకె సహా ప్రతిపక్షాలు లేవనెత్తుతున్న ప్రశ్నలకు జవాబులు వెతకాలి.

వలస జీవులకు రిమోట్ ఓటింగ్ కల్పించడంపై ఎన్నికల సంఘంలో చర్చలు కొత్తేమీ కాదు. దేశీయ వలసదారులకు ఓటింగ్ అవకాశాలు కల్పించాలంటూ కొన్నేళ్ళుగా అభ్యర్థనలున్నాయి. అలా వచ్చిన ఓ అభ్యర్థనపై సుప్రీమ్ కోర్ట్ 2015లోనే ఆదేశాలిచ్చింది. రిమోట్ ఓటింగ్‌కు అవకాశాలు పరిశీలించాలని ఎన్నికల సంఘాన్ని నిర్దేశించింది. పరోక్ష ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్, ఇంటర్నెట్ ఓటింగ్, ముందస్తు ఓటింగ్ లాంటి పలు మార్గాలను ఎన్నికల సంఘ అధికారుల కమిటీ పరిశీలించింది. రకరకాల కారణాలతో ఆ పద్ధతులను సిఫార్సు చేయలేదు. సమగ్ర ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని సదరు కమిటీ సిఫార్సు చేసింది. ఎన్నికల సంఘం మాత్రం తాజాగా సమస్య సాంకేతిక పరిష్కారంతో, ఈ బహుళ నియోజకవర్గ రిమోట్ ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఆర్వీఎం) నమూనాను ముందుకు తెచ్చింది. ఇప్పటికే వాడుతున్న ఈవీఎం మోడల్‌కు మార్పులు చేర్పుల రూపమే – ఆర్వీఎం. వలసజీవులు తాము పనిచేస్తున్న నగరాల్లోని పోలింగ్ కేంద్రాల్లోనే తమ స్వస్థలానికి చెందిన నియోజక వర్గాల ఓటింగ్‌లో పాల్గొనేందుకు ఇది వీలు కల్పిస్తుంది.

ఈ ప్రతిపాదన అమలైతే సొంతూరికి దూరంగా ఉన్న ఓటర్ తన సొంత నియోజక వర్గం తాలూకు రిటర్నింగ్ అధికారితో ఆన్‌లైన్‌లో కానీ, ఆఫ్‌లైన్‌లో కానీ ముందుగా రిమోట్ ఓటరుగా రిజిస్టర్ చేయించుకోవాలి. అప్పుడు ప్రస్తుతం సదరు ఓటర్ నివసిస్తున్నచోటే ప్రత్యేక పోలింగ్ కేంద్రం, ఆర్వీఎం పెడతారు. ప్రభుత్వ రంగ సంస్థ ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా రూపొందించిన ఈ ఆర్వీఎం వివిధ నియోజక వర్గాలకు ఒకేసారి పనిచేస్తుందట. ఓటర్ నియోజక వర్గాన్ని బట్టి అప్పటికప్పుడు మారే డైనమిక్ బ్యాలెట్ డిస్‌ప్లే ద్వారా ఒకే రిమోట్ పోలింగ్ బూత్ నుంచి 72 నియోజక వర్గాలకు అది పనికొస్తుందట. దీనికి ఇంటర్నెట్ కనెక్టివిటీ అవసరం లేదట. ఆలోచన మంచిదే. ఈ యంత్రాల్ని సరిగ్గా వినియోగిస్తే గనక స్వస్థలం నుంచి వలస వెళ్ళిన ఓటర్లు ఇప్పుడిక తమ రాజ్యాంగబద్ధమైన ఓటు హక్కు వినియోగానికి కష్టపడి సొంత జిల్లాలకు వెళ్ళాల్సిన అవసరం లేదు. వెళ్ళలేని పరిస్థితుల్లో తమ హక్కును వృథా కానివ్వనక్కర లేదు.

2011 నాటి జనాభా లెక్కల ప్రకారం 37 శాతం జనాభా (45.36 కోట్ల మంది) తమ స్వస్థలాల్ని వదిలి, దేశీయంగా వలసపోయినవారే. వీరిలోనూ నూటికి 85 మంది తమ సొంత రాష్ట్రంలోనే విద్య, ఉద్యోగం, వివాహం లాంటి రకరకాల కారణాలతో గ్రామాల నుంచి పట్టణ ప్రాంతాలకు వలసపోతున్నారు. వీరంతా ఎన్నికల వేళ స్వస్థలాల్లో ఓటు వినియోగించుకోలేక పోతున్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో 91.2 కోట్ల మంది భారతీయులకు ఓటు హక్కుంటే, వారిలో 67.4 శాతమే ఓటేశారు. 30 కోట్ల పైచిలుకు మంది తమ హక్కును వినియోగించుకోలేదు. అంటే, ప్రతి ముగ్గురిలో ఒకరు ఓటు వేయనే లేదు. వలస వల్ల అధికశాతం ఓటు హక్కు వినియోగించు కోవట్లేదు గనక, వారు ఎక్కడున్నా ఓటేసే వీలు కల్పిస్తే పోలింగ్ శాతం పెరుగుతుందనేది ఎన్నికల సంఘం ఆలోచన.

దీనికి చట్టపరంగా, సాంకేతికంగా, పాలనాపరంగా అనేక సమస్యలున్నాయి. 'వలసజీవి' అనే మాటకు భారత రిజిస్ట్రార్ జనరల్, కేంద్ర కార్మిక శాఖ, జాతీయ నమూనా సర్వే సంస్థల్లో ఒక్కోచోట ఒక్కో నిర్వచనం ఉంది. అసలు స్వస్థలానికి ఎంతకాలంగా దూరంగా ఉంటే వలస ఓటర్? రిమోట్ నియోజకవర్గాల్లో ఎన్నికల నియమావళి అమలుచేసేదెట్లా? ఈ వలసజీవుల్ని ఎలా గుర్తించాలి, ఎలా సురక్షిత వాతావరణం కల్పించాలి? రిమోట్ ఓటర్ల డేటా లేదని ఎన్నికల సంఘమే చెబుతోంది. కానీ, 2023లో 9 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ప్రయోగాత్మకంగా ఆర్వీఎంలను వాడాలనీ, 2024 సార్వత్రిక ఎన్నికలకు పూర్తిగా అమలు చేయాలనీ పాలకుల పనుపున తహతహలాడుతోంది.

అసలు ముందుగా ప్రజాప్రాతినిధ్య చట్టం, ఎన్నికల నిర్వహణ, ఓటర్ల నమోదు నియమాలు మార్చాలి. ఆలోచించి చేయాల్సిన ఈ పనుల్ని హడావిడిగా నడిపించి, చటుక్కున చేతిలోకి రిమోట్ తీసుకుంటే అనుమానాలు బలపడతాయి. ఎలక్ట్రానిక్ డిస్‌ప్లేతో ఓటింగ్‌పై అంతర్జాతీయంగానూ అనుమానాలున్నాయి. బలమైన ఆధారాలు లేకున్నా ఎన్నికల్లో మోసాలకు ఇది వీలు కల్పిస్తుందని ఓ భావన. సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామింగ్‌లో కుయుక్తులు, యంత్రాల భద్రత, వేసిన ఓట్లు ఏ మేరకు సురక్షితం లాంటి చర్చనీయాంశాలున్నాయి. ఇటీవల గుజరాత్ ఎన్నికల్లో ఆఖరి గంటలో 10 – 12 శాతం ఓటింగ్ రేపిన సందేహాలనూ విస్మరించలేం. రేపు రిమోట్ ఓటింగ్‌లోనూ ఇలాంటివే పరిపాటైతే, అసలు ఎన్నికల ప్రక్రియపైనే నమ్మకం పోతుంది. అప్పుడిక ప్రజాస్వామ్యానికి అర్థం ఏముంటుంది!

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, పుష్యమాసం, **తిథి:** శు.ద్వాదశి రా.11.02 వరకు, తదుపరి త్రయోదశి, **నక్షత్రం:** కృత్తిక సా.6.03 వరకు, తదుపరి రోహిణి, **వర్జ్యం:** లేదు, **దుర్ముహూర్తం:** ఉ.8.46 నుండి 9.30 వరకు, తదుపరి రా.10.45 నుండి 11.37 వరకు, **అమృతఘడియలు:** ప.3.30 నుండి 5.10 వరకు.

సూర్యోదయం : 6.36
సూర్యాస్తమయం: 5.34
రాహుకాలం : ప. 3.00 నుంచి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుంచి 10.30 వరకు

అమృతోత్సవ దీక్షకు ఫలితం?!

కోరేగావ్ దళిత మహాసభ ఉద్దేశాన్ని వక్రంగా చిత్రించి, ఆ సభకు హాజరైన కొందరు వామపక్ష సభ్యులు పాలకుల్ని హత్య చేయడానికి కుట్ర పన్నారన్న మిషపైన దేశవ్యాప్తంగా కొందరు పౌర హక్కుల నాయకుల్ని నిష్కారణంగా అరెస్టులు చేసి వేధింపులకు గురిచేశారు. గూఢచర్య 'పెగసస్'తో భారతదేశ పౌర సమాజంపై పాలక పక్షం విరుచుకుపడింది. ఆఖరికి చిన్న దేశమైన భూటాన్ కరెన్సీతో ఇండియా రూపాయి సమానమైంది. ఇలా గడిచిన ఏడాది ఎన్నో పరిణామాల్ని భారతీయ సమాజం చవిచూసింది. భారత స్వాతంత్య్ర అమృతోత్సవాల వేళ పాలకులు, పాలితులు మిగిలిన పాఠాలను స్మరించుకోవలసి ఉంది. గడిచిన 75 ఏళ్ల చరిత్ర నుంచి గుణపాఠాలు నేర్చుకోవలసి ఉంది.



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

భారత స్వాతంత్య్రానికి 75 ఏళ్లు నిండిన వేళ దేశ అత్యున్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్ దేశ న్యాయ స్థానాలకూ, పాలక వర్గానికీ, పౌర సమాజానికీ బాధ్యతా యుతమైన కర్తవ్యాన్ని (30 డిసెంబర్ 2022) నిర్దేశించారు. రాబోయే రోజుల్లో దేశ న్యాయ వ్యవస్థలో మహిళలదే ప్రధాన పాత్ర కాబోతున్నదనీ, వలసవాద ఆలోచనా విధానాల నుంచి న్యాయ వ్యవస్థను రక్షించవలసిన సమయం వచ్చిందనీ అన్నారు. వ్యక్తులను అకారణంగా అరెస్టులు చేసి, జైళ్లలో పెట్టడం వారి వ్యక్తిగత స్వేచ్ఛను హరించడమేనంటూ పలువురు పౌరుల విడుదలకు మార్గాన్ని సుగమం చేశారు.

కోరేగావ్ దళిత మహాసభ ఉద్దేశాన్ని వక్రంగా చిత్రించి, ఆ సభకు హాజరైన కొందరు వామపక్షాల సభ్యులు పాలకుల్ని హత్య చేయడానికి కుట్ర పన్నారన్న మిషపైన దేశవ్యాప్తంగా కొందరు పౌర హక్కుల నాయకుల్ని నిష్కారణంగా అరెస్టులు చేసి వేధింపులకు గురి చేస్తూ వచ్చారు. కోరేగావ్ దళితుల సభలో స్వయంగా పాల్గొన్న న్యాయమూర్తులు ఈ అరెస్టులను, వేధింపులను నిరసించినా పాలకుల కుట్రపూరిత వైఖరి కొనసాగుతూనే వచ్చింది. కాగా జస్టిస్ చంద్రచూడ్ ప్రధాన న్యాయమూర్తిగా పదవిని స్వీకరించిన తర్వాత ఈ వేధింపుల విషయంలో కూడా స్పష్టమైన వైఖరి తీసుకున్నారు. అరెస్టయినవాళ్లు జైళ్లలో నిరవధికంగా విచారణ లేకుండా మగ్గడాన్ని గమనించి, నిష్కారణ పరిణామానికి ఫుల్‌స్టాప్ పెట్టడానికి నిర్ణయించారు. విచారణను త్వరితం చేసి, డిటెన్యూల విడుదలకు క్రమంగా చర్యలు తీసుకోవడం హర్షించదగిన పరిణామం.

ఫాదర్ స్టాన్ స్వామి అరెస్టు ఉదంతం పాలక వర్గాల అత్యంత నీచమైన చర్య. భారత నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ) సేకరించానని ప్రకటించిన 'సాక్ష్యం' ఫాదర్ స్టాన్ స్వామి, తదితర నిందితుల కంప్యూటర్లలోకి పనిగట్టుకొని చొప్పించిన దొంగ సాక్ష్యాలేనని ప్రసిద్ధ అమెరికన్ డిజిటల్ ఫోరెన్సిక్ కంపెనీ 'ఆర్సెనల్ కన్సల్టెన్సీ' విడుదల చేసిన నివేదికలో (10 డిసెంబర్ 2021) పేర్కొంది. విచిత్రమేమంటే, ఏ ఇజ్రాయిల్ స్పైవేర్ 'పెగసస్'ను భారత పాలకులు ఉపయోగించారో, దాని సంస్థతో ఎన్ఐఏ కూడా సంబంధాలు పెట్టుకుంది. అయితే సుప్రీంకోర్టు (27 అక్టోబర్ 2021) విచారణ కోసం ఒక సాంకేతిక సంఘాన్ని నియమించింది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఆర్.వి. రవీంద్రన్ అధ్యక్షులుగా ఉన్న ఈ కమిటీలో ప్రొఫెసర్ పి. ప్రభాకరన్, ప్రొఫెసర్ అశ్విన్ గుమస్తే సభ్యులుగా ఉన్నారు. నిందితుల ఫోన్లను ఇజ్రాయిల్ పెగసస్ స్పైవేర్ ట్యాంపర్ చేస్తున్న విషయం నిజమా? కాదా? అని తేల్చాలని ఈ కమిటీ ఎన్ఐఏను ఆదేశించింది. కానీ, ఇంతవరకూ ఆ విషయాన్ని ఎన్ఐఏ తేల్చకుండా దాటవేసిందని వార్తలు. ఈ 'కప్పదాట్లు' అంతటితో ఆగలేదు. 'పెగసస్'తో భారతదేశ పౌర సమాజంపై పాలక పక్షం

రెండో మాట



విరుచుకుపడేంతవరకు కొనసాగుతూనే వచ్చింది. అంతేగాదు, కాంగ్రెస్ పాలకుల 'బోఫోర్స్' కొనుగోళ్ల వల్ల దేశం నష్టపోయింది రూ. 70 కోట్లు కాగా, బీజేపీ–ఆరెస్సెస్ పాలకుల రఫేల్ (ఫ్రెంచి) విమానాల కొనుగోళ్ల వల్ల దేశం కోల్పోయింది రూ. 70 వేల కోట్లని తేలినా నిగ్గతీయగల చైతన్యాన్ని ప్రతిపక్షాలూ కోల్పోయాయి.

ఆ మాటకొస్తే, 2002లో గుజరాత్‌లో ఏమైంది? పాలకుల అధికారిక దౌర్జన్యాలను, ఆగడాలను ఎండగట్టి, వారు శిక్షార్హులేనని సుప్రీంకోర్టు ప్రత్యేక సలహాదారుగా విచారణకు నియమితులైన 'ఎమికస్ క్యూరీ' ప్రసిద్ధ న్యాయవాది రాజు రామచంద్రన్ సమర్పించిన నివేదికను కూడా పాలకులు తొక్కిపట్టిన ఉదంతాన్ని దేశం మరచిపోలేదు. ఇన్ని రకాల దారుణాలకు, పాలక పక్షాలు ఒడిగట్టిన దేశంలో – స్వాతంత్య్ర దినోత్సవ అమృతోత్సవాలు ముగిసిన వేళలో పాలకులకు, పాలితులకు మిగిలిన గుణపాఠాన్ని స్మరించుకోవలసిన సమయమిది. దేశ స్వాతంత్య్రం కోసం సకల వ్యక్తిగత సౌకర్యాలను గడ్డిపోచగా భావించి ప్రాణాలు సహా సర్వస్వాన్ని త్యాగం చేసిన లక్షలాదిమంది దేశభక్తులను ఒక్కసారి తలచుకోవలసిన సమయం ఇదే. గడిచిన 75 ఏళ్ల పరిణామాల నుంచి గుణపాఠాలు తీసుకోవలసిన ఘడియ కూడా ఇదే!

అంతేగాదు, ఈ 75 ఏళ్లలోనే క్రమంగా పత్రికా రంగంలో కూడా జాతీయ ప్రయోజనాల పరిరక్షణ స్పృహకన్నా కార్పొరేట్ ఇండియాలో భాగంగా కార్పొరేట్ మీడియా బలిసింది. పత్రికా రంగంలో ప్రయివేట్ రంగ ప్రయోజనాల ప్రాధాన్యం పెరిగింది. తద్వారా జర్నలిజం స్వరూప స్వభావాలనే అది తారుమారు చేస్తూ వచ్చింది. 1955 నాటికే వర్కింగ్ జర్నలిస్టుల, తదితర వార్తా పత్రికా ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడుతూ ప్రత్యేక చట్టమే వచ్చింది. ఫలితంగా ఇతర సంస్థలలో పనిచేసే వివిధ వృత్తిదారుల ప్రయోజనాలను కూడా రక్షించే నిబంధనలు అందులో పొందు పర్చడం జరిగింది. ఇది లేబర్ కోర్టుల ద్వారా ఉద్యోగుల సమస్యల సామరస్య పరిష్కారానికి తోడ్పడింది. తొల్లింటి ప్రయివేట్ మీడియాను జైన్లు, బిర్లాలు, గోయెంకా లాంటి జూట్ వ్యాపారులు నిర్వహించగా, ఇప్పుడు ఆ స్థానాన్ని నడమంత్రపు 'సిరి' పారిశ్రామికవేత్తలు భర్తీ చేశారు. వీళ్లపైన భారత రాజ్యాంగ నిబంధనల ఆజమాయిషీ బొత్తిగా మృగ్యమై పోవడం కూడా కాంగ్రెస్, బీజేపీ–ఆరెస్సెస్ పాలనల 'పుణ్యమే'. కాబట్టి ఈ సమీక్ష అనివార్యమవుతోంది.

చివరికి మన కరెన్సీ కూడా ఈ 75 ఏళ్లలో ఏ స్థాయికి దిగజారి పోయిందో, ఆ దిగజారుడులో కాంగ్రెస్ పాలకులు కూడా భాగస్వాములయినా ఒక ఆలోచనాపరురాలిగా, కాంగ్రెస్ వాదిగా భావికా కపూర్ నిర్మొహమాటంగా ఇలా వర్ణించారు: మన ప్రగతి 'వేగం' ఇప్పుడు ఏ స్థాయిలో ఉందంటే – ''భూటాన్ కరెన్సీ ఇప్పుడు ఇండియా కరెన్సీతో సమానం. ఒక భూటానీస్ గుల్ట్రమ్ (కరెన్సీ) ఒక రూపాయితో సమానమైంది. భూటాన్ ఒక్కటే కాదు, అఫ్ఘానిస్తాన్ రూపాయి కూడా ఇండియా రూపాయితో సమానమై కూర్చుంది. అంటే, మనమిప్పుడు తాలిబన్ల రాజ్యానికి సమానమన్నమాట. వావ్ మోదీజీ.. వావ్!'' (30 డిసెంబర్ 2022)

ఏది ఏమైనా, 75 ఏళ్ల భారత అమృతోత్సవాలు ముగిసిన వేళలో ఒక మహాకవి, స్వతంత్ర భారత మానవుడిని తలచుకుని అతని నేటి దుస్థితికి స్పందించిన తీరును మరొక్కసారి గుర్తు చేసుకుందాం:

''ఆ మానవమూర్తి ముఖం మీద
ఎప్పుడూ ఉండే పసిపాప నవ్వులేదు!
స్వతంత్ర భరతవర్ష వాస్తవ్యుడా మానవుడు
అర్ధనగ్నంగా ఆకాశాన్నే కప్పుకొని
నిండని కడుపుతో మండుతూన్న కళ్లతో
ఇలా ఎంతకాలం ఇంకా నిలబడతాడా ప్రాణి?
అందుకే అతణ్ణి జాగ్రత్తగా చూడండి
స్వతంత్ర భారత పౌరుడు
అతని బాధ్యత వహిస్తామని
అందరూ హామీ ఇవ్వండి
అతని యోగ క్షేమాలకు / అందరూ పూచీపడండి
అతికించండి మళ్లీ / అతని ముఖానికి నవ్వు!
స్వాతంత్య్రం ఒక చాలా సున్నితమైన పువ్వు,
చాలా వాడైన కత్తి, విలువైన వజ్రం
స్వాతంత్య్రం తెచ్చేవెన్నెన్నో బాధ్యతలు
సామర్థ్యంతో నిర్వహిస్తామని / సంకల్పం చెప్పుకుందాం''

ఇంతకీ మహాకవి ఆశించిన ఆ 'సామర్థ్యం, సంకల్పం' మనలో ఏది? అది మనలో కరువయింది కాబట్టే పాలకుల పాలనా సామర్థ్యాన్ని గత సుమారు రెండు దశాబ్దాలుగా బొడ్లో చేయివేసి ప్రశ్నిస్తున్న 'ఏడీఆర్'(అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్) నిరంతర నివేదికలు కూడా 'బుట్టదాఖలు' అవుతున్నాయి.

abkprasad2006@yahoo.co.in

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

అసలు సమస్య



అవును... పెద్దనోట్లను రద్దు చేయడానికి పాటించిన విధానం చట్టబద్ధమే. కానీ అది అత్యధిక భారతీయ ప్రజల ప్రయోజనాలకు వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయం.
– రాన్ దెల్నెవో, ఆర్థికాంశాల వ్యాఖ్యాత

ఆపేయండ్రో!



ఒకవేళ నాకు ఈ 'బ్రో', 'డ్యూడ్' లేదా 'చిల్' అనే మాటలు పూర్తి పెద్దవాళ్ల నుంచి వినిపిస్తే గనక నేను బద్దలైపోతాను.
– దుష్యంత్ ఎ., న్యాయవాది

మనుషులే భిన్నం



కేరళలో ఎంత ఎక్కువ తిరుగుతుంటే అంతగా నేను సమాధాన పడుతున్నది ఏమంటే, 'కేరళ మోడల్'ను అంత సులభంగా అనుసరించలేం. అది ఈ ప్రభుత్వమా, ఆ ప్రభుత్వమా; ఈ విధానమా, ఆ విధానమా గురించి కాదు. కేరళకు ఒక విభిన్న చరిత్ర ఉంది. అది ఎన్నో అంశాల సంగమం. కొన్ని భాగాల్ని అనుసరించొచ్చు. కానీ మొత్తాన్నీ కాదు.
– పత్రలేఖా ఛటర్జీ, విజిటింగ్ ఫెలో

మీకంటే పాతది



జెరూసలేం ఆక్రమణలో ఉందని ఐక్య రాజ్య సమితి ఎన్నిసార్లు చెప్పినా సరే – క్రీపూ.1000 సంవత్సరంలో కింగ్ డేవిడ్ తన రాజ్యానికి దాన్ని రాజధాని చేసుకున్నారనే చారిత్రక వాస్తవాన్ని తుడిచెయ్యలేరు. అప్పటికి 'పాలస్తీనా' లేదు, ఐక్యరాజ్యసమితి కూడా లేదు.
– హనన్య నఫ్తాలీ, ఇజ్రాయిల్ వ్యాఖ్యాత

అధికారిక ధోరణి



రష్యా అధికారిక ఛానల్ నిర్వహించిన నూతన సంవత్సర స్పెషల్ షోలో వాళ్లు బహిరంగంగా పాశ్చాత్య దేశాలను ఉద్దేశించి ఈ మాట చెప్పారు: "మీకు ఇష్టమున్నా లేకపోయినా, రష్యా విస్తరిస్తోంది." దానికి స్టూడియోలో ఉన్న అతిథుల మూడ్ ఎంతో ఉల్లాసంగా కనిపించింది.
– జూలియా డేవిస్, కాలమిస్ట్

ప్రచారంలో భాగం



టీకాలు వేసుకోని పౌరులను జైల్లో పెట్టడానికి ఇదే తగిన సమయం అంటూ వ్యాఖ్యలు చేశారు హాలీవుడ్ నటుడు షాన్ పెన్. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఈ కళాకారులు, 'ఇన్‌ఫ్లుయెన్సర్లు' అందరూ కూడా టీకాల గురించి ప్రచారం చేయడానికి డబ్బులు తీసుకున్నారు. అది ఎప్పటికీ మరిచిపోవద్దు.
– రాబర్ట్ డబ్ల్యూ.మలోని, టీకా శాస్త్రవేత్త

హింసకు సరేకానీ...



పాకిస్తానీయుల మనస్తత్వానికి 'ద లెజెండ్ ఆఫ్ మౌలా జట్' కచ్చితమైన ఉదాహరణ. ఒక పురుషుడి ఖండిత శిరస్సును ఒక మహిళ తన చేతిలో పట్టుకునే దృశ్యం ఉన్న ఈ సినిమాను చూడటానికి కుటుంబ సమేతంగా వెళ్లొచ్చు. కానీ సినిమాలో ఒక్క శృంగార దృశ్యం కూడా ఉండకూడదు. ఎందుకు? ఎందుకంటే అది కుటుంబ చిత్రం. ప్రేమ వాళ్లను రెచ్చగొడుతుంది. కానీ హింస అనేది సాధారణం.
– సయ్యద్ ముజమ్మిల్ షా, పాక్ టీవీ హోస్ట్

మహిళా విద్యా ప్రదాత

విద్య ద్వారా సమాజంలో ఉన్న అసమానతలను చదును చేయాలని... 18వ శతాబ్దంలోనే మహాత్మ జ్యోతిబాపూలే, సావిత్రీబాయి పూలే దంపతులు ప్రయత్నించారు. మొక్కవోని వారి దీక్ష వల్ల అప్పటి సమాజంలో హీన స్థితిలో ఉన్న స్త్రీల జీవితాలకు అండ దొరికింది. భర్త జ్యోతిబా పూలే ప్రోత్సాహంతో స్వయంగా చదువుకున్న సావిత్రీబాయి దేశంలో మహిళా విద్యకు దారిదీపం అయింది.

1840లో 9 ఏళ్ల సావిత్రీబాయి వివాహం 13 ఏళ్ల జ్యోతిబా పూలేతో జరిగింది. స్త్రీలకు విద్య చాలా అవసరం అని గ్రహించి ముందు తన భార్య సావిత్రీబాయికి చదువు నేర్పాడు జ్యోతిబా. భారతదేశ చరిత్ర లోనే స్త్రీ విద్యను మొట్ట మొదట ప్రవేశపెట్టిన వాడు జ్యోతిబాపూలే. తన పొలం దగ్గర మామిడి చెట్టు నీడలో మొట్ట మొదటి పాఠశాల పెట్టాడు. ఆ పాఠశాలలో ఆయన అక్క సుగుణబాయి, భార్య సావిత్రీబాయి విద్యార్థులు! స్త్రీ విద్యా ప్రయోగ శాలగా ఆ పాఠశాల చరిత్రలో మిగిలిపోయింది.



సావిత్రీబాయి పూలే

1848లో ఓ భవంతిలో స్త్రీల కోసం పాఠశాలను ఏర్పాటు చేశాడు పూలే. చదువు నేర్చుకునే క్రమంలో సావిత్రీబాయి ఎన్నో పుస్తకాలు చదివి స్త్రీ ఎంత దారుణ స్థితిలో ఉందో అర్థం చేసుకుంది. అదే సమయంలో అమెరికా నల్లజాతి వివక్ష వ్యతిరేక పోరాట నాయకులు థామస్ క్లార్క్ జీవిత చరిత్ర చదివి స్ఫూర్తి పొందింది. బ్రాహ్మణ స్త్రీలతోపాటూ బహుజన స్త్రీ జనోద్ధరణకు భర్తతో పాటూ నడుం బిగించింది. స్త్రీ జనోద్ధరణకు సంబంధించిన అన్ని కార్యక్రమాలకూ ఆమే ఇన్‌చార్జ్‌గా వ్యవహరించింది.

1851లో పూణేలో అమ్మాయిల కోసం మరో స్కూలు ప్రారంభించారు. మెల్లమెల్లగా పూలే దంపతులు 18 పాఠశాలలను స్థాపించారు. అయితే నాటి ఛాందసవాదులు సావిత్రీబాయి మామగారిని... ఆయన కొడుకూ, కోడలూ శాస్త్ర విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని రెచ్చగొట్టారు. దీంతో పూలే దంపతులను మామగారు ఇంటి నుండి వెళ్లగొట్టారు. అయినా ఆ దంపతులు తమ మార్గాన్ని మార్చుకోలేదు. ఆత్మహత్య చేసుకోబోతున్న కాశీ బాయి అనే గర్భవతి అయిన బ్రాహ్మణ వితంతు మహిళను కాపాడి ఆమె కన్న పిల్లవాడిని దత్తత తీసుకుని 'యశ్వంతరావు' అని పేరు పెట్టుకొని పెంచి పెద్ద చేశారు. 1876–77లో మహారాష్ట్రలో భయంకరమైన కరువు వచ్చి జనాలు ఆకలితో అలమటిస్తుంటే తమ 'సత్య శోధక సమాజ్' ద్వారా ఆహార సేకరణ చేసి ఆదుకున్నారు. ఆమె మంచి ఉపాధ్యాయురాలే కాదు, కవయిత్రి కూడా. ఆమె రచించినటువంటి 'కావ్య పుష్పాలు' అనే సంపుటి చాలా గొప్పది.

ప్లేగు వ్యాధి గ్రస్తులకు సేవ చేస్తూ ఆ వ్యాధికే బలై 1897 మార్చి 10వ తేదీన తుది శ్వాసవిడిచి ఎందరికో స్ఫూర్తిప్రదాతగా నిలిచిన మహనీయురాలు సావిత్రీబాయి.

– తండ సదానందం, టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్

(నేడు సావిత్రిబాయి పూలే జయంతి)

ఉస్మానియా అలాయ్ బలాయ్!

వందేళ్ళకు పైగా ఘన చరిత్ర, కీర్తి గల ఉస్మానియా యూనివర్సిటీ మరొక అద్భుతమైన ఘట్టానికి తెరలేపుతోంది. గ్లోబల్ అలుమ్నుయి మీట్ (జీఏఎమ్–23)ను జనవరి మూడు, నాలుగు తేదీలలో నిర్వహిస్తోంది. స్వాతంత్య్ర ఉద్యమ కాలంనాటి వందేమాతరం ఉద్యమం నుండి తొలి, మలి తెలంగాణ ఉద్యమాల వరకూ ఎన్నో ప్రజా యుద్ధాలకూ, తెలంగాణ ప్రజల అస్తిత్వానికీ, ఆత్మగౌరవానికీ చిహ్నంగా నిలిచింది ఉస్మానియా.

ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల 57వ రూమ్ ఎన్నో సామాజిక, రాజకీయ, అస్తిత్వ ఉద్యమాలకూ, మేధో చర్చలకూ వేదిక అయింది. హైదరాబాద్‌కు మణిహారం లాంటి ఆర్ట్స్ కళాశాల నుండి ప్రపంచాన్ని ప్రభావితం చేసిన మేధావులు, పాత్రికేయులు, రాజకీయ నాయకులు, కళాకారులు, సాహితీ వేత్తలు, వ్యాపారవేత్తలు, సినీ, క్రీడా ప్రముఖులు తయారయ్యారు. మిగతా కళాశాలల నుంచి గొప్ప ఇంజినీరింగ్, శాస్త్ర సాంకేతిక నిపుణులూ, సైంటిస్టులూ తలెత్తారు. ఈ దేశానికి ప్రధాన మంత్రి అయిన పీవీ నర్సింహారావు, పార్లమెంట్‌లో గొప్ప వక్తగా, విమర్శకునిగా పేరున్న ఎస్. జైపాల్ రెడ్డి, లోక్‌సభ మాజీ స్పీకర్ శివరాజ్ పాటిల్, వామపక్ష ఉద్యమాలకు ఊపిరులూదిన జార్జిరెడ్డి; గొప్ప కవి, రచయిత, టీచర్‌గా పేరున్న సి. నారాయణ రెడ్డి, సినీ దిగ్గజం శ్యాంబెనెగల్, ఆర్‌బీఐ మాజీ గవర్నర్ వైవీ రెడ్డి... ఇలా చెప్పుకుంటూ పోతే ఉస్మానియా ఉత్పత్తి చేసిన మహామహుల పేర్లకు అంతుండదు. నిజానికి ఉస్మానియా చరిత్ర రాస్తే ఒక ఉద్గ్రంథమే అవుతుంది.



కడుపు చేత పట్టుకొని వచ్చిన వేలాది మంది విద్యార్థులను అమ్మలాగా ఆదరించి అక్కున చేర్చుకొని వారికి సుందరమైన భవిష్యత్తును తీర్చిదిద్ది దేశ సేవ కోసం బయటికి పంపింది ఉస్మానియా.

'ఎన్‌సీసీ' నుండి యూనివర్సిటీ ప్రాంగణంలోకి అడుగుపెట్టగానే ఏదో తెలియని అనుభూతి అనుభవిస్తే గాని మనసు కుదుటపడదు. పచ్చని చెట్లు, పిట్టల కిలకిలా రావాలతో జీవ వైవిధ్యం ఉట్టిపడే క్యాంపస్‌లో అడుగుపెడితే ఎన్నో అద్భుతమైన జ్ఞాపకాలు! యూనివర్సిటీ లైబ్రరీలో రేయింబవళ్లూ కూర్చొని చదువుకోవడం, ఇంజనీరింగ్ కాలేజీ క్యాంటీన్ కబుర్లూ; అబ్బాయిలూ, అమ్మాయిలూ కలిసి చెట్టాపట్టాల్ వేసుకుని తిరిగే దృశ్యాలూ, ఎల్లమ్మ తల్లి గుడి దగ్గర జరుపుకొన్న వేడుకలూ, యూనివర్సిటీలోని చాయ్ కొట్టుల దగ్గర జరిపిన సుదీర్ఘమైన సామాజిక, రాజకీయ చర్చలూ, సరదా సంభాషణలూ... ఎన్ని జ్ఞాపకాలు!


మన యూనివర్సిటీ క్యాంపస్‌లో ఆత్మీయ ఆలింగనాలు చేసుకుని మరోసారి పలకరించుకుందాం రండి. సుదీర్ఘకాలం తర్వాత మళ్లీ ఒకసారి అందరం ఒక దగ్గర కూడి ఆనాటి మధుర జ్ఞాపకాలను తలుచుకుని తరించే అవకాశం యూనివర్సిటీ కల్పిస్తోంది. ఇలాంటి అవకాశాలు, సందర్భాలు రావడం బహు అరుదు. అన్ని విధాలా అభివృద్ధి చెందిన మన పాత విద్యార్థులు యూనివర్సిటీ అభివృద్ధికి తమ వంతు సాయం అందించడానికి తగిన సందర్భమూ ఇదే!

– వలిగొండ నరసింహ, రీసెర్చ్ స్కాలర్, ఓయూ

(నేడు, రేపు ఓయూ పూర్వ విద్యార్థుల సమ్మేళనం)

అవసరంలో ఒక అసత్యం

ఎప్పుడూ సత్యమే పలకాలనీ, అబద్ధాలాడటం వ్యక్తిత్వానికి మచ్చ అనీ, అసత్యాలు పలికేవారిని సమాజం గౌరవించకుండా చిన్న చూపు చూస్తుందనీ... సాధారణంగా పెద్దవాళ్ళు ఇలా పిల్లలకు చెపుతూ ఉంటారు. ఉపాధ్యాయులు, విద్యార్థులకు సత్య వాక్యం గొప్పదనాన్ని బోధిస్తూ ఉంటారు. అయితే, జీవితంలో ఎప్పుడూ అబద్ధాలాడకుండా ఉండడం సాధ్యమేనా? కానే కాదు. అవసరం లేకపోయినా అదో అలవాటుగా మారిపోయి, తరచూ అబద్ధాలాడే వ్యక్తి ఎప్పుడైనా నిజం చెప్పినా ఎవరూ నమ్మరు. కాని, అవసర సమయాలలో అబద్ధం చెప్పటం తప్పు కాదని, ప్రాచీన గ్రంథాలు చెపుతున్నాయి.



జ్యోతిర్మయం

ఆదిపర్వంలో శుక్రాచార్యుని కుమార్తె దేవయానిని యయాతి పెళ్లాడినప్పుడు, ఆమె వద్ద దాసిగా ఉన్న వృషపర్వుని కూతురు శర్మిష్ఠ యయాతి వద్దకు దేవయానితో పాటు వస్తుంది. శర్మిష్ఠ తనను భార్యగా స్వీకరించమని యయాతిని కోరుతుంది. అతడు, శుక్రాచార్యునికి ఇచ్చిన మాట తప్పినట్లవుతుందనీ, అసత్య దోష మౌతుందనీ చెపుతాడు. అప్పుడు శర్మిష్ఠ 'ప్రాణాలకు నాశనం కలిగే సమయాన, తమ ధనం అపహరించబడే సమయాన, పెళ్లి వేళలందు అసత్య మాడటం దోషం కాద'ని చెపుతుంది. తనను వివాహమాడమని కోరుతుంది. అందుకే, వెయ్యి అబద్ధాలాడైనా ఒక పెళ్లి చేయాలనే సామెత పుట్టి ఉంటుంది.

ఇదే విషయాన్ని భాగవతంలో పోతన చెపుతాడు. వామనావతార ఘట్టంలో, దానమడగటానికి వచ్చిన బాలుడు విష్ణువని గ్రహించిన దానవ గురువు శుక్రాచార్యులు బలి చక్రవర్తితో... 'స్త్రీల విషయంలో, వివాహ సమయంలో; ప్రాణానికి, సంపదకు, మానానికి హాని కలుగుతున్నప్పుడూ అబద్ధం ఆడితే తప్పు లేదనీ, వామనునికి ఇచ్చిన మాట వెనక్కి తీసుకొని ప్రాణాలు కాపాడుకో'మనీ చెపుతాడు. అయినా, బలి చక్రవర్తి మాట తప్పలేదు. వామనునికి దాన మిచ్చాడు.

నేటి మానవ జీవితంలో ఒక అబద్ధమైనా ఆడకుండా మనుగడ సాగించటం సాధ్యం కాదు. అత్యవసర సందర్భాలలో తమను తాము రక్షించుకోవటానికి, మనుషులు అరుదుగా అసత్యమాడినా దోషం కాదు కాని, అబద్ధాలాడటం ఒక మార్చుకోలేని అలవాటుగా పరిణమిస్తే మాత్రం గౌరవ హాని కలుగుతుందనేది తథ్యం.

– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

పేదలను బలిగొంటున్న బాబు ప్రచారార్భాటం

- 827వ రోజు రిలే దీక్షలో మండిపడ్డ బహుజన నాయకులు


రిలే దీక్షలో కూర్చున్న బహుజన నాయకులు

తాడికొండ: తన ప్రచారార్భాటంతో పేదల ప్రాణాలను బలిగొంటున్న చంద్రబాబును తక్షణమే అరెస్టు చేసి జైల్లో పెట్టాలని బహుజన పరిరక్షణ సమితి నాయకులు డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లాతుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షల 827వ రోజు సోమవారం పలువురు మాట్లాడారు. పబ్లిసిటీ పిచ్చితో పేదలకు తాయిలాలు ఇస్తామని ఆశపెడుతూ చంద్రబాబు పెడుతున్న మీటింగులకు వెళ్లిన పేద ప్రజలు అమాయకంగా ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజధానిలో తమ స్వార్థ ప్రయోజనాల కోసం సీఆర్డీయేకు భూములు అమ్ముకుని రిటర్నబుల్ ప్లాట్లు పొందిన కులవాదులు.. ఇప్పుడు రాష్ట్ర ప్రయోజనాల కోసం భూములిచ్చామని చెప్పడం మోసపూరితం కాదా అని ప్రశ్నించారు. రాష్ట్రానికి చంద్రబాబు శనిలా తయారయ్యాడన్నారు. బహుజనులు 827 రోజులుగా ఉద్యమాలు చేస్తుంటే తమ పచ్చ పత్రికల్లో ప్రచురించకుండా రాష్ట్రంలో కులవాదాన్ని రెచ్చగొడుతున్న మీడియాపై చర్యల కోసం త్వరలో ప్రెస్ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. బాబు ఆయన ఎల్లో మీడియా, బినామీలు కలిసి ఎన్ని కుట్రలు పన్నినా రాబోయే ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించి సత్తా చాటుతామని హెచ్చరించారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, బేతపూడి సాంబయ్య, పులి దాసు, ఈపూరి ఆదాం తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠనాథుడిని దర్శించుకున్న సీజేఐ

సాక్షి, న్యూఢిల్లీ: వైకుంఠ ఏకాదశి సందర్భంగా న్యూఢిల్లీలోని గోల్ మార్కెట్ వద్ద గల బాలాజీ ఆలయాన్ని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వైకుంఠ ఏకాదశి పూజలకు సీజేఐ చంద్రచూడ్ హాజరుకాగా.. ఆలయ అధికారులు ఆయనను సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అంజనాదీప్తి, నాగసత్యం, చంద్రశేఖర్, సదానందరెడ్డి, రామమూర్తి పాల్గొన్నారు.

కబసురా పంపిణీకి కేంద్రం కసరత్తు

- తమిళనాడు ప్రభుత్వంతో సంప్రదింపులు
- కరోనా సెకండ్, థర్డ్ వేవ్‌లలో కబసురా వినియోగం

సాక్షి, చెన్నై: తమిళనాట సిద్ధ వైద్యంలో రోగ నిరోధక శక్తిని పెంపొందించే ప్రధాన మూలికల మందు (హెర్బల్ డ్రింక్) కబసురా కషాయంపై కేంద్రం కన్ను పడింది. ఇది తమిళులకు తగినంత శక్తిని ఇస్తుండటంతో దేశవ్యాప్తంగా కబసురా పంపిణీ చేయడానికి కసరత్తు చేపట్టింది. ఈ అంశంపై తమిళనాడు ప్రభుత్వంతో కేంద్ర ఆరోగ్య శాఖ వర్గాలు సంప్రదింపులు జరుపుతున్నట్టు సమాచారం. కరోనా తొలి వేవ్ సమయంలో కబసురా దివ్యౌషధంగా మారింది. ఎలాండి సైడ్ ఎఫెక్ట్‌లు లేకపోవడంతో ఇంటింటా కబసురా వాడకం నేటికీ జరుగుతోంది. లవంగం, కిప్పిలి ఆకు, సిరుకాంచ్చేరి వేరు, ఆడతుడ ఆకు, కర్పూరవల్లి ఆకు, నెలవేము వేరు, కడుక్కాయ్ తదితర 15 రకాల మూలికలతో దీనిని తయారు చేస్తున్నారు. రేషన్ దుకాణాల్లో సైతం చౌక ధరకే లభించే ఈ పొడిని వేడినీటిలో వేసుకుని తాగితే చిన్నపాటి జ్వరం కూడా తగ్గుతుంది.


కబసురా కషాయం ప్యాకెట్

అప్పట్లో 3 లక్షల కిలోల అమ్మకం

తమిళనాడు ప్రభుత్వ పరిధిలోని టాంప్ కోల్ సంస్థ కబసురా తయారు చేస్తోంది. 2021లో 3 లక్షల కిలోల కబసురా పొడిని సిద్ధం చేసి విక్రయించారు. 100 గ్రాములు కొంటే చాలు ఇంటిల్లిపాదీ వారం పది రోజులు వాడుకోవచ్చు. కరోనా రెండు, మూడో వేవ్‌లలోనూ కబసురా విక్రయాలు జోరుగానే జరిగాయి. ఇది రోగ నిరోధక శక్తిని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నట్టు కేంద్ర వైద్య పరిశోధనల్లోనూ స్పష్టమైంది. దీంతో కబసురాను దేశవ్యాప్తంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కేంద్రం నిర్ణయించింది. తమిళనాడు ప్రభుత్వంతో సంప్రదింపులు జరుగుతున్నాయి. ఇది ప్రాథమిక దశలో ఉంది.

మోస్ట్‌వాంటెడ్ క్రిమినల్ చెన్నై మురుగన్ అరెస్ట్

- 10ఏళ్లుగా రెడ్‌హిల్స్ నుంచి ఆపరేషన్
- వివరాలు వెల్లడించిన టాస్క్‌ఫోర్స్ ఎస్పీ చక్రవర్తి


మాట్లాడుతున్న ఎస్పీ చక్రవర్తి

తిరుపతి అలిపిరి: ఎన్నో ఏళ్లనుంచి మోస్ట్‌వాంటెడ్‌గా తప్పించుకు తిరుగుతున్న 'ఎర్ర' స్మగ్లర్ చెన్నై మురుగన్ ఆదివారం ఎట్టకేలకు టాస్క్‌ఫోర్స్ పోలీసులకు చిక్కాడు. టాస్క్‌ఫోర్స్ ఎస్పీ చక్రవర్తి తెలిపిన వివరాల మేరకు ఇటీవల పట్టుబడి జైల్లో ఉన్న స్మగ్లర్ ఇచ్చిన వాంగ్మూలంతో ప్రత్యేక బృందాలను ఎస్పీ రంగంలోకి దించారు. సీఐ రామకృష్ణ బృందం వ్యూహాత్మకంగా వ్యవహరించి మురుగన్ కదలికలను శ్రీకాళహస్తి–రేణిగుంట ప్రాంతాల్లో ఉన్నట్లు గుర్తించింది. దీంతో అతనిని ఆదివారం పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. షిఫ్ట్ కారులో 6 దుంగలను, ఐషర్ వాహనంలో 12 దుంగలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఘటన స్థలంలో మురుగన్ (40)తో పాటు మేగవర్ణం (66)ను అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. ఈ మేరకు పట్టుకున్న వాహనాలు, ఎర్రచందనం విలువ సుమారు రూ.50లక్షలు ఉంటుందని తెలియజేశారు. చెన్నై రెడ్‌హిల్స్ ప్రాంతంలో ఉంటూ తిరుపతిలోని కొంతమందితో పరిచయాలు ఏర్పరుచుకుని పదేళ్లగా ఎర్రస్మగ్లింగ్‌ను నడిపిస్తుండగా.. ఇప్పటికే టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో ఇతనిపై 6 కేసులు నమోదు కాగా సత్యవేడులో 7కేసులున్నాయి. మోస్ట్ వాంటెడ్ క్రిమినల్‌ను పట్టుకున్న పోలీసులను ఎస్పీ చక్రవర్తి అభినందించి రివార్డు ప్రకటించారు.

ఫిల్మ్ ఫెస్టివల్‌లో గిరిజన యువకుడి ప్రతిభ

కొయ్యూరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): అంతర్జాతీయ టాలెంట్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో రాష్ట్రానికి చెందిన గిరిజన యువకుడు అద్భుత ప్రతిభ కనబరిచాడు. అతను రూపొందించిన రెండు లఘు చిత్రాలకు అవార్డులు లభించాయి. మహారాష్ట్ర ఔరంగబాద్‌లోని మౌలాన ఆజాద్ పరిశోధన కేంద్రంలో నిర్వహించిన ఏషియన్ ఇంటర్నేషనల్ టాలెంట్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలం కొమ్మికకు చెందిన ఎస్.వెంకటరాఘవ రూపొందించిన రెండు లఘు చిత్రాలను ప్రదర్శించారు. వెంకట రాఘవ రూపొందించిన 'మీ చూపులే' ఉత్తమ తెలుగు లఘు చిత్రంగా ఎంపి కైంది. 'పోర్న్' అనే మరో లఘు చిత్రం ప్రత్యేక జ్యూరీ పురస్కారానికి ఎంపి కైంది. రాఘవకు సోమవారం ఫిల్మ్ ఫెస్టివల్ డైరెక్టర్ రాజు కూంబ్లే అవార్డులను అందజేశారు. తాను నాలుగు సంవత్సరాల నుంచి లఘు చిత్రాలను తీస్తున్నానని రాఘవ తెలిపారు.

అమల్లోకి నిషేధం

ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌లకు చెక్



- డిసెంబర్ 31 నుంచి అమల్లోకి వచ్చిన కేంద్ర పర్యావరణ శాఖ ఉత్తర్వులు
- వార్డు పరిధిలోనే తనిఖీలు, కేసుల నమోదు
- ఆదేశాలు జారీ చేసిన పురపాలక శాఖ
- ఈ నెల 26 నుంచి ప్లాస్టిక్ ఫ్లెక్సీలపైనా నిషేధం

సాక్షి, అమరావతి: ఒక్కసారి వాడి పారవేసే ప్లాస్టిక్ సంచుల తయారీ, వినియోగంపై కేంద్ర ప్రభుత్వం విధించిన నిషేధం అమల్లోకి వచ్చింది. ఇకపై దేశవ్యాప్తంగా 120 మైక్రాన్లు లేదా ఆపై మందం గల ప్లాస్టిక్ సంచులను మాత్రమే వినియోగించాలి. ఈ మేరకు కేంద్ర పర్యావరణ శాఖ జారీ చేసిన ఆదేశాలు డిసెంబర్ 31 నుంచి అమల్లోకి వచ్చాయి. ఇకపై 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం గల క్యారీ బ్యాగ్‌లు తయారు చేసినా, దిగుమతి చేసుకున్నా, అమ్మినా, వినియోగించినా కఠిన చర్యలు తీసుకుంటారు. ఇప్పటివరకు 75 మైక్రాన్ల మందం గల క్యారీ బ్యాగులను వినియోగించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇకపై పునర్ వినియోగానికి అవకాశమున్న 120 మైక్రాన్ల ప్లాస్టిక్ సంచులను మాత్రమే వినియోగించాలని రాష్ట్రంలోని అన్ని మునిసిపాలిటీలు, కార్పొరేషన్లు, నగర పంచాయతీలతో పాటు జిల్లా కలెక్టర్లకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. నిబంధనల అమలు, పర్యవేక్షణను వార్డు శానిటేషన్ కార్యదర్శులు చూడాలని ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో ఒక్కసారి వాడి పారేసే ప్లాస్టిక్ సంచులు పర్యావరణానికి ఎంత ప్రమాదకరంగా మారుతున్నాయో ప్రజలకు అవగాహన కల్పించనున్నారు. కాగా, వీధుల్లో ఏర్పాటు చేసే ప్లాస్టిక్ ఫ్లెక్సీలపై విధించిన నిషేధం కూడా ఈ నెల 26వ తేదీ నుంచి అమల్లోకి రానుంది. నిబంధనల అమలును తనిఖీ చేసేందుకు ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాలను ఏర్పాటు చేశారు. ఈ బృందాలు నగరాలు, పట్టణాలు, పంచాయతీల్లో తనిఖీలు చేయనున్నాయి.



అతిక్రమిస్తే భారీగా జరిమానాలు

- 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం గల ప్లాస్టిక్ వస్తువులను తయారు చేసినట్టయితే మొదటిసారి రూ.50 వేల జరిమానా, రెండోసారి రూ.లక్ష జరిమానాతో పాటు సంస్థ గుర్తింపును రద్దు చేస్తారు.
- స్టాకిస్టులు, సరఫరాదారులు, -కామర్స్ కంపెనీలకు మొదటిసారి రూ.25 వేల జరిమానాతో పాటు నిషేధిత ప్లాస్టిక్ సామగ్రి కేజీకి రూ.10 చొప్పున పెనాల్టీ విధించి, సరుకును జప్తు చేస్తారు. రెండోసారి రూ.50 వేల జరిమానా, కేజీకి రూ.20 చొప్పున పెనాల్టీ విధించడంతో పాటు పర్యావరణ రక్షణ చట్టం కింద కేసులు నమోదు చేస్తారు.
- వీధి వ్యాపారులకు సైతం మొదటిసారి రూ.2,500 జరిమానా, రెండోసారి రూ.5 వేల జరిమానాతో పాటు వ్యాపారం చేయకుండా చర్యలు తీసుకుంటారు. దుకాణాలకు మొదటిసారి రూ.20 వేల జరిమానా, రెండోసారి రూ.40 వేల జరిమానాతో పాటు వ్యాపార లైసెన్సును రద్దు చేసి చట్టపరంగా కేసు నమోదు చేస్తారు.
- ఈ మేరకు ప్లాస్టిక్ తయారీ సంస్థలకు ఉత్తర్వులు జారీ చేయడంతో పాటు పట్టణాల్లో వ్యాపార సంస్థలకు, దుకాణ యజమానులకు అవగాహన కల్పించాల్సిందిగా ఇప్పటికే ఆదేశాలు అయ్యాయి.

పీవీ చలపతిరావుకు కన్నీటి వీడ్కోలు

- ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు
- నివాళులర్పించిన మిజోరాం గవర్నర్ హరిబాబు, మంత్రి అమర్‌నాథ్

సాక్షి, విశాఖపట్నం: బీజేపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ పీవీ చలపతిరావుకు ఆయన కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు కన్నీటివీడ్కోలు పలికారు. అనారోగ్యంతో ఆదివారం కన్నుమూసిన ఆయన అంత్యక్రియలను సోమవారం విశాఖ నగరంలోని చావులమంద శ్మశానవాటికలో ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించారు. అంతకుముందు పీవీ చలపతిరావు పార్థివదేహాన్ని ప్రజలు, పార్టీ శ్రేణుల సందర్శనార్థం పిఠాపురంకాలనీలోని ఆయన స్వగృహంలో ఉంచారు. చలపతిరావు భౌతిక కాయంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు తమ పార్టీ పతాకం కప్పి అంజలి ఘటించారు. చలపతిరావు భౌతిక కాయం వద్ద మిజోరాం గవర్నర్ కంభంపాటి హరిబాబు, రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, బీజేపీ ఉమ్మడి రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు ఎస్.ఇంద్రసేనారెడ్డి, రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావులతోపాటు ఆంధ్రా, తెలంగాణ, కర్ణాటకకు చెందిన ఆ పార్టీ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు చలపతిరావు ప్రజలకు, బీజేపీకి అందించిన సేవలను, ఆయనతో తమ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఉదయం 11గంటలకు పీవీ ఇంటి నుంచి అంతిమయాత్ర ప్రారంభమై చావులమంద శ్మశానవాటికకు చేరుకుంది. అక్కడ పీవీ చలపతిరావుకు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. చలపతిరావు భౌతికదేహానికి ఆయన కుమారుడు ఎమ్మెల్సీ మాధవ్ తలకొరివి పెట్టారు. పీవీ చలపతిరావు మృతి పట్ల ప్రధానమంత్రి నరేంద్రమోదీ సహా పలువురు బీజేపీ జాతీయ, రాష్ట్ర నాయకులు తమ సంతాపాన్ని తెలియజేశారు.


పీవీకి నివాళులర్పిస్తున్న రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

జేపీ వెంచర్ ఇసుక తవ్వకాలపై పిల్

సాక్షి, అమరావతి: వైఎస్సార్ కడప జిల్లా వల్లూరు మండలం చెర్వుకిందపల్లి గ్రామ పరిధిలో జయప్రకాశ్ (జేపీ) వెంచర్ చేపట్టిన ఇసుక తవ్వకాలపై హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. ఈ వ్యాజ్యంపై విచారించిన హైకోర్టు.. సాధారణ పరిపాలనశాఖ, రెవెన్యూశాఖ, గనులశాఖల ముఖ్య కార్యదర్శులకు, ఖనిజాభివృద్ధి సంస్థ, జేపీ వెంచర్ సంస్థతో పాటు పలువురు ప్రభుత్వ అధికారులకు నోటీసులు జారీచేసింది. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. విచారణను ఈ నెల 18కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ డి.వి.ఎస్.ఎస్.సోమయాజుల ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. చెర్వుకిందపల్లి గ్రామ పరిధిలో జయప్రకాశ్ వెంచర్ చేపట్టిన ఇసుక తవ్వకాలను సవాలు చేస్తూ గడికోట శాంతి ఈ వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై సోమవారం సీజే ధర్మాసనం విచారించింది. పిటిషనర్ న్యాయవాది బాలాజీ మేడమల్లి వాదనలు వినిపిస్తూ.. పూడికతీత పేరుతో జేపీ వెంచర్ ఇసుక తవ్వకాలు చేస్తోందన్నారు. వాస్తవానికి జలవనరులశాఖ లేదా ఖనిజాభివృద్ధి సంస్థ మాత్రమే తవ్వకాలు చేపట్టాలని చెప్పారు. అందుకు విరుద్ధంగా జేపీ వెంచర్ తవ్వకాలు చేస్తోందని, తవ్వితీసిన ఇసుకను భారీ వాహనాల ద్వారా తరలించడం వల్ల రోడ్లన్నీ ధ్వంసమయ్యాయన్నారు.

స్వర్ణ రథంపై సర్వాంతర్యామి

▶ మొదటి పేజీ తరువాయి

నామం బోర్డు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. మండపం లోపల శ్రీ మహాలక్ష్మి, దశావతారాలతో పాటు శ్రీమహావిష్ణువు విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. ఈ మండపాన్ని సందర్శించిన భక్తులు ఆనంద పరవశులవుతున్నారు. ఆలయం వెలుపల విద్యుత్ దీపాలతో ఏర్పాటు చేసిన స్వామి వారి నిలువెత్తు విగ్రహాలు విశేషంగా ఆకర్షిస్తున్నాయి. నిలువెత్తు బంగారాన్ని రథంగా మార్చి దేవేరులతో కలిసి కోనేటిరాయుడు ఆలయ తిరువీధుల్లో ఊరేగడాన్ని చూసిన భక్తులు పరవశించిపోయారు. వైకుంఠ ద్వార దర్శనం కోసం తిరుమలకు చేరుకున్న అశేష భక్తవాహిని స్వర్ణరథ వాహనసేవను తిలకించి స్వామి, అమ్మవార్లకు కర్పూర నీరాజనాలు సమర్పించారు. మహిళా భక్తులు ఉత్సాహంతో స్వర్ణరథాన్ని లాగారు.

నిర్ణీత సమయంలో శ్రీవారి దర్శనం:

తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. నిర్ణీత సమయంలో కేటాయించిన టైమ్స్ స్లాట్ టికెట్లకు దర్శనమవుతుంది. ఆదివారం అర్ధరాత్రి వరకు 53,101 మంది స్వామి వారిని దర్శించుకోగా, 23,843 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.48 కోట్లు సమర్పించారు.

నేడు చక్రస్నానం

వైకుంఠ ద్వాదశిని పురస్కరించుకుని తిరుమలలో శ్రీదేవి భూదేవి సమేత మలయప్ప స్వామికి మంగళవారం తెల్లవారుజామున 4:30 నుంచి 5:30 గంటల మధ్య చక్రస్నాన మహోత్సవం ఏకాంతంగా నిర్వహించనున్నారు.


సింహాచలంలో శ్రీదేవి, భూదేవి సమేత వరాహ లక్ష్మీనృసింహస్వామి ఊరేగింపు

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

వైకుంఠ ఏకాదశి సందర్భంగా సోమవారం పలువురు ప్రముఖులు వైకుంఠ ద్వారంలో శ్రీవారిని దర్శించుకున్నారు. తిరుమల ఆలయ పెద్ద జీయర్, చిన్న జీయర్ స్వామి, తమిళనాడు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి డి.రాజా, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దినేష్ కుమార్, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గంగారాం, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నంద, ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ టి.రాజశేఖర్‌రావు, జస్టిస్ రవినాథ్ తిలహరి, జస్టిస్ రవీంద్రబాబు, కేరళ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్వీ భట్, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ వి.శ్రీనివాస్, జస్టిస్ ఇ.వి.వేణుగోపాల్, కర్ణాటక గవర్నర్ తవార్ చంద్ గెహ్లాట్, తెలంగాణ మంత్రి మల్లారెడ్డి, డిప్యూటీ సీఎం నారాయణస్వామి, రాష్ట్ర మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కారుమూరి నాగేశ్వరరావు, గుడివాడ అమర్నాథ్, ఉషశ్రీ చరణ్, మేరుగ నాగార్జున, అంబటి రాంబాబు, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే, నేతలు సీఎం రమేష్, విష్ణువర్ధన్ రెడ్డి ఉన్నారు.

వైష్ణవాలయాల్లో ఉత్తర ద్వార దర్శనం:

గుంటూరు జిల్లా మంగళగిరి శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీనృసింహస్వామి వారు ముక్కోటి ఏకాదశి సందర్భంగా సోమవారం ఉత్తర ద్వారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) సామాన్య భక్తుల క్యూలైన్‌లో వెళ్లి దర్శించుకున్నారు. విశాఖ జిల్లాలోని సింహాచలం క్షేత్రంలో శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శ్రీదేవి, భూదేవి సమేతుడై ఆలయ ఉత్తర రాజగోపురంలో వైకుంఠవాసుడిగా శేషతల్పంపై భక్తులకు దర్శనమిచ్చారు. విశాఖ శ్రీశారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, రాష్ట్ర డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు స్వామిని దర్శించుకున్నారు. శ్రీశైల మహాక్షేత్రంలో ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామి వార్లకు ప్రత్యేక ఉత్సవం, రావణ వాహనసేవ వైభవంగా నిర్వహించారు. విజయనగరం జిల్లా రామతీర్థంలో సోమవారం నిర్వహించిన గిరి ప్రదక్షిణతో నీలాచలం గిరులు పులకించాయి. సీతారామలక్ష్మణుల ఉత్సవ మూర్తుల ఊరేగింపులో సుమారు పదివేల మంది భక్తులు పాల్గొని శ్రీరామనామాన్ని స్మరిస్తూ నీలాచలం చుట్టూ ప్రదక్షిణ చేశారు.

ఆఫీసు వేళలు మారాలి
పని విధానంలోనూ మార్పులు కావాలి



కోరుకుంటున్న మెజారిటీ ఉద్యోగులు

- అందుకు యాజమాన్యం ఒప్పుకుంటే
- జీతాలు తగ్గించుకునేందుకు కూడా ఓకే
- సంప్రదాయ 'నైన్ టు ఫైవ్' టైమింగ్స్ స్థానంలో మరింత వినూత్న ప్రత్యామ్నాయాలు కోరుతున్న తీరు...
- వర్క్ ఫ్రంహోంకే చాలామంది మొగ్గు
- 'పీపుల్స్ ఎట్ వర్క్ 2022 @ ఏ గ్లోబల్ వర్క్‌ఫోర్స్ వ్యూ'లో వివిధ అంశాలు వెల్లడి.. ఐటీయే కాదు ఇతర రంగాల్లోనూ ఇదే పరిస్థితి
- సాక్షితో డా. బి.అపర్ణ రెడ్డి, హెచ్‌ఆర్ నిపుణురాలు

సాక్షి, హైదరాబాద్: ఉద్యోగులు ప్రస్తుతం మారుతున్న కాలాన్ని బట్టి తమ రోజువారీ విధులు, వృత్తిగత జీవితంలో గుణాత్మక మార్పులు కోరుకుంటున్నారు. ఆఫీస్ వేళలు–పనివిధానంలో మార్పులు జరగాలని భారత్‌లోని మెజారిటీ ఎంప్లాయిస్ గట్టిగా అభిలషిస్తున్నారు. కార్యాలయ పనివేళల నియమాలు అనేవి తాము కోరుకున్నట్టుగా రూపొందించేందుకు యాజమాన్యాలు ఒప్పుకుంటే జీతాలు తగ్గించుకోవడమే కాదు ఇతర అంశాల్లోనూ రాజీపడేందుకు సిద్ధమంటున్నారు.

→ మొత్తంగా 17 దేశాల్లోని 33 వేలమంది ఉద్యోగులపై నిర్వహించిన సర్వే ఆధారంగా...ఏడీపీ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ 'పీపుల్స్ ఎట్ వర్క్ 2022 @ ఏ గ్లోబల్ వర్క్‌ఫోర్స్ వ్యూ' ఓ నివేదికను రూపొందించింది. ఇందులో అనేక ఆసక్తికరమైన అంశాలు వెల్లడయ్యాయి. పనిగంటల్లో, విధులు నిర్వహించే విధానంలో వెసులుబాటు ఉండాలని ప్రతి పది మందిలో ఏడుగురు కోరుకున్నట్టు తేలింది. రోజూవారీ చేసే పనిగంటలపై తమకు పూర్తి పట్టు ఉండాలని భారత్‌లోని 76.07 శాతం ఉద్యోగులు స్పష్టం చేశారు. వర్క్ ఫ్రం హోం లేదా ఇల్లు, ఆఫీసుల మధ్య ఎంచుకునే అవకాశం, వారంలో సగం రోజులు ఆఫీసు, సగం రోజులు ఇంటి నుంచి పనిచేసే వెసులుబాటు కల్పిస్తే తమకిచ్చే జీతంలో కొంత తగ్గించుకునేందుకు, ఇతర అలవెన్సుల్లో రాజీపడేందుకు సంసిద్ధత వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా పూర్తిస్థాయిలో ఆఫీసు నుంచే పనిచేయాలని యాజమాన్యాలు స్పష్టం చేస్తున్న పక్షంలో కొత్త కొలువులు వెతుకుంటామంటూ 76.38 శాతం భారత ఉద్యోగులు పేర్కొన్నట్టు ఈ రిపోర్ట్ తెలిపింది. వర్క్ ఫ్రంహోం సందర్భంగా తమ సేవలను మంచి గుర్తింపు లభించిందని 73 శాతం, నైపుణ్యాల మెరుగు, శిక్షణా అవసరాలు వంటి వాటిపై యాజమాన్యాలతో చర్చించగలిగామని 74 శాతం చెబుతున్నారు. మానసిక ఒత్తిళ్లను అధిగమించేందుకు, మెంటల్ హెల్త్‌ను కాపాడుకునేందుకు ఇంటినుంచి పనిచేయడం ఉపయోగపడిందని 56 శాతం అభిప్రాయపడ్డారు. సాంప్రదాయ 'నైన్ టు ఫైవ్' ఉద్యోగుల టైమింగ్స్ స్థానంలో సృజనాత్మకతతో కూడిన మరింత వినూత్న ప్రత్యామ్నాయాలను వారు కోరుకుంటున్నారు.

→ కోవిడ్ మహమ్మారి కాలంలో తీవ్రమైన మానసిక సంఘర్షణ, ఒత్తిళ్లను ఎదుర్కొన్నందున చేసే ఆఫీసుపని–గడిపే రోజూవారీ జీవితం మధ్య మంచి సమతూకంతో పాటు ఒత్తిళ్ల లేని పనివిధానం కోరుకుంటున్నారు' అని ఏడీపీ సౌతీస్ట్ ఏషియా, ఇండియా ఎండీ రాహుల్ గోయల్ చెప్పారు. గతంలో ఆచరణ సాధ్యం కాదని భావించిన వారానికి 4 రోజుల పని విధానం అమలు, ఇంటి నుంచి పనిచేసే సౌలభ్యం కల్పించడం ద్వారా ఆయారంగాల్లోని ఉత్తమ నైపుణ్యాలున్న ఉద్యోగులను ఆకర్షించే అవకాశముందని గోయల్ అభిప్రాయపడ్డారు.

ఐటీ అనే కాదు ఇతర రంగాల్లోనూ ఇదే పరిస్థితి

ఐటీ అనే కాకుండా అన్ని రంగాల ఉద్యోగులు ఫ్లెక్సిబుల్ టైమింగ్స్ కోరుకుంటున్నారు. జాబ్ ఇంటర్వ్యూలప్పుడే జీతం ప్యాకేజీ కంటే కూడా వర్క్ ఫ్రం హోం, హైబ్రిడ్ వర్కింగ్ ఇస్తేనే చేరతామంటున్నారు. కోవిడ్ పరిస్థితుల కారణంగా తమకు తోచిన పద్ధతుల్లో పనివేళలు అడుగుతున్నారు. కనీసం వారానికి రెండురోజులైనా ఇంటినుంచి పని విధానం ఉందా లేదా అని ఆరాతీస్తున్నారు. ట్రైనీలు, ఎంట్రీలెవల్ ఎంప్లాయిస్ కూడా దీనినే కోరుతున్నారు.

– డా. బి. అపర్ణరెడ్డి, హెచ్‌ఆర్ నిపుణురాలు

క్లుప్తంగా...

హామీలన్నీ అమలుచేస్తున్న సీఎం జగన్

- టీడీపీ నాయకుడు, సర్పంచ్ లక్ష్మన్న


పింఛన్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ లక్ష్మన్న

ఆలూరు(కర్నూలు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వృద్ధులు, దివ్యాంగులకు ఇచ్చిన హామీ మేరకు పింఛన్ పెంచుతూ వారి మనసు దోచుకున్నారని టీడీపీ నాయకుడు, పెద్దహోతూరు గ్రామ సర్పంచ్ లక్ష్మన్న అన్నారు. కర్నూలు జిల్లా ఆలూరు మండలంలోని పెద్దహోతూరు గ్రామ సచివాలయంలో సోమవారం పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ లక్ష్మన్న మాట్లాడుతూ పింఛన్లను క్రమం తప్పకుండా ఇవ్వడంతోపాటు రూ.2,750లకు పెంచడం అభినందనీయమన్నారు. ప్రతి అంశం ఆర్థికంగా ముడిపడి ఉంటుందని, అయినప్పటికీ సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన హామీకి కట్టుబడి అన్నింటినీ అమలు చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు బోయ దేవరాజ్, చిన్న తిక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ ఈవోగా ధర్మారెడ్డి మళ్లీ బాధ్యతల స్వీకరణ


అనిల్‌కుమార్ సింఘాల్ నుంచి బాధ్యతలు స్వీకరిస్తున్న ఏవీ ధర్మారెడ్డి

తిరుమల: టీటీడీ ఈవోగా ఎ.వి.ధర్మారెడ్డి సోమవారం తిరిగి బాధ్యతలు స్వీకరించారు. గత నెల 23వ తేదీ నుంచి ఆయన సెలవులో ఉన్నారు. ఆయన స్థానంలో తాత్కాలిక ఈవోగా అనిల్‌కుమార్ సింఘాల్‌ను ప్రభుత్వం నియమించింది. సోమవారం ధర్మారెడ్డి తిరుమల శ్రీవారి ఆలయంలో అనిల్‌కుమార్ సింఘాల్ నుంచి బాధ్యతలు స్వీకరించారు.

సంక్షేమ పథకాలు అవసరమే

- సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ


మాట్లాడుతున్న సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

కోటవురట్ల: ప్రజల మేలు కోసం సంక్షేమ పథకాలను అమలు చేయడం అవసరమేనని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం రాజుపేటలో సోమవారం నిర్వహించిన 'ప్రకృతి సేద్యం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం లక్ష్మీనారాయణ విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రధానంగా సంక్షేమంపై దృష్టి పెట్టిందని, కోవిడ్ సమయంలో అమెరికాలాంటి దేశం కూడా ప్రతి కుటుంబానికి 1,300 డాలర్లు ఇచ్చిందన్నారు. మూడు రాజధానుల అంశంపై స్పందిస్తూ ప్రతి జిల్లా అభివృద్ధి కేంద్రం కావాలని చెప్పారు. రాష్ట్రంలో వైషమ్యాలు పెరగకుండా 26 జిల్లాలను అభివృద్ధి చేయాలన్నారు. పాఠశాలల మధ్యాహ్న భోజన పథకంలో ప్రకృతి వ్యవసాయంలో పండించిన పంటలనే ఉపయోగించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు. రైతులు పండించే పంటను ప్రభుత్వం లేదా ప్రైవేటు వ్యక్తులు కొనుగోలు చేసినా ఒకటే ధర ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. టోల్‌గేట్‌ల వద్ద రైతుల వాహనాలు ఉచితంగా వెళ్లేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా...

ఆధునిక భారతదేశ చరిత్రపై విస్తృత పరిశోధనలు చేయాలి

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు

న్యూఢిల్లీ: ఆధునిక భారతదేశ చరిత్రపై మరిన్ని పరిశోధనలు చేయాల్సిన అవసరం ఉందని ప్రధానమంత్రి చెప్పారు. ఆ అంశంపై దృష్టి పెట్టాలని పరిశోధకులకు పిలుపునిచ్చారు. అలాగే ప్రఖ్యాత సామాజిక సంస్కర్త స్వామి దయానంద సరస్వతి, 1875లో ఏర్పాటైన ఆర్య సమాజ్ అందించిన సేవలను వెలుగులోకి తీసుకోవాలని కోరారు. ఈ విషయంలో విద్యా, సాంస్కృతిక సంస్థలు చొరవ తీసుకోవాలని అన్నారు. సోమవారం ఢిల్లీలోని నెహ్రూ స్మారక మ్యూజియం, లైబ్రరీ(ఎన్ఎంఎంఎల్) వార్షిక సమావేశంలో ప్రధాని మోదీ ప్రసంగించారు. విస్తృత పరిశోధనల ద్వారా ఆధునిక భారతదేశ చరిత్ర గురించి నేటి తరానికి మరిన్ని విషయాలు తెలియజేయవచ్చని పేర్కొన్నారు.

అన్ని ఏజెన్సీలతో ఈడీ అనుసంధానం

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో ఆర్థిక నేరాలు పెరిగిపోతున్న నేపథ్యంలో అవకతవకల సత్వర గుర్తింపునకు వీలుగా ఇతర ఏజెన్సీల డేటాతో సులభంగా యాక్సెస్ చేసుకునేలా ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను సిద్ధంచేసుకుంది. సీబీఐ, నేషనల్ ఇంటెలిజెన్స్ గ్రిడ్ (ఎన్ఐజీ), ఫైనాన్షియల్ ఇంటెలిజెన్స్ యూనిట్ (ఎఫ్ఐయూ), కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు(సీబీడీటీ)తో పాటు ఇతర ఏజెన్సీల వద్ద ఉన్న వివరాలను సరిపోల్చుకునే వ్యవస్థను సిద్ధంచేసుకుంది. కోర్ ఈడీ ఆపరేషన్ సిస్టమ్ పేరుతో అభివృద్ధి చేసిన ఈ సాఫ్ట్‌వేర్ ద్వారా నేర ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులు, వారి ఆర్థిక లావాదేవీలు, వారిపై నమోదైన కేసులు, అనుబంధ పత్రాలను ఆన్‌లైన్ ద్వారా పొందటం సులభం కానుంది. ఆర్థిక నేరాల పరిశోధనలో వేగాన్ని పెంచేందుకు, ఇతర ఏజెన్సీలతో సమన్వయం చేసుకునేందుకు ఇది దోహదపడనుంది.

వారికి నెగటివ్ సర్టిఫికెట్ తప్పనిసరి

న్యూఢిల్లీ: చైనాతోపాటు హాంకాంగ్, సింగపూర్, థాయ్‌ల్యాండ్, జపాన్, దక్షిణ కొరియాల ద్వారా వచ్చే ప్రయాణికులకు కోవిడ్ నెగటివ్ సర్టిఫికెట్ తప్పనిసరి అని కేంద్రం స్పష్టం చేసింది. వారు ఏ దేశస్తులైనా సరే భారతీయ విమానాశ్రయాల్లోకి ప్రవేశించేందుకు ఇది అవసరమని సోమవారం రాష్ట్రాలకు రాసిన లేఖలో పేర్కొంది.

ఆస్ట్రేలియాలో రెండు హెలికాప్టర్లు ఢీ.. నలుగురు మృతి

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియాలో సోమవారం మధ్యాహ్నం రెండు హెలికాప్టర్లు ఢీకొన్న ఘటనలో నలుగురు చనిపోయారు. క్వీన్స్‌ల్యాండ్ రాష్ట్రం గోల్డ్‌కోస్ట్‌లోని మెయిన్ బీచ్‌లో ఘటన చోటుచేసుకుంది. ప్రమాద సమయంలో ఒక హెలికాప్టర్ ల్యాండవుతుండగా, అదే సమయంలో మరో హెలికాప్టర్ ప్రయాణికులతో టేకాఫ్ తీసుకుంటోంది. రెండూ ఢీకొన్న వెంటనే పెద్ద శబ్దంతో ఒక హెలికాప్టర్ కూలిపోయింది. అందులోని ప్రయాణికులు నలుగురు చనిపోగా మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. మరో హెలికాప్టర్ సురక్షితంగానే ల్యాండయింది.

మెక్సికో జైలుపై దుండగుల దాడి..14 మంది మృతి

మెక్సికో సిటీ: మెక్సికోలోని చిహువాహువా రాష్ట్రం సియుడాడ్ జువారెజ్ జైలుపై ఆదివారం దుండగులు జరిపిన దాడిలో 10 మంది భద్రతా సిబ్బంది సహా 14 మంది చనిపోయారు. ఉదయం 7 గంటల సమయంలో వాహనాలపై వచ్చిన సాయుధులు జైలు సిబ్బందిపై విచక్షణా రహితంగా కాల్పులకు దిగారు. ఈ కాల్పుల్లో 10 మంది భద్రతా సిబ్బంది, నలుగురు ఖైదీలు చనిపోయారు. సుమారు 24 మంది ఖైదీలు తప్పించుకుపోయారు.

తుపాకీతో డ్యాన్స్.. కాంగ్రెస్ ఎమ్మెల్యేపై కేసు

భోపాల్: నూతన సంవత్సర వేడుకల్లో చేతిలో తుపాకీ పట్టుకుని స్టేజీపై డ్యాన్స్ వేసిన కాంగ్రెస్ ఎమ్మెల్యేపై మధ్యప్రదేశ్ ప్రభుత్వం కేసు నమోదు చేసింది. కోట్మా నియోజకవర్గ ఎమ్మెల్యే సునీల్ సరాఫ్ మరో నలుగురితో కలిసి తుపాకీ చేతబట్టుకుని చిందులు వేస్తున్న వీడియో వైరల్ అవుతోంది.

కశ్మీర్‌లో మరో ఉగ్ర ఘాతుకం

రాజౌరి/జమ్మూ: జమ్మూకశ్మీర్‌లోని రాజౌరి జిల్లా దాంగ్రి గ్రామంలో మరో విషాద ఘటన చోటుచేసుకుంది. 14 గంటల వ్యవధిలో చోటుచేసుకున్న ఘటనల్లో ఆరుగురు చనిపోగా 12 మంది వరకు గాయపడ్డారు. సోమవారం ఉదయం 9.30 గంటల సమయంలో ఐఈడీ పేలి సమీక్షా శర్మ(16), విహాన్ కుమార్ శర్మ(4) అనే ఇద్దరు చిన్నారులు అసువులు బాశారు. మరో ఆరుగురు గాయపడ్డారు. ఆదివారం ఉగ్రవాదుల కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన నలుగురిలో ఒకరైన ప్రీతమ్ లాల్ నివాసానికి సమీపంలోనే ఈ పేలుడు చోటుచేసుకుంది. 14 గంటల వ్యవధిలో చోటుచేసుకున్న ఈ ఘటనలపై ప్రజలు నిరసనలకు దిగారు. జిల్లా వ్యాప్తంగా బంద్ పాటించారు. లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా వచ్చే వరకు మృతులకు అంత్యక్రియలు జరపబోమంటూ గ్రామస్తులు భీష్మించారు. డీజీపీ నచ్చజెప్పినా వినలేదు. దీంతో, సోమవారం సాయంత్రం మనోజ్ సిన్హా అక్కడికి వెళ్లి ఆందోళనకారులతో మాట్లాడారు. భద్రతా చర్యలు కట్టుదిట్టం చేస్తామని, దోషులను వదిలిపెట్టబోమని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కాగా, కాల్పులు, పేలుడు ఘటనలపై జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) బృందం దర్యాప్తు ప్రారంభించింది. ఐఈడీ పేలుడు సమాచారం తెలిసిన వెంటనే భద్రతా బలగాలు ఆ ప్రాంతాన్ని దిగ్బంధించి, పెద్ద ఎత్తున సోదాలు ప్రారంభించాయి.



అంతరిక్షంలో సినిమా షూటింగ్

రష్యా రికార్డు • దుమ్ము రేపుతున్న ట్రైలర్

హాలీవుడ్ స్టార్ టామ్ క్రూయిజ్ తన తదుపరి సినిమాలో ఒక సీక్వెన్స్‌ను నాసా సహకారంతో అంతరిక్షంలో షూట్ చేయబోతున్నారన్న వార్త ఇటీవల అందరినీ ఆకర్షించింది. కానీ ఆయన కంటే ముందే రష్యా ఈ ఘనత సాధించేసింది. రష్యా దర్శకుడు క్లిమ్ షిపెంకో రూపొందిస్తున్న సినిమా 'ద చాలెంజ్'లో ఒక సీక్వెన్స్‌ను 2021 అక్టోబర్లో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో తీశారు. అందులో నటించిన యూలియా పెరెస్లిడ్‌తో కలిసి ఇందుకోసం 12 రోజుల పాటు ఐఎస్ఎస్‌లో గడిపారు. తద్వారా అంతరిక్షంలో షూటింగ్ జరుపుకున్న తొలి సినిమాగా ద చాలెంజ్ రికార్డు సృష్టించింది. తాజాగా విడుదలైన దీని ట్రైలర్ దుమ్ము రేపుతోంది. ఓ కాస్మోనాట్ ప్రాణాలు కాపాడేందుకు ఐఎస్ఎస్‌కు వెళ్లిన డాక్టర్‌గా యూలియా ఇందులో నటిస్తోంది. షూట్ కోసం సినిమా బృందం ఐఎస్ఎస్‌లో లాండైన తీరును కూడా సినిమాలో చూపించనున్నారు. మున్ముందు చంద్రునితో పాటు అంగారకునిపైనా షూటింగ్ చేస్తానని క్లిమ్ చెబుతున్నారు!

దుబాయ్‌లో మద్యంపై పన్ను రద్దు



దుబాయ్: పర్యాటకులను ఆకర్షించడమే లక్ష్యంగా దుబాయ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మద్యం విక్రయాలపై ఇప్పటిదాకా విధిస్తున్న 30 శాతం పన్నును పూర్తిగా రద్దు చేసింది. ఇది ఆదివారం నుంచే అమల్లో వచ్చింది. అంతేకాకుండా వ్యక్తిగత ఆల్కహాల్ లైసెన్స్‌లకు ఇకపై ఎలాంటి చార్జీ వసూలు చేయబోరు. దుబాయ్‌లో ఎవరైనా ఇళ్లలో మద్యం సేవించాలంటే వ్యక్తిగత ఆల్కహాల్ లైసెన్స్ ఉండాల్సిందే. దుబాయ్ ప్రభుత్వం ఇటీవలి కాలంలో మద్యం విషయంలో కొన్ని చట్టాలను సడలిస్తోంది. అయితే, పన్ను రద్దు అనేది తాత్కాలికమా? లేక శాశ్వతమా? అనేదానిపై ఇంకా స్పష్టత రాలేదు.

నోట్ల రద్దు సబబే: సుప్రీం

నిర్ణయ ప్రక్రియలో లోపాల్లేవు • ధర్మాసనం మెజారిటీ తీర్పు

- విభేదించిన జస్టిస్ నాగరత్న
- రద్దు చట్ట విరుద్ధమంటూ తీర్పు
- రాహుల్ క్షమాపణలు చెప్పాలి: బీజేపీ
- కేంద్రానికి చెంప దెబ్బ తీర్పే: కాంగ్రెస్



న్యూఢిల్లీ: నరేంద్ర మోదీ ప్రభుత్వానికి అత్యున్నత న్యాయస్థానంలో మరో భారీ ఊరట లభించింది. రూ.500, రూ.1,000 నోట్లను రద్దు చేస్తూ కేంద్రం ఆరేళ్ల కింద తీసుకున్న నిర్ణయాన్ని సుప్రీంకోర్టు సమర్థించింది. ''ఈ నిర్ణయం తీసుకునే ముందు కేంద్రానికి, ఆర్‌బీఐకి మధ్య ఆర్నెల్ల పాటు సంప్రదింపులు జరిగాయి. కనుక పిటిషనర్లు ఆరోపించినట్టుగా నోట్ల రద్దు నిర్ణయ ప్రక్రియలో న్యాయ, రాజ్యాంగపరమైన లోపాలేవీ చోటుచేసుకోలేదు'' అని స్పష్టం చేసింది. నోట్ల రద్దును సవాలు చేస్తూ దాఖలైన 58 పిటిషన్లను కొట్టేసింది. ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం ఈ మేరకు సోమవారం మెజారిటీ తీర్పు వెలువరించింది. ''దొంగ నోట్లకు, నల్లధనానికి, ఉగ్రవాదానికి నిధులకు అడ్డుకట్ట వేసే ఉదాత్త లక్ష్యాలతో తీసుకున్న ఆర్థిక విధానపరమైన నిర్ణయమిది. వెనక్కు మరల్చడం వీలు కాని ఇలాంటి నిర్ణయాలను కేవలం వాటిని తీసుకునేందుకు అనుసరించిన ప్రక్రియ ఆధారంగా అసమంజసమని తేల్చి కొట్టేయలేం'' అని ధర్మాసనానికి సారథ్యం వహించిన జస్టిస్ ఎస్.ఎ.నజీర్‌తో పాటు బి.ఆర్.గవాయ్, ఎ.ఎస్.బొపన్న, వి.రామసుబ్రమణియన్ పేర్కొన్నారు. అంతేగాక ఇలాంటి నిర్ణయాలు సమంజసమైనవేనా, ఆశించిన ఫలితాలిచ్చాయా అనే అంశాలపై న్యాయ వ్యవస్థ సమీక్ష జరపజాలదన్నారు. రద్దు చేసిన నోట్ల మార్పిడికి ఇచ్చిన 52 రోజుల గడువు సమంజసమైనదేనని అభిప్రాయపడ్డారు. ధర్మాసనం తరఫున మెజారిటీ తీర్పును జస్టిస్ గవాయ్ చదివి వినిపించారు. ధర్మాసనంలోని ఐదో సభ్యురాలు జస్టిస్ బి.వి.నాగరత్న దీనితో విభేదించారు. నోట్ల రద్దు నిర్ణయం చట్ట విరుద్ధమంటూ ఆమె విడిగా తీర్పు వెలువరించారు. నోట్ల రద్దును సవాలు చేస్తూ పలువురు సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేయడం తెలిసిందే. వాటన్నింటినీ కలిపి విచారించిన ధర్మాసనం డిసెంబర్ 7న తీర్పును రిజర్వు చేసింది. నిర్ణయానికి సంబంధించిన కొన్ని కీలక డాక్యుమెంట్లను సీల్డ్ కవర్లో తమకు సమర్పించాలని అంతకుముందు కేంద్రాన్ని ఆదేశించింది.

ఇప్పుడేమంటారు?

దేశ ప్రయోజనాల కోసం మోదీ ప్రభుత్వం తీసుకున్న నోట్ల రద్దు నిర్ణయం ఉగ్రవాదం నడ్డి విరవడంలో కీలక పాత్ర పోషించింది. ఆ నిర్ణయాన్ని సమర్థిస్తూ సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు వెలువరించింది. నోట్ల రద్దుకు వ్యతిరేకంగా దేశ విదేశాల్లో ప్రచారం చేసిన రాహుల్‌గాంధీ ఇప్పుడు క్షమాపణ చెబుతారా?

\- బీజేపీ

సమర్థించలేదు

నోట్ల రద్దు నిర్ణయాన్ని సుప్రీంకోర్టు సమర్థించిందనడం సరికాదు. తాజా తీర్పు కేవలం నిర్ణయ ప్రక్రియపైనే తప్ప, నోట్ల రద్దు లక్ష్యాలు నెరవేరాయా, లేదా అన్న కీలక అంశంపై కాదు. నోట్ల రద్దు చట్టవిరుద్ధమంటూ జస్టిస్ నాగరత్న వెలువరించిన మైనారిటీ తీర్పు మోదీ సర్కారుకు చెంప పెట్టు. లక్షలాది కంపెనీలను నాశనం చేసి, కోట్లాది మంది ప్రజల పొట్ట కొట్టిన ఇలాంటి పిచ్చి తుగ్లక్ నిర్ణయం తీసుకున్నందుకు ప్రధాని మోదీయే జాతికి క్షమాపణ చెప్పాలి.

\- కాంగ్రెస్

పిటిషనర్ల వాదనేమిటి?

నోట్ల రద్దు కేసులో పిటిషనర్ల తరఫున చిదంబరం తదితరులు వాదించారు. వాళ్లేమన్నారంటే...

- రద్దు నిర్ణయానికి అనుసరించిన ప్రక్రియ పూర్తిగా లోపభూయిష్టం. సంబంధిత పత్రాలన్నింటినీ కోర్టు ముందుంచాలి
- నోట్ల రద్దుకు కేంద్రం నేరుగా నిర్ణయం తీసుకోజాలదు. అందుకు ఆర్‌బీఐ కేంద్ర బోర్డు సిఫార్సు తప్పనిసరి.
- రద్దు ద్వారా ఆశించిన లక్ష్యాలేవీ నెరవేరలేదు
- నిర్ణయాన్ని ఇప్పుడు వెనక్కు తీసుకోవడం అసాధ్యమే అయినా మున్ముందు ప్రభుత్వాలు ఇలాంటి దుస్సాహసాలకు పాల్పడకుండా స్పష్టమైన చట్ట నిబంధనలను ఏర్పరచాలి
- గడువు లోగా పాత నోట్లు మార్చుకోలేకపోయిన వారికి మరో అవకాశం కల్పించాలి

కేంద్రం ఏం చెప్పింది...

కేంద్రం తరఫున అటార్నీ జనరల్ వెంకట రమణితో పాటు ఆర్‌బీఐ తరఫున న్యాయవాది నోట్ల రద్దును సమర్థిస్తూ వాదనలు విన్పించారు...

- దొంగ నోట్లు, నల్లధనం, ఉగ్రవాదానికి నిధులు, పన్నుల ఎగవేత వంటి జాఢ్యాల ఏరివేత నోట్ల రద్దు నిర్ణయం లక్ష్యం
- అన్ని కోణాల్లోనూ లోతుగా ఆలోచించి, అవసరమైన సంప్రదింపులన్నీ జరిపిన మీదట తీసుకున్న నిర్ణయమిది
- ఈ విషయమై ఆర్‌బీఐతో సుదీర్ఘ సంప్రదింపులు జరిగాయి
- ఆరేళ్ల కింద జరిగిపోయిన ఈ నిర్ణయానికి సంబంధించి ఇప్పుడు 'కాలాన్ని వెనక్కు తిప్పి' జరిగిపోయిన వాటిని సరి చేయడం, పరిహారం వంటివి ఇవ్వడం సాధ్యం కాదు. కనుక దీనిపై విచారణే కూడదు.

మెజారిటీ తీర్పులో సుప్రీంకోర్టు ధర్మాసనం చెప్పిందిదీ...

నోట్ల రద్దు నిర్ణయం సబబేనంటూ ధర్మాసనం తరఫున జస్టిస్ నజీర్ మెజారిటీ తీర్పు చదివి విన్పించారు. 382 పేజీల ఈ తీర్పులో ఆయనేం చెప్పారంటే...

- ఆర్‌బీఐతో ఆర్నెల్లపాటు సంప్రదింపులు జరిపిన మీదటే నోట్ల రద్దు నిర్ణయం తీసుకున్నారు
- ఇది హడావుడిగా తీసుకున్న నిర్ణయమన్న వాదన అర్థరహితం
- కేవలం కొన్ని సిరీస్‌ల నోట్లనే తప్ప వాటిని మొత్తానికే రద్దు చేసే అధికారం కేంద్రానికి లేదనడం అసంబద్ధం
- ఎందుకంటే నోట్ల రద్దు నిర్ణయాన్ని సొంతంగా తీసుకుని అమలు చేసే స్వతంత్ర అధికారాలు ఆర్‌బీఐకి లేవు
- ఆర్‌బీఐ చట్టంలోని 26 (2) సెక్షన్ కింద కేంద్రానికి ఉన్న అధికారాలు పరిమితమైనవడం, కొన్ని సిరీస్‌ల నోట్లనే తప్ప వాటిని కేంద్రంసంపూర్ణంగా రద్దు చేయజాలదని చెప్పడం సరికాదు


జస్టిస్ నజీర్


జస్టిస్ గవాయ్


జస్టిస్ బొపన్న


జస్టిస్ రామసుబ్రమణియన్

- గతంలో జరిగిన నోట్ల రద్దు నిర్ణయాలను పార్లమెంటు చట్టం ద్వారా తీసుకున్నంత మాత్రాన ఈ విషయంలో మరో విధమైన నిర్ణయం తీసుకునేందుకు కేంద్రానికి అధికారం లేదని కూడా చెప్పలేం
- కేవలం కేంద్రం చేపట్టిన చర్యల ఫలితం ఆధారంగా నోట్ల రద్దు నిర్ణయాన్ని కొట్టేయలేం
- ఈ నిర్ణయం వెనక మూడు లక్ష్యాలను గుర్తించాం. వాటిని చేరుకోవడంలో తేడాలున్నంత మాత్రాన నిర్ణయాన్ని కొట్టేయాలనడం సరికాదు
- ఇలాంటి నిర్ణయాల విషయంలో పూర్తిస్థాయి ముందస్తు గోప్యత చాలా అవసరం. అవి లీకైతే ఎంతటి అనర్థం జరిగేదో ఊహించుకోవడం కూడా కష్టమే.
- రద్దయిన నోట్ల మార్పిడికి ఇచ్చిన 52 రోజుల గడువు సమంజసమైనదే
- కొంతమందికి తాత్కాలికంగా కాస్త కష్టం కలిగినంత మాత్రాన మొత్తం నిర్ణయాన్నే తప్పుబట్టలేం
- నోట్ల రద్దు ప్రభావం తదితరాలను మదింపు చేయడం కోర్టుల పని కాదు

జస్టిస్ నాగరత్న ఏమన్నారంటే...

నోట్ల రద్దు నిర్ణయం చట్ట విరుద్ధమని జస్టిస్ నాగరత్న పేర్కొన్నారు. ధర్మాసనంలో అందరికంటే జూనియర్ న్యాయమూర్తి అయిన ఆమె మెజారిటీ తీర్పుతో విభేదిస్తూ ఈ మేరకు విడిగా 124 పేజీల తీర్పు వెలువరించారు. అందులో ఏం చెప్పారంటే...

- నోట్ల రద్దు నిర్ణయం దొంగ నోట్లు, నల్లధనం, ఉగ్రవాదానికి నిధులకు అడ్డుకట్టే వేసేందుకు బాగా ఆలోచించి, సదుద్దేశంతో తీసుకున్నదే.



సమాజ మూలాలను పెకిలిస్తున్న జాఢ్యాలను నిర్మూలించాలన్న ఉద్దేశాన్ని అభినందించాల్సిందే

- కానీ ఇది కేవలం 24 గంటల్లో తీసుకున్న హడావుడి నిర్ణయం. పైగా అందుకు అనుసరించిన తీరు కూడా పూర్తిగా చట్టవిరుద్ధం
- ఇది కేంద్రం సిఫార్సు చేసిన నిర్ణయమని ఆర్‌బీఐ సమర్పించిన పత్రాలే చెబుతున్నాయి. అంటే ఇది ఆర్‌బీఐ స్వతంత్ర ఆలోచన కాదని స్పష్టమవుతోంది
- కేంద్ర ప్రభుత్వానికి ఉన్న విస్తృతమైన అధికారాల దృష్ట్యా కేవలం గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వడానికి బదులు ప్రజలందరికీ ప్రాతినిధ్యం వహించే పార్లమెంటులో నోట్ల రద్దుపై విస్తృతంగా చర్చించి ఈ మేరకు చట్టం చేయాల్సింది.
- అయితే ఇది ఆరేళ్ల క్రితం నాటి నిర్ణయం. కనుక దీనిపై స్టే గానీ, పిటిషనర్లకు ఉపశమనం గానీ ఇవ్వలేం

ఇప్పటికీ క్యాషే కింగ్!

- నోట్ల రద్దుతో చెల్లకుండా పోయిన 86 శాతం కరెన్సీ
- ఆరేళ్ల తర్వాత 83 శాతం పెరిగిన నగదు చలామణి
- చెల్లింపుల్లో మాత్రం డిజిటల్ దెబ్బకు కుదేలైన నగదు వాటా

న్యూఢిల్లీ: పెద్ద నోట్ల రద్దు. ఆరేళ్ల క్రితం మోదీ సర్కారు తీసుకున్న సంచలన నిర్ణయం. అప్పటికి దేశవ్యాప్తంగా చలామణిలో ఉన్న కరెన్సీలో 86 శాతం వాటి రూ.1,000, రూ.500 నోట్లదే. కేంద్రం నిర్ణయంతో అవి ఒక్క దెబ్బతో రద్దయ్యాయి. కానీ ఆర్థిక లావాదేవీల్లో ఇప్పటికీ నగదుదే పెద్ద వాటా! పైగా నోట్ల రద్దు నాటితో పోలిస్తే జనం దగ్గరున్న నగదు ఏకంగా రెట్టింపైందని తాజా గణాంకాలు చెబుతుండటం ఆసక్తికరం. నోట్ల రద్దుకు కాస్త ముందు, అంటే 2016 నవంబర్ 4న చలామణిలో ఉన్న కరెన్సీ విలువ కేవలం 17.74 లక్షల కోట్ల రూపాయలు. రద్దు నిర్ణయం తర్వాత అది ఏకంగా రూ.9 లక్షల కోట్లకు పడిపోయింది. కానీ తాజాగా 2022 డిసెంబర్ 23 నాటికి ఏకంగా 32.42 లక్షల కోట్ల రూపాయల విలువైన కరెన్సీ చలామణిలో ఉందని రిజర్వు బ్యాంకు గణాంకాలే చెబుతున్నాయి. రద్దయిన నోట్లు మార్చుకోవడానికి అప్పట్లో 52 రోజుల గడువు ఇవ్వడం తెలిసిందే. ఆ గడువు లోపల రూ.15.3 లక్షల కోట్ల విలువైన పెద్ద నోట్లు, అంటే 99.3 శాతం వెనక్కొచ్చాయని ఆర్‌బీఐ పేర్కొంది. అలాంటప్పుడు నోట్ల రద్దుతో సాధించింది ఏమిటన్న ప్రశ్నలు అప్పట్లోనే తలెత్తాయి. రద్దు అనంతరం కొత్తగా రూ.2,000 నోటు ప్రవేశపెట్టడం తెలిసిందే. రూ.500 నోట్లను సరికొత్త రూపంలో తిరిగి జారీ చేసినా రూ.1,000 నోట్లను మాత్రం పునరుద్ధరించలేదు. ఒకవైపు డిజిటల్ చెల్లింపుల్లో భారత్ కొన్నేళ్లుగా ప్రపంచంలోనే అగ్ర స్థానంతో దూసుకుపోతున్నా మరోవైపు నగదు చలామణి కూడా అంతకంతకూ పెరుగుతుండటం ఆసక్తికరమే. అయితే నగదు చలామణి క్రమంగా తగ్గుతోందని ఎస్‌బీఐ తాజా సర్వే ఒకటి తేల్చింది. ''మొత్తం చెల్లింపుల్లో నగదు వాటా 2015–16 ఆర్థిక సంవత్సరంలో 88 శాతం కాగా 2021–22 నాటికి అది 20 శాతానికి తగ్గింది. 2026–27 కల్లా కేవలం 11 శాతానికి పరిమితమవుతుంది. అదే సమయంలో 2015–16లో కేవలం 11.26 శాతంగా నమోదైన డిజిటల్ చెల్లింపులు 2021–22 నాటికి ఏకంగా 80 శాతానికి ఎగబాకాయి. 2026–27 కల్లా 88 శాతానికి చేరతాయి'' అని అది పేర్కొంది.

చలామణిలో ఉన్న నోట్ల మొత్తం విలువ	
2017 మార్చి 31	రూ.13.1 లక్షల కోట్లు
2018 మార్చి 31	రూ.18.03 లక్షల కోట్లు
2019 మార్చి 31	రూ.21.1 లక్షల కోట్లు
2020 మార్చి 31	రూ.24.2 లక్షల కోట్లు
2021 మార్చి 31	రూ.28.26 లక్షల కోట్లు
2022 మార్చి 31	రూ.31.05 లక్షల కోట్లు
2022 డిసెంబర్ 23	రూ.32.42 లక్షల కోట్లు

చలామణిలో ఉన్న మొత్తం నోట్ల సంఖ్య	
2017 మార్చి 31	9,026.6 కోట్లు
2022 మార్చి 31	13,053.3 కోట్లు

(రూ.2, 5, 10, 20, 50, 100, 200, 500, 2,000 నోట్లన్నీ కలిపి)

అక్కడ రష్యా.. ఇక్కడ చైనా..

ఒకే తరహా వైఖరి : రాహుల్ ధ్వజం



న్యూఢిల్లీ: యుద్ధంలో మునిగిన ఉక్రెయిన్, రష్యాలతో భారత్, చైనా సరిహద్దు వివాదాన్ని పోలుస్తూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యలు చేశారు. 'ఉక్రెయిన్‌ను ఆక్రమిస్తూ రష్యా ఆ దేశంతో ఉన్న సరిహద్దులను మార్చేస్తోంది. అదే తరహాలో భారత్‌తో ఉన్న సరిహద్దును మార్చేందుకు చైనా తన సైన్యం చొరబాట్లతో దుస్సాహసానికి తెగబడుతోంది' అని రాహుల్ గాంధీ ఆందోళన వ్యక్తంచేశారు. ప్రముఖ నటుడు, మక్కల్ నీది మయ్యం చీఫ్ కమల్ హాసన్‌తో చర్చాగోష్టి తాలూకా సుదీర్ఘ వీడియోను రాహుల్ గాంధీ సోమవారం ట్వీట్ చేశారు. 'బలహీన ఆర్థిక వ్యవస్థ, దమ్ములేని నాయకత్వంలో దార్శనికత కొరవడిన ప్రజలు, విద్వేషం, ఆగ్రహం కలగలిసిన ఈ పరిస్థితులను చైనా తనకు అనువుగా మలచుకుంటోంది. లద్దాఖ్‌లోకి వస్తామంటోంది. అరుణాచల్‌లో అడుగుపెడతామంటోంది' అని రాహుల్ ఆందోళన వ్యక్తంచేశారు. ఉత్తరప్రదేశ్‌లో ఈనెల 3వ తేదీ నుంచి మొదలయ్యే భారత్ జోడో యాత్రలో పాల్గొనాలంటూ ఆహ్వానం పంపిన రాహుల్ గాంధీకి ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్, బీఎస్పీ చీఫ్ మాయావతి కృతజ్ఞతలు తెలిపారు.

ఫిబ్రవరి 24 నుంచి కాంగ్రెస్ ప్లీనరీ

ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో ఫిబ్రవరి 24 నుంచి 26 దాకా.. మూడు రోజులపాటు తమ పార్టీ 85వ ప్లీనరీ నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సోమవారం తెలియజేశారు. పార్టీ రాజ్యాంగం ప్రకారం కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ)కి సైతం ప్లీనరీ సందర్భంగా ఎన్నికలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

సిరియాపై ఇజ్రాయెల్ దాడులు

బీరుట్: ఇజ్రాయెల్ ప్రభుత్వం మరోమారు సిరియాపై దాడులకు తెగబడింది. సిరియా రాజధాని నగరం డమాస్కస్‌లోని అంతర్జాతీయ ఎయిర్‌పోర్ట్‌పై క్షిపణి దాడులకు దిగింది. ఈ ఘటనలో ఇద్దరు సిరియా సైనికులు, ఇద్దరు విమానాశ్రయ సిబ్బంది మరణించారు. ఎయిర్‌పోర్ట్‌లో ఒకవైపు రన్‌వే దెబ్బతింది. రెండు టర్మినళ్లలో నిర్వహణ వ్యవస్థ ధ్వంసమైంది. ఆదివారం అర్ధరాత్రి దాటాక ఈ దాడి ఘటన జరిగింది. గత ఏడు నెలల్లో డమాస్కస్ ఎయిర్‌పోర్ట్‌పై ఇజ్రాయెల్ క్షిపణులు ప్రయోగించడం ఇది రెండోసారి. బషర్ అల్ అసద్‌కు మద్దతు పలుకుతున్న స్థానిక ఉగ్రవాదులకు ఇరాన్, లెబనాన్ హిజ్‌బుల్లాల నుంచి ఆయుధాల సరఫరాను అడ్డుకునేందుకే ఈ దాడులు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఎయిర్‌పోర్ట్‌తోపాటు డమాస్కస్ దక్షిణాన ఉన్న సిరియా ఆయుధాగారంపైనా ఇజ్రాయెల్ క్షిపణులను ఎక్కుపెట్టింది.

వెస్ట్‌బ్యాంక్‌లో కాల్పులు

రమల్లా: ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌లో ఇజ్రాయెల్ సైన్యంతో ఆదివారం జరిగిన ఘర్షణల్లో ఇద్దరు పాలస్తీనియన్లు చనిపోయారు. జెనిన్‌లోని కాఫిర్‌దాన్‌లోకి ప్రవేశించిన ఇజ్రాయెల్ ఆర్మీని పాలస్తీనియన్లు అడ్డుకున్నారు. దీంతో ఆర్మీ వారిపైకి కాల్పులకు దిగింది. కాల్పుల్లో సమెర్ హౌషియెహ్(21), ఫవాద్ అబెద్(25) అనే వారు మృతి చెందారు.

ఒక్క క్షిపణితో 400 మంది హతం !

డోనెట్స్క్‌లో దాడిలో రష్యా సైనికుల్ని చంపామన్న ఉక్రెయిన్


రష్యా దాడిలో ధ్వంసమైన కీవ్ ప్రాంతం

కీవ్: దురాక్రమణకు దిగిన రష్యా సేనలను క్షిపణి దాడుల్లో అంతమొందించే పరంపర కొనసాగుతోందని ఉక్రెయిన్ ప్రకటించింది. డోనెట్స్క్ ప్రాంతంలో తమ సేనలు జరిపిన భారీ క్షిపణి దాడిలో ఏకంగా 400 మంది రష్యా సైనికులు చనిపోయారని ఉక్రెయిన్ పేర్కొంది. ఈ దాడిలో మరో 300 మంది గాయపడ్డారని తెలిపింది. అయితే 63 మంది సైనికులే మరణించారని రష్యా స్పష్టంచేసింది. మకీవ్కా సిటీలో ఆదివారం అర్ధరాత్రి ఈ దాడి జరిగినట్లు తెలుస్తోంది. ఒక పెద్ద భవంతిలో సేద తీరుతున్న రష్యా సైనికులే లక్ష్యంగా ఉక్రెయిన్ క్షిపణి దాడి జరిగింది. అమెరికా సరఫరా చేసిన హిమార్స్ రాకెట్లను ఆరింటిని ఉక్రెయిన్ సేనలు ప్రయోగించగా రెండింటిని నేలకూల్చామని మిగతావి భవనాన్ని నేలమట్టంచేశాయని రష్యా సోమవారం తెలిపింది. భవనంలోని సైనికులు ఇంకా యుద్ధంలో నేరుగా పాల్గొనలేదని, ఇటీవల రష్యా నుంచి డోనెట్స్క్‌కు చేరుకున్నారని, అదే భవనంలో యుద్ధంతాలూకు పేలుడుపదార్థాలు ఉండటంతో విధ్వంసం తీవ్రత పెరిగిందని స్థానిక మీడియా తెలిపింది. మరోవైపు, డోనెట్స్క్‌లో దాడి తర్వాత ఉక్రెయిన్ రాజధాని కీవ్‌పై రష్యా మరోసారి డ్రోన్లకు పనిజెప్పింది. కీలకమైన మౌలిక వ్యవస్థలపై సోమవారం 40 డ్రోన్లు దాడికి యత్నించగా అన్నింటినీ కూల్చేశామని కీవ్ మేయర్ విటలీ క్లిష్కో చెప్పారు. కీవ్ ప్రాంతంలో కీలక మౌలిక వ్యవస్థలు, జనావాసాలపై డ్రోన్ దాడులు సోమవారం సైతం కొనసాగాయని కీవ్ ప్రాంత గవర్నర్ కుబేలా చెప్పారు.

పొడవులో ఘనాపాఠి

- ఎత్తు 7 అడుగుల 4 అంగుళాలు
- త్వరలో గిన్నిస్ రికార్డుకెక్కే చాన్స్



అక్రా: ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన వ్యక్తిగా టర్కీకి చెందిన 40 ఏళ్ల సుల్తాన్ సేన్ గతంలోనే గిన్నిస్ ప్రపంచ రికార్డులకెక్కాడు. అయితే, ఇతడిని దాటేసేందుకు ఘనాకు చెందిన 29 ఏళ్ల వ్యక్తి నెలనెలా తెగ పెరిగిపోతున్నాడు. ఇతని పేరు సులేమనా అబ్దుల్ సమీద్. అందరిలా సాధారణ ఎత్తు ఉన్న సమీద్ 22 ఏళ్ల వయసులో వేగంగా పెరగడం అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తింది. దగ్గర్లోని ఆస్పత్రికి వెళ్లి ఎత్తు కొలవమంటే వారి దగ్గర సరిపడా టేప్ లేదు. ఒక ఎత్తయిన కర్ర తీసుకుని ఎత్తు తేల్చారు. అప్పుడు అతని ఎత్తు 7 అడుగుల 4 అంగుళాలు. గిన్నిస్‌లో స్థానం సంపాదించిన సుల్తాన్(ఎత్తు 8 అడుగుల 2.8 అంగుళాలు)ను త్వరలోనే దాటేస్తావని అందరూ తెగ పొగిడేశారు. సమీద్ ఇంకా ఎత్తు పెరుగుతుండటం గమనార్హం. కాగా 'మార్ఫాన్ సిండ్రోమ్'గా పిలిచే ఈ జన్యుసంబంధ వ్యాధి కారణంగా తీవ్ర గుండె సమస్యలు తలెత్తుతాయి. మెదడుకు శస్త్రచికిత్స చేసి ఇతని పెరుగుదలను ఆపాల్సి ఉంది' అని వైద్యులు తెలిపారు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
మంగళవారం ı 3 ı జనవరి ı 2023



పచ్చదనంపై వేటు

బెంగళూరులోని బళ్లారి రోడ్డులో రహదారి విస్తరణ పనుల కోసం నరికివేసిన పెద్ద చెట్టు. రోడ్డు విస్తరణ కోసం ఇప్పటివరకు 58 చెట్లను నేలకూల్చారు

వ్యాపారి ఆత్మహత్య.. ఎమ్మెల్యేకు చిక్కులు!

- డెత్‌నోట్‌లో బీజేపీ ఎమ్మెల్యే అరవింద లింబావళి పేరు
- కోట్ల రూపాయలు మోసపోయానని మృతుని ఆవేదన
- బెంగళూరులో కలకలం



ఎమ్మెల్యే అరవింద లింబావళితో ప్రదీప్ (ఫైల్)



బనశంకరి: కారులో తలకు పిస్టల్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్న బెళ్లందూరు అంబలిపుర నివాసి ప్రదీప్ (47) కేసులో బెంగళూరు మహాదేవపుర బీజేపీ ఎమ్మెల్యే అరవింద లింబావళి చిక్కుల్లో పడ్డారు. ప్రదీప్ రాసిన డెత్‌నోటులో ఆరుగురి పేర్లలో లింబావళి కూడా ఉండడంతో కేసు తీవ్రంగా మారింది.

వేడుకలు చేసుకుని తిరిగి వస్తూ

వివరాలు... నగరవాసి ప్రదీప్ పలు వ్యాపారాలు చేస్తుంటాడు. కుటుంబంతో పాటు గత 30వ తేదీన బెంగళూరు కగ్గలిపుర పరిధిలోని నెట్టిగెరెలో ఉన్న వుడ్స్ రెస్టారెంట్‌కు కొత్త ఏడాది సంబరాలకు వెళ్లారు. డిసెంబరు 31 తేదీ రాత్రి భార్యతో గొడవపడి ఇంటికి వెనక్కి వెళ్లిపోయాడు. మరుసటిరోజు మళ్లీ రిసార్ట్‌కు వెళ్లాడు. ఆదివారం సాయంత్రం 5 గంటల సమయంలో భార్య భర్తతలో కారులో బయల్దేరారు. వెనుక కారులో వస్తున్న ప్రదీప్ పిస్టల్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కాల్పుల శబ్దం విని భార్య వెనక్కి వచ్చి చూడగా ప్రదీప్ చనిపోయి ఉన్నాడు.

డెత్‌నోట్‌లో ఏముందంటే..

- కగ్గలిపుర పోలీసులు చేరుకుని కారులో పరిశీలించగా డెత్‌నోటు బయటపడింది. అందులో ఎమ్మెల్యే అరవింద లింబావళి, కే.గోపి, సోమయ్య, జీ.రమేశ్‌రెడ్డి, జయరామరెడ్డి, రాఘవభట్ పేర్లు ఉన్నాయి.
- 8 పేజీల డెత్‌నోట్‌లో ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులపై వివరంగా రాశాడు. హెచ్ఎస్ఆర్. లేఔట్ సమీపంలోని హరళూరులో క్లబ్ ఏర్పాటు చేస్తామంటే కే.గోపి, సోమయ్యలకు 2018 మే నుంచి రూ.1.10 కోట్ల డబ్బును ఇచ్చానని, ఇందుకుగాను ప్రతి నెలా రూ.3 లక్షలు లాభం, అక్కడ పనిచేస్తే నెలకు లక్షన్నర వరకు వేతనం ఇస్తామని వారు తెలిపారు.
- కానీ ఇప్పటి వరకు ఎలాంటి లాభం ఇవ్వలేదని దీని గురించి మాట్లాడటానికి ఎమ్మెల్యే అరవింద లింబావళి వద్దకు వెళ్లగా రాజీ నెపంతో నెలకు లక్ష రూపాయలు లెక్కన 9 నెలలు తన వద్ద డబ్బు తీసుకున్నారు.
- తరువాత సోమయ్య బృందం రూ.90 లక్షలు వెనక్కి ఇస్తామని తెలిపారు. కానీ ఇప్పటికే నేను చాలా అప్పుచేశానని, ఎమ్మెల్యే లింబావళి సైతం తనకు సహాయం చేయలేదని నోట్‌లో రాశాడు.
- రమేశ్‌రెడ్డి దగ్గర రూ.10 లక్షలు అప్పు చేస్తే రూ.35 లక్షలు వసూలు చేసి మరింత డబ్బు కోసం బెదిరించాడు, రాఘవభట్ నా వద్ద రూ.20 లక్షలు అప్పు తీసుకుని తిరిగి చెల్లించలేదు.
- మొత్తం నాకు రూ.2 కోట్లు 20 లక్షలు రావాల్సి ఉంది. నా అప్పులను తీర్చడానికి నా భార్య సైతం అప్పులు తీసుకుంది. వారి నుంచి వసూలు చేసిన డబ్బును నా భార్య కుమార్తెకు ఇవ్వాలని డెత్‌నోట్‌లో ప్రదీప్ రాశాడు.
- కగ్గలిపుర పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఆత్మహత్య సంఘటనలో చట్ట ప్రకారం చర్యలు: సీఎం

బనశంకరి: పారిశ్రామికవేత్త ప్రదీప్ ఆత్మహత్య కేసుకు సంబంధించి మాజీ మంత్రి, ఎమ్మెల్యే అరవింద లింబావళిపై ఎఫ్ఐఆర్ నమోదు కావడంపై విలేకరుల సీఎం బొమ్మైని ప్రశ్నించగా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు. ఇక విజయపుర సిద్దేశ్వర స్వామీజీ తాను తరచూ ఆయన ఆరోగ్యంపై ఆరా తీస్తున్నట్లు సీఎం చెప్పారు.

కాలేజీలో విద్యార్థిని హత్య

తరచూ ఎక్కడో ఒక చోట ప్రేమోన్మాదుల దాష్టీకానికి అమ్మాయిలు బలవుతున్నారు. చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాల్సినవారు ప్రేమ పాశానికి బలవుతూ కన్నవారికి శోకాన్ని మిగులుస్తున్నారు. మరోవైపు దాడులకు పాల్పడినవారు కటకటాల పాలై బతుకును బుగ్గి చేసుకుంటున్నారు.

- ప్రేమించలేదని స్నేహితుని దురాగతం
- బెంగళూరు యలహంకలో ఘటన







లయస్మిత మృతదేహం (కింద) ఆస్పత్రిలో పవన్



లయస్మితతో ప్రేమోన్మాది పవన్ (ఫైల్)

యశవంతపుర: ప్రేమించలేదనే కోపంతో విద్యార్థినిని మరో విద్యార్థి చాకుతో పొడిచి హత్య చేసిన ఘటన బెంగళూరులో జరిగింది. యలహంక రాజనకుంట పోలీసుస్టేషన్ పరిధిలో దిబ్బూరులోని ప్రెసిడెన్సీ ఇంజనీరింగ్ కాలేజీ ఈ దారుణానికి వేదికైంది. కోలారుకు చెందిన లయస్మిత (19) హతురాలు. వివరాలు.. లయస్మిత ఈ కాలేజీలో ఇంజనీరింగ్ రెండో ఏడాది విద్యార్థిని కాగా, ఆమె స్నేహితుడు పవన్ నృపతుంగ రోడ్డులో విశ్వేశ్వరయ్య ఇంజనీరింగ్ కాలేజీలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. లయస్మితను ప్రేమిస్తున్నానని వెంటపడేవాడు. ఆమె ఇష్టం లేదని చెప్పినా పవన్ తీరు మారలేదు.

10 సార్లు కత్తితో పొడిచి హత్య

కాలేజీకీ వచ్చి ముఖ్యమైన విషయం మాట్లాడాలని చెప్పి లయస్మితను క్లాసు నుంచి పిలిపించాడు. నన్ను ప్రేమిస్తావా, లేదా అని పవన్ డిమాండ్ చేయగా లయస్మిత నిరాకరించింది. దీంతో ఉన్మాదిగా మారిన పవన్ కత్తి తీసుకుని 10 సార్లు ఆమెను పొడిచాడు. లయస్మిత రక్తపు మడుగులో కుప్పకూలి ప్రాణాలు వదిలింది. ఈ ఘోరాన్ని చూసిన విద్యార్థులు భయంతో పరుగులు తీశారు. తరువాత ప్రేమోన్మాది చాకుతో పొడుచుకొని ఆత్మహత్యకు యత్నించాడు. గాయపడిన పవన్‌ను విద్యార్థులు ఆస్పత్రికి తరలించారు. పవన్ తరచూ కాలేజీకి వచ్చి ప్రేమ పేరుతో లయస్మితను వేధించినట్లు తెలిసింది. రాజనుకుంట పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు. ప్రేమోన్మాది మారణకాండ తీవ్ర సంచలనం సృష్టించింది.

తల్లీ తనయుడు అనుమానాస్పద మృతి

- మండ్యలో సంఘటన



నితిన్, వీణా (ఫైల్)

మండ్య: తల్లి ఇంట్లో ఉరివేసుకున్న స్థితిలో చనిపోయి ఉండగా, తనయుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండ్య నగరంలో చోటు చేసుకుంది. సుభాష్ నగరలో క్రిస్టియన్ కాలనీలో నివాసిస్తున్న రిటైర్డు టీచర్ వీణా జోది (63), ఆమె కుమారుడు నితిన్ (28) మృతులు. ఇంట్లో ఆదివారంరోజున వీణా ఉరి వేసుకొన్న స్థితిలో కనిపించగా, నితిన్ విసి ఫారం గేట్ వద్ద రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు.

డబ్బు కోసం కొడుకు వేధింపులు


వివరాలు... వీణా అభినవ భారతి పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేసి రిటైరైంది. నగరంలో తమకు ఉన్న ఆస్తిని రెండు సంవత్సరాల క్రితం అమ్మగా వచ్చిన డబ్బును నితిన్ వృథా ఖర్చులు చేసి అయిపోగొట్టాడు. పైగా లక్షల రూపాయలు అప్పులు చేశాడని తెలిసింది. డబ్బు కావాలని రోజూ తల్లిని పీడించేవాడు. క్రిస్మస్ పండుగను బాగానే జరుపుకొన్నారు. వీణా ఆత్మహత్యపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఎత్తుగా ఉండే వీణా కిటికీకి ఉరివేసుకోగా కాళ్లు నేలను తాకుతున్నాయి. కొడుకు తల్లిని హత్య చేసి ఉరి వేసి, తాను ఆత్మహత్య చేసుకున్నాడా అని పోలీసులు అనుమానిస్తున్నారు. పశ్చిమ విభాగం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



హావేరి నగరంలో ఈ నెల 6 నుంచి 8 వరకు ప్రపంచ కన్నడ సాహిత్య సమ్మేళనం జరగనుంది. ఇందుకోసం భారీ ఎత్తున సాగుతున్న టెంట్ల నిర్మాణాలు

వెయ్యి శుభాల వైకుంఠ దర్శనం

- భక్తసంద్రమైన వైష్ణవాలయాలు
- తెల్లవారుజాము నుంచే భక్తుల రాక



బెంగళూరు ఇస్కాన్‌లో వైకుంఠవాసి రూపం



బెంగళూరు రాజాజీనగర రంగనాథ స్వామి దర్శనం



వేకువనే మంగళూరు వెంకటరమణ ఆలయంలోకి వెళ్తున్న భక్తులు

బనశంకరి: హిందువులకు పరమ పవిత్రమైన ముక్కోటి వైకుంఠ ఏకాదశి కావడంతో సోమవారం వైష్ణవాలయాలు భక్తజన సంద్రాలుగా మారాయి. వైకుంఠవాసి దర్శనం కోసం తండోపతండాలుగా తరలివచ్చారు. పేద ధనిక అనే భేదం లేకుండా శ్రీమన్నారాయణుని దర్శనం కోసం బారులు తీరారు. గోవింద నామస్మరణతో మందిరాలు మారుమోగాయి. కరోనా మహమ్మారి వల్ల గత రెండేళ్లుగా వైకుంఠ ఏకాదశిని రద్దీ లేకుండా జరపాల్సి వచ్చింది. ఈసారి నిబంధనల బెడద లేకుండా ఘనంగా సాగాయి. ఉత్తరద్వారం ద్వారా శ్రీమన్నారాయణస్వామిని దర్శనం చేసుకుంటే పుణ్యం లభిస్తుందని భక్తుల నమ్మకం. ఆలయాల్లో ప్రత్యేకంగా ఉత్తర ద్వారాన్ని ఏర్పాటు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

ప్రముఖ దేవస్థానాల్లో

బెంగళూరులోని లక్ష్మీవెంకటేశ్వర దేవస్థానం, మహాలక్ష్మీ లేఔట్‌లో శ్రీనివాస నిలయం, రాజాజీనగరలో ఇస్కాన్ మందిరం, చామరాజపేటలో కోటె వెంకటరమణస్వామి, జేపీ నగరలో తిరుమలగిరి లక్ష్మీవెంకటేశ్వరస్వామి గుడి, వయ్యాలికావల్ టీటీడీ ఆలయాల్లో భక్తులు వేకువజాము నుంచి క్యూ కట్టారు. రాజాజీనగర 5వ స్టేజ్‌లో గల శ్రీకైలాస వైకుంఠ మహాక్షేత్ర ట్రస్ట్‌లోనూ విశేష పూజలు, దర్శనాలు నిర్వహించారు. అంతటా రాత్రి వరకూ దర్శనాలను కొనసాగించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.



బెంగళూరు ఇస్కాన్ ఆలయంలో ఉత్తర ద్వారం గుండా వెళ్తున్న భక్తులు

న్యూస్‌రీల్

రోజూ 6 వేల కోవిడ్ పరీక్షలు

శివాజీనగర: రాజధాని బెంగళూరులో కోవిడ్ వైరస్ నివారణకు ప్రతిరోజు 6 వేల వరకు కోవిడ్ పరీక్షలను చేస్తున్నట్లు బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్ తెలిపారు. సోమవారం బీబీఎంపీ ప్రధాన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడిన ఆయన, ఇంతకు ముందు నగర వ్యాప్తిలో 1500 వరకు కోవిడ్ పరీక్షలు జరిగేవని, అయితే ప్రస్తుతం ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం రోజుకు 6 వేల కోవిడ్ పరీక్షలు చేస్తామన్నారు. కోవిడ్ లక్షణాలు కనిపిస్తే తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని విన్నవించారు. బయట తిరిగేవారికి మాస్క్ తప్పనిసరి చేయలేదు. అయితే ధరించాలని జాగృతి కల్పిస్తున్నామని అన్నారు.

కొరటగెరె వద్ద చిక్కిన చిరుత



తుమకూరు: తుమకూరు జిల్లాలోని కొరటగెరె పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు కంటికి నిద్ర లేకుండా చేసిన చిరుతపులి ఎట్టకేలకు బోనులోకి చిక్కింది. కొరటగెరెకి దగ్గరిలో బసవనకొండ వద్ద ఉన్న గంగాధరేశ్వర చెరువు వద్ద ఒక పొలంలో బోను పెట్టగా ఆదివారం రాత్రి అందులో పడింది. చిరుతను చూడడానికి ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చారు. అటవీ సిబ్బంది చిరుతను తరలించారు.

ఎయిర్‌పోర్టులో లేడీ సీఐపై ప్రయాణికుడి దాడి

- కేసు నమోదు

దొడ్డబళ్లాపురం: డాక్యుమెంట్ అడిగినందుకు మహిళా ఇన్‌స్పెక్టర్‌పై ప్రయాణికుడు దాడికి పాల్పడిన సంఘటన కెంపేగౌడ ఎయిర్‌పోర్టులో చోటుచేసుకుంది. ఆలస్యంగా వెలుగు చూసిన వివరాలు... డిసెంబర్ 25న సాయంత్రం 5.10 సమయంలో జాకి అమ్మనూర్ ఖాసిమ్ అనే వ్యక్తి కెంపేగౌడ ఎయిర్‌పోర్టు నుంచి కొచ్చిన్ బయలుదేరాలి. తనిఖీల సమయంలో సీఐఎస్ఎఫ్ సీఐ ధనేశ్వరి కొట్టామ్ విధుల్లో ఉన్నారు. ఖాసిమ్ తన గ్రీన్ కార్డ్ పోగొట్టుకు పోయిందని తెలిపాడు. గ్రీన్ కార్డ్ పోయినట్టు లాస్ట్ అండ్ ఫౌండ్ ఫిర్యాదు ఇవ్వాలని ఆమె ఒక ఫారం ఇచ్చారు. ఈ చర్యలతో ఆగ్రహంతో ఊగిపోయిన ఖాసిమ్ ఫారం విసిరికొట్టి దుర్భాషలాడుతూ చేయి చేసుకున్నాడు. ఈ సమయంలో ఖాసిమ్ మద్యం తాగి ఉన్నట్టు తెలిసింది. ఘటనకు సంబంధించి ఎయిర్‌పోర్టు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

మళ్లీ అధికారంలోకి వస్తాం

- సీఎం బొమ్మై



బనశంకరి: రాష్ట్రంలో మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తుందని ముఖ్యమంత్రి బసవరాజ బొమ్మై అన్నారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా సోమవారం మల్లేశ్వరంలోని తిరుపతి తిరుమల దేవస్థానాన్ని సందర్శించి శ్రీవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విలేకరులతో బొమ్మై మాట్లాడారు. తాను ఆలయాలు సందర్శించే సమయంలో ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం దేవున్ని వేడుకుంటానని, రాజకీయాలకు సంబంధించి ఏవీ కోరనన్నారు. వైకుంఠ ఏకాదశి రోజు వెంకటేశ్వరున్ని దర్శించుకుంటే శుభం కలుగుతుందని, టీటీడీ ఆలయానికి వచ్చి వెంకటేశ్వరస్వామిని దర్శించుకుని, రాష్ట్ర క్షేమం కోసం పూజించానన్నారు. మంత్రులు అశ్వత్థనారాయణ, మునిరత్న, వయ్యాలి కావల్ ఆలయ చైర్మెన్ సంపత్ రవినారాయణ్, కార్యదర్శి కే.భక్తవత్సలరెడ్డి, పీ.భాస్కరరెడ్డి, వెంకట కృష్ణారెడ్డి, గీతారామ్, వసంతకవిత, రవికుమార్‌రెడ్డి, రామశేషారెడ్డి, జయంతి తదితరులు పాల్గొన్నారు.

సిద్ధేశ్వర స్వామి కన్నుమూత

రాయచూరు రూరల్: విజయపుర (బిజాపుర)లో ప్రఖ్యాత జ్ఞానయోగ ఆశ్రమ పీఠాధిపతి సిద్ధేశ్వర స్వామి (81) సోమవారం రాత్రి కన్నుమూశారు. కొంతకాలంగా ఆయన వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్నారు. విజయపుర సైనిక పాఠశాలలో ఆయన భౌతిక కాయాన్ని ఉంచారు. విజయపురలో జన్మించిన స్వామీజీ బాల్యంలోనే మఠంలో సన్యాసిగా చేరి అంచెలంచెలుగా ఎదిగి మఠాధిపతి అయ్యారు.ఆయన భక్తి ప్రవచనాలు వినడానికి భక్తులు తరలివచ్చేవారు. గత మూడు రోజులు కింద అస్వస్థతకు గురయ్యారు. మంగళవారం ఆశ్రమంలో వీరశైవ లింగాయత సంప్రదాయాల ప్రకారం అంతిమ సంస్కారాలను నిర్వహిస్తారు.

దేవెగౌడ గురించి మాట్లాడే అర్హత లేదు



మాట్లాడుతున్న కుమారస్వామి

మైసూరు: మండ్యలో జరిగిన ఓ సమావేశంలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా జేడీఎస్ పార్టీపై, ఆ పార్టీ అధినేత దేవెగౌడపై చేసిన వ్యాఖ్యలపై మాజీ సీఎం కుమారస్వామి మండిపడ్డారు. సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ...అమిత్‌షా కాదు కాదా ఎంతమంది నాయకులు వచ్చిన కూడా మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ కాలిగోటికి కూడా సరిపోరని అన్నారు. అధికార బీజేపీ అవినీతిలో మునిగి తేలుతోందని, మాపై లేనిపోని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. రెండు జాతీయ పార్టీలు రాష్ట్రానికి చేసింది ఏమీ లేదన్నారు.

తుంగభద్రలో ముగ్గురు గల్లంతు

- హావేరి జిల్లాలో దుర్ఘటన



నదిలో మునిగిన యువకులు వీరే

సాక్షి, బళ్లారి: తుంగభద్ర నదిలో స్నానానికెళ్లి ముగ్గురు యువకులు నీటమునిగి గల్లంతైన ఘటన జరిగింది. వివరాలు.. హావేరి జిల్లా రాణెబెన్నూరు తాలూకా ముదేనూరుకు చెందిన నవీన్ కుమార్ (20), వికాస్ పాటిల్ (21), ప్రేమ్‌బోరా (25) అనే ముగ్గురు స్నేహితులు కొత్త సంవత్సర వేడుకల్లో పాల్గొన్న తర్వాత ఆదివారం సరదాగా నదీ స్నానానికి వెళ్లారు. అయితే అక్కడ లోతు ఎక్కువగా ఉండడంతో నీట మునిగి పోయారు. విషయం తెలిసిన వెంటనే స్థానిక అధికారులు, అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని గల్లంతైన యువకుల ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు. హలగేరి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యే లింబావళిని అరెస్టు చేయాలి

శివాజీనగర: ప్రదీప్ అనే వ్యాపారి ఆత్మహత్య కేసులో బీజేపీ ఎమ్మెల్యే అరవింద లింబావళిని తక్షణమే అరెస్ట్ చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ నేత ముఖ్యమంత్రి చంద్రు డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ కేసులో బీజేపీ ఎమ్మెల్యే పేరుంది కాబట్టి ఆయనను కాపాడుతున్నారని అన్నారు. రాష్ట్రంలో సామాన్య ప్రజలకు ఒక చట్టం, పెద్దవారికి ఒక చట్టం ఉందా అని ప్రశ్నించారు. ప్రదీప్ మరణంలో అరవింద లింబావళి పాత్ర ఉందనేది ప్రజలకు తెలియాలి. తప్పు చేసిన ప్రతి ఒక్కరికి శిక్ష పడాలి. ప్రదీప్ కుటుంబానికి న్యాయం లభించాలని అన్నారు.

బాలలపై లాఠీలతో ఖాకీల దాడి

యశవంతపుర: క్రికెట్ ఆడుతున్న బాలలను పోలీసులు లాఠీలతో కొట్టి ఆపై పారిపోతుండగా లాఠీ విసరటంతో ఇద్దరు గాయపడ్డారు. ఈ సంఘటన మంగళూరు నగరంలో తణ్ణీరుబావి బీచ్ వద్ద చోటుచేసుకుంది. ఆదివారం సాయంత్రం బాలలు, యువకులు రోడ్డుకు అడ్డంగా క్రికెట్ ఆడుతుండగా అటుగా వచ్చిన పోలీసులు.. రోడ్డు మీద క్రికెట్ ఆడతారా..., మీ వల్లే ఇక్కడ ట్రాఫిక్ సమస్య వస్తోందని లాఠీలతో విరుచుకుపడ్డారు. యువకులను చితకబాదారు. పరుగులు తీస్తున్న బాలలపై పోలీసులు లాఠీ విసరడంతో అది తగిలి ఆరో తరగతి, పీయూసీ చదువుతున్న విద్యార్థులిద్దరూ గాయపడ్డారు. పోలీసుల దాష్టీకంపై స్థానికులు ఆక్రోశం వ్యక్తం చేశారు. ఈ సంఘటనపై విచారణ చేస్తున్నట్లు పణంబూరు ఎస్ఐ తెలిపారు.

సౌదీ నుంచి వచ్చిన వ్యక్తికి కోవిడ్

దొడ్డబళ్లాపురం: విదేశాల నుంచి బెంగళూరుకు వచ్చిన ఒక వ్యక్తికి కోవిడ్ నిర్ధారణ అయ్యింది. దీంతో అతన్ని వారం రోజులపాటు క్వారంటైన్‌లో ఉండాలని తెలిపారు. సౌదీ అరేబియా నుంచి డిసెంబరు 31న రాత్రి బెంగళూరు దేవనహళ్లి ఎయిర్‌పోర్టులో ఒక వ్యక్తి దిగాడు. అతనికి పరీక్షలు చేయగా కోవిడ్ పాజిటివ్‌గా వచ్చింది. దీంతో ఇంట్లోనే చికిత్స పొందుతూ వారంపాటు క్వారంటైన్‌లో ఉండాలని సూచించారు.

ఓబీసీల రిజర్వేషన్ల పునర్ వర్గీకరణకు సన్నాహాలు

శివాజీనగర: రాష్ట్రంలో ప్రభావిత లింగాయత్ పంచమసాలి, ఒక్కలిగ సామాజిక వర్గాల రిజర్వేషన్ మార్పు, పెంపు విషయంలో 2 శాతం చొప్పున రిజర్వేషన్ పెంచే నిర్ణయానికి అనుకూలంగా ఓబీసీల పునర్ వర్గీకరణ జరుగుతోంది. కేటగిరి-2 (బీ) లోఉన్న ముస్లిలను ఆర్థిక బలహీన వర్గాల (ఇడబ్ల్యూఎస్) కోటాకు బదిలీ చేసేందుకు యోచించారు. ప్రస్తుతం ముస్లిం, క్రైస్తవులతో పాటు కొన్ని మైనార్టీ వర్గాలు ఓబీసీ(బీ) వ్యాప్తిలో ఉండగా, మొత్తం 4 శాతం రిజర్వేషన్ కల్పించారు. రాష్ట్రంలో అమల్లో ఉన్న కేంద్ర ఈడబ్ల్యూఎస్ 10 శాతం రిజర్వేషన్ వ్యాప్తిలోకి ముస్లింలకు అవకాశం కల్పించారు. దీనిద్వారా అందుబాటులో ఉన్న నాలుగు శాతం రిజర్వేషన్ స్థాయిని 2 శాతం చొప్పున లింగాయత్, ఒక్కలిగ సామాజిక వర్గానికి పంపిణీ చేయాలని యోచించినట్లు ఉన్నత వర్గాలు తెలిపాయి.

క్లుప్తంగా

మహాదేవతాత రథోత్సవం



బళ్లారిఅర్బన్: నగర శివార్లలోని అల్లీపురలో వెలసిన సద్గురు మహాదేవతాత మహారథోత్సవం సోమవారం సాయంత్రం వేడుకగా నిర్వహించారు. ప్రతి ఏడాది వైకుంఠ ఏకాదశి రోజున ఉదయం నుంచి మఠంలో దేవతామూర్తులందరికీ అలంకరణ పూజలు నిర్వహించి మఠం ముందు నుంచి ప్రధాన రోడ్డు మీదుగా ఎదురు బసవణ్ణ వరకు రథోత్సవాన్ని సాయంత్రం 4 గంటలకు వేలాది మంది భక్తుల సమక్షంలో నిర్వహించారు. ఉదయం నుంచి తాతను దర్శించుకునేందుకు, మహా రథోత్సవాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాలతో పాటు సరిహద్దు ప్రాంతాల నుంచి కూడా భక్తులు తరలివచ్చారు.

విమ్స్ బ్లడ్‌బ్యాంకు తరలింపు

బళ్లారి రూరల్ : విమ్స్ బ్లడ్‌బ్యాంకులో ఆదివారం సంభవించిన అగ్నిప్రమాదంతో విభాగంలోని రక్తాన్ని శుద్ధి చేసే యంత్రాలు, రిఫ్రిజిరేటర్లు, వివిధ పరికరాలు కాలిపోయాయి. అయితే ఏయే యంత్రాలు కాలిపోయి పని చేయడం లేదో ఇంజినీరు వచ్చి పరిశీలించిన తెలుస్తుందని అధికారులు తెలిపారు. మంటలు చెలరేగిన గదిలో రక్తాన్ని ప్లేట్‌లెట్స్, ఆర్‌బీసీ, డబ్ల్యూబీసీ, ప్లాస్మాలుగా విభజించే యంత్రం, రక్తాన్ని నిల్వ చేసే యంత్రాలున్నాయి. అయితే ఎంతమేరకు నష్టం వాటిల్లిందో అధికారులు స్పష్టం చేయడం లేదు. ప్రస్తుతం ఈ విభాగంలో సేవలు తాత్కాలికంగా నిలిచిపోయాయి. కాగా బ్లడ్‌బ్యాంకును వేరే చోటకు తరలించే యోచనలో ఉన్నట్లు విమ్స్ డైరెక్టర్ డాక్టర్ గంగాధరగౌడ తెలిపారు.

ఎన్నికలు జరిపించండి

బళ్లారిఅర్బన్: జిల్లా లారీ అసోసియేషన్‌కు ఎన్నికలు జరపాలని ఆ అసోసియేషన్ సభ్యులు సోమవారం జనతా బజార్‌లో ఎన్నికల అధికారి మారెప్పకు, జిల్లా ఎస్పీ రంజిత్‌కుమార్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సభ్యులు భాస్కర్‌రెడ్డి, ఎంఎస్‌టీ మెహబూబ్‌బాష, ప్రవీణ్, చల్లా రమేష్, శ్రీకాంత్‌రెడ్డి, లోకేష్, ఎం.వెంకటేష్, సురేంద్ర తదితర సభ్యులు మాట్లాడుతూ లారీ అసోసియేషన్ ఎన్నికలు గత మూడేళ్లుగా నిర్వహించలేదన్నారు. ఇటీవల అధ్యక్ష, గౌరవ అధ్యక్షులు తదితరులు రాజీనామా చేసినందున సంఘం బైలా నిబంధనల ప్రకారం ఎన్నికలు జరిపించేలా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీని కలిసి కోరినట్లు తెలిపారు.

బీఆర్ఎస్ పోటీ చేయదు

రాయచూరు రూరల్: వచ్చే కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పోటీ చేయడం లేదని నారాయణపేట్ ఎమ్మెల్యే ఎస్.రాజేంద్రరెడ్డి వెల్లడించారు. ఆయన సోమవారం నగరంలోని నవోదయ క్యాంపస్‌లో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ, కర్ణాటక సరిహద్దుల్లోని నియోజకవర్గాల్లో జేడీఎస్ పార్టీకి మద్దతు ఇస్తామన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో మాత్రమే రాష్ట్ర సరిహద్దు జిల్లాల్లో బీఆర్ఎస్ తరఫున పోటీకి దిగేందుకు సిద్ధమవుతామని అన్నారు.

ఏనుగుల సమస్యపై నిరసన

దొడ్డబళ్లాపురం: తరచూ గ్రామాల వైపు వచ్చి పంటపొలాలను ధ్వంసం చేస్తున్న అడవి ఏనుగుల నుంచి రక్షణ కల్పించాలని గ్రామస్తులు రాస్తారోకో చేశారు. కనకపుర తాలూకా శ్రీనివాసనహళ్లి గ్రామం చుట్టుపక్కల ఇటీవల అడవి ఏనుగుల బెడద ఎక్కువయింది. ఆదివారం రాత్రి కూడా అడవి ఏనుగుల గుంపు గ్రామంలోకి ప్రవేశించి విధ్వంసం సృష్టించింది. ఆగ్రహించిన గ్రామస్తున్న సోమవారం ఉదయం కనకపుర-కోడిహళ్లి రహదారిపై బైటాయించి నిరసన తెలిపారు. అడవి ఏనుగుల వల్ల తాము ఎంతో నష్టపోతున్నామని, గ్రామాల్లో నివసించలేకపోతున్నామని వాపోయారు. ఏనుగులను అరికట్టాలని ఎన్నిసార్లు విన్నవించుకున్నా అటవీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ధర్నా కారణంగా కొన్ని గంటలపాటు వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు సర్దిచెప్పి రాస్తారోకోను విరమింపచేశారు.

నాణ్యతగా మరమ్మతులు చేయండి

రాయచూరు రూరల్: నగరంలోని రంగమందిరం మరమ్మతు పనులు నాణ్యతగా చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే పాపారెడ్డి వెల్లడించారు. ఆయన సోమవారం పాత్రికేయుల భవనంలో విలేకరులతో మాట్లాడారు. త్వరలో రూ.2.5 కోట్లతో మరోసారి నవీకరణకు శ్రీకారం చుడుతున్నందున నిధులు దుర్వినియోగం కాకుండా, పనులు నాసిరకంగా చేపట్టకుండా జిల్లాధికారి పనులను పపర్యవేక్షించాలని కోరారు. ఈసందర్భంగా జేడీఎస్ జిల్లాధ్యక్షుడు విరుపాక్షి, కరవే జిల్లాధ్యక్షుడు అశోక్ కుమార్ జైన్, అల్తాఫ్‌లున్నారు.

చెరువులో మునిగి ఫోటోగ్రాఫర్ మృతి



ప్రసన్నభట్

దొడ్డబళ్లాపురం: శివమొగ్గ ఎంపీ బీవై రాఘవేంద్ర వద్ద ఫోటోగ్రాఫర్‌గా పనిచేస్తున్న వ్యక్తి రామనగర వద్ద చెరువులో పడి మృతి చెందాడు. మృతుడు ప్రసన్నభట్ (28). ఆదివారం కొత్త ఏడాది వేడుకలను జరుపుకోవాలని రామనగర వద్ద ఉన్న మావత్తూరు చెరువు వద్దకు మిత్రులతో కలిసి వచ్చాడు. చెరువులో ఈతకొట్టడానికి దిగి నీటిలో మునిగి మృతి చెందాడు. రాత్రికి మృతదేహాన్ని వెలికితీశారు. గత కొన్నేళ్లుగా ప్రసన్నభట్ బీవై రాఘవేంద్రకు ఫోటోగ్రాఫర్‌గా పనిచేస్తూ సోషల్ మీడియాలో ఆయనకు మద్దతుగా పోస్టులు పెట్టేవాడు. యడియూరప్ప కుటుంబానికి ప్రసన్నభట్ దగ్గరగా ఉండేవాడు. కనకపుర గ్రామీణ పోలీసులు కేసు నమోదుచేసుకున్నారు.

భక్తిశ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి



రాయచూరులో స్వామివారికి పూజ చేస్తున్న అర్చకులు



గోమాతకు బెల్లం తినిపిస్తున్న రాజేంద్రరెడ్డి



స్వామి వారి దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు

- వేంకటేశ్వర ఆలయాల వద్ద బారులు తీరిన భక్తులు
- ఉదయం నుంచి రాత్రి వరకు కిటకిటలాడిన క్యూలు

సాక్షి,బళ్లారి: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని నగరంలోని వేంకటేశ్వర స్వామి ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు, అలంకరణలు చేశారు. కూల్ కార్నర్ సమీపంలోని వేంకటేశ్వర ఆలయంలో సోమవారం తెల్లవారు జాము నుంచే భక్తులు బారులు తీరి స్వామివారి దర్శనం చేసుకున్నారు. రామేశ్వరనగర్‌లో వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భక్తుల తాకిడితో ఆయా ఆలయాల వద్ద ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీరాములు, ఎమ్మెల్యే గాలి సోమశేఖరరెడ్డి, మాజీ ఎంపీ జే.శాంత తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.

రూపనగుడిలో..

తాలూకాలోని రూపనగుడిలో వెలసిన పురాతన వేంకటేశ్వర స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మాజీ బుడా అధ్యక్షుడు నారా ప్రతాప్‌రెడ్డి, ఆయన సతీమణి నారా శైలజారెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తిరుపతి లడ్డూను, అన్నప్రసాదాలను పంపిణీ చేశారు. స్వామివారిని వేలాది మంది భక్తులు బారులు తీరి దర్శించుకున్నారు. సమీప గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి స్వామిని దర్శనం చేసుకున్నారు.

బళ్లారిఅర్బన్: వైకుంఠ ఏకాదశి సందర్భంగా పటేల్ నగర్ లక్ష్మీ వేంకటేశ్వర ఆలయంలో అర్చకులు శ్రీనివాస్ ఆచారి, అధ్యక్షులు సోమప్ప, జయం వెంకట్ సమక్షంలో వైకుంఠ ఏకాదశి పూజలు జరిపి ప్రసాద వితరణ నిర్వహించారు. సంగనకల్లులోని లక్ష్మీ వేంకటేశ్వర దేవస్థానంలో గోవిందరాజులు నేతృత్వంలో, నాగలకెరెలోని వీరాంజనేయ స్వామి ఆలయంలో, సిటీ కార్పొరేషన్ వెనుక గల వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఏకాదశి పూజలు జరుపుకున్నారు.

రాయచూరులో..

రాయచూరు రూరల్: నగరంలోని నవోదయ క్యాంపస్‌లో వెలసిన వేంకటేశ్వరాలయంలో ఘనంగా వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు జరిగాయి. ఆలయంలో సోమవారం స్వామి వారి విగ్రహానికి అభిషేకం, ప్రత్యేక పూజలను నారాయణపేట్ ఎమ్మెల్యే, నవోదయ వైద్య కళాశాల ట్రస్టీ ఎస్.రాజేంద్రరెడ్డి, కుటుంబ సభ్యులు నెరవేర్చారు. గోమాతకు పూజలు జరిపి స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. తెల్లవారు జాము నుంచి భక్తులు దర్శనానికి బారులు తీరారు.


శ్రీమన్నారాయణకు ప్రత్యేక పూజలు

కంప్లి: వైకుంఠ ఏకాదశి సందర్భంగా సోమవారం సత్యనారాయణ పేటె వద్ద వేంకటరమణ ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీమన్నారాయణ మఠం పరమానంద నారాయణ విద్యాభారతి గురువులు, సేవా ధర్మదర్శులు వైష్ణవి కృష్ణమూర్తి, సవితా శశిధర్, భగవతి ప్రసాద్, ఆంధ్ర ప్రాంత వాసులైన మేస్త్రి వెంకటేశులు, కౌన్సిలర్ టీవీ.సుదర్శన్‌రెడ్డి ప్రసాద సేవలు అందించారు.

ఘనంగా ముక్కోటి ఏకాదశి

గంగావతి రూరల్: నగరంలోని జయనగర్‌లోని సత్యనారాయణ ఆలయంలో సోమవారం ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని పలు ధార్మిక కార్యక్రమాలతో పాటు స్వామివారికి ఆలయం ఉత్తర ద్వార దర్శనం అత్యంత పుణ్యప్రదంగా భావించి భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు వాదిరాజ్ ఆచారి కాల్‌మింగి ప్రత్యేక పూజలు చేశారు.

హోసపేటె: నగరంలోని అమరావతిలో వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం తెల్లవారు జాము నుంచే భక్తులు క్యూలో నిలబడి స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు వైకుంఠ ఉత్తరద్వార దర్శనాన్ని కల్పించారు. ఆలయ కమిటీ అధికారులు, ఆలయ అర్చకులు విజయస్వామి, క్రాంతి స్వామి వచ్చిన భక్తులకు ఉచితంగా లడ్డూలను అందజేశారు.



బళ్లారిలో వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక అలంకరణ దృశ్యం



ఆలయం వద్ద దర్శనానికి బారులు తీరిన భక్తులు



రామేశ్వర్‌నగర్‌లో వేంకటేశ్వర స్వామికి విశేష అలంకరణ



పటేల్ నగర్‌లోని వేంకటేశ్వర స్వామికి పూలతో అలంకరణ



కంప్లిలో స్వామి వారికి పూజ నిర్వహించిన అర్చకులు



గంగావతి: దీపా అలంకరణలో వేంకటేశ్వర స్వామివారు

బూత్ విజయ అభియాన్ ప్రారంభం



జెండాను ఎగరవేస్తున్న మంత్రి శ్రీరాములు, ఎమ్మెల్యే సోమశేఖరరెడ్డి తదితరులు

సాక్షి,బళ్లారి: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని విజయ తీరాలకు చేర్చేందుకు ఆ పార్టీ నేతలు వినూత్నంగా బూత్ కమిటీ అధ్యక్షులు, పలువురు కార్యకర్తల ఇళ్లపై పార్టీ జెండాను ఎగరవేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సోమవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీ.శ్రీరాములు, ఎమ్మెల్యే గాలి సోమశేఖరరెడ్డి నేతృత్వంలో 34వ వార్డు దేవినగర్‌లోని బూత్ సంఖ్య-55 పరిధిలో బూత్ అధ్యక్షుడు దేవిప్రసాద్ ఇంటిపై పార్టీ జెండా ఎగరవేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో బీజేపీని మళ్లీ అధికారంలోకి తెచ్చేందుకు పార్టీ నాయకుల ఆదేశాల మేరకు ఈనెల 12 వరకు నగరంలోని ప్రతి బూత్‌లో ఇంటింటికీ వెళ్లి పార్టీ జెండాను ఎగరవేస్తామన్నారు. ఈసందర్భంగా మాజీ ఎంపీ జే.శాంత, జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు వీరశేఖరరెడ్డి, మాజీ బుడా అధ్యక్షుడు పాలన్న, కార్పొరేటర్ మోత్కర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాంతీయ పార్టీల ప్రభావం ఉండదు

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీల ప్రభావం ఏమాత్రం ఉండబోదని, జేడీఎస్ అయినా, కొత్తగా ఆవిర్భవించిన కేఆర్‌పీపీ వల్ల అయినా బీజేపీకి ఎలాంటి నష్టం ఉండదని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి బీ.శ్రీరాములు పేర్కొన్నారు. ఆయన సోమవారం నగరంలో విలేకరులతో మాట్లాడుతూ తన స్నేహితుడు గాలి జనార్దనరెడ్డి పేరు ఉచ్చరించకుండా పరోక్షంగా ప్రాంతీయ పార్టీల ప్రభావం ఉండదన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే గాలి సోమశేఖరరెడ్డి, మాజీ ఎంపీ శాంత, జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు వీరశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా ఎమ్మెల్యే ప్రచారం

గంగావతి: నగరంలో బూత్‌ల వారీగా ఎన్నికల ప్రచారానికి సోమవారం ఎమ్మెల్యే పరణ్ణ మునవళ్లి శ్రీకారం చుట్టారు. 28వ వార్డులోని 108వ బూత్ ఏరియాలో, హొసహళ్లి గ్రామంలో ఇంటింటికీ ఎమ్మెల్యే వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన తమ పార్టీ కార్యకర్తలు, అభిమానులు ఇళ్లపై పార్టీ పతాకాన్ని ఎగరవేశారు. పార్టీ కౌన్సిలర్లు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

పార్టీ అభివృద్ధికి కార్యకర్తలు కృషి చేయాలి



మాట్లాడుతున్న మంత్రి ఆనంద్‌సింగ్

హొసపేటె: పార్టీ అభివృద్ధికి కార్యకర్తలు నిరంతరంగా కృషి చేయాలని మంత్రి ఆనంద్‌సింగ్ తెలిపారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో పార్టీని మరింత అభివృద్ధి చేసేందుకు కార్యకర్తలు నిరంతరంగా సైనికుల్లా పని చేయాలని కోరారు. కార్యకర్తలు పార్టీ అభివృద్ధికి పునాదులన్నారు. వార్డు, బూత్‌స్థాయి నుంచి గ్రామీణ విభాగం వరకు పార్టీని బలపరచాలని తెలిపారు. ఈ సందర్భంగా వివిధ వార్డుల కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బూత్ విజయ అభియాన్ షురూ

కంప్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సాధనలను ప్రజలకు తెలపడంతో పాటు తిరిగి మరో సారి బీజేపీని అధికారంలోకి తేవాలని పార్టీ ఇన్‌చార్జి, ప్రముఖులు సింగనాళ విరుపాక్షప్ప తెలిపారు. ఆయన సోమవారం బీజేపీ బూత్ విజయ అభియాన్‌ను ప్రారంభించి ప్రతి ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిసి బీజేపీ సాధనలను వివరించడంతో పాటు వారి సమస్యలు ఆలకించి పరిష్కరించే దిశగా అడుగు ముందుకేశారు. అనంతరం క్షేత్ర అధ్యక్షులు అళ్లళ్లి వీరేష్ మాట్లాడుతూ బూత్ అధ్యక్షులు బీఎల్‌ఓలను ఎంపిక చేసి కార్యకర్తల ఇళ్లపై పార్టీ జెండాను ఎగరవేసి ప్రజలకు పార్టీ సాధనలను వివరిస్తామన్నారు. బీజేపీ జిల్లా కార్యదర్శి హుడేద్ సురేష్, ప్రముఖులు పీ.బ్రహ్మయ్య, ఎస్.పురుషోత్తం, బీ.సిద్దప్ప, కొడిదల రాజు, జీ.రామణ్ణ, శ్రీధర్ శెట్టి, డాక్టర్ వెంకటేష్ బర్మక్కనవర్, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఓమ్ని డ్రైవర్ మృతి



ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సు



ప్రమాదంలో నుజ్జయిన ఓమ్ని కారు

హొసపేటె: వేగంగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఓమ్ని కారును ఢీకొనడంతో కారు డ్రైవర్ మృతి చెందిన ఘటన విజయనగర జిల్లా హరపనహళ్లి తాలూకా హరిహర క్యాంపు ఆదిబసవేశ్వర దేవస్థానం వద్ద సోమవారం జరిగింది. హరపనహళ్లి పోలీసులు తెలిపిన మేరకు వివరాలు..శివమొగ్గ జిల్లా సొరబ తాలూకాకు చెందిన మహేష్(47) తన ఓమ్ని కారులో హరపనహళ్లిలో జరిగే గొర్రెల సంతకు బయలుదేరాడు. మార్గమధ్యంలో తెల్లవారు జామున హొసపేటె నుంచి మైసూరు వెళుతున్న బస్సు డ్రైవర్ జగదీశ్ మరో వాహనాన్ని ఓవర్‌టేక్ చేస్తుండగా అదుపు తప్పి ఎదురుగా వచ్చిన ఓమ్ని కారును ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఓమ్ని డ్రైవర్ మహేష్‌కు తలకు తీవ్ర గాయాలు కావడంతో పాటు రెండు కాళ్లు తెగిపోయాయి. తీవ్రగాయాలతో రక్తస్రావమై డ్రైవర్ మహేష్ స్థలంలోనే మృతి చెందాడని పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో బస్సు డ్రైవర్ జగదీశ్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



మురళీధర్(ఫైల్)

గంగావతి: ఓ పురుగుల మందు దుకాణం యజమాని తన దుకాణంలోనే ఆదివారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జరిగింది. జులైనగర్‌లో నివాసం ముంటున్న డీ.మురళీధర్(62) లక్షలాది రూపాయల మేర అప్పులు చేశాడు. వాటిని తీర్చలేక అప్పులిచ్చిన వారి ఒత్తిళ్ల బాధ తాళలేక తన దుకాణంలోనే ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

కారు ఢీకొని యువకుడి మృతి



హనుమంత నాయక్(ఫైల్)

గంగావతి: కారు ఢీకొని ఓ యువకుడు స్థలంలోనే మృతి చెందిన ఘటన హేమగుడ్డ వద్ద సోమవారం జరిగింది. హేమగుడ్డకు చెందిన హనుమంత నాయక్(26) పొలం పనులకు వెళ్లి తిరిగి వస్తుండగా కారు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందారు. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించి రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. మృతుని బంధువులు ఆస్పత్రికి చేరుకోగా ఎమ్మెల్యే పరణ్ణ మునవళ్లి వచ్చి వారిని పరామర్శించి సానుభూతిని తెలిపారు.

కోలారు వార్తలు...

నమో వేంకటరమణా..







కోలారు: అలంకరణలో వేంకటేశ్వరస్వామి వార్లు, ప్రత్యేక అలంకరణలో గుట్టహళ్లి వెంకటరమణస్వామి

- అంగరంగ వైభవంగా వైకుంఠ ఏకాదశి
- వైకుంఠ ద్వార దర్శనం చేసుకున్న భక్తులు

కోలారు : వైకుంఠ ఏకాదశి సందర్భంగా సోమవారం నగరంలోని వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారు జాము 4 గంటల నుంచే పెద్ద ఎత్తున స్వామి దర్శనం కోసం క్యూలో నిలుచున్నారు. వైకుంఠ ద్వారం గుండా వచ్చి స్వామి దర్శనం చేసుకుని భక్తులు తరించారు.

చిక్కతిరుపతికి పోటెత్తిన భక్తజనం

మాలూరు : రెండో తిరుపతిగా ప్రఖ్యాతి గాంచిన మాలూరు చిక్కతిరుపతి ప్రసన్న వేంకటరమణ స్వామి ఆలయంలో సోమవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు రవి నేతృత్వంలో స్వామి వారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో క్యూలో నిలబడి గోవిందనామ స్మరణ చేస్తూ దర్శనం చేసుకున్నారు.

వైకుంఠ ఏకాదశి ప్రత్యేక పూజలు

కేజీఎఫ్ : తాలూకాలోని ప్రసిద్ధ గుట్టహళ్లి బంగారు తిరుపతి వెంకటరమణస్వామి ఆలయంలో సోమవారం వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు జరిగాయి. లోక్‌సభ సభ్యుడు ఎస్.మునిస్వామి, మాజీ ఎమ్మెల్యే వై.సంపంగి, తాలూకా బీజేపీ అధ్యక్షుడు జయప్రకాష్‌నాయుడు, నాయకుడు చంద్రారెడ్డి తదితరులు స్వామి దర్శనం చేసుకున్నారు. వెంకటరమణస్వామి ఆలయం, యర్రనాగనహళ్లి వెంకటరమణ ఆలయం, దొడ్డకంబళి వేంకటేశ్వరస్వామి ఆలయం, బేతమంగల విజయేంద్ర ఆలయం, కోటిలింగేశ్వరాలయాలకు భక్తులు తరలివచ్చి స్వామివారి దర్శనం చేసుకున్నారు.

దైవారాధనతో ఒత్తిడి నుంచి విముక్తి

శ్రీనివాసపురం : ఒత్తిడి మధ్య జీవితం సాగిస్తున్న వారికి దైవారాధన, దైవ దర్శనం ద్వారా ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే కె ఆర్ రమేష్‌కుమార్ తెలిపారు. సోమవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా తాలూకాలోని రోణూరు లక్ష్మీ వెంకటరమణస్వామి ఆలయంలో స్వామిని దర్శనం చేసుకున్న అనంతరం మాట్లాడారు. తాలూకాలోని పురాణ ప్రసిద్ధ గనిబండ, తాలూకాలోని అన్ని విష్ణు ఆలయాల్లో ప్రత్యేక పూజలను నిర్వహించారు. వేల సంఖ్యలో భక్తులు ఆలయాలకు వెళ్లి స్వామివారి దర్శనం చేసుకున్నారు.

ప్రేరక్‌ల నియామకానికి డిమాండ్

మాలూరు : జిల్లాలోని అన్ని జీపీల లోకశిక్షణా కేంద్రాల్లో పని చేస్తున్న ప్రేరక్‌లను ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఆదేశాల మేరకు సి, డి గ్రూపు ఉద్యోగులుగా నియమించాలని జిల్లా సాక్షరతా ప్రేరక్‌ల క్షేమాభివృద్ధి సంఘం అధ్యక్షుడు ఆర్‌ఎస్ చంద్రశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని సర్వజ్ఞ పార్కు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, గౌరవ అధ్యక్షుడు చౌడప్ప, ఉపాధ్యక్షురాలు పద్మావతి, కార్యదర్శి వసంతమ్మ, కోశాధికారి రామచంద్రప్ప పాల్గొన్నారు.

బైరదేవరకొప్ప ఖాద్రి దర్గాకు సిద్దరామయ్య భేటీ

హుబ్లీ: హుబ్లీలోని బైరదేవరకొప్ప ఖాద్రి దర్గాను రోడ్డు విస్తరణలో భాగంగా తరలించిన సంగతి తెలిసిందే. తొలగించిన ఈ దర్గా స్థలాన్ని మాజీ సీఎం సిద్దరామయ్య సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు అంజుమన్ సంస్థ నేతలు అక్కడి పూర్తి వివరాలు వివరించారు. విజయపుర నుంచి హుబ్లీకి వచ్చిన సిద్దరామయ్య మహదాయి ఆందోళనలో పాల్గొనడానికి వెళుతూ దర్గాను సందర్శించారు. ఆయన వెంట స్థానిక కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఘన సన్మానం



ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్‌ను సన్మానిస్తున్న సభ్యులు

రాయచూరు రూరల్: నగర అభివృద్ధికి ప్రజల సహకారం అవసరమని ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్ పేర్కొన్నారు. ఆదివారం రాత్రి బైరూన్ కిల్లా 11వ వార్డులోని ప్రధాన రహదారిలో రూ.4.70 కోట్లతో సీసీ రోడ్డు, తాగునీటి ట్యాంక్‌ల నిర్మాణ పనులకు భూమిపూజ చేసి మాట్లాడారు. నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దడానికి పాటు పడతామన్నారు. ఈ సందర్భంగా నగరసభ అధ్యక్షురాలు లలిత, కౌన్సిలర్లు ప్రశాంతి, దరూరు బసవరాజ్, శశిరాజ్, పార్టీ నేతలు సతీష్, హరీష్‌లున్నారు.

బస్సు సౌకర్యం కోసం రాస్తారోకో

- రోడ్డు ప్రమాదంలో విద్యార్థిని మృతిపై నిరసన



రోడ్డుపై బైఠాయించిన విద్యార్థులు, మృతురాలు

సాక్షి,బళ్లారి: గ్రామానికి బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థిని పాఠశాలకు వెళుతూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడాన్ని నిరసిస్తూ గ్రామస్తులతో పాటు విద్యార్థులు రాస్తారోకో చేపట్టిన ఘటన సోమవారం బెళగావి జిల్లా కిత్తూరు తాలూకా నిచ్చణకిలో జరిగింది. గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని నిరసిస్తూ విద్యార్థులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. తమ గ్రామం నుంచి ప్రతి రోజు విద్యార్థులు ప్రతి రోజు కాలినడకన పారుగున ఉన్న గ్రామానికి వెళుతున్నారన్నారు. అలా వెళుతుండగా రోడ్డు ప్రమాదం సంభవించి ముగ్గురు విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయన్నారు. వీరిలో ఒక విద్యార్థిని మృతి చెందిందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థిని మృతికి ఆర్టీసీ వారే కారణమని మండిపడుతూ వాహన రాకపోకలను నిలిపివేసి ఆందోళనకు దిగారు. గ్రామం నుంచి తక్షణం బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. దీంతో ఒక విద్యార్థిని మరణించినందున అధికారులు, పాలకులు తక్షణం విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సంబంధిత అధికారులు ఆందోళనకారుల వద్దకు వచ్చి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆ మేరకు గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించకపోతే మళ్లీ పోరాటం తప్పదని హెచ్చరించారు.

మద్దతు ధర ప్రకటించరూ

రాయచూరు రూరల్: జిల్లాలో రైతులు పండించిన పత్తి, మిరప పంటలకు మద్దతు ధర ప్రకటించాలని జేడీఎస్ పార్టీ డిమాండ్ చేసింది. సోమవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివశంకర్ మాట్లాడారు. ప్రభుత్వం ఈ విషయంలో రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగునకు మద్దతు ధరలను కేటాయించాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు. అంతకు ముందు బసవేశ్వర సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాధ్యక్షుడు విరుపాక్షి, నేతలు మహంతేష్ పాటిల్, తిమ్మారెడ్డి, నరసింహ నాయక్, లక్ష్మీపతిలున్నారు.

ప్రజాసేవకులను ఎన్నుకోండి



తాగునీటి క్యాన్‌లను అందిస్తున్న దృశ్యం

మాలూరు : ప్రజల సమస్యల పై స్పందించే నాయకులను ఎన్నుకొని సమాజ సేవకు అవకాశం కల్పించాలని బీజేపీ నాయకుడు హూడి విజయకుమార్ విన్నవించారు. సోమవారం పుర గ్రామంలో గ్రామస్తులకు ఉచిత తాగునీటి క్యాన్‌లను అందించి ఆయన మాట్లాడారు. గత నాలుగున్నరేళ్లుగా తాలూకాలో ప్రతి గ్రామంలోను సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నానన్నారు. ప్రజలు ఆశీర్వదించి గెలిపిస్తే మరింత ఉత్సాహంగా సేవా కార్యక్రమాలను కొనసాగిస్తానన్నారు. బీజేపీ ప్రముఖులు ప్రభాకర్, నోటవె వెంకటేష్ గౌడ, పురసభ రామమూర్తి పాల్గొన్నారు.

అభివృద్ధిలో పూర్తి నిర్లక్ష్యం



బీజేపీలోకి చేరిన కార్యకర్తలు

కోలారు : కాంగ్రెస్, జేడీఎస్‌ల హయాంలో నియోజకవర్గాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని మాజీ మంత్రి, బీజేపీ నాయకుడు వర్తూరు ప్రకాష్ ఆరోపించారు. సోమవారం రాత్రి తాలూకాలోని సీతి హోసూరు గ్రామంలో జేడీఎస్, కాంగ్రెస్‌ల నుంచి పలువురు కార్యకర్తలు బీజేపీలో చేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ, జేడీఎస్ ఎమ్మెల్యేలు నియోజకవర్గ అభివృద్ధికి చేసిందేమీ లేదన్నారు. కాంగ్రెస్‌లో నాయకత్వ లోపం ఉండడం వల్ల సిద్దరామయ్యను కోలారులో పోటీ చేయించాలని చూస్తున్నారన్నారు. బెగ్లి ప్రకాష్, జెడ్పీ మాజీ సభ్యుడు అరుణ్ ప్రసాద్, బంక్ మంజునాథ్ పాల్గొన్నారు.

కేఆర్‌పీపీలో చేరిక

గంగావతి రూరల్: గాలి జనార్దనరెడ్డి స్థాపించిన కళ్యాణ రాజ్య ప్రగతి పార్టీ(కేఆర్‌పీపీ)కి జైకొట్టి సోమవారం బెంగళూరులో గాలి జనార్దనరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ నాయకులు, మాజీ సీఎం సిద్దరామయ్య అనుచరుడు హనుమంతప్ప అరసినకేరితో పాటు చిక్కబెణకల్ బెట్టప్ప, నూరుద్దీన్ ఖాద్రి, సయ్యద్ అలీ తదితరులు ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.

క్లుప్తంగా

మద్యం మత్తులో కొండపై నుంచి పడి ..


మృతిచెందిన రామకృష్ణ (ఫైల్)

దొడ్డబళ్లాపురం: మద్యం మత్తులో కొండమీద నుంచి జారిపడి యువకుడు మృతి చెందిన ఘటన నెలమంగల తాలూకా దాబస్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని శివగంగ కొండమీద చోటుచేసుకుంది. తుమకూరు జిల్లా గుబ్బి తాలూకా బీరమారనహళ్లికి చెందిన రామకృష్ణ (29) మృతి చెందిన యువకుడు. కొత్త సంవత్సరం నేపథ్యంలో స్నేహితులతో కలిసి కొండకు వచ్చిన రామకృష్ణ పీకలదాకా మద్యం తాగాడు. తరువాత కొండ దిగే క్రమంలో మెట్ల దారిలో దిగకుండా బండరాళ్ల మీద ఎగురుకుంటూ దిగడానికి ప్రయత్నించాడు. మత్తులో బండరాయి మీద నుంచి కాలుజారి కిందపడి మృతి చెందాడు. రామకృష్ణతో పాటు ఉన్న మరో యువకుడు కూడా కిందపడి గాయపడ్డాడు. దాబస్‌పేట పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

నాటక ప్రదర్శనపై పోలీసులకు ఫిర్యాదు

మైసూరు: మైసూరు నగరంలో రంగాయనలో నిర్వహించిన సాంబశివ ప్రవాసం అనే నాటకం ద్వారా మాజీ సీఎం సిద్దరామయ్య, కేపీసీసీ అధ్యక్షుడు డి.కే. శివకుమార్‌లు కించపరుస్తు నాటకంలో చూపించారని ఆరోపిస్తు కర్ణాటక ప్రదేశ్ కురుబర సంఘం అధ్యక్షుడు బీ సుబ్రమణ్యం మైసూరు నగరంలోని జయలక్ష్మీపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. చంద్రశేఖర కంబార సాంబశివ ప్రవాసన నాటకాన్ని కార్తీక్ దర్శకత్వంలో ప్రదర్శించారు. ఈ నాటకంలో భాగ్యాలను ఇస్తూ సిద్దరామయ్యను, డీకే శివకుమార్‌ను కేడీ అంకుల్ అంటూ వ్యంగ్యంగా చూపుతూ కించపరిచారని ఆరోపిస్తూ 18 మందిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మహిళకు రూ. 2 లక్షల టోకరా

మైసూరు: కంపెనీలో డబ్బులు పెడితే తక్కువ వ్యవధిలోనే రెట్టింపు ఇస్తామని మహిళను నమ్మించి సుమారు రూ.2.04 లక్షలు తీసుకుని మోసం చేసిన ఘటన మైసూరు నగరంలో చోటుచేసుకుంది. నగరంలోని లష్కర్ మొహల్లాలోని మహ్మద్ సేఠ్ బ్లాక్‌లో నివాసం ఉంటున్న సుమైయా అఫ్రీన్ అనే మహిళ డబ్బులు పోగొట్టుకున్న బాధితురాలు. బాధిత మహిళ మొబైల్‌కు వచ్చిన లింక్ చూడగా అందులో ఓ కంపెనీ పేరు సూచిస్తూ పెట్టుబడి పెడితో మనం పెట్టినదానికంటే రెట్టింపు నగదు వస్తుందని చెప్పడంతో సుమైయా విడతల వారీగా రూ. 2.4 లక్షల మేర పెట్టుబడి పెట్టారు. నగదు పంపించినా ఎటువంటి సమాచారం రాకపోవడం, ఫోన్ స్విచాఫ్ రావడంతో మోసపోయినట్లు గుర్తించి సెస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కారు బుగ్గి, ప్రాణాలతో బయటపడిన యువకులు

మైసూరు: రోడ్డుపై ఎండపెట్టిన గడ్డి కారణంగా ఓ కారు దగ్ధమైన ఘటన చామరాజనగర జిల్లాలో చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఏడుగురు యువకులు ప్రాణాలతో బయటపడ్డారు. వివరాలు... కేరళ రిజిస్ట్రేషన్‌కు చెందిన కారులో ఏడుగురు యువకులు హొన్నెగౌడనహళ్లి–గోపాళపుర గ్రామాల మధ్య వస్తుండగా రోడ్డుపై ఎండబెట్టిన గడ్డి కారుకు చిక్కుకుంది. రాపిడి ఏర్పడి మంటలు వచ్చాయి. విషయం గుర్తించిన యువకులు వెంటనే కారును ఆపి కిందకు దిగేశారు. కొన్ని క్షణాల్లో కారు మొత్తం కాలి బూడిదైంది. ఫైర్ సిబ్బంది వచ్చేలోపే కారు మొత్తం కాలిపోయింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

బన్నేరుఘట్ట కిటకిట

- రికార్డు స్థాయిలో ఆదాయం



బొమ్మనహళ్లి: బెంగళూరు దక్షిణ పరిధిలో ప్రసిద్ధి చెందిన బన్నేరుఘట్ట ఉద్యానవనానికి కొత్త సంవత్సరం సందర్భంగా ఆదివారం రికార్డు స్థాయిలో పర్యాటకులు వచ్చారు. జనవరి 1న ఆదివారం కూడా కలిసి రావడంతో ఆ ఒక్కరోజే 30,381 మంది పర్యాటకులు వచ్చారు. దీంతో ఒక్కరోజే రూ. 54 లక్షలకు పైగా ఆదాయం వచ్చిందని ఉద్యాన అధికారులు తెలిపారు. గడచిన వారం రోజులుగా అధిక సంఖ్యలో పర్యాటకులు వస్తారని గుర్తించిన అధికారులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు.

మేల్‌మరవత్తూరుకు తరలిన భక్తులు


బస్సు వద్ద పూజలు చేస్తున్న దృశ్యం

శిడ్లఘట్ట: శిడ్లఘట్ట తాలూకా హిరెబల్ల గ్రామానికి చెందిన 50 మందికి పైగా భక్తులు మేల్‌మరవత్తూరు ఆలయానికి తరలివెళ్లారు. ఓం శక్తి మాల ధరించిన భక్తుల కోసం ఏబీడీ ట్రస్ట్ ఆధ్వర్యంలో బస్సు సౌకర్యంతో పాటు ఉచిత ఆహారం, సౌకర్యం కల్పించారు. సోమవారం ట్రస్ట్ అధ్యక్షుడు రాజీవ్‌గౌడ, ఆయన భార్య సహాన భక్తులను సాగనంపారు.

వైకుంఠ ఏకాదశి.. పరవశించిన భక్తకోటి

- ఉత్తర ద్వార దర్శనంతో కిక్కిరిసిన ఆలయాలు
- మారుమోగిన గోవింద నామస్మరణలు


ప్రత్యేక అలంకరణలో వసంతవల్లభరాయస్వామి మూలవిరాట్


ఆలయంలోని వైకుంఠద్వారంలో ప్రవేశిస్తున్న కాంగ్రెస్‌నేత ఆర్‌కే.రమేశ్, పురటాశి వెంకటేశ్


బొమ్మనహళ్లి అగరలో వైకుంఠ ద్వారంలో భక్తులకు దర్శనం ఇస్తున్న స్వామివారు

బనశంకరి: వైకుంఠ ఏకాదశి సందర్భంగా వైష్ణవ ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనం చేసుకుని భక్తకోటి పరవశించింది. సోమవారం తెల్లవారుజాము నుంచే భక్తుల కోలాహలం మొదలైంది. నగరంలోని చారిత్రక నేపథ్యం కలిగిన వసంతపుర వసంత వల్లభరాయస్వామి దేవస్థానంలో భక్తులు పోటెత్తారు. ఆలయ ప్రధాన అర్చకులు రఘురామబట్టర్ నేతృత్వంలో వసంత వల్లభుడికి ప్రత్యేక అలంకరణ, అభిషేకం, పూజలు చేశారు. తెల్లవారుజామున 4 గంటల నుంచి భక్తులకు స్వామివారి దర్శన భాగ్యం కల్పించారు. వైకుంఠ ద్వారంలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. బెంగళూరు దక్షిణ కాంగ్రెస్ నేత ఆర్‌కే.రమేశ్, పురటాశి వెంకటేశ్ తదితరులు వసంతవల్లభుడిని దర్శించుకున్నారు.

బొమ్మనహళ్లి: బెంగళూరు బొమ్మనహళ్లి పరిధిలో ఉన్న పలు వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో సందడి నెలకొంది. హెచ్‌ఎస్‌ఆర్ లేఔట్ వార్డు అగరలో ప్రసిద్ధి చెందిన లక్ష్మీ వేంకటేశ్వర స్వామి సన్నిధి భక్తులతో కిటకిటలాడింది. గోవింద నామస్మరణ మారుమోగింది. అర్చకులు చంద్రమౌళి స్వామివారికి విశేష అలంకరణ, పూజలు చేశారు.

ప్రజలందరూ సంతోషంగా ఉండాలి..

బొమ్మనహళ్లి: ఈ కొత్త సంవత్సరంలో ప్రజలందరూ సంతోషంగా ఉండాలని ఆ దేవదేవున్ని కోరుకున్నానని బొమ్మనహళ్లి ఎమ్మెల్యే ఎం.సతీష్ రెడ్డి అన్నారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆయన బొమ్మనహళ్లిఅరికెరె వార్డులోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ఉత్తర ద్వారంలో స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కరోనా లాంటి వైరస్‌లు రాకుండా పూజలు చేసినట్లు చెప్పారు. ఎమ్మెల్యే వెంట మాజీ కార్పొరేటర్ భాగ్యలక్ష్మీ మురళి, బీజేపీ నాయకుడు మురళీధర్ తదితరులు వైకుంఠ ఏకాదశి పూజల్లో పాల్గొన్నారు.

ఆలంబగిరిలో...

చింతామణి: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని తాలూకాలోని ఆలంబగిరి గ్రామంలో వెలసిన కల్కి శ్రీ లక్ష్మీవెంకటరమణస్వామి ఆలయంలో శ్రీదేవి భూదేవి సమేత వెంకట రమణస్వామి ఉత్సవ మూర్తికి వేణుగోపాలస్వామి అలంకారం చేశారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. కైవార యోగినారయణ మఠం ధర్మాధికారి జయరాం దంపతులు గోపూజ చేసి కార్యక్రమాలను ప్రారంభించారు.

మైసూరుకు వైకుంఠ శోభ

మైసూరు: వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని రాచనగరి మైసూరులో సోమవారం తెల్లవారుజాము నుంచే శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు బారులు తీరారు. ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. మైసూరు నగరంలో మళలవాడిలోని వేంకటేశ్వర స్వామి ఆలయం, జయనగరలోని ఇస్కాన్ ఆలయం, విజయనగరలోని యోగ నరసింహ ఆలయాలకు భక్తులు భారీగా తరలివచ్చారు.


చింతామణి ఆలంబగిరిలో గోపూజ దృశ్యం


మైసూరులో ఉత్తర ద్వార దర్శనంలో వస్తున్న భక్తులు.


ఉత్తరద్వారంలో వస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి

ఆ శిల్పాలు ఎంతో అపురూపం


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

గౌరిబిదనూరు: అమరశిల్పి జక్కణాచారి చెక్కిన శిల్పాలు నేటికీ ఎంతో అబ్బురపరుస్తాయని ఎమ్మెల్యే శివశంకరరెడ్డి తెలిపారు. సోమవారం తాలూకా కార్యాలయం సభాభవనంలో అమరశిల్పి జక్కణాచారి జయంతి కార్యక్రమాలను ప్రారంభించి మాట్లాడారు. జక్కణ్ణ శిల్పాలను మనం బేలూరు, హళెబీడులలోని దేవాలయాల్లో చూడవచ్చని, అటువంటి మహనీయుని జయంతి ఆచరించడం ఎంతో సంతోషకరంగా ఉందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, కమిషనర్ గీత తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్, కండక్టర్ నిజాయితీ


మహిళకు గొలుసు అందజేస్తున్న దృశ్యం

యశవంతపుర: ఓ మహిళ బస్సులో పోగొట్టుకున్న బంగారు చైన్‌ను తిరిగి ఆమెకు అప్పగించి కండక్టర్, డ్రైవర్ తమ నిజాయితీని చాటుకున్నారు. ఈ ఘటన దక్షిణకన్నడ జిల్లా ఉళ్లాల పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. తస్లీమా అనే మహిళ ఆదివారం మంగళూరు నుంచి ఉళ్లాలకు బస్‌లో బయలుదేరింది. ఆమె దిగిపోయే సమయంలో మెడలో ఉన్న 18 గ్రాముల బంగారు చైన్ ఆమె కూర్చున్న చోటే జారిపోయింది. ఇది గమనించని ఆమె వెళ్లిపోయింది. డ్రైవర్ నిసార్ అహ్మద్, కండక్టర్ ఇబ్రహీం బంగారు చైన్‌ను గుర్తించి బస్సు యజమానికి అందజేశారు. సోమవారం ఆయన ఉళ్లాల పోలీసులకు అప్పగించారు. అప్పటికే తస్లీమా నగ పోయిన విషయంపై ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ శివకుమార్ బాధితురాలిని స్టేషన్‌కు పిలిపించి నగ అందజేశారు. పలువురు కండక్టర్, డ్రైవర్ నిజాయితీని ప్రశంసించారు.

నమో వేంకటేశాయ

- తుమకూరులో ఆలయాలు కిటకిట


ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి


ఉత్తర ద్వారం గుండా వస్తున్న భక్తులు


శ్రీవారిని దర్శించుకుంటున్న దృశ్యం

తుమకూరు: వైకుంఠ ఏకాదశి సందర్భంగా తుమకూరు నగరంలో దేవాలయాలు భక్తులతో రద్దీగా మారాయి. వెంకటేశ్వర స్వామి వారి ఆలయాల్లో తెల్లవారుజామునుంచే ఉత్తర ద్వారం ద్వారా స్వామివారి దర్శనాలు ఆరంభమయ్యాయి. బటవాడి వెంకటేశ్వర స్వామి గుడి, జయనగరలోని రింగ్ రోడ్డులో తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామి దేవాలయం, సరస్వతీపురంలో ఉన్న వెంకటేశ్వర స్వామి దేవాలయం తదితర దేవస్థానాల్లో వేలాదిగా భక్తులు తరలివచ్చి శ్రీదేవి, భూదేవి సహిత వైకుంఠవాసునికి పూజలు చేశారు.

శివాజీనగరలో గెలిస్తే అధికారమే: సీఎం


అభియాన్‌ను ప్రారంభిస్తున్న సీఎం బొమ్మై

శివాజీనగర: బెంగళూరులో కేంద్ర బిందువుగా ఉన్న శివాజీనగరలో బీజేపీ గెలుపు అసాధ్యం కాదని, ఇక్కడ పార్టీ బలోపేతానికి, అభివృద్ధి పనులకు పెద్దపీట వేసినట్లు సీఎం బొమ్మై చెప్పారు. శివాజీనగరలో గెలిస్తే రాష్ట్రంలో వందకు వందశాతం బీజేపీ విజయం సాధిస్తుందన్నారు. అందుచేత ఈ నియోజకవర్గంలో కార్యకర్తలు శ్రమించాలని సూచించారు. సోమవారం వసంతనగరలో రాజపుత్ భవన్‌లో శివాజీనగర నియోజకవర్గ బూత్ విజయ అభియాన్‌ను ప్రారంభించి మాట్లాడారు. ఒకప్పుడు శివాజీనగర బీజేపీ నియోజకవర్గమే. మునుముందు కూడా తప్పకుండా తాము గెలుపొందుతామని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో తాము చేసిన కార్యాల జాబితా ఇస్తాం, దానిని ప్రజలకు తెలియజేయాలన్నారు. కాంగ్రెస్‌వారికి చెప్పుకొనేందుకు వేరే ఏమి లేవన్నారు. కార్యక్రమంలో ఎంపీ పీసీ మోహన్‌తో పాటు స్థానిక బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఏకాదశి



విజయపుర (బెంగళూరు గ్రామీణ): వైకుంఠ ఏకాదశి కావడంతో పట్టణంలో ఉన్న దేవాలయాల్లో పెద్దసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. చెన్నకేశవ స్వామి ఆలయం, బలిజ పేటలో ఉన్న వెంటకట రమణస్వామి ఆలయంలో ఉత్తర ద్వారం గుండా భక్తులు స్వామిని దర్శించుకున్నారు

ప్రాణాలు తీసిన కాలువ పనులు

- బైక్ పడి యువకుడు మృతి


గజేంద్ర

శిడ్లఘట: శిడ్లఘట్ట పట్టణంలో కొత్త సంవత్సరం వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్న యువకుడు కొంతసేపటికే ప్రాణాలు కోల్పోయాడు. శిడ్లఘట్టలో బైక్ మెకానిక్‌గా పనిచేసే గజేంద్ర (28) ఆదివారం స్నేహితులతో కొత్త ఏడాది సంబరాలు చేసుకున్నాడు. రాత్రి బైక్‌పై ఇంటికి బయల్దేరాడు. గార్డెన్ రోడ్డులో గత 10 రోజుల నుంచి 10 అడుగుల లోతు తవ్వి రాజకాలువ పనులు చేస్తున్నారు. దానికి ఎలాంటి అడ్డుగోడ కూడా కట్టలేదు. చీకట్లో గజేంద్ర గుంతలోకి దూసుకెళ్లాడు. తలకు, ఎదలో తీవ్ర గాయాలు తగలడంతో మృత్యువాత పడ్డాడు. పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

జాతీయ స్థాయికి ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

చింతామణి: తాలూకాలోని కైవార క్రాస్‌లో వున్న శ్రీ భైరవేశ్వర విద్యాసంస్థకు చెందిన విద్యార్థులు మూడబిదరిలో నిర్వహించిన లాంగ్ జంప్ పోటీలో గెలుపొంది జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. దీంతో పాఠశాల యాజమాన్యం విద్యార్థులను ఘనంగా సన్మానించింది. పాఠశాల వ్యవస్థాపకులు సుబ్బారెడ్డి మాట్లాడుతూ జాతీయ స్థాయిలో గెలుపొంది మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

హోసూరు వార్తలు..

ప్రభుత్వ టీచర్‌కు అవార్డు



హోసూరు: హోసూరు తాలూకా ముగలూరు ప్రభుత్వ మాధ్యమిక పాఠశాల ఉపాధ్యాయిని గీత ఉత్తమ విద్యాబోధనకు గాను అవార్డును అందుకున్నారు. నూతన విద్యా వైజ్ఞానిక నైపుణ్యాలను విద్యార్థులకు సులభ పద్ధతిలో అర్థమయ్యేలా ఆమె బోధిస్తారు. యుఎస్‌ఏ ఇన్నోవేటివ్ టీచర్స్ ఆఫ్ ద ఇయర్ అవార్డ్‌ను ఢిల్లీలో ఆమెకు ప్రదానం చేశారు.

దారి విషయమై ఉద్రిక్తత


కాలనీకి దారి ఏర్పాటుపై సర్వే చేస్తున్న అధికారులు

కెలమంగలం: డెంకణీకోట తాలూకా కెలమంగలం సమీపంలోని బోడిచిపల్లి కాలనీ సమస్య పరిష్కరించాలని కాలనీవాసులు సోమవారం ఆందోళన చేపట్టారు. బోడిచిపల్లి గ్రామంలోని కాలనీకి వెళ్లే మార్గంలో గ్రామస్థులు ఇళ్లు కట్టుకున్నారు. కాలనీకి వాహనాలు వెళ్లేందుకు కూడా దారి లేకపోవడంతో గత కొద్ది రోజులుగా ఆందోళనలు నిర్వహిస్తున్నారు. సోమవారం దారికి అడ్డుగా ఉన్న ఇళ్లను తొలగించేందుకు పోలీసులతో కలిసి రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. దీంతో తాము ఇళ్లు కోల్పోతామని కొందరు బాధితులు శరీరంపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేయడంతో ఉద్రిక్తత నెలకొంది. హోసూరు సబ్‌కలెక్టర్ శరణ్య వచ్చి అధికారులతో చర్చించి కాలనీవాసులకు వేరే ప్రాంతంలో దారి ఏర్పాటు చేయాలని సూచించి వెళ్లిపోయారు. దీంతో ఆవేశానికి గురైన కాలనీవాసులు సబ్‌కలెక్టర్ తమతో చర్చించలేదని కెలమంగలం- ఉద్దనపల్లి రోడ్డుపై బైఠాయించారు.

బైకిస్టు దుర్మరణం


నుజ్జునుజ్జయిన బస్సు

దొడ్డబళ్లాపురం: బైక్, బస్సు ముఖాముఖి ఢీకొన్న ప్రమాదంలో బైకిస్టు మృతి చెందిన సంఘటన చెన్నపట్టణ తాలూకా పోలీస్ ట్రైనింగ్ స్కూల్ వద్ద చోటుచేసుకుంది. చెన్నపట్టణ తాలూకా తడికవాగులు గ్రామం నివాసి శివస్వామి (51) మృతి చెందిన వ్యక్తి. శివస్వామి బైక్‌పై వెళ్తుండగా పోలీస్ ట్రైనింగ్ స్కూల్ వద్ద చెన్నపట్టణ నుంచి రామనగర వెళ్తున్న బస్సు ఎదురుగా వచ్చి ఢీకొంది. ప్రమాదంలో శివస్వామి అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్‌ను ఢీకొన్న వేగంలోనే బస్సు డివైడర్‌ను ఢీకొని ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. చెన్నపట్టణ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి పూజలు


అంకుశగిరి కొత్తూరు తిమ్మరాయస్వామి మూలవిరాట్

హోసూరు, కెలమంగలం, క్రిష్ణగిరి: వైకుంఠ ఏకాదశి సందర్భంగా సోమవారం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో విశేష పూజలు జరిగాయి. హోసూరు పట్టణంలో ప్రసిద్ధి పొందిన శ్రీ ప్రసన్నవెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారిని విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. హోసూరు, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున ఆలయానికి చేరుకొని స్వర్గవాకిలి ద్వారా ప్రవేశించి స్వామివారిని దర్శించుకున్నారు. సూళగిరి తాలూకా గోపసంద్రం వద్ద దక్షిణ తిరుపతిగా పేరుగాంచిన శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉదయం 5 గంటల నుంచి విశేష అలంకరణ, అభిషేకం తదితర పూజా కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. డెంకణీకోటలో బేటరాయ స్వామి ఆలయంలో వేకువజాము నుంచి పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. భక్తులకు తీర్థప్రసాద వినియోగం, అన్నదాన కార్యక్రమాలు జరిగాయి.

బైక్ ప్రమాదంలో వలస కూలీ మృతి

హోసూరు: రెండు బైకులు నేరుగా ఢీకొన్న ప్రమాదంలో అసోం వలస కూలీ మృతి చెందిన సంఘటన సిఫ్‌కాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. అసోంవాసి నోమల్ దిమారి (29) బంధువులతో కలిసి హోసూరు ప్రాంతంలో నివాసముంటూ ప్రైవేట్ పరిశ్రమలో కార్మికునిగా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి మహమ్మద్ ఇస్మాయిల్‌తో కలిసి హోసూరు- బెంగళూరు హైవేపై బైక్ మీద వెళ్తుండగా ఎదురుగా వచ్చిన మరో ద్విచక్రవాహనం ఢీకొంది. నోమల్‌దిమారి తీవ్ర గాయాలతో అక్కడే మృతి చెందాడు. సిఫ్‌కాట్ పోలీసులు కేసు నమోదు చేశారు.

85 మంది వాహనదారులపై కేసులు

నిబంధనలు పాటించక వాహనాలు నడిపిన 85 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఆదివారం రాత్రి హోసూరు ప్రాంతంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. హెల్మెట్లు ధరించకపోవడం, రాంగ్‌రూట్, సెల్‌ఫోన్లో మాట్లాడుతూ నడపడం, అతివేగం, లైసెన్స్ లేకపోవడం తదితర అంశాలపై 85 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు.

మహిళను కిడ్నాప్ చేసి రూ.లక్ష వసూలు

హోసూరు: మహిళతో పాటు ముగ్గురిని కిడ్నాప్ చేసి రూ. 5 కోట్లు డిమాండ్ చేస్తూ రూ. లక్ష లాక్కొని పరారైన 7 మంది నిందితుల కోసం సూళగిరి పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు. వివరాల మేరకు జిల్లా కేంద్రం క్రిష్ణగిరి ఇందిరానగర్ ప్రాంతానికి చెందిన ప్రకాష్ భార్య అనురాధ(36) బెంగళూరు వద్ద హొసకోట ప్రాంతంలో కిరాణా దుకాణం నిర్వహిస్తోంది. ఆదివారం దుకాణంలో పనిచేసే ఇద్దరు కూలీలతో కలిసి కారులో క్రిష్ణగిరివైపు వెళ్తుండగా హోసూరు- క్రిష్ణగిరి జాతీయ రహదారి సూళగిరి సమీపంలోని ఏ.శెట్టిపల్లి వద్ద ఓ కారులో వచ్చిన ఏడుగురు దుండగులు అనురాధ కారును అడ్డగించి ముగ్గురినీ కిడ్నాప్ చేశారు. రూ. 5 కోట్లు అందజేస్తే వదిలేస్తామని బెదరిస్తూ సేలం వరకు తీసుకెళ్లారు. అనురాధ తన బ్యాంకు ఖాతాలో ఉన్న రూ. లక్షను వారికి ఇవ్వగా ముగ్గురినీ వదిలేసి పరారయ్యారు. ఈ ఘటనపై బాధితురాలు సూళగిరి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని కిడ్నాపర్ల కోసం గాలిస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి హత్య

విజయపుర (బెంగళూరు గ్రామీణ): విజయపుర పరిధిలోని బుళ్ళహళ్ళి గేట్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం సోమవారం కనిపించింది. 40 ఏళ్ల వయసున్న వ్యక్తిని హత్య చేసి, ముఖాన్ని గుర్తు పట్టకుండా కొడవలితో నరికివేశారు. డీసీపీ నాగ రాజు, సీఐ వీరేంద్ర పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చీరల పంపిణీ

శిడ్లఘట్ట: శిడ్లఘట్ట తాలూకా జంగమకోటెలో గ్రామ దేవత ముత్యాలమ్మ ఆలయంలో కొత్త సంవత్సరం వేడుకలను పురస్కరించుకుని సోమవారం అమ్మవారి సన్నిధిలో సహనగౌడ పేద మహిళలకు ఉచితంగా చీరల పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొచిముల్ మాజీ అధ్యక్షుడు కే.గుడియప్ప, ఆనంద్, బంగారప్ప, రవిగవడ తదితరులు పాల్గొన్నారు.

జక్కణాచారిని స్మరించుకోవాలి

చిక్కబళ్లాపురం: హొయసల రాజుల నాటి శిల్పి జక్కణాచారిని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని రాష్ట్ర ఖాదీ గ్రామోద్యోగ మండలి అధ్యక్షుడు కేవీ నాగరాజు అన్నారు. సోమవారం నగరంలోని అంబేడ్కర్ భవనంలో అమరశిల్పి జక్కణాచారి సంస్మరణ దినోత్సవాన్ని ప్రారంభించి మాట్లాడారు. మన దేశంలోని అనేక ఆలయాల్లో జక్కణాచారి తీర్చిదిద్దిన శిల్పాలు నేటికీ ప్రత్యేకమన్నారు. బేళూరు, హళిబేడులో శిల్పాలు జక్కణ్ణ కళావిజ్ఞతకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో నగరసభ అధ్యక్షుడు ఆనందరెడ్డి బాబు, బీఎంటీసీ ఉపాధ్యక్షుడు కేవీ నవీన్ కిరణ్, సముదాయ ప్రముఖులు బ్రహ్మచారి, నాగరాజాచారి, సుబ్రమణ్యాచారి తదితరులు పాల్గొన్నారు.

బనశంకరీదేవి సన్నిధిలో హోమాలు


భక్తులు నిమ్మకాయల ప్రమిదలతో దీపారాధన చేశారు.

బనశంకరి: బనశంకరీదేవి జాతర మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. పుష్య శుద్ధ ఏకాదశి సోమవారం వేకువజామున సుప్రభాతసేవ అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు ఆర్.సత్యనారాయణశాస్త్రి, చంద్రమోహన్ ఆధ్వర్యంలో అమ్మవారి మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకరణ, పూజలు చేశారు. అనంతరం యాగశాలలో శ్రీలక్ష్మీనారాయణ హృదయ హోమ శ్రీధన్వంతరి హోమం చేపట్టి మధ్యాహ్నం పూర్ణాహుతి నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి సమితి అధ్యక్షుడు ఏహెచ్.బసవరాజ్, కమిటీ సభ్యులు హరిబాబు, ఈట కే.పద్మ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తెలంగాణ

'పాలమూరు-రంగారెడ్డి'పై విచారణ వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సుప్రీంకోర్టు వాయిదా వేసింది. ఈ పిటిషన్ సోమవారం జస్టిస్ అబ్దుల్ నజీర్, జస్టిస్ హిమా కోహ్లిలతో కూడిన ధర్మాసనం ముందుకొచ్చింది. తెలంగాణ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది దుష్యంత్ దవే వాదనలు వినిపిస్తూ.. ప్రజల కోసం నిర్మించే ఈ ప్రాజెక్టు వేలాదిమందిపై ప్రభావం చూపుతుందన్నారు. ఈ ప్రాజెక్టుపై పదేపదే పిటిషన్లు దాఖలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ పిటిషన్‌లో పిటిషనర్ వాదనలు వినాల్సి ఉందని జస్టిస్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. మరి కొంత సమాచారం అందించడానికి అనుమతించాలని నాగం తరఫు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ కోర్టును కోరారు. అనుమతించిన ధర్మాసనం విచారణ రెండు వారాలకు వాయిదా వేసింది.

మద్యం కుంభకోణం నిందితులకు రిమాండు పొడిగింపు

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో నిందితులకు రౌజ్ అవెన్యూ కోర్టు జ్యూడీషియల్ రిమాండు పొడిగించింది. అభిషేక్ బోయినపల్లి, బినోయ్‌బాబు, విజయ్ నాయర్, శరత్‌చంద్రారెడ్డిల రిమాండు ముగియడంతో ఈడీ అధికారులు సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీరిని ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎంకే నాగపాల్ ముందు హాజరు పరిచారు. కేసు దర్యాప్తు వేగవంతం అవుతోందని మరికొన్ని రోజులు నిందితులకు రిమాండు పొడిగించాలని ఈడీ తరఫు సీనియర్ న్యాయవాది నవీన్‌కుమార్ కోరారు. కేసు పురోగతి వివరిస్తూ ఈ నెల 5 అనుబంధ ఛార్జిషీటు దాఖలు చేయనున్నట్లు వివరించారు. ఈడీ విజ్ఞప్తిని పరిగణించిన న్యాయమూర్తి నిందితులకు జనవరి 6 వరకూ జ్యుడీషియల్ రిమాండు పొడిగించారు. తదుపరి విచారణ జనవరి 7కు వాయిదా వేశారు.

మహిళా వర్సిటీలో నేటినుంచి యువజనోత్సవాలు


మాట్లాడుతున్న మహిళా వర్సిటీ వీసీ దువ్వూరి జమున

తిరుచానూరు (తిరుపతి జిల్లా): శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీలో మంగళవారం నుంచి ఈ నెల 7వ తేదీ వరకు 'పద్మతరంగ్' పేరుతో 36వ యువజనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు వైస్‌చాన్సలర్ దువ్వూరి జమున తెలిపారు. ఆమె సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ 2018లో విజయవంతంగా యువజనోత్సవాలు నిర్వహించామని, అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ సూచన మేరకు ఈ ఏడాది ఉత్సవాలను కూడా తామే నిర్వహిస్తున్నామని చెప్పారు. యువజనోత్సవాలకు దక్షిణ భారతదేశం నుంచి వివిధ బృందాలు హాజరవుతాయని తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం 3.30 గంటలకు చేపట్టే ర్యాలీలో వివిధ యూనివర్సిటీల విద్యార్థులు వివిధ థీమ్స్, వేషధారణలతో ప్రదర్శనగా పాల్గొంటారని తెలిపారు. అనంతరం వర్సిటీలోని ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో ప్రారంభ సభ ఉంటుందని చెప్పారు. ఈ ఉత్సవాలకు హాజరయ్యే బృందాలకు మహిళలు, పురుషులకు వేర్వేరుగా వసతి సదుపాయం కల్పించామన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సాంస్కృతిక శాఖ మంత్రి ఆర్‌కే రోజా, గౌరవ అతిథిగా ఎంపీ ఎం.గురుమూర్తి హాజరవుతారని తెలిపారు. శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి, న్యూఢిల్లీ ఏజేయూ సహాయ కార్యదర్శి డాక్టర్ బలిజిత్‌సింగ్ శేఖర్, విశిష్ట అతిథిగా గాయని ఎస్పీ శైలజ హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశంలో చీఫ్ కో- ఆర్డినేటర్స్ ప్రొఫెసర్ కె.అనూరాధ, ప్రొఫెసర్ టి.త్రిపురసుందరి, ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ఎస్ శైలేశ్వరి పాల్గొన్నారు.

నకిలీ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల గుట్టురట్టు

- విజయవాడ వాసి అరెస్ట్
- ఇప్పటివరకు 15కుపైగా డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్!

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): నకిలీ డాక్యుమెంట్ల గుట్టురట్టు చేశారు డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు. విశాఖలో ఒక భూమికి సంబంధించిన రిజిస్ట్రేషన్‌లో జరిగిన అవకతవకలపై ఫిర్యాదులు అందగా.. రంగంలోకి దిగిన డీఆర్ఐ అధికారులు విజయవాడ నగరానికి చెందిన టి.రాజ్‌చైతన్య అనే వ్యక్తి తప్పుడు ధ్రువపత్రాలతో రిజిస్ట్రేషన్లు చేస్తున్నట్టు గుర్తించారు. ఒక దస్తావేజు ఆధారంగా విజయవాడ నగరంలోని గాంధీనగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రికార్డులు పరిశీలించగా.. ఇప్పటివరకు రాజ్‌చైతన్య 15కు పైగా డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్లు చేసినట్టు గుర్తించారు. వీటిలో తనఖా, సేల్, మార్టిగేజ్ డాక్యుమెంట్లు ఉన్నాయని అధికారులు గుర్తించారు. వంగవీటి మోహన్‌రంగా హత్యానంతర పరిణామాల్లో కార్యాలయాల్లో రికార్డులు కాలిపోయాయి. దానిని ఆసరాగా తీసుకున్న రాజ్‌చైతన్య నకిలీ ధ్రువపత్రాలు, సబ్ రిజిస్ట్రార్ల స్టాంపులు తయారు చేసి రిజిస్ట్రేషన్లు చేస్తున్నట్టు అధికారులు నిర్ధారణకు వచ్చారు. అతని మొబైల్ ఫోన్ బ్యాకప్ ఆధారంగా డీఆర్ఐ అధికారులు లోతుగా కూపీ లాగుతున్నారు.

ఒకడేనా.. ముఠా ఏమైనా ఉందా?

రాజ్‌చైతన్య ఒకడే ఇలా చేస్తున్నాడా లేక అతడి వెనుక ఏదైనా ముఠా ఉందా?, ఏయే రిజిస్ట్రార్ కార్యాలయాల్లో డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ చేయించారు వంటి విషయాలను సేకరిస్తున్నారు. నున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోని అంబాపురంలో భూములు రిజిస్ట్రేషన్ చేసినట్టు సమాచారం. అయితే, విశాఖపట్నం నుంచి సమాచారం వచ్చిన వెంటనే అప్రమత్తమైన గాంధీనగర్ సబ్‌రిజిస్ట్రార్లు చాకచక్యంగా వ్యవహరించారు. సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వచ్చిన అతనిని గుర్తించి డీఆర్ఐ అధికారులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న అధికారులు రాజ్‌చైతన్యను అదుపులోకి తీసుకోవడంతో నకిలీ డాక్యుమెంట్ల వ్యవహారం గుట్టు రట్టయింది. నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్లు చేస్తున్న వ్యక్తిపై సబ్‌రిజిస్ట్రార్లు గవర్నర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతున్న కేంద్రం

కేరళ న్యాయశాఖ మంత్రి రాజీవ్ విమర్శ



సాక్షి, భీమవరం: 'ఒకే మతం-ఒకే భాష' పేరుతో కేంద్ర ప్రభుత్వం ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతోందని కేరళ రాష్ట్ర న్యాయ, పరిశ్రమల శాఖ మంత్రి పి.రాజీవ్ విమర్శించారు. సీఐటీయూ రాష్ట్ర 16వ మహాసభలు సోమవారం పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాజీవ్ మాట్లాడుతూ దేశ ప్రజలపై బలవంతంగా హిందీ భాషను రుద్దాలని బీజేపీ ప్రభుత్వం చూస్తోందన్నారు. బీజేపీ ప్రజాతంత్ర వేషధారణలో ఆర్ఎస్ఎస్ విధానాలను అమలుచేస్తూ మొత్తం ప్రజానీకానికి ప్రమాదకరంగా మారిందన్నారు. రాజ్యాంగానికి సైతం కేంద్రం తూట్లు పొడుస్తోందన్నారు. కేరళ రాష్ట్ర పాలన యావత్ భారతదేశానికి ఆదర్శమని అన్నారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఏ గఫూర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టేందుకు ఏప్రిల్‌లో కార్మిక, కర్షక మహా కార్యక్రమం చేపడతామని చెప్పారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ నర్సింగరావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్, ఎమ్మెల్సీలు షేక్ సాబ్జీ, ఇళ్ల వెంకటేశ్వరరావు, సీఐటీయూ జాతీయ ఉపాధ్యక్షులు కె.సాయిబాబా, కె.లక్ష్మయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.బేబీరాణి,ఉమా మహేశ్వరరావు పాల్గొన్నారు.

బంగారు 'బట్టమేక' గుట్టు చిక్కింది

క్రూర జంతువుల దృష్టిని మరల్చటంలో బట్టమేక పక్షులు బహుతెలివైనవి. గుడ్లను, పిల్లలను కాపాడుకోవటానికి ఆడ పక్షులు వంకర టింకరగా.. ఒక రకమైన నాట్యం చేస్తాయి. ప్రపంచవ్యాప్తంగా బట్టమేక పక్షుల్లో 22 రకాల జాతులు ఉండగా.. భారత్‌లోని బంగారు బట్టమేక పక్షులు అత్యంత అరుదైనవి. వీటిలోనూ నాలుగు జాతులు ఉండగా.. ఏపీలో సంచరించే బంగారు బట్టమేక పక్షులే అతి పెద్దవి.. బలిష్టమైనవి. ఈ పక్షులు అవకాశవాద భక్షులు. అంటే తాము నివసించే ప్రాంతంలో ఏవి దొరికితే వాటిని తిని బతికేస్తాయి. అయినా.. వీటి మనుగడకు అనువైన పరిస్థితులు లేక అతి త్వరగా అంతరించిపోతున్న పక్షుల జాబితాలో చేరాయి.



దేశంలో ఎగిరే పక్షుల్లో ఇవే అతి పెద్దవి.. ప్రపంచంలో రెండో భారీ పక్షులు ఇవే

- రాష్ట్రంలో 180 పక్షులు ఉన్నట్టు గుర్తింపు
- కర్నూలు, నంద్యాల జిల్లాల్లో సంచరిస్తున్న అరుదైన పక్షులు
- వీటి కోసం రోళ్లపాడు, సుంకేశుల సమీపంలో సంరక్షణ కేంద్రాలు



అంతరించిపోతున్న జీవులుగా..

అంతరించిపోతున్న బంగారు బట్టమేక (గ్రేట్ ఇండియన్ బస్టర్డ్) పక్షుల పరిరక్షణ కోసం 1988లో నంద్యాల జిల్లా నందికొట్కూరు సమీపంలోని రోళ్లపాడు వద్ద బట్టమేక పక్షుల సంరక్షణ కోసం 600 హెక్టార్ల భూమిని అభయారణ్యంగా ప్రకటించారు. అదేవిధంగా కర్నూలు జిల్లా సుంకేశుల జలాశయం సమీపంలోనూ మరో 800 ఎకరాల భూమిని కేటాయించారు. ఇక్కడే బట్ట మేక పక్షులు సంచరిస్తుంటాయి. ఇవి తీవ్రంగా అంతరించిపోతున్న జాబితాలో ఉన్నాయి. మన రాష్ట్రంలో కేవలం 180 పక్షులు మాత్రమే ఉన్నట్టు గుర్తించారు.

సాక్షి, అమరావతి: పొడవాటి తెల్లటి మెడ, బంగారు లేదా గోధుమ వర్ణంలో వీపు, మెడలో తెలుపు-నలుపు ఈకల హారం, తలపై నల్లని టోపీతో బట్టమేక పక్షులు ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తాయి. ప్రపంచంలోనే అరుదైన బట్టమేక (గ్రేట్ ఇండియన్ బస్టర్డ్) పక్షులు మన రాష్ట్రంలో 180 వరకూ ఉన్నట్టు గుర్తించారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఇవి సంచరిస్తుంటాయి. బట్టమేక పక్షులు ఏపీతోపాటు రాజస్థాన్, గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లోనూ ఇవి సంచరిస్తుంటాయి. సుమారు మీటరు పొడవు, 14 నుంచి 15 కేజీల బరువు ఉంటాయి. ఏపీలో సంచరించే బట్టమేక జాతి పక్షులే వీటన్నింటిలోనూ పెద్దవి, బలిష్టమైనవి కూడా. ఎగిరే పక్షుల్లో దేశంలో మొదటి, ప్రపంచంలో రెండవ అతి భారీ పక్షులివి. గడ్డి భూముల్లో సంచరించే ఈ పక్షులు 1 లేదా 2 సంవత్సరాలకు ఒకసారి గుడ్లుపెట్టి.. 25-30 రోజులపాటు పొదుగుతాయి. తమకు సమీపంలో ఎలాంటి ఆహారం లభ్యమైనా తిని జీర్ణించుకోగలవు. సాధారణంగా ఇవి కీటకాలు, తొండలు, బల్లులు, చిన్నపాటి పాములు, పండ్లను తిని జీవిస్తాయి. మగ పక్షుల కంటే ఆడ పక్షులు చిన్నవిగా ఉంటాయి. ఇవి సుమారు 75 సెంటీమీటర్ల పొడవు, 4-6 కేజీల బరువు ఉంటాయి. ఆడ పక్షులు ఊదా రంగు తల, మెడతో ఉంటాయి. వీటి రొమ్ముపై పట్టీ ప్రస్ఫుటంగా కనిపించదు.

పర్యావరణ వ్యవస్థలో ఇవి కీలకం

అభయారణ్యానికి సమీపంలోని గడ్డి భూములు పంట పొలాలుగా మారడంతో ఈ పక్షుల ఆవాస ప్రాంతాలు తగ్గిపోయాయి. పురుగు మందుల వాడకంతో బట్టమేక పక్షుల ఆహారమైన కీటకాలు విషతుల్యమవడం, నక్కలు ఇతర జంతువులు వాటి గుడ్లు, పిల్లలను తినడం వంటి కారణాలు ఈ పక్షుల ఉనికికి తీవ్ర ప్రతిబంధకాలుగా మారాయి. పర్యావరణంలో ముఖ్య భూమిక పోషించే గడ్డి భూముల పరిస్థితిని బట్టమేక పక్షుల ఉనికి తెలుపుతోంది. ఈ పక్షుల సంచారం బాగుందంటే గడ్డి భూముల పర్యావరణం బాగున్నట్టు లెక్క. అందుకే పర్యావరణ వ్యవస్థలో కీలకమైన వాటిని సంరక్షించుకోవాల్సిన అవసరం ఉంది. ప్రకృతి ప్రసాదించిన ఈ అరుదైన పక్షులను అంతరించిపోకుండా కాపాడుకోవడం అందరి బాధ్యత. ప్రకృతిని కబళిస్తున్న పురుగు మందులు, ఎరువులను తగ్గించి సేంద్రియ వ్యవసాయ పద్ధతులు పాటించాలి. తద్వారా మన పరిసరాలు, ప్రకృతిని కాపాడుకుని భావితరాలకి బంగారు బట్టమేకని బహుమతిగా అందిద్దాం.

– డాక్టర్ సీఎం సంతోష్‌కుమార్, స్కూల్ ఆఫ్ బయో సైన్సెస్, యూనివర్సిటీ ఆఫ్ బర్మింగ్‌హామ్, యూకే (నేటివ్ ఆఫ్ నంద్యాల)


నగరంలోని ఓ హోటల్లో బిర్యానీ వడ్డిస్తూ..

పనులపై వచ్చేవారు రుచికరమైన భోజనం కోసం వాచిపోయేవారు. సాయంత్రం దాటితే మంచి టిఫిన్ దొరకడం కూడా గగనమే.. ఇదీ ఒకప్పుడు శ్రీకాకుళంలో పరిస్థితి. ఇక పట్టణవాసులైతే జిహ్వ చాపల్యం తీర్చుకునేందుకు వారాంతాల్లో విశాఖకు తరలివెళ్లేవారు. కానీ ఇప్పుడు రోజులు మారాయి. సిక్కోలు ఆహారప్రియులకు మంచి రోజులు వచ్చాయి. వారి జిహ్వ చాపల్యాన్ని తీర్చే కొత్త రుచులు అందుబాటులోకి వచ్చాయి. మెట్రో నగరాలకు తీసిపోని రెస్టారెంట్ కల్చర్ శ్రీకాకుళం నగరంలో అభివృద్ధి చెందుతోంది. జిల్లాలోని పలు ప్రాంతాల ప్రజలను సరికొత్త రుచులతో చవులూరిస్తోంది. తన వద్దకు రా.. రమ్మని ఆహ్వానిస్తోంది.



RESTAURANT CULTURE

రోజులు మారాయి కొత్త రుచులొచ్చాయ్..

- సిక్కోలులో విస్తరిస్తున్న రెస్టారెంట్ కల్చర్
- వెరైటీ డిష్‌లతో భోజనప్రియులకు స్వాగతం

శ్రీకాకుళం డెస్క్

సిక్కోలులో రెస్టారెంట్ కల్చర్ రోజురోజుకీ పెరుగుతోంది. మనుషుల జీవన ప్రమాణాలు పెరగడం.. ఖర్చులకు వెనకంజ వేయకపోవడం.. కుటుంబంతో చక్కగా గడపాలనే కోరిక ఇలా కారణమేదైనప్పటికీ విభిన్న రకాల రుచులు ఆరగించేందుకు జిల్లా వాసులు మక్కువ చూపుతున్నారు. కొద్ది కాలం క్రితం వరకు సరైన భోజనం దొరికే పరిస్థితిలేని శ్రీకాకుళం నేడు రెస్టారెంట్ కల్చర్‌లో మెట్రో నగరాలకు దీటుగా పోటీపడుతోంది. రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రముఖ రెస్టారెంట్లు తమ బ్రాంచ్‌లను శ్రీకాకుళంలో ఏర్పాటు చేస్తున్నాయి. వాటికి ఆదరణ బాగానే ఉండడంతో మరిన్ని ఏర్పాటుకు వ్యాపారులు ఈ రంగంపై దృష్టి సారించారు.


తగ్గిన దూరం.. రుచుల హారం..

వారాంతం వచ్చిందంటే చాలు విందారగించేందుకు టెక్కలి, నరసన్నపేట, శ్రీకాకుళం తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు, ఇతర వర్గాల ప్రజలు విశాఖలో వాలిపోయేవారు. సాయంత్రం వరకు అక్కడే ఎంజాయ్ చేసి ఇంటి బాట పట్టేవారు. ఇప్పుడా పరిస్థితి మారింది. అన్ని రకాల డిష్‌లు శ్రీకాకుళం నగరంలోనే లభ్యమవుతుండడంతో తమకు దూరాభారం తగ్గిందని.. మంచి ఆహారం ఇక్కడే లభ్యమవుతోందని ఫుడ్‌లవర్స్ చెబుతున్నారు. అందుకే వీకెండ్ వచ్చిందంటే చాలు నగరంలో రెస్టారెంట్లు కిటకిటలాడుతున్నాయి. ఒక్కో రెస్టారెంట్లో అయితే టేబుల్ దొరక్క మధ్యాహ్నం 3.30 గంటల వరకు వెయిట్ చేసి మరీ తమ జిహ్వ చాపల్యాన్ని తీర్చుకుంటున్నారంటే ఇక్కడ ఫుడ్‌కు ఉన్న డిమాండ్ ఎలా ఉందో వేరే చెప్పనక్కర్లేదు.


మే ఐ సర్వ్ యూ.. : వడ్డిస్తున్న రోబో

ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి..

జిల్లాలో రెస్టారెంట్ కల్చర్ పెరగడం.. హోటళ్ల సంఖ్య ఎక్కువవుతుండడంతో ఉపాధి అవకాశాలు కూడా మెరుగవుతున్నాయి. ప్రత్యక్షంగా ఉపాధి పొందే వారితో పాటు పరోక్షంగా విభిన్న రంగాలకు చెందిన వారు ఉపాధి పొందుతున్నారు. ట్రాన్స్‌పోర్టు, కూరగాయలు, మాంసం, చేపల విక్రయదారులకు వ్యాపారం జోరుగా సాగుతోంది. మరో విషయమేమిటంటే వివిధ సంస్థల ఆధ్వర్యంలో స్వయం ఉపాధి శిక్షణలో భాగంగా హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో శిక్షణ అందిస్తున్నారు. వీరికి నగరంలోని చాలా రెస్టారెంట్లు ఉద్యోగాలను కల్పిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా హోటల్ రంగంలో 2000 మంది వరకు ఉపాధి పొందుతున్నారు. పరోక్షంగా 5 వేల మంది వరకు ఉపాధి లభిస్తోందని ఆయా రంగ ప్రముఖులు చెబుతున్నారు.



ఎడారి రుచులు.. రోబో వడ్డింపులు..

హైదరాబాద్‌లోని బార్కాస్ అనే ప్రాంతానికి మాత్రమే పరిమితమైన మండీ కల్చర్ కూడా సిక్కోలుకు వచ్చేసింది. మండీ బిర్యానీ అంటే చాలా మక్కువని స్నేహితుల గ్యాంగులు గొప్పగా చెప్పుకుంటాయి. డేరాల గదుల్లో చక్కగా మెత్తని పరుపుల మీద వృత్తాకారంలో కూర్చుని మధ్యలో పెద్ద కంచంలో బిర్యానీ కుప్పను పోసుకుని చేతికి అందిన మాంసపు ముక్కను ఆస్వాదిస్తూ కబుర్లతో కాలక్షేపమే ఈ మండీ బిర్యానీ ప్రత్యేకత. ఎడారిని తలపించేలా ఒంటెలు, అరబిక్ సంగీతం, ఒయాసిస్‌లాంటి సెట్టింగుల థీమ్‌తో రెస్టారెంట్ల కళాత్మకత ఫుడ్‌లవర్స్‌కు రుచులతో పాటు ప్రత్యేక లోకాన్ని పరిచయం చేస్తోంది. మరో కొత్త అంశం ఏమిటంటే సౌతిండియాలో ఉన్న అతికొద్ది రోబో సర్వింగ్ రెస్టారెంట్లలో ఒకటి సిక్కోలులో ఉండటమే. ఆర్డర్ నుంచి డిష్‌లు అందించడం వరకు అన్నింటినీ రోబో చకచకా చేసేయడమే ఇక్కడ ప్రత్యేకత. వీధికో థీమ్‌తో బోలెడు రెస్టారెంట్లు విందారగించేందుకు వెల్‌కమ్ చెబుతున్నాయి.


త్రెడ్డెడ్ చికెన్..

అందరికీ బిజినెస్..

రెస్టారెంట్‌లు, ఫ్రాంచైజీ హోటళ్లు ఎన్ని వెలుస్తున్నా అందరికీ వ్యాపారం బాగానే ఉందని చెబుతున్నారు హోటళ్ల నిర్వాహకులు. జిల్లా వ్యాప్తంగా చిన్నా పెద్దా హోటల్స్ 600 వరకు ఉన్నాయని, రోజుకు రూ.20 లక్షల వరకు వ్యాపారం జరుగుతున్నట్టు హోటల్‌రంగ ప్రతినిధులు చెబుతున్నారు.

ఉపాధి
ప్రత్యక్షంగా పనిచేసే వారు 2000
పరోక్షంగా.. 5000

బిజినెస్
జిల్లా వ్యాప్తంగా నెలలో జరిగే బిజినెస్ రూ. 6 కోట్లు

హాట్ ఫేవరెట్

ఆకులో చేప..
బిర్యానీ పొట్లాం..
శాకాహార మాంసం
త్రెడ్డెడ్ చికెన్..


మండీ బిర్యానీ

నగరంలో దొరికే రుచులను ఓ సారి చూస్తే ఒక్కో రెస్టారెంట్ ఒక్కో స్పెషల్ డిష్‌ను తమ కస్టమర్లకు అందిస్తోంది. ఆ స్పెషల్ డిష్‌లే వారాంతాల్లో ఎక్కువగా అమ్ముడవుతున్నాయని యజమానులు చెబుతున్నారు. పత్రానీ కా మచ్ఛీ పేరుతో అందించే అరటి ఆకులో చేప డిష్ నగరవాసుల హాట్‌ఫేవరెట్. మరో డిష్ పొట్లాం బిర్యానీ.. చికెన్, మటన్, ప్రాన్, ఎగ్ రుచుల సమాహారమే ఈ బిర్యానీ పొట్లాం. త్రెడ్డెడ్ చికెన్ పేరుతో ప్రత్యేక రుచితో ఇటీవలే ఓ డిష్ అందుబాటులోకి వచ్చింది. అలాగే శాకాహార ప్రియులకు చికెన్‌కానీ చికెన్.. మటన్ కాని మటన్‌తో 'మాంసాహారాన్ని' రుచి చూపిస్తున్నారు హోటళ్ల నిర్వాహకులు. మిల్‌మేకర్, సోయా, వెజిటబుల్ ఆయిల్, మిల్క్‌తో ఫ్యాక్టరీలో తయారయ్యే ప్లాంట్ బేస్డ్ చికెన్‌తో ఈ వంటకాన్ని సిద్ధం చేస్తున్నారు. ఇది ఇప్పుడు వెజ్ ప్రియులు 'నాన్‌వెజ్' హాట్ ఫేవరెట్ డిష్. ఈ వంటకం రుచిలో చికెన్, మటన్‌కంటే బాగా ఉంటుంది. పోషక విలువలు మెండుగా ఉంటాయని రెస్టారెంట్ నిర్వాహకులు చెబుతున్నారు.



మహిళలే అధికం..

హోటళ్లు, రెస్టారెంట్లలో అధికశాతం మంది మహిళలే సేవలందిస్తున్నారు. కస్టమర్లను పలకరించడం నుంచి వడ్డించడం వరకు వీరు ఓపికగా చేస్తుండడమే వీరికి ఆయా యాజమాన్యాలు అధిక ప్రాధాన్యమిస్తున్నాయి. భోజనం, వసతి కల్పించి మంచి జీతాన్ని అందిస్తున్నాయి.

ఉపాధి బాగుంది..



హోటల్ రంగంలో ఉపాధి అవకాశాలు విస్తతంగా ఉన్నాయి. హోటల్ మేనేజ్‌మెంట్‌లో డిప్లొమా చేశాను. ఉద్యోగం లభించింది. భోజనం, వసతి కల్పించి మంచి జీతం ఇస్తున్నారు.
–ప్రియాంక, క్యాషియర్

సూపర్ టేస్టీ..



వీకెండ్‌లో కుటుంబ సమేతంగా రెస్టారెంట్‌కు వెళ్తాం. కొత్త వెరైటీలు వివిధ హోటళ్లలో వడ్డిస్తున్నారు. ఇళ్లలో చేసుకోలేని చాలా వంటలు ఇక్కడ లభ్యమవుతున్నాయి.
– డాక్టర్ సీపీ శ్రీదేవి

ఆదరిస్తున్నారు..



హోటల్ రంగాన్ని ప్రజలు ఆదరిస్తున్నారు. భోజనప్రియుల అభిరుచులకు అనుగుణంగా ఆహారం, సౌకర్యాలను అందుబాటులోకి తీసుకొస్తున్నాం.
– జామి రాజశేఖర్, హోటల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

ప్రజారోగ్యమే ధ్యేయంగా..



మారుతున్న అభిరుచులకు తగ్గట్టుగా ఆహారం అందిస్తున్నాం. ప్రజారోగ్యమే పరమావధిగా ముందుకు వెళ్తున్నాం. అనారోగ్య కారకాలైన రంగులు, టేస్టింగ్ సాల్ట్, డాల్డా వంటివి వినియోగించడం లేదు.
– మెట్ట నాగరాజు, హోటల్స్ అసోసియేషన్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ

సాక్షి ఫ్యామిలీ
బెంగళూరు
మంగళవారం ॥ 3-1-2023

మోసం చేశాడని చేతుల్లో ముఖం దాచుకుంటే
మోసపోయానని తనను తాను హింసించుకుంటే
పోయిన కాలం తిరిగి రాదు... జీవితం కూడా.
సాంకేతికత మన పురోగతికి సాధనం మాత్రమే.
సాంకేతికత మన జీవితాన్ని నిర్దేశించే ఆయుధం కాదు.
అది ప్రశ్నించి... పరిహసించే పరిస్థితికి లోనుకావద్దు.



ముగ్గులకు ఆహ్వానం

చిరునామా
ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ,
సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ మెయిల్:
muggulu.sakshi@gmail.com
(మీ ఊరుతోపాటు కాలనీ- వీధి పేరు కూడా రాయండి)





16 చుక్కలు, 8 వరుసలు,
8 వచ్చే వరకు,
సరి చుక్క

సి. తన్మయి
హైదరాబాద్





9 చుక్కలు
9 వరుసలు

కాసర లక్ష్మీ సరోజారెడ్డి
జంగారెడ్డి గూడెం, ప.గో.జిల్లా

స్త్రీ శక్తి



● బీవోపీ-గంగ దళ సభ్యులు

ఉక్కు దళం

**ఇండియా-బంగ్లాదేశ్ సరిహద్దు ప్రాంతం...
పచ్చని అడవి... చల్లని నది
ప్రశాంతంగా కనిపిస్తాయి.
అయితే చాప కింద నీరులా సంఘవిద్రోహశక్తులు
వికటాట్టహాసం చేస్తుంటాయి.
తమకు ఎదురు లేదని
కొమ్ములు విసురుతుంటాయి.
సంఘవిద్రోహశక్తుల అక్రమ కార్యకలాపాలపై ఉక్కు
పాదం మోపడానికి 'ఓన్లీ ఉమెన్' దళం
రంగంలోకి దిగింది.**

స్త్రీ సాధికారతకు పట్టం కట్టేలా బీఎస్ఎఫ్ (బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్)లో మరో అడుగు పడింది. తాజాగా ఇండియా-బంగ్లాదేశ్ సరిహద్దుల్లో బీఎస్ఎఫ్ మహిళా జవాన్లు విధులు నిర్వహించనున్నారు.



● ధైర్యంగా దూసుకెళ్తూ...

ప్రసిద్ధ సుందర్‌బన్ అడవుల్లో కొంత భాగం మన దేశంలో, కొంత భాగం బంగ్లాదేశ్‌లో విస్తరించి ఉంది. సరిహద్దును ఆనుకొని ఉన్న అడవులు, చిన్న దీవులు, నదులు అనేవి సంఘ విద్రోహశక్తులకు అడ్డాగా మారాయి.

ఈ నేపథ్యంలో నిరంతర పర్యవేక్షణ అవసరం అయింది. దీనికోసం బీఎస్ఎఫ్ సట్లెజ్, నర్మద, కావేరి, సబర్మతి, క్రిష్ణ, గంగ పేర్లతో బీవోపి (బార్డర్ ఔట్ పోస్ట్) లను ఏర్పాటు చేసింది.

'బీవోపి'కి చెందిన 'గంగ' మహిళా జవానులు తొలిసారిగా సరిహద్దు ప్రాంతానికి సంబంధించిన నిఘా విధులలో భాగం అవుతున్నారు.

మనుషుల అక్రమ చొరబాటు, స్మగ్లింగ్ కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడంతోపాటు దొంగల నుంచి, ప్రతికూల వాతావరణ పరిస్థితుల నుంచి జాలర్లను రక్షించే బాధ్యతలు కూడా 'బీవోపి-గంగ'పై ఉన్నాయి.

స్థానిక పోలీసులు, అటవీశాఖ అధికారులు, స్థానిక ప్రజలను సమన్వయం చేసుకుంటూ అటవీ ప్రాంతాలకు నష్టం జరగకుండా చూడాల్సి ఉంటుంది.

'బీవోపి-గంగ'కు ఉపయోగించే మోటర్ బోట్‌ను కొచ్చిలో తయారు చేశారు. దీనిలో 35 మంది జవాన్‌లకు చోటు ఉంటుంది. అత్యాధునిక రాడార్, కమ్యూనికేషన్ సదుపాయాలు ఉన్నాయి.

'బీవోపీ-గంగ తన సత్తా చాటబోతోంది. పోరాట పటిమ ప్రదర్శించబోతోంది. స్మగ్లింగ్ కార్యకలాపాల్లో కొందరు స్త్రీలు కూడా భాగం అవుతున్నారు. ఇకముందు వారిని అదుపులోకి తీసుకోవడం సులభం అవుతుంది' అంటున్నారు సౌత్ బెంగాల్ ఫ్రంటియర్ బీఎస్ఎఫ్ డిఐజీ అమ్రిష్ ఆర్యా.

సోషల్‌గా మోసం జాగ్రత్త పడాల్సిందే!

'అబ్బాయిల చేతిలో అమ్మాయిలు మోసపోతున్నారు'... ఈ మాట పందొమ్మిది వందల అరవైలలో ఉండేది, ఎనభైలలోనూ ఉండేది. ఇరవై ఒకటో శతాబ్దంలోనూ వింటున్నాం. 'మోసపోతున్నది అమ్మాయిలేనా అబ్బాయిలు మోసపోవడం లేదా, మోసం చేస్తున్నది అబ్బాయిలేనా మోసం చేస్తున్న అమ్మాయిలు లేరా' అనే కౌంటర్ వాదన కూడా అప్పుడూ ఉంది, ఇప్పుడూ ఉంది... తేడా అంతా మోసపోతున్న తీరులోనే. టెక్నాలజీ విస్తృతంగా అందుబాటులోకి వచ్చింది. సద్వినియోగంతోపాటు దుర్వినియోగమూ ఎక్కువైంది. ఒకరినొకరు అర్థం చేసుకోవడంలో వేగం వచ్చింది, మోసం చేయడం సులువైంది. సోషల్ మీడియా ఇద్దరి జీవితాలను నిర్దేశించే స్థాయికి వెళ్లిందంటే... ఆ తప్పు టెక్నాలజీది కాదు, టెక్నాలజీని ఎలా ఉపయోగించుకోవాలో తెలియని మనిషిదే. అమ్మాయిలు తమకు చట్టపరమైన రక్షణ ఉందా లేదా అనే ఆలోచన లేకుండా తమకు తాముగా జీవితాన్ని అభద్రతవలయంలోకి నెట్టివేసుకుంటున్నారని చెప్పారు సీనియర్ న్యాయవాది పార్వతి.

"మా దగ్గరకు వచ్చే మహిళలనే గమనిస్తే... ఒకప్పుడు ఎక్కువ శాతం భర్త, అత్తింటి వారి నుంచి వేధింపులు, గృహహింస కారణాలతో వచ్చేవారు. ప్రేమ పేరుతో మోసం చేశాడని కూడా వచ్చేవారు. ఇప్పుడు 'కొంతకాలం లివ్ ఇన్ రిలేషన్‌షిప్‌లో ఉండి, ఇప్పుడు మొహం చాటేశాడనే కేసులు ఎక్కువయ్యాయి. ఇలాంటి కేసుల వివరాల్లోకి వెళ్తే ఆ ఇద్దరి మధ్య పరిచయానికి వేదిక సోషల్ మీడియానే అయి ఉంటోంది. ముఖాముఖి కలవడానికి ముందే ఒకరి గురించి ఒకరు అన్ని విషయాలనూ షేర్ చేసుకుని ఉంటున్నారు. సరిగ్గా ఇక్కడే అమ్మాయిలు గమనించాల్సింది, జాగ్రత్త పడాల్సిందీ. ఎందుకంటే... అబ్బాయిలు మాటల్లో పెట్టి అమ్మాయిల వివరాలన్నీ తెలుసుకుంటున్నారు, తన గురించిన వివరాలను చాలా జాగ్రత్తగా ఇస్తారు. అతడు మొహం చాటేశాక, అతడి గురించి ఈ అమ్మాయిలను ఏ వివరం అడిగినా తెల్లమొహం వేస్తారు. 'అన్ని వివరాలనూ షేర్ చేస్తున్నామని చెప్పారు కదా, అతడి గురించి నువ్వు తెలుసుకున్న దేంటి?' అని అడిగినప్పుడు అమ్మాయిలు చెప్పే వివరాల్లో అతడి అభిరుచులు, ఇష్టమైన క్రీడాకారులు, అతడు చూసిన సినిమాలు, జీవితం పట్ల అతడి ఆకాంక్షలు, చదివిన పుస్తకాలు... ఇలా ఉంటుంది జాబితా. అతడి ఉద్యోగం, చదువు, ఊరు, అమ్మానాన్నలు ఎక్కడ ఉంటారు, అక్కచెల్లెళ్లు, అన్నదమ్ముల వివరాలు... ఏమీ చెప్పలేరు. ఒకవేళ అప్పటికే పెళ్లయిన వాడా అని కూడా తెలుసుకోరు. అతడు ఫోన్ నంబర్ మార్చేస్తే ఇక ఏ రకంగానూ అతడిని ట్రేస్ చేయలేని స్థితిలో ఉంటుంది పరిస్థితి.

అమ్మాయిలు అన్నీ చెప్పేస్తారు!

అమ్మాయిలు మాత్రం తనతోపాటు ఇంట్లో అందరి ఫొటోలు షేర్ చేయడం, ఇంటి అడ్రస్, అమ్మానాన్నల పేర్లు, ఉద్యోగం, బ్యాంకు బాలెన్స్, నగలు... అన్నీ చెప్పేసి ఉంటారు.'పరిచయమైన వ్యక్తి ఫోన్ చేసి పలకరించేటప్పుడు చాలా సాధారణమైన మాట 'భోజనం చేశావా' అని అడిగితే దానిని తన మీదున్న కన్సర్న్ అని మురిసిపోతారు. తనకు సమయానికి అన్నం వండి పెట్టిన అమ్మ, తనకు అన్నీ అమర్చి పెడుతున్న నాన్న ఆ పనులన్నీ తన మీద ప్రేమతోనే చేస్తున్నారనే ఆలోచన రావడం లేదు. అతడి నుంచి 'గుడ్‌నైట్' మెసేజ్ వస్తుంది, దానికి అమ్మాయి నుంచి వెంటనే రిప్లయ్ వస్తే 'ఇంకా నిద్రపోలేదా' అని అడుగుతాడు. ఇవన్నీ చెప్పి... 'నా మీద అంత ప్రేమగా ఉండేవాడు. మా అమ్మానాన్నల కంటే ఎక్కువ ప్రేమ చూపించాడు. అందుకే ఇంటి నుంచి వెళ్లి పోయి ఇద్దరం సహజీవనంలో ఉన్నాం' అని చెబుతారు. అవతలి వ్యక్తి పెళ్లి ప్రస్తావన రానివ్వకుండా జాగ్రత్తపడిన విషయం మోసపోయిన తర్వాత కానీ అమ్మాయిలకు తెలియడం లేదు. ఈలోపు అమ్మాయి బ్యాంకు బాలెన్స్, నగలు ఖర్చయిపోయి ఉంటాయి. శ్రద్ధావాకర్ కేసులో దారుణం జరిగింది కాబట్టి సమాజం దృష్టిలోకి వస్తుంది. కానీ అలాంటి పరిస్థితి రాలేదనే మాటే కానీ మోసపోయి... న్యాయ పోరాటం చేయలేక, ఆవేదనతో మానసికంగా కృంగిపోతున్న వాళ్లు ఎందరో" అని చెప్పారు లాయర్ పార్వతి.

వంచనకు సాధనం

అబ్బాయిలు కానీ అమ్మాయిలు కానీ ప్రేమ పేరుతో వంచించడానికి సోషల్ మీడియాను సాధనంగా ఉపయోగించుకుంటున్నారు. ఒక వ్యక్తితో ముఖాముఖి మాట్లాడితే ఒకసారికి కాకపోయినా ఐదారు దఫాలు మాట్లాడిన తర్వాతకైనా ముసుగు జారిపోతుంది. ఇక ఫేస్‌బుక్, వాట్సాప్ చాటింగ్‌లో అవతలి వ్యక్తి మనోభావాలను పసిగట్టడం సాధ్యం కానే కాదు. మోసపోతున్నది అమ్మాయిలు మాత్రమే అని కాదు, మోసపోతున్న వాళ్లలో ఎక్కువ శాతం అమ్మాయిలే ఉంటున్నారు. ఒకప్పుడు కలం స్నేహాలు ఎక్కడో ఉన్న ఇద్దరు వ్యక్తులను అనుసంధానం చేసేవి. అవి పరస్పరం అభిప్రాయాలు, అభిరుచులను షేర్ చేసుకోవడానికే పరిమితమయ్యేవి. సోషల్ మీడియా స్నేహాలు జీవితాలను నిర్దేశిస్తున్నాయి, తప్పుదారిలో నడిపిస్తున్నాయంటే... ఆ తప్పు సాంకేతికతది కాదు. మెదడు ఉన్న, విచక్షణ ఉండాల్సిన మనిషిదే.

– వాకా మంజులారెడ్డి

చట్టాలున్నాయి...కానీ!



పెళ్లి చేసుకున్న మహిళకు చట్టపరంగా ఎలాంటి రక్షణ ఉందో, సహజీవనం విషయంలో కూడా అలాంటి రక్షణను కల్పించింది చట్టం. అయితే సహజీవనాన్ని నిరూపించుకోవాలి. చాలా సందర్భాల్లో నిరూపణ కష్టమవుతోంది. ఆ ఇద్దరూ ఒకే కప్పు కింద జీవించారని చుట్టుపక్కల వాళ్లు సాక్ష్యం చెప్పాలి. అలాగే ఆ ఇద్దరూ ఒకే ఇంట్లో ఉన్నట్లు సెల్‌ఫోన్ సిగ్నల్స్ వంటి సాంకేతిక ఆధారాలను చూపించవచ్చు. కానీ న్యాయస్థానం ఎలక్ట్రానిక్ ఎవిడెన్స్‌ని ప్రధాన సాక్ష్యంగా పరిగణించడం లేదు. సెకండరీ ఎవిడెన్స్‌గా మాత్రమే తీసుకుంటుంది. సహజీవనాన్ని నిరూపించలేని పరిస్థితుల్లో 'క్రిమినల్ బ్రీచ్ ఆఫ్ ట్రస్ట్, చీటింగ్' కేసులు పెట్టవచ్చు. కానీ అమ్మాయిలు, వారి తల్లిదండ్రులకు, సమాజానికి భయపడి ఈ పని చేయలేకపోతున్నారు. అమ్మాయి తల్లిదండ్రులు కూడా కేసులు పెట్టి జీవితంలో మరింత అల్లకల్లోలంలోకి వెళ్లడానికి ఇష్టపడరు. అమ్మాయిలు జాగ్రత్తగా ఉండడమే చెప్పదగిన సూచన. పుట్టిన రోజుకి ఫ్లవర్ బొకేలు పంపించినంత మాత్రాన అతడిది సంపూర్ణమైన ప్రేమ అనే భ్రమలోకి వెళ్లవద్దు.

- ఈమని పార్వతి, హైకోర్టు న్యాయవాది

సాగుబడి
ఉత్తరాషాఢ కార్తె :
జనవరి 10 వరకు

మరత్వాడాలో ముత్యాల మెరుపులు

నీటి వనరులు పరిమితంగా ఉన్న మెట్ట ప్రాంతంలోనూ మంచినీటి చెరువుల్లో ముత్యాల పెంపకంతో మంచి ఆదాయం గడించవచ్చని మహారాష్ట్రలోని మరత్వాడా రైతులు నిరూపిస్తున్నారు. ఔరంగాబాద్ పరిసర ప్రాంతాల్లో గత 10-15 ఏళ్లుగా మంచినీటిలో ముత్యాల సాగు పుంజుకుంటున్నది. కరువు ప్రాంతం అయినప్పటికీ భువనేశ్వర్‌లోని కేంద్రీయ మంచినీటి ఆక్వాకల్చర్ పరిశోధనా సంస్థ (సిఫా) శాస్త్రవేత్తల పర్యవేక్షణలో శిక్షణ పొంది ఆధునిక మెలకువలు పాటిస్తూ ముత్యాల సాగు చేస్తుండటం విశేషం. కనీసం 4,500 మంది రైతులు ముత్యాల సాగు చేస్తున్నారని ఔరంగాబాద్‌కు చెందిన ముత్యాల వ్యాపారి అరుణ్ అంబోర్ చెబుతున్నారు. మంచి ఆదాయం వస్తుండటంతో మరత్వాడా ప్రాంతంలో ముత్యాల సాగు ఏటేటా విస్తరిస్తోంది.



● ఇనుప మెష్‌లో అమర్చిన ఆల్చిప్పలు



● ఆల్చిప్పలో ముత్యం పెరిగేది ఇలా..



● మెష్‌లను ఇలా చెరువు నీటిలోకి పెడతారు

● మంచినీటి ముత్యాల పెంపకంలో దుమ్ము రేపుతున్న మరత్వాడా రైతులు

● తొలి ఏడాదే రూ.14 లక్షల నికరాదాయం పొందిన ఎఫ్.పి.ఓ.



ఎఫ్.పి.ఓ. ద్వారా సమష్టి సేద్యం

రైతు ఉత్పత్తిదారుల సంఘా(ఎఫ్.పి.ఓ.)ల ద్వారా కూడా రైతులు సమష్టిగా ముత్యాల సాగు చేపడుతున్నారు. ఒస్మానాబాద్ జిల్లా షహపూర్ గ్రామానికి చెందిన రైతు సంజయ్ పవార్ మరో 9 మంది రైతులతో కలిసి త్రివేణి పెరల్స్ అండ్ ఫిష్ ఫామ్ పేరిట ఎఫ్.పి.ఓ.ను నెలకొల్పారు. రెండేళ్ల క్రితం కరోనా కష్టాలను సైతం లెక్క చేయకుండా భువనేశ్వర్‌లో సిఫాకు వెళ్లి ముత్యాల పెంపకంలో శిక్షణ పొంది సాగు చేశారు. తొలి ఏడాదే రూ.14 లక్షల నికరాదాయం పొందారు.

సొంత పొలంలో 300 అడుగుల పొడవు, 100 అడుగుల వెడల్పు, 20 అడుగుల లోతున రూ. 8.5 లక్షల పెట్టుబడితో 2020-21లో చెరువు తవ్వారు. నీరు ఇంకిపోకుండా అడుగున పాలిథిన్ షీట్ వేశారు. ఔరంగాబాద్‌లోని ముత్యాల వ్యాపారి అరుణ్ అంబోర్ దగ్గర నుంచి 25 వేల మంచినీటి ఆల్చిప్పలను ఒక్కొక్కటి రూ. 90 చొప్పున కొనుగోలు చేశారు. 2021 జులైలో ఆల్చిప్పలను ఇనుప మెష్‌లో అమర్చి, చెరువు నీటిలో మునిగేలా తాళ్లతో లాగి గట్టుపై పోల్స్‌కు కట్టారు. చెరువులో నీరు ఆవిరైపోకుండా చెరువుపైన కూడా పాలిథిన్ షీట్ కప్పారు. చెరువు చుట్టూతా మెష్ వేశారు.

ముత్యం ధర రూ. 400

చెరువు నీటిలో నాచును ఆహారంగా తీసుకుంటూ ఆల్చిప్ప పెరుగుతుంది. నాచు పెరగడం కోసం (నెలకో వెయ్యి చొప్పున రోజుకు కొన్ని) స్పైరులినా టాబ్లెట్లను వేశారు. ఆల్చిప్పను రెండుగా చీల్చి మధ్యలోకి చిన్నపాటి నమూనాను చొప్పిస్తే.. దాని చుట్టూ కొద్దినెలల్లో తెల్లటి పదార్థం పోగుపడి.. ముత్యంగా తయారవుతుంది. లోపలికి చొప్పించేది ఏ ఆకారంలో ఉంటే ముత్యం ఆ (ఉదా.. దేవతామూర్తి/ బియ్యపు గింజ/ గుండ్రటి చిరుధాన్యం) ఆకారంలో తయారవుతుంది. 2022 సెప్టెంబర్‌లో పది వేల ముత్యాలు వచ్చాయి. ముత్యం రూ. 400కి అమ్మారు. రూ. 40 లక్షల ఆదాయం వచ్చింది. ఖర్చులు పోను తొలి ఏడాదే రూ.14 లక్షల నికరాదాయం వచ్చిందని సంజయ్ తెలిపారు. 'ముత్యాల పెంపకం మరీ కష్టమేమీ కాదు, మెలకువలను పాటిస్తే చాల'ని రైతు గోవింద్ షిండే అన్నారు.

విశాఖలో 6 నుంచి ఆర్గానిక్ మేళా

గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల - వినియోగదారుల సంఘం, రైతునేస్తం ఫౌండేషన్ తదితర సంస్థలతో కలసి, విశాఖపట్నం నగరంలో ఆర్గానిక్ ఆహారోత్పత్తుల ప్రదర్శన, అమ్మకం మేళాను ఈ నెల 6 నుంచి 9వ తేదీ వరకు బీచ్ రోడ్డు – ఎం.వి.పి. కాలనీలోని గాదిరాజు ప్యాలెస్‌లో నిర్వహించనున్నట్లు మేళా నిర్వాహకులు, భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ నాయకులు కుమారస్వామి తెలిపారు. తొలి రోజు 6(శుక్ర)న ఉ. 10 గం.కు ప్రకృతి సేద్యంపై సదస్సు జరుగుతుంది. 7(శని)న ఉ. 10 గం.కు సేంద్రియ ఇంటిపంటలు, మిద్దె తోటల సాగుపై నిపుణులు శిక్షణ ఇస్తారు. 8(ఆది)న ఉ. 10. గం.కు ఆవు పేడ, మూత్రంతో అనేక ఉత్పత్తులు తయారు చేసి ఉపాధి పొందే మార్గాలపై నిపుణులు శిక్షణ ఇస్తారు. 9(సోమ)న ఉ. 10 గం.కు 'ఆరోగ్యమే మహాభాగ్యం'పై నిపుణులు ప్రసంగిస్తారు. రైతులు, వ్యాపారులు సేంద్రియ ఉత్పత్తులను విక్రయిస్తారు. అందరూ ఆహ్వానితులే.

నల్ల తామరను జయించిన దుర్గాడ

● మిరప పంటను కాపాడిన ప్రకృతి వ్యవసాయ పద్ధతులు

● ప్రకృతి సేద్యంలో ఎకరానికి రూ. 2.6 లక్షల నికరాదాయం

● కాకినాడ జిల్లా దుర్గాడ మిరప రైతుల విజయం

మిరప పంటపై నల్ల తామరకు ప్రకృతి వ్యవసాయమే దీటుగా సమాధానం చెబుతోంది. రెండేళ్లుగా నల్ల తామర, మిరప తదితర ఉద్యాన పంటలను నాశనం చేస్తుండడంతో దీన్ని పెను విపత్తుగా ప్రభుత్వం గుర్తించింది. రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో కాకినాడ జిల్లాలోని మిరప రైతులు నల్ల తామర తదితర చీడపీడలను సమర్థవంతంగా ఎదుర్కొంటూ పంటను నిలబెట్టుకుంటున్నారు.

గొల్లప్రోలు మండలం దుర్గాడకు చెందిన పలువురు రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సస్యరక్షణ మందులను వినియోగించి నల్ల తామర ఉధృతిని కట్టడి చేస్తూ పంటలను కాపాడుకుంటున్నారు. దుర్గాడ గ్రామంలో 650 ఎకరాల్లో గుండ్రటి రకం మిరప సాగవుతుంటే, ఇందులో 180 ఎకరాలలో రైతులు ప్రకృతి సేద్య పద్ధతులు పాటిస్తున్నారు. ఈ మిరప పంట నల్ల తామర పురుగును తట్టుకుని నిలబడటం విశేషంగా చెబుతున్నారు. దుర్గాడ రకం మిర్చి విరగ పండటంతో రైతులు సంతోషంగా ఉన్నారు. అయితే, అదే గ్రామంలో ఈ పొలాలకు పక్కనే ఉన్న, రసాయనిక ఎరువులు, పురుగుమందులు వాడుతున్న రైతుల పొలాల్లో మిరప తోటలు నల్లతామర తదితర చీడపీడలతో దెబ్బతిన్నాయి. భారీ పెట్టుబడులు పెట్టి రైతులు తీవ్రంగా నష్టపోయారు.

– లక్కింశెట్టి శ్రీనివాసరావు,
సాక్షి ప్రతినిధి, కాకినాడ
ఫొటోలు:
వివివి వరప్రసాద్,
పిఠాపురం



ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన మిరప పంటలో రైతు వెలుగుల బాబ్జి



రసాయనిక వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన మిరప పంటలో రైతు ఇంటి ప్రసాద్

పకృతి వ్యవసాయంలో మిర్చి సాగు

పకృతి వ్యవసాయదారుడు	- వెలుగుల బాబ్జి
మండలం	- గొల్లప్రోలు
గ్రామం	- దుర్గాడ
సాగు చేసిన భూమి	- ఎకరం
సాగు చేసిన పంట	- మిర్చి
ఖర్చు :	
విత్తనాలు	- రూ.2,000
దుక్కి	- రూ.6,400
కలుపుతీత	- రూ.15,000
నాట్ల కూలి	- రూ.5,000
నీరు తడికి	- రూ.1,200
400 కేజీల ఘన జీవామృతం	- రూ.4,000
కషాయాల ఖర్చు	- రూ.6,000
మొత్తం ఖర్చు	- రూ.39,600
ఆదాయం	- రూ.3,00,000
నికరాదాయం	- రూ.2,60,400

రసాయనాలతో మిరప సాగు

మిరప రైతు	- ఇంటి ప్రసాద్
మండలం	- గొల్లప్రోలు
గ్రామం	- దుర్గాడ
సాగు చేసిన భూమి	- ఎకరం
సాగు చేసిన పంట	- మిర్చి
విత్తనాలకు	- రూ.2,000
దుక్కి	- రూ.6,400
కలుపుతీత	- రూ.15,000
నాట్ల కూలి	- రూ.5,000
నీరు తడికి	- రూ.1,200
రసాయనిక ఎరువు	- రూ.17,000 (10 బస్తాలు)
పురుగు మందులు	- రూ.10,000
పశువుల ఎరువు	- రూ.7,500 (5 తొట్టెలు)
మొత్తం ఖర్చు	- రూ.64,100
ఆదాయం	- 0

(పంటకు తామర పురుగు సోకి పూర్తిగా పాడవ్వడంతో తీసేయాల్సి వచ్చింది)



ఎకరానికి రూ. 65 వేల పెట్టుబడి.. రూపాయి కూడా తిరిగి రాలేదు..

నేను గత కొన్నేళ్లుగా రసాయనిక ఎరువులు, పురుగుమందులతో మిరప సాగు చేస్తున్నా. ఐతే గత రెండేళ్ళుగా నల్ల తామర పురుగు సోకడంతో మిర్చి పంట పూర్తిగా దెబ్బతిన్నది. ఎకరానికి రూ 65 వేల వరకు పెట్టుబడి పెట్టాను. ఒక్క రూపాయి కూడా తిరిగి రాలేదు. పంట పూర్తిగా తీసేయాల్సి వచ్చింది. రసాయనిక పురుగుమందులు పంటకు రక్షణ కల్పించ లేకపోయాయి.

- ఇంటి ప్రసాద్, మిర్చి రైతు, దుర్గాడ.
గొల్లప్రోలు మండలం,
కాకినాడ జిల్లా



దెబ్బతిన్న తోటలు కూడా కోలుకుంటున్నాయి



కొత్త పురుగు నల్ల తామరను నియంత్రించడంలో రసాయనక ఎరువులు, పురుగుమందుల కంటే కషాయాలే బాగా పనిచేస్తున్నాయి. ఉల్లి కషాయం, జీవామృతం, మీనామృతం వంటివి వినియోగించిన పొలాల్లో మిరప పంట తామర పురుగును తట్టుకుని నిలబడింది. రసాయనిక సేద్యంలో దెబ్బతిన్న మిరప పొలాల్లో కషాయాలు, ద్రావణాలు ఉపయోగించిన చోట్ల పంట తిరిగి పుంజుకుంటుండటం విశేషం. సేంద్రియ ఎరువులు వాడిన పంట మంచి ఆదాయాన్నిస్తుండగా రసాయనిక ఎరువులు, పురుగుమందులు వినియోగించిన పంటలు దెబ్బతిన్నాయి. ఈ రైతులకు అవగాహన కల్పించి వచ్చే సీజన్లో ప్రకృతి వ్యవసాయం చేసేలా అవగాహన కల్పిస్తున్నాం. నల్ల తామర ఉధృతిని ఎప్పటికప్పుడు పరిశీలించి రైతులకు సూచనలు ఇస్తున్నాం. సేంద్రీయ మందులతో కొత్త పురుగు ఉధృతి తగ్గింది.

- ఇలియాజర్ (94416 56083), డీపీఎం, పకృతి వ్యవసాయ శాఖ, కాకినాడ

'ప్రకృతి' మిరపలో ఎకరానికి రూ.3 లక్షలు



కుళ్లిన ఉల్లితో కషాయం, ఘన జీవామృతం, ద్రవ జీవామృతం, చేప వ్యర్థాలతో మీనామృతం, అల్లం-వెల్లుల్లితో అగ్ని అస్త్రం వంటివి తయారు చేసుకొని మిరప పంటకు వాడుతూ ప్రకృతి సేద్యంలో మంచి ఫలితాలు సాధిస్తున్నాం. కుళ్లిన ఉల్లిపాయలు, వేపాకులతో తయారు చేసే ఉల్లి కషాయం మిరప తోటల్లో నల్ల తామరను కట్టడి చేయటంలో కీలక స్థానం పోషిస్తోంది. ఎకరా మిర్చి తోట నుంచి ఇప్పటి వరకు రూ.3 లక్షల వరకు ఆదాయం వచ్చింది. ఇంకా కొన్ని కాయలు కోయాల్సి ఉంది.

- వెలుగుల బాబ్జి (97014 41771),
ప్రకృతి సేద్య పద్ధతుల్లో మిర్చి సాగు చేస్తున్న రైతు, దుర్గాడ

నిర్వహణ: **పంతంగి రాంబాబు**, సాగుబడి డెస్క్

స్పోర్ట్స్



మళ్లీ క్యాన్సర్ బారిన నవ్రతిలోవా

టెన్నిస్ ఆల్‌టైమ్ గ్రేట్‌లలో ఒకరైన మార్టినా నవ్రతిలోవా మరోసారి క్యాన్సర్ బారిన పడింది. తనకు స్టేజ్ 1 గొంతు క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్ (హ్యూమన్ పపిలోమావైరస్) కూడా సోకినట్లు మార్టినా సోమవారం ప్రకటించింది. అయితే దీనికి చికిత్స ఉందని, త్వరలోనే తాను కోలుకోగలనని కూడా 66 ఏళ్ల మార్టినా విశ్వాసం వ్యక్తం చేసింది. అనారోగ్యం కారణంగా పరీక్షలు చేయించుకోవడంతో క్యాన్సర్ విషయం బయటపడింది. 18 సింగిల్స్ సహా మొత్తం 59 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ గెలిచిన నవ్రతిలోవా 2010లోనే తొలిసారి క్యాన్సర్‌కు గురైంది.

ఫైనల్లో శివ థాపా

జాతీయ పురుషుల సీనియర్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో స్టార్ బాక్సర్ శివ థాపా క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. ఆరు సార్లు ఆసియా పతకాలు సాధించిన అస్సాం బాక్సర్ థాపా... 63.5 కేజీల విభాగం ప్రిక్వార్టర్స్‌లో జస్వీందర్ సింగ్ (ఢిల్లీ)ని తన నాకౌట్ పంచ్‌తో చిత్తు చేశాడు. 2022 కామన్వెల్త్ క్రీడల్లో కాంస్యం సాధించిన రోహిత్ టోకస్ (రైల్వేస్) కూడా 5-0తో జై సింగ్ (ఛత్తీస్‌గఢ్)పై ఘన విజయం సాధించాడు.



చివరి చూపు కోసం...

పీలే భౌతికకాయం సందర్శనకు జనం

సావోపాలో: బ్రెజిల్ ఆరాధ్య ఫుట్‌బాలర్ పీలేను కడసారి చూసేందుకు అభిమానులు సోమవారం ఉదయం నుంచే ఆయన పార్థివదేహం ఉంచిన విలా బెల్మిరా స్టేడియం ముందు క్యూ కట్టారు. 82 ఏళ్ల సాకర్ సూపర్‌స్టార్ గురువారం క్యాన్సర్‌తో తుదిశ్వాస విడిచిన సంగతి తెలిసిందే! సావోపాలో శివారులో ఉన్న స్టేడియం సామర్థ్యం 16000 మాత్రమే! కానీ పెద్ద సంఖ్యలో అభిమానులు, సాంటోస్ క్లబ్ ఆటగాళ్లు, బ్రెజిల్ జాతీయ ఆటగాళ్లు తమ దిగ్గజానికి తుది నివాళులు అర్పించారు. 'ఫిఫా' అధ్యక్షుడు ఇన్‌ఫాంటినో, అధికారులు శ్రద్ధాంజలి ఘటించారు. మంగళవారం సాంటోస్ వీధుల గుండా అంతిమయాత్ర ముగించాక మెమోరియల్ నెక్రోపాలె ఎక్యుమెనికలో అంత్యక్రియలు నిర్వహిస్తారు. దీనికి బ్రెజిల్ అధ్యక్షుడు లూయిస్ ఇనాసియో హాజరవుతారు.


నివాళి అర్పిస్తున్న పీలే భార్య మార్సియా ఒకీ (నలుపు డ్రెస్‌లో)

డెవాన్ కాన్వే సెంచరీ



కరాచీ: పాకిస్తాన్‌తో ప్రారంభమైన రెండో టెస్టులో తొలి రోజు న్యూజిలాండ్ బ్యాటింగ్‌లో మెరుగైన ప్రదర్శన కనబర్చింది. ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో కివీస్ 6 వికెట్ల నష్టానికి 309 పరుగులు చేసింది. డెవాన్ కాన్వే (191 బంతుల్లో 122; 16 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీ సాధించగా, టామ్ లాథమ్ (100 బంతుల్లో 71; 9 ఫోర్లు) రాణించాడు. వీరిద్దరు తొలి వికెట్‌కు 134 పరుగులు జోడించారు. తొలి రెండు సెషన్లలో ఒకే వికెట్ కోల్పోయిన న్యూజిలాండ్...పాక్ బౌలర్ల జోరుతో చివరి సెషన్‌లోనే 5 వికెట్లు చేజార్చుకుంది. ఒక దశలో 234/1తో పటిష్ట స్థితిలో కనిపించిన టీమ్, 45 పరుగుల వ్యవధిలో 6 వికెట్లు కోల్పోయింది.

సిరీస్ భారత మహిళల సొంతం


నజీలా

ప్రిటోరియా: దక్షిణాఫ్రికా మహిళల (అండర్-19)తో జరిగిన టి20 సిరీస్‌లో భారత మహిళలు (అండర్-19) పైచేయి సాధించారు. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సొంతం చేసుకున్నారు. సోమవారం జరిగిన నాలుగో టి20 మ్యాచ్‌లో భారత్ 4 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికాను ఓడించింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన సఫారీ టీమ్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 86 పరుగులే చేయగలిగింది. కేలే రెనెకే (18) టాప్ స్కోరర్‌గా నిలవగా...భారత బౌలర్లలో నజీలా సీఎంసీ (3/4), ఫలక్ నాజ్ (2/11) ప్రత్యర్థిని దెబ్బకొట్టారు. అనంతరం భారత్ 15 ఓవర్లలో 6 వికెట్లకు 87 పరుగులు సాధించింది. కెప్టెన్ షఫాలీ వర్మ (27 బంతుల్లో 29; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్‌తో జట్టును గెలిపించింది. సిరీస్‌లో తొలి మ్యాచ్‌లో భారత్ గెలవగా, తర్వాతి రెండు మ్యాచ్‌లు వర్షం కారణంగా రద్దయ్యాయి. సిరీస్‌లో చివరి మ్యాచ్ రేపు జరుగుతుంది.

హైదరాబాద్ X ఆంధ్ర

సాక్షి, విజయనగరం: రంజీ ట్రోఫీలో చిరకాల ప్రత్యర్థులైన రెండు జట్ల మధ్య నేటినుంచి కీలక సమరం జరగనుంది. ఎలైట్ గ్రూప్ 'బి' పోరులో భాగంగా హైదరాబాద్, ఆంధ్ర తలపడనున్నాయి. హైదరాబాద్ జట్టు ఇప్పటి వరకు ఆడిన 3 మ్యాచ్‌లలో ఒక్క విజయాన్నీ అందుకోలేకపోయింది. తమిళనాడుతో జరిగిన మ్యాచ్‌లో అదృష్టవశాత్తూ 'డ్రా'తో గట్టెక్కిన టీమ్ ఆ తర్వాత ముంబై, అస్సాం చేతుల్లో ఓడి ఈ గ్రూప్ పాయింట్ల పట్టికలో అందరికంటే చివరగా (1 పాయింట్) ఎనిమిదో స్థానంలో కొనసాగుతోంది. హైదరాబాద్‌తో పోలిస్తే ఆంధ్ర పరిస్థితి కాస్త మెరుగ్గా ఉంది. ముంబై చేతిలో తొలి మ్యాచ్‌లో ఓడినా... ఆ తర్వాత స్ఫూర్తిదాయక ప్రదర్శనతో రెండు పటిష్ట జట్లు తమిళనాడు, మహారాష్ట్రలను ఆంధ్ర ఓడించింది. మొత్తం 6 పాయింట్లతో ఆ జట్టు ఐదో స్థానంలో ఉంది. ఈ నేపథ్యంలో ఇరు జట్లకూ ఈ మ్యాచ్‌లో గెలుపు ఎంతో కీలకంగా మారింది.

ఐసీయూ నుంచి ప్రైవేట్ వార్డుకు...

పంత్ ఆరోగ్యస్థితి మెరుగు



డెహ్రాడూన్: కారు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భారత క్రికెటర్ రిషభ్ పంత్ పరిస్థితి కాస్త మెరుగైంది. అతడిని అత్యవసరం విభాగం (ఐసీయూ)నుంచి ప్రైవేట్ వార్డుకు తరలించినట్లు మ్యాక్స్ హాస్పిటల్ వర్గాలు వెల్లడించాయి. అయితే కాళ్లకు తగిలిన గాయాల తీవ్రతపై మాత్రం ఇంకా స్పష్టత రాలేదు. నొప్పి ఎక్కువగానే ఉండటంతో ఎంఆర్ఐ గురించి ప్రస్తుతానికి ఆలోచించడం లేదని సమాచారం. మోకాలు, బొటనవేలు, మడమ భాగాలకు చాలా దెబ్బలు తగలడంతో ఇప్పటి వరకు వైద్యులు వాటికి ఎంఆర్ఐ చేయలేకపోయారు.

సుమీత్ నగాల్ అవుట్

టాటా ఓపెన్ మహారాష్ట్ర

పుణే: దేశంలోని ఏకైక ఏటీపీ టోర్నీ టాటా ఓపెన్ మహారాష్ట్రలో భారత ఆటగాడు సుమీత్ నగాల్ పోరు ముగిసింది. హోరాహోరీగా సాగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో ఫిలిప్ క్రజినోవిచ్ (సెర్బియా) 6-4, 4-6, 6-4 స్కోరుతో నగాల్‌పై విజయం సాధించాడు. 2 గంటల 24 నిమిషాల పాటు సాగిన ఈ పోరులో 'వైల్డ్ కార్డ్' సుమీత్ తీవ్రంగా పోరాడినా లాభం లేకపోయింది. క్రజినోవిచ్ 8 ఏస్‌లు కొట్టగా, నగాల్ 3 ఏస్‌లు నమోదు చేశాడు. మరో మ్యాచ్‌లో అమెరికాకు చెందిన మైకేల్ మో 6-2, 6-4 స్కోరుతో 15 ఏళ్ల భారత సంచలనం మానస్ ధమ్నేపై విజయం సాధించాడు.

కుర్రాళ్లతో కొత్త సమరం

- శ్రీలంకతో భారత్ తొలి టి20 నేడు
- స్టార్లు లేని జట్టుకు పాండ్యా సారథ్యం
- రాత్రి గం. 7 నుంచి 'స్టార్‌స్పోర్ట్స్-1'లో ప్రత్యక్ష ప్రసారం


షనక


పాండ్యా

ముంబై: ఈ కొత్త సంవత్సరం భారత యువ క్రికెటర్లకు లక్కీ చాన్స్ ఇస్తోంది. స్టార్లు లేని టీమిండియాలో ఓ పూర్తి స్థాయి సిరీస్ ఆడేందుకు చక్కని అవకాశం కల్పించింది. ముఖ్యంగా టాపార్డర్‌లో సత్తా చాటుకునేందుకు కుర్రాళ్లకు ఇంతకు మించిన సదవకాశం ఉండదేమో! భారత పర్యటనకు వచ్చిన శ్రీలంకతో మూడు టి20ల సిరీస్‌లో మొదటి మ్యాచ్ నేడు ఇక్కడ జరుగుతుంది. ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా సారథ్యంలో నూతన ఉత్సాహంతో టీమిండియా బరిలోకి దిగుతోంది. ఇన్నాళ్లు అడపాదడపా ఓపెనింగ్‌లో అవకాశాలు పొందిన ఇషాన్ కిషన్, రుతురాజ్ గైక్వాడ్‌లు ఈ మూడు మ్యాచ్‌ల సిరీస్‌తో సత్తా చాటుకోవాలి. ముఖ్యంగా పవర్‌ప్లేలో తమ బ్యాటింగ్ పవర్ చూపించాల్సిందే!

'సూర్య' ప్రతాపం కొనసాగేనా

గతేడాది ఆసాంతం సూర్యకుమార్ యాదవ్ మెరుపులు మెరిపించాడు. ఒక్క ఏడాదిలోనే ఐసీసీ టి20 బ్యాటింగ్ ర్యాంకుల్లో అగ్ర స్థానానికి ఎగబాకాడు. ముఖ్యంగా ప్రతీ సిరీస్‌లోనూ తన మార్కు ఆటతీరుతో రాణించాడు. భారత 360 డిగ్రీ బ్యాటర్‌గా రూపాంతరం చెందాడు. ప్రత్యర్థి పేస్ బౌలర్ల పాలిట సూర్య ప్రతాపం ఎంత చెప్పుకున్నా తక్కువే. ఇదే జోరును ఈ ఏడాదీ కొనసాగించాలనే లక్ష్యంతో సూర్య ఉన్నాడు. రోహిత్, కోహ్లి, రాహుల్ లేని టాప్ ఆర్డర్‌కు సూర్యకుమారే ఇప్పుడు పెద్ద దిక్కు. పెరిగిన బాధ్యతలతో జట్టుకు ఉపయుక్తమైన ఇన్నింగ్స్‌లు ఆడాల్సి వుంటుంది. పగ్గాలు అప్పగించిన ప్రతీసారి నిరూపించుకున్న హార్దిక్ పాండ్యా ఆల్‌రౌండ్ మెరుపులు కూడా తోడయితే లంకేయులకు కష్టాలు తప్పవు. మిడిలార్డర్‌లో దీపక్ హుడా, సంజూ సామ్సన్‌లు కూడా బ్యాటింగ్‌లో బాధ్యతను పంచుకుంటే తక్కువ దూరంలో బౌండరీ ఉన్న వాంఖెడేలో భారీ స్కోర్లు ఏమంత కష్టం కానేకాదు.

అర్ష్‌దీప్‌పై భారం

ప్రస్తుత భారత జట్టులో అనుభవజ్ఞులైన పేసర్లు ఎవరు లేరు. ఇంకా చెప్పాలంటే జట్టులో ఇప్పుడున్న ఏకైక సీనియర్ బౌలర్ చహల్ ఒక్కడే! అతను స్పిన్‌తో కట్టడి చేయగలడు. అయితే సీమ్ బౌలింగ్‌ను నడిపించేది మాత్రం అర్ష్‌దీప్ సింగే. గడచిన ఐదారు నెలల్లో అర్ష్‌దీప్ తన పేస్ వాడి ఏంటో చూపెట్టాడు. టీమ్ మేనేజ్‌మెంట్ కూడా అతని ప్రతిభను గుర్తించి పదేపదే అవకాశాలిస్తుంది. స్పీడ్‌తో ఉమ్రాన్ మాలిక్, పేస్ వైవిధ్యంతో హర్షల్ పటేల్, స్పిన్‌తో వాషింగ్టన్ సుందర్ ప్రత్యర్థి బ్యాటింగ్‌ను ఏ మేరకు కళ్లెం వేయగలరో చూడాలి.

ఆసియా చాంప్‌తో ఆషామాషీ కాదు!

శ్రీలంక మిగతా ఫార్మాట్లలో ఎలా వున్నప్పటికీ పొట్టి ఫార్మాట్‌లో గట్టి ప్రత్యర్థే! ఆసియా కప్ టి20 చాంపియన్ శ్రీలంక జట్టులో మెరుపులు మెరిపించే బ్యాటర్స్‌కు కొదవే లేదు. కెప్టెన్ షనక, నిసాంక, కుశాల్ మెండిస్, భానుక రాజపక్స, సమరవిక్రమ అందరు మంచి ఫామ్‌లో ఉన్నారు. పైగా అనుభవజ్ఞులు లేని భారత బౌలింగ్‌పై వీళ్లు విరుచుకుపడితే భారీ స్కోర్లకు కొరత ఉండదు. బౌలింగ్ విషయానికి వస్తే హసరంగ స్పిన్ మ్యాజిక్‌తో పాటు తీక్షణ, మదుశంక, లహిరు కుమారల రూపంలో శ్రీలంక బౌలింగ్ మెరుగ్గానే ఉంది.

తుది జట్లు (అంచనా)

భారత్: హార్దిక్ పాండ్యా (కెప్టెన్), ఇషాన్ కిషన్, రుతురాజ్, సూర్యకుమార్, సామ్సన్, దీపక్ హుడా, వాషింగ్టన్ సుందర్, చహల్, హర్షల్, అర్ష్‌దీప్, ఉమ్రాన్ మాలిక్.

శ్రీలంక: దసున్ షనక (కెప్టెన్), నిసాంక, కుశాల్ మెండిస్, ధనంజయ, అసలంక, చమిక కరుణరత్నే, భానుక రాజపక్స, హసరంగ, తీక్షణ, మదుశంక, లహిరు కుమార.

పిచ్-వాతావరణం

వాంఖెడే పిచ్ ప్రత్యేకించి పొట్టి ఫార్మాట్‌లో మెరుపులకు చక్కని అవకాశం కల్పిస్తుంది. దీంతో భారీ స్కోర్లు ఖాయం. మంచు ప్రభావం వల్ల టాస్ నెగ్గిన జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంటుంది. వర్షం ముప్పు లేదు.

'కిట్' మారింది!



భారత క్రికెట్ జట్టు 'కిట్'లో స్వల్ప మార్పు చోటు చేసుకుంది. ఇప్పటి వరకు ఎంపీఎల్ స్పోర్ట్స్ 'కిట్' స్పాన్సర్‌గా ఉండగా... ఇప్పుడు దాని స్థానంలో కేవల్ కిరణ్ క్లాతింగ్ లిమిటెడ్ (కేకేసీఎల్) వచ్చింది. ఎంపీఎల్‌తో ఈ ఏడాది మార్చి వరకు బీసీసీఐ ఒప్పందం ఉండగా... తమ హక్కులను మరో సంస్థకు బదలాయించుకునేందుకు అనుమతి ఇవ్వాల్సిందిగా బోర్డును ఎంపీఎల్ ఇటీవలే కోరింది. అందుకే మూడు నెలల స్వల్ప కాలానికి కేకేసీఎల్ సీన్‌లోకి వచ్చింది. దాంతో శ్రీలంకతో సిరీస్‌నుంచి కేకేసీఎల్ తమ పాపులర్ బ్రాండ్ 'కిల్లర్ జీన్స్' లోగోను టీమిండియా జెర్సీలపై ప్రదర్శించనుంది.

సినిమా


● మహేశ్ బాబు

సీక్వెల్స్ ఉన్నాయి!

మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో ఓ సినిమా రూపొందనున్న విషయం తెలిసిందే. ఈ చిత్రానికి ప్రముఖ రచయిత, రాజమౌళి తండ్రి విజయేంద్ర ప్రసాద్ కథ అందిస్తున్నారు. ఇప్పటికే ఇది 'యాక్షన్ అడ్వెంచరస్' మూవీ అని ఆయన పలు ఇంటర్వ్యూల్లో పేర్కొన్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఈ చిత్రానికి సీక్వెల్స్ ఉంటాయన్నారు. ప్రధాన పాత్రలు అలాగే ఉంటాయని, సీక్వెల్స్ కథ మారుతుంటుందని స్పష్టం చేశారాయన. ప్రస్తుతం తొలి భాగానికి సంబంధించిన కథను పూర్తి చేసే పని మీద ఉన్నారు విజయేంద్రప్రసాద్. ఇక మహేశ్ అద్భుత నటుడని, యాక్షన్ సీన్స్ బాగా చేస్తారని, ఏ రచయితకైనా ఆయనకు రాయడం బాగుంటుందని, ఈ చిత్రానికి హీరోగా తనే బెస్ట్ చాయిస్ అని చెప్పుకొచ్చారు విజయేంద్రప్రసాద్. ఈ ఏడాది ఈ చిత్రం షూటింగ్ ఆరంభమయ్యే అవకాశం ఉంది.

ఫిబ్రవరిలో ప్రేమకథ


● సమంత, దేవ్ మోహన్

సమంత టైటిల్ రోల్‌లో నటించిన చిత్రం 'శాకుంతలం'. గుణశేఖర్ దర్శకత్వం వహించారు. 'దిల్' రాజు సమర్పణలో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్, గుణ టీమ్ వర్క్స్‌పై నీలిమ గుణ నిర్మించారు. ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 17న తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో రిలీజ్ చేయనున్నట్లు చిత్రయూనిట్ అధికారికంగా ప్రకటించింది. ''ప్రముఖ కవి కాళిదాసు రచించిన సంస్కృత నాటకం 'అభిజ్ఞాన శాకుంతలం' ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు గుణశేఖర్. శకుంతల, దుష్యంత మహారాజుల అజరామరమైన ప్రేమకథ ఇది. ఇందులో శకుంతలగా సమంత, దుష్యంతుడిగా దేవ్ మోహన్ నటించారు. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇవ్వటానికి ఈ చిత్రాన్ని 3డీలో రూపొందించాం. మణిశర్మ సంగీతం అందించారు. మ్యూజికల్‌గానూ ప్రేక్షకులకు అద్భుతమైన అనుభూతివ్వడానికి రీ రికార్డింగ్‌ను బుడాపెస్ట్, హంగేరిలోని సింఫనీ టెక్నీషియన్స్‌తో చేయించాం. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి'' అని చిత్రబృందం పేర్కొంది. మోహన్‌బాబు, ప్రకాష్‌రాజ్, మధుబాల, గౌతమి, బేబీ అల్లు అర్హ తదితరులు నటించిన ఈ చిత్రానికి కెమెరా: శేఖర్ వి. జోసెఫ్.

వేసవిలో మాస్‌గా...



'ఉప్పెన' ఫేమ్ పంజా వైష్ణవ్ తేజ్ హీరోగా ఓ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ సినిమా రూపొందుతోంది. ఈ చిత్రం ద్వారా శ్రీకాంత్ ఎన్. రెడ్డి దర్శకునిగా పరిచయమవుతున్నారు. శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్‌పై ఎస్. నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఈ ఏడాది ఏప్రిల్ 29న విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించి, వైష్ణవ్ తేజ్ వీడియోను రిలీజ్ చేసింది. ఈ సందర్భంగా చిత్ర దర్శక-నిర్మాతలు మాట్లాడుతూ- ''పూర్తి స్థాయి మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతోన్న చిత్రమిది. ఇందులో వైష్ణవ్ సరికొత్త మాస్ అవతారంలో కనిపిస్తారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ చివరి దశలో ఉంది. టైటిల్‌తో పాటు, చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలోనే ప్రకటిస్తాం'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: దుడ్లే.

పదేళ్ల ప్రేమ ప్రయాణం


● నాగశౌర్య, మాళవికా నాయర్

'ఊహలు గుసగుసలాడే, జ్యో అచ్యుతానంద' వంటి చిత్రాల తర్వాత హీరో నాగశౌర్య, దర్శకుడు శ్రీనివాస్ అవసరాల కాంబినేషన్‌లో రూపొందుతోన్న మూడో చిత్రం 'ఫలానా అబ్బాయి ఫలానా అమ్మాయి'. నాగశౌర్య, మాళవికా నాయర్ జంటగా టీజీ విశ్వప్రసాద్, పద్మజ దాసరి నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ ఇటీవలే పూర్తయింది. ఈ సందర్భంగా ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. శ్రీనివాస్ అవసరాల మాట్లాడుతూ- ''పదేళ్ల పాటు ఓ జంట మధ్య సాగే ప్రేమ ప్రయాణమే 'ఫలానా అబ్బాయి ఫలానా అమ్మాయి'. 18 ఏళ్ల నుండి 28 సంవత్సరాల వయస్సు వరకు హెచ్చు తగ్గులతో సాగే వారి ప్రయాణం ఎంతో ఆసక్తికరంగా ఉంటుంది'' అన్నారు. ''ఈ సినిమా విడుదల తేదీతో పాటు మరిన్ని వివరాలు త్వరలో వెల్లడిస్తాం'' అన్నారు టీజీ విశ్వప్రసాద్, పద్మజ దాసరి. ఈ చిత్రానికి కెమెరా: సునీల్ కుమార్ నామ, సంగీతం: కళ్యాణీ మాలిక్, వివేక్ సాగర్ (కాఫీ పై సాంగ్), ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సుజిత్ కుమార్ కొల్లి, అసోసియేట్ ప్రొడ్యూసర్స్: సునీల్ షా, రాజా సుబ్రమణియన్, సహనిర్మాత: వివేక్ కూచిభొట్ల.

మనసు చెప్పిన మాట వింటాను


● ఆలియా భట్

కెరీర్‌లో దూసుకెళుతున్నప్పుడు పెళ్లి చేసుకోవడం, తల్లి కావడం అనేది సరైన నిర్ణయం కాదని కథానాయికలకు కొందరు చెబుతుంటారు. ఇదే విషయం గురించి ఆలియా భట్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ - ''నేనెప్పుడూ నా మనసు చెప్పింది వింటాను. జీవితాన్ని మనం ప్లాన్ చేయలేం. జీవితమే ప్లాన్ చేస్తుంది. నా కెరీర్ పీక్‌లో ఉన్నప్పుడు పెళ్లి చేసుకున్నాను.. తల్లిని కూడా అయ్యాను. పెళ్లి చేసుకున్నంత మాత్రాన, తల్లయినంత మాత్రాన చేసే వృత్తిలో మార్పులు వస్తాయా.. ఎవరన్నారు? ఓ నటిగా నా మీద నాకు నమ్మకం ఉంది. మనం మంచి యాక్టర్ అయినప్పుడు, కష్టపడి పని చేయాలనే ఆలోచన ఉన్నప్పుడు పని దానంతట అది మన దగ్గరకు వస్తుంది. ఒకవేళ రాలేదనుకుంటే.. ఇది మన టైమ్ కాదనుకోవాలి. అయినా నేను పని గురించి పెద్దగా ఆలోచించి, ఒత్తిడికి గురి కాను. తల్లి కావాలని నేను తీసుకున్న నిర్ణయానికి జీవితంలో ఎప్పుడూ పశ్చాత్తాపపడను. ఇంకా చెప్పాలంటే పెళ్లి, తల్లి కావడం అనేవి నా జీవితంలో నేను తీసుకున్న గొప్ప నిర్ణయాలు'' అన్నారు. ఇక గత ఏడాది రణ్‌బీర్ కపూర్-ఆలియాల వివాహం జరిగిన విషయం తెలిసిందే. నవంబర్‌లో ఆలియా పాపకు జన్మనిచ్చారు. కుమార్తెకు 'రాహా' అని పేరు పెట్టారు. ఈ పేరుకి అర్థం చెబుతూ - ''రాహా అంటే 'ఆధ్యాత్మిక బాట' అని ఓ అర్థం. ఇంకా ఉపశమనం, విశ్రాంతి, సౌకర్యం, ఆనందం, స్వేచ్ఛ.. ఇలా ఒక్కో భాషల్లో ఒక్కో అర్థం ఉంది. మా జీవితాల్లోకి రాహా రావడం మా కుటుంబం మొత్తానికీ ఆనందం ఇచ్చింది. మా జీవితాలు ఇప్పుడే మొదలైనట్లుగా అనిపిస్తోంది. నాకైతే జీవితం పరిపూర్ణంగా ఉన్నట్లనిపిస్తోంది'' అన్నారు ఆలియా.

వ్యూహం ఏంటి?


● అజయ్

క్యారెక్టర్ ఆర్టిస్టుగా, విలన్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న అజయ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'చక్రవ్యూహం'. 'ది ట్రాప్' అన్నది ఉపశీర్షిక. చెట్కూరి మధుసూదన్ దర్శకత్వం వహిస్తున్నారు. సహస్ర క్రియేషన్స్ బ్యానర్‌పై సావిత్రి నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ సందర్భంగా చెట్కూరి మధుసూదన్, సావిత్రి మాట్లాడుతూ- ''మర్డర్ మిస్టరీ క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందుతోన్న చిత్రమిది. హత్య కేసును ఛేదించేందుకు హీరో ఎలాంటి వ్యూహం పన్నాడన్నది ఆసక్తిగా ఉంటుంది. పోలీస్ పాత్రలో అజయ్ నటన ఆకట్టుకుంటుంది'' అన్నారు. ఈ చిత్రానికి సహనిర్మాతలు: వెంకటేష్, అనూష, సంగీతం: భరత్ మంచిరాజు, కెమెరా: జీవీ అజయ్, ఎగ్జిక్యూటివ్ నిర్మాతలు: అజయ్, మహేష్.

సస్పెన్స్.. థ్రిల్


● బుచ్చిబాబు, శంకర్

రవి వర్మ, రోహిత్ బెహల్, అక్షత సోనవానె ముఖ్య పాత్రల్లో రూపొందిన చిత్రం 'ప్రత్యర్థి'. శంకర్ ముడావత్ దర్శకత్వంలో సంజయ్ సాహ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 6న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా 'ఉప్పెన' ఫేమ్ దర్శకుడు బుచ్చిబాబు ట్రైలర్‌ని విడుదల చేసి, చిత్ర యూనిట్‌కి శుభాకాంక్షలు తెలిపారు. ''సస్పెన్స్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని రూపొందించాం. రొటీన్‌కి భిన్నంగా ఉండే చిత్రాన్ని ప్రేక్షకులకు ఇవ్వాలనే ఆలోచనతో ఓ డిఫరెంట్ పాయింట్‌తో తీశాం. ఊహించని మలుపులతో సినిమా ఆసక్తికరంగా ఉంటుంది'' అన్నారు దర్శక-నిర్మాతలు. ఈ చిత్రానికి సంగీతం: పాల్ ప్రవీణ్, కెమెరా: రాకేష్ గౌడ్.

లవ్ లైటూ...


● నందినీ రాయ్

శ్రీ సింహా, నేహా సోలంకి హీరోహీరోయిన్లుగా నటించిన చిత్రం 'భాగ్ సాలే'. ప్రణీత్ సాయి దర్శకత్వంలో అర్జున్ దాస్యన్, యష్ రంగినేని, కల్యాణ్ సింగనమల నిర్మించారు. కాల భైరవ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'ప్రేమ కోసం..' అనే మాస్ పాటను విడుదల చేశారు. 'సన్ లైటు.. మూన్ లైటు.. మించిందేరా లవ్ లైటూ, వద్దు చాటు.. వద్దు లేటు.. ఉంటే చాలు కొంత చోటు...' అంటూ సాగే ఈ పాటకి కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించగా, మంగ్లీ పాడారు. ఈ పాటలో నటి నందినీ రాయ్ నర్తించారు. ''ప్రేక్షకులను ఆద్యంతం థ్రిల్ చేసే కథతో రూపొందిన చిత్రం 'భాగ్ సాలే'. యువతని ఆకట్టుకునేలా ఈ చిత్రాన్ని ప్రణీత్ సాయి తెరకెక్కించారు'' అని నిర్మాతలు అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: రమేష్ కుషేందర్.

సాక్షి **బిజినెస్**
మంగళవారం
3-1-2023

స్టాక్‌ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	327	61,168
నిఫ్టీ ▲	92	18,197

మరిన్ని బిజినెస్‌ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	10,466	▽	12
డోజోన్స్	33,147	▽	74
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,452	▽	61
డాక్స్	14,069	▲	146
షాంఘై	3,089	▲	16
నిక్కాయ్	26,094	▲	1

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	54,867
బంగారం (99.5 స్వచ్ఛత)	54,647
వెండి (కిలో)	68,092

ఫారెక్స్‌ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్‌ డాలర్	ఎస్‌బీఐ	81.90	83.57
£	బ్రిటన్‌ పౌండ్	ఎస్‌బీఐ	86.97	90.07
€	యూరో	ఎస్‌బీఐ	98.27	101.56
¥	జపాన్‌ ఎన్ (100)	ఎస్‌బీఐ	62.17	64.20
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.19	57.59
S$	సింగపూర్‌ డాలర్	ఎస్‌బీఐ	60.79	62.78
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.07	22.74
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.63	23.42
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.87	12.90

ఇండియన్‌ బ్యాంక్‌ రుణ రేట్లు పావుశాతం పెంపు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ ఇండియన్‌ బ్యాంక్‌ రుణ రేట్లు పావుశాతం వరకూ పెరిగాయి. తాజా రేట్లు జనవరి 3వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయని బ్యాంక్‌ ప్రకటన తెలిపింది. నిధుల సమీకరణ వ్యయ ఆధారిత రుణ రేటు (ఎంసీఎల్‌ఆర్), బాండ్‌ ఆధారిత రుణ రేటు (టీబీఎల్‌ఆర్), బేస్‌ రేట్‌ అండ్‌ బెంచ్‌ మార్క్‌ ప్రైమ్‌ లెండింగ్‌ రేట్‌ (బీపీఎల్‌ఆర్)ను అసెట్‌ లయబిలిటీ మేనేజ్‌మెంట్‌ కమిటీ (ఏఎల్‌సీఓ)సమీక్షించి అన్ని కాలపరిమితులపై రేటు 25 బేసిస్‌ పాయింట్ల వరకూ (100 బేసిస్‌ పాయింట్లు ఒకశాతం) పెంచాలని నిర్ణయించినట్లు బ్యాంక్‌ ప్రకటన పేర్కొంది. తాజా నిర్ణయంతో ప్రధానంగా ఏడాది రుణ రేటు 8.20 శాతం నుంచి 8.30 శాతానికి ఎగసింది. నెల, ఆరు నెలల రేట్లు 20 బేసిస్‌ పాయింట్లు ఎగశాయి. బేస్‌ రేటు పావుశాతం పెంపుతో 9.10 శాతానికి ఎగసింది.

టై హైదరాబాద్‌ ప్రెసిడెంట్‌గా రషీదా

హైదరాబాద్, బిజినెస్‌ బ్యూరో: ద ఇండస్‌ ఎంట్రప్రెన్యూర్స్‌ (టై) హైదరాబాద్‌ విభాగం నూతన ప్రెసిడెంట్‌గా 2023 సంవత్సరానికిగాను ఆర్‌అండ్‌ఎ అసోసియేట్స్‌ ఫౌండర్‌ పార్ట్‌నర్‌ రషీదా అడెన్‌వాలా నియమితులయ్యారు.



హైదరాబాద్‌ చాప్టర్‌ ప్రెసిడెంట్‌గా ఒక మహిళ బాధ్యతలు చేపట్టడం ఇదే తొలిసారి. వైస్‌ ప్రెసిడెంట్‌గా మంజీరా డిజిటల్‌ సిస్టమ్స్‌ కో-ఫౌండర్‌ శ్రీని చందుపట్ల ఎన్నికయ్యారు. బోర్డు సభ్యులుగా వెంకటేశ్వర రావు అన్నప్రగడ, బాలాజీ భైరవభట్ల, రవి చెన్నుపాటి, షర్లిన్‌ తాయిల్, రాజ్‌ సామల, రవీంద్ర నల్లూరి, నందిత సేథి, భాను ప్రకాశ్‌ వర్ల, జయేశ్‌ సంఘ్వి, అభిజీత్‌ బెనర్జీ ఎంపికయ్యారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్‌-నెక్‌ / 100కు రూ.లలో)

3-1-2023	
విశాఖ	555-00
చిత్తూరు	568-00
ఈస్ట్, వెస్ట్‌ గోదావరి	540-00
విజయవాడ	540-00
రిటైల్‌ ధర (డజను)	78.00
2-1-2023 ఫామ్‌ ధర...	
హైదరాబాద్	541-00
వరంగల్	543-00
రిటైల్‌ ధర	6.00

రిఫ్రిజిరేటర్లు మరింత ప్రియం



న్యూఢిల్లీ: రిఫ్రిజిరేటర్లు మరింత ప్రియం కానున్నాయి. ధరలు 5 శాతం వరకు అధికం అయ్యే అవకాశం ఉంది. బ్యూరో ఆఫ్‌ ఎనర్జీ (బీఈఈ) నూతన ప్రమాణాలు జనవరి 1 నుంచి అమలులోకి రావడమే ఇందుకు కారణం. కొత్త ప్రమాణాల కారణంగా మోడల్‌నుబట్టి 2–5 శాతం ధర పెరగవచ్చని గోద్రెజ్‌ అప్లయెన్సెస్, హాయర్, ప్యానాసోనిక్‌ వెల్లడించాయి. ఫ్రాస్ట్‌–ఫ్రీ మోడళ్లలో ఫ్రీజర్స్, రిఫ్రిజిరేటర్‌ ప్రొవిజనింగ్‌ యూనిట్‌ల (నిల్వ విభాగం) కోసం వేర్వేరుగా స్టార్‌ లేబులింగ్‌ను బీఈఈ తప్పనిసరి చేసింది. రిఫ్రిజిరేటర్‌ స్థూల సామర్థ్యానికి బదులు నికర సామర్థ్యం (వినియోగం అయ్యే స్థలం) ఆధారంగానే కంపెనీలు స్టార్‌ లేబులింగ్‌ చేయాల్సి ఉంటుంది. రీసెర్చ్‌ అండ్‌ మార్కెట్స్‌ నివేదిక ప్రకారం భారత్‌లో రిఫ్రిజిరేటర్ల విపణి 2022లో రూ.25,352 కోట్లు ఉంది.

డిసెంబర్‌లో తయారీ జోరు

13 నెలల గరిష్టానికి సూచీ



న్యూఢిల్లీ: భారత్‌ తయారీ రంగం డిసెంబర్‌లో మంచి పనితీరును కనబరిచింది. స్టాండర్డ్‌ అండ్‌ పూర్స్‌ గ్లోబల్‌ ఇండియా మ్యానుఫ్యాక్చరింగ్‌ పర్చేజింగ్‌ మేనేజర్స్‌ ఇండెక్స్‌ (పీఎంఐ) డిసెంబర్‌లో 13 నెలల గరిష్టం 57.8ని తాకింది. నవంబర్‌లో ఈ సూచీ 55.7 వద్ద ఉంది. కొత్త ఆర్డర్లు, పటిష్ట డిమాండ్‌ తాజా సానుకూల ఫలితానికి కారణమని ఎస్‌అండ్‌పీ గ్లోబల్‌ మార్కెట్‌ ఇంటెలిజెన్స్‌ ఎకనమిక్స్‌ అసోసియేట్‌ డైరెక్టర్‌ పోలీయానా డీ లిమా పేర్కొన్నారు. సూచీ 50 పైన ఉంటే వృద్ధి ధోరణిగా, ఆ దిగువకు పడిపోతే క్షీణతగా పరిగణిస్తారు. ఈ ప్రాతిపదికన పీఎంఐ వరుసగా 18 నెలల నుంచి వృద్ధి బాటలోనే కొనసాగుతోంది. కాగా, ద్రవ్యోల్బణానికి సంబంధించి డిసెంబర్‌లో కొంత ఒత్తిడి ఉన్నట్లు తమ సర్వేలో వెల్లడయినట్లు డీ లిమా పేర్కొన్నారు.

కష్ట కాలంలోనూ భారత్‌ ఎకానమీ దూకుడు

- అసోచామ్‌ నివేదిక
- కార్పొరేట్‌ పనితీరు బాగుంది
- ద్రవ్యోల్బణం నెమ్మది
- డిమాండ్‌ పరిస్థితులు బెటర్



న్యూఢిల్లీ: క్లిష్టతరమైన ప్రపంచ ఆర్థిక పరిస్థితుల్లోనూ భారత్‌ 2023 సంవత్సరాలన్ని నెట్టుకురాగలుగుతుందన్న విశ్వాసాన్ని పారిశ్రామిక వేదిక– అసోచామ్‌ వ్యక్తం చేసింది. పటిష్ట వినియోగ డిమాండ్, మెరుగైన కార్పొరేట్‌ పనితీరు, తగ్గుముఖం పడుతున్న ద్రవ్యోల్బణం వంటి అంశాలు తమ అంచనాలకు కారణంగా పేర్కొంది. అసోచామ్‌ సెక్రటరీ జనరల్‌ దీపక్‌ సూద్‌ ఈ మేరకు చేసిన ప్రకటనలో కొన్ని ముఖ్యాంశాలను పరిశీలిస్తే..

▪ గ్లోబల్‌ ఆర్థిక పరిస్థితులు క్లిష్టంగా కనిపిస్తున్నాయి. అయినప్పటికీ, బలమైన దేశీయ డిమాండ్, పటిష్ట ఆర్థిక రంగం, మెరుగైన కార్పొరేట్‌ బ్యాలెన్స్‌ షీట్‌ల సహాయంతో భారత ఆర్థిక వ్యవస్థ స్థిరమైన బాటలో నిలుస్తుందని విశ్వసిస్తున్నాం.

▪ రబీ పంటలు బాగుంటాయని తొలి సంకేతాలు వెల్లడిస్తున్నాయి. వ్యవసాయ రంగం సానుకూల పనితీరును ఇది సూచిస్తోంది. ఫాస్ట్‌ మూవింగ్‌ కన్జూమర్‌ గూడ్స్‌ (ఎఫ్‌ఎంసీజీ). ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలు, ప్రత్యేక రసాయనాలు– ఎరువులు వంటి అనేక పరిశ్రమల పనితీరు బాగుంది.

▪ పర్యాటకం, హోటళ్ల రవాణా, గృహ కొనుగోళ్లు, విద్యుత్, ఎలక్ట్రానిక్స్, విచక్షణతో కూడిన వినియోగదారు వస్తువుల కొనుగోళ్లు, ఆటోమొబైల్స్‌ విభాగాల్లోనూ చక్కటి వినియోగ డిమాండ్‌ కనిపిస్తోంది.

▪ అయితే, అంతర్జాతీయ కరెన్సీ హెచ్చుతగ్గుల గురించి, ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల పనితీరు, పర్యవసానాలపై భారత్‌ జాగరూకతలో ఉండాల్సిన అవసరం ఉంది.

▪ అభివృద్ధి చెందిన కొన్ని కీలకమైన ఆర్థిక వ్యవస్థలు మాంద్యం పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని, ఆయా దేశాల కేంద్ర బ్యాంకులు అనుసరిస్తున్న కఠిన ద్రవ్య విధానాలతో పరిస్థితి మరింత క్లిష్టంగా మారుతోందని, ఈ నేపథ్యంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కేవలం 2.7 శాతం మాత్రమే వృద్ధి చెందుతుందని రిజర్వ్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా (ఆర్‌బీఐ) ఇటీవలే అంచనా వేసింది. అధిక వడ్డీ ప్రభావం భారత్‌ కార్పొరేట్ల బ్యాలెన్స్‌ షీట్లపై కూడా ప్రతిబింబిస్తోంది. అయితే ఆయా ప్రతికూలతలను భారత్‌ కార్పొరేట్‌ రంగం అధిగమిస్తోంది.

▪ ఇన్ని క్లిష్ట పరిస్థితుల్లోనూ భారత్‌ ఎకానమీ 2022–23లో 6.8 శాతం నుంచి 7 శాతం పురోగమిస్తుందని భావిస్తున్నాం. 2023–24లో కూడా ఇదే సానుకూలత కొనసాగే అవకాశాలూ ఉన్నాయి.

కొత్త ఏడాది లాభాల బోణీ

- తొలి ట్రేడింగ్‌ సెషన్‌లో శుభారంభం
- మళ్లీ 61వేల పాయింట్ల పైకి సెన్సెక్స్
- 18,200 స్థాయికి చేరువలో నిఫ్టీ



ముంబై: దేశీయ స్టాక్‌ సూచీలు కొత్త ఏడాది తొలి ట్రేడింగ్‌ సెషన్‌ను లాభాలతో ముగించాయి. సెన్సెక్స్‌ సోమవారం 327 పాయింట్లు బలపడి 61,168 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 92 పాయింట్లు పెరిగి 18,200 పాయింట్లు చేరువలో 18,197 వద్ద నిలిచింది. నూతన సంవత్సరం నేపథ్యంలో పలు దేశాల స్టాక్‌ మార్కెట్లకు సెలవు కారణంగా సూచీలు ఉదయం ఫ్లాట్‌గా ట్రేడింగ్‌ను ప్రారంభించాయి. తొలుత కాస్త తడిబడినా..., మెటల్, బ్యాంకింగ్, ఫైనాన్స్‌ ఆర్థిక షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో క్రమంగా లాభాల బాటపట్టాయి. ఈ క్రమంలో సెన్సెక్స్‌ 381 పాయింట్లు పెరిగి 61,222 వద్ద, నిఫ్టీ 110 పాయింట్లు బలపడి 18,215 వద్ద ఇంట్రాడే గరిష్టాలను అందుకున్నాయి. గతేడాది చివరి నెల డిసెంబర్‌లో జీఎస్టీ వసూళ్లు గణనీయంగా పెరిగాయి. ఆటో కంపెనీల అమ్మకాలు అంచనాలకు తగ్గట్టు నమోదయ్యాయి. కొత్త వ్యాపారాల ఆర్డర్లలతో తయారీ రంగ పీఎంఐ సూచీ 13 నెలల గరిష్టానికి చేరుకుంది. ఈ సానుకూల పరిణామాలు సూచీల ర్యాలీకి దన్నుగా నిలిచాయి. కన్జూమర్‌ డ్యూరబుల్స్, విద్యుత్‌ రంగాల షేర్ల అమ్మకాలు ఒత్తిడికి లోనయ్యాయి. బీఎస్‌ఈ స్మాల్‌క్యాప్‌ ఇండెక్స్‌ ఒకశాతం, మిడ్‌ క్యాప్‌ సూచీ అరశాతం లాభపడ్డాయి. సూచీలు అరశాతం ర్యాలీ చేయడంతో స్టాక్‌ మార్కెట్లో రూ.1.47 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. విదేశీ ఇన్వెస్టర్లు రూ.213 కోట్ల షేర్లను అమ్మేశారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.743 కోట్ల షేర్లు కొన్నారు. కొత్త ఏడాది సందర్భంగా జపాన్, సింగపూర్, హాంగ్‌కాంగ్, థాయిలాండ్, చైనా, బ్రిటన్‌తో పాటు అమెరికా మార్కెట్లు పని చేయలేదు. అంతర్జాతీయంగా క్రూడాయిల్‌ ధరలు పెరుగుదల, దేశీయ మార్కెట్లో ఎఫ్‌ఐఐల పెట్టుబడుల ఉపసంహరణతో డాలర్‌ మారకంలో రూపాయి విలువ 17 పైసలు క్షీణించి 82.78 స్థాయి వద్ద స్థిరపడింది. 'దేశీయ కార్పొరేట్‌ కంపెనీల ఆదాయాల్లో మెరుగైన వృద్ధి నమోదవ్వొచ్చనే అంచనాలతో పాటు బడ్జెట్‌పై ఆశలతో రానున్న రోజుల్లో దేశీయ స్టాక్‌ మార్కెట్‌ స్థిరంగా రాణించవచ్చు. నిఫ్టీ ఎగువ స్థాయిలో 18,250 పాయింట్లను ఛేదించాల్సి ఉంటుంది. దిగువ స్థాయిలో 18,100 పాయింట్ల వద్ద కీలక మద్దతు ఉంది' అని మోతీలాల్‌ ఓస్వాల్‌ ఫైనాన్షియల్‌ సర్వీసెస్‌ హెడ్‌ సిద్ధార్థ ఖేమా తెలిపారు.

మార్కెట్లో మరిన్ని సంగతులు

▪ డిమాండ్‌ పెంచేందుకు చైనా ఎగుమతుల సుంకాన్ని పెంచడంతో పాటు కోవిడ్‌ ఆంక్షల ఎత్తివేతతో మెటల్‌ షేర్లు మెరిశాయి. సెయిల్, హిందుస్తాన్‌ కాపర్, మొయిల్, జేఎస్‌ఎల్, టాటా స్టీల్‌ షేర్లు 8% నుంచి 7% ర్యాలీ చేశాయి. నాల్కో, హిందాల్కో, వేదాంత, రత్నమణి మెటల్స్, జిందాల్‌ స్టీల్, ఏపీఎల్‌ అపోలో షేర్లు, హిందుస్తాన్‌ జింక్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్‌ షేర్లు 4–1% చొప్పు న రాణించాయి. నిఫ్టీ మెటల్‌ ఇండెక్స్‌ ఇంట్రాడేలో 3% ఎగసి 6907 స్థాయి వద్ద జీవిత కాల గరిష్టాన్ని నమోదు చేసింది.

▪ రెండోరోజు నాటికి షా పాలీమర్స్‌ ఐపీఓ 2.37 రెట్లు సబ్‌స్క్రైబ్‌ అయ్యింది. ఇష్యూలో భాగంగా కంపెనీ 56.10 లక్షల ఈక్విటీ షేర్లను జారీ చేయగా 1.33 లక్షల షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి.

▪ ఫార్మా షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. నాట్కో ఫార్మా, దివీస్‌ ల్యాబ్స్, అరబిందో ఫార్మా, ఇప్కా ల్యాబ్స్, ఫైజర్, లారస్‌ ల్యాబ్స్‌ సన్‌ ఫార్మా షేర్లు 1.50% నుంచి ఒకశాతం నష్టపోయాయి.

ఆన్‌లైన్‌ గేమింగ్‌కు స్వీయ నియంత్రణ సంస్థ

- గేమ్స్‌ ఫలితాలపై బెట్టింగ్‌ చేయకూడదు
- నిబంధనల ముసాయిదా విడుదల



న్యూఢిల్లీ: ఆన్‌లైన్‌ గేమింగ్‌ కంపెనీలకు సంబంధించిన నిబంధనల ముసాయిదాను కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ (ఎంఈఐటీవై) విడుదల చేసింది. వీటి ప్రకారం ఆన్‌లైన్‌ గేమింగ్‌ పరిశ్రమ.. స్వీయ నియంత్రణ సంస్థను (ఎస్‌ఆర్‌వో) ఏర్పాటు చేసుకోవాల్సి రానుంది. అలాగే తప్పనిసరిగా ప్లేయర్ల ధ్రువీకరణ, భారత్‌లో భౌతిక చిరునామా నిబంధనలను పాటించాల్సి ఉంటుంది. గేమ్స్‌ ఫలితాలపై బెట్టింగ్‌ చేయడానికి ఉండదు. వీటిపై పరిశ్రమ వర్గాలు జనవరి 17లోగా తమ అభిప్రాయాలను తెలియజేయాల్సి ఉంటుందని ఎంఈఐటీవై సహాయ మంత్రి రాజీవ్‌ చంద్రశేఖర్‌ తెలిపారు. తుది నిబంధనలు ఫిబ్రవరి తొలి నాళ్లలో ఖరారయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. దేశీయంగా ఆన్‌లైన్‌ గేమింగ్‌ రంగం వృద్ధికి, నవకల్పనలకు ప్రోత్సాహమివ్వాలనేది నిబంధనల ప్రధాన లక్ష్యమని ఆయన చెప్పారు. 200 బిలియన్‌ డాలర్ల పైచిలుకు విలువ గల పరిశ్రమలో స్టార్టప్‌లు, పెట్టుబడులపరంగా ఎదిగేందుకు భారత్‌కు గణనీయంగా అవకాశాలు ఉన్నాయని ఆయన తెలిపారు. 2021లో సోషల్‌ మీడియా ప్లాట్‌ఫామ్స్‌ కోసం రూపొందించిన కొత్త ఐటీ నిబంధనల పరిధిలో ఆన్‌లైన్‌ గేమింగ్‌ కంపెనీలు పని చేయాల్సి ఉంటుందని మంత్రి చెప్పారు.

యూపీఐ చెల్లింపులు @ రూ. 13 లక్షల కోట్లు

డిసెంబర్‌లో రికార్డు స్థాయిలో పేమెంట్స్; 782 కోట్ల లావాదేవీలు



న్యూఢిల్లీ: ఏకీకృత చెల్లింపుల విధానం (యూపీఐ) ద్వారా గత డిసెంబర్‌లో రికార్డు స్థాయిలో చెల్లింపులు జరిగాయి. 782 కోట్ల లావాదేవీల ద్వారా ఏకంగా రూ. 12.82 లక్షల కోట్ల పేమెంట్స్‌ నమోదయ్యాయి. 2016లో ప్రారంభమైన యూపీఐ ప్లాట్‌ఫామ్‌ దేశీయంగా డిజిటల్‌ పేమెంట్స్‌ విభాగంలో విప్లవాత్మక మార్పులు తేవడంలో కీలక పాత్ర పోషిస్తోందని ఆర్థిక సేవల విభాగం సోమవారం మైక్రోబ్లాగింగ్‌ సైట్‌ ట్విట్టర్‌లో ట్వీట్‌ చేసింది. యూపీఐ చెల్లింపులు గతేడాది అక్టోబర్‌లో తొలిసారిగా రూ. 12 లక్షల కోట్ల మార్కును దాటాయి. నవంబర్‌లో రూ. 11.90 లక్షల కోట్లకు తగ్గినా, డిసెంబర్‌లో మళ్లీ పెరిగాయి. ప్రస్తుతం దాదాపు 381 బ్యాంకులు యూపీఐ ప్లాట్‌ఫామ్‌లో ఉన్నాయి.

విద్య, ఉద్యోగ సమాచారం

టీఎస్‌పీఎస్సీలో 783 గ్రూప్‌-2 పోస్టులు

తెలంగాణ స్టేట్‌ పబ్లిక్‌ సర్వీస్‌ కమిషన్‌(టీఎస్‌పీఎస్సీ).. 18 ప్రభుత్వ విభాగాల్లో వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 783

» **వయసు:** 01.07.2022 నాటికి ప్రొహిబిషన్‌ అండ్‌ ఎక్సైజ్‌ సబ్‌ ఇన్‌స్పెక్టర్‌ పోస్టులకు 21 నుంచి 30 ఏళ్లు, ఇతర పోస్టులకు 18 నుంచి 44 ఏళ్ల మధ్య వయసు ఉండాలి. రిజర్వేషన్‌ వర్గాలకు వయో సడలింపు లభిస్తుంది.

» **అర్హత:** పోస్టును అనుసరించి బ్యాచిలర్స్‌ డిగ్రీ, బ్యాచిలర్స్‌ డిగ్రీ(మ్యాథ్స్‌ /ఎకనామిక్స్‌/కామర్స్‌/లా), ఎంఏ(సోషల్‌ వర్క్‌/సైకాలజీ/క్రిమినాలజీ/కరెక్షనల్‌ అడ్మినిస్ట్రేషన్). డిప్లొమా(టెక్స్‌టైల్‌ టెక్నాలజీ/హ్యాండ్‌లూమ్‌ టెక్నాలజీ). ప్రొహిబిషన్‌ అండ్‌ ఎక్సైజ్‌ సబ్‌ ఇన్‌స్పెక్టర్‌ పోస్టులకు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు ఉండాలి.

» **ఎంపిక విధానం:** రాతపరీక్ష(ఆబ్జెక్టివ్‌ టైప్),ధ్రువపత్రాల పరిశీలన,రూల్‌ ఆఫ్‌ రిజర్వేషన్‌ ఆధారంగా ఎంపికచేస్తారు. **పరీక్ష విధానం:** పేపర్‌–1(జనరల్‌ స్టడీస్, జనరల్‌ ఎబిలిటీస్), పేపర్‌–2(హిస్టరీ, పాలిటీ, సొసైటీ), పేపర్‌–3(ఎకానమీ,డెవలప్‌మెంట్),పేపర్‌–4(తెలంగాణ మూ మెంట్, స్టేట్‌ ఫార్మేషన్)పరీక్షలు ఉంటాయి. ప్రతి పేపర్‌కు 150 ప్రశ్నల చొప్పున మొత్తం 600 మార్కులు కేటాయించారు. ప్రతి పేపర్‌కు రెండున్నర గంటల వ్యవధి ఉంటుంది.

» **ఆన్‌లైన్‌ దరఖాస్తు ప్రారంభతేది:** 18.01.2023.

» **ఆన్‌లైన్‌ దరఖాస్తులకు చివరితేది:** 16.02.2023.

» **వెబ్‌సైట్:** tspsc.gov.in

యూజీసీ-నెట్-2022 డిసెంబర్

యూనివర్సిటీ గ్రాంట్స్‌ కమిషన్‌(యూజీసీ).. నేషనల్‌ ఎలిజిబిలిటీ టెస్ట్‌ డిసెంబర్‌ 2022 (యూజీసీ–నెట్) పరీక్ష షెడ్యూల్‌ విడుదల చేసింది. జూనియర్‌ రీసెర్చ్‌ ఫెలోషిప్‌(జేఆర్‌ఎఫ్), విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ పోస్టుల కోసం ఈ పరీక్షను నిర్వహిస్తారు.

» **సబ్జెక్టులు:** అడల్ట్‌ ఎడ్యుకేషన్, ఆంత్రోపాలజీ, అరబ్‌ కల్చర్‌ అండ్‌ ఇస్లామిక్‌ స్టడీస్, అరబిక్, ఆర్కియాలజీ, అస్సామీ, బెంగాలీ, బోడో, బౌద్ధ, జైన, చైనీస్, కామర్స్, కంప్యూటర్‌ సైన్స్, క్రిమినాలజీ తదితరాలు.

» **అర్హత:** 55శాతం మార్కులతో మాస్టర్స్‌ డిగ్రీ లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలి.

» **వయసు:** జేఆర్‌ఎఫ్‌కు 01.02.2023 నాటికి 30 ఏళ్లు మించకూడదు. అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌కు గరిష్ట వయోపరిమితి లేదు.

» **పరీక్ష విధానం:** కంప్యూటర్‌ ఆధారిత పరీక్ష(సీబీటీ)విధానంలో ఉంటుంది. పరీక్షలో రెండు పేపర్లు ఉంటాయి. రెండు పేపర్లలోనూ ఆబ్జెక్టివ్‌ టైప్, మల్టిపుల్‌ ఛాయిస్‌ ప్రశ్నలు ఉంటాయి. పేపర్‌–1లో 50 ప్రశ్నలకు 100 మార్కులు, పేపర్‌–2లో 100 ప్రశ్నలకు 200 మార్కులు కేటాయించారు. పరీక్ష వ్యవధి 3 గంటలు.

» **ఆన్‌లైన్‌ దరఖాస్తులకు చివరితేది:** 17.01.2023.

» **పరీక్ష తేదీలు:** 21.02.2023 నుంచి 10.03.2023 వరకు. »**వెబ్‌సైట్:** ugcnet.nta.nic.in

టీఎస్‌ఎన్‌పీడీసీఎల్, హన్మకొండలో 157 పోస్టులు

హన్మకొండలో తెలంగాణ నార్తర్న్‌ పవర్‌ డిస్ట్రిబ్యూషన్‌ కంపెనీ ఆఫ్‌ తెలంగాణ లిమిటెడ్(టీఎస్‌ఎన్‌పీడీసీఎల్).. వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. » **మొత్తం పోస్టుల సంఖ్య:** 157

» **యూనిట్‌ల వారీగా ఖాళీలు:** హన్మకొండ–11, వరంగల్–10,జనగాం–08, మహబూబాబాద్–08, ప్రొఫెసర్‌ జయశంకర్‌ భూపాలపల్లి–07, కరీంనగర్–13, పెద్దపల్లి–10, జగిత్యాల–09, ఖమ్మం–15, భద్రాద్రి కొత్తగూడెం–10, నిజామాబాద్–16, కామారెడ్డి–11, ఆదిలాబాద్–07, నిర్మల్–07, మంచిర్యాల–08, కుమురంభీం–ఆసిఫాబాద్–06, కార్పొరేట్‌ ఆఫీస్–01.

» **అర్హత:** సీఏ, సీఐఎస్‌ఏ/డీఐఎస్‌ఏ ఉత్తీర్ణులవ్వాలి. ఈఆర్‌పీ/ఎస్‌ఏపీలో పరిజ్ఞానం ఉండాలి. కనీసం 3 ఏళ్ల పని అనుభవం ఉండాలి. **కాంట్రాక్ట్‌ వ్యవధి:** 02 ఏళ్లు.

» **వేతనం:** నెలకు రూ.35,000 చెల్లిస్తారు.

» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ది చీఫ్‌ జనరల్‌ మేనేజర్(ఆడిట్)టీఎస్‌ఎన్‌పీడీసీఎల్, కార్పొరేట్‌ ఆఫీస్, థర్డ్‌ ఫ్లోర్, విద్యుత్‌ భవన్, నక్కలగుట్ట, హన్మకొండ, 506001(తెలంగాణ) సెల్‌ నెం–+91–9440811214చిరునామకు పంపించాలి.

» **దరఖాస్తులకు చివరితేది:** 23.01.2023.

» **వెబ్‌సైట్:** www.tsnpdcl.in

ఐఏసీఎస్, కోల్‌కతాలో 10 ఎంటీఎస్‌ పోస్టులు

కోల్‌కతాలోని ఇండియన్‌ అసోసియేషన్‌ ఫర్‌ ది కల్టివేషన్‌ ఆఫ్‌ సైన్సెస్(ఐఏసీఎస్) మల్టీ టాస్కింగ్‌ స్టాఫ్(ఎంటీఎస్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. » **మొత్తం పోస్టుల సంఖ్య:** 10

» **అర్హత:** మెట్రిక్యులేషన్/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులవ్వాలి.**వయసు:**18నుంచి 27ఏళ్లు ఉండాలి.

» **వేతనం:** నెలకు రూ.18,000 చెల్లిస్తారు.

» **ఎంపిక విధానం:** స్క్రీనింగ్, రాతపరీక్ష, స్కిల్/ట్రేడ్‌ టెస్ట్‌ ఆధారంగా ఎంపికచేస్తారు.

» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ఇండియన్‌ అసోసియేషన్‌ ఫర్‌ ది కల్టివేషన్‌ ఆఫ్‌ సైన్సెస్(ఐఏసీఏస్) జదవ్‌పూర్, కోల్‌కతా–700032 చిరునామకు పంపించాలి.

» **దరఖాస్తులకు చివరితేది:** 31.01.2023.

» **వెబ్‌సైట్:** www.iacs.res.in

అవుతారా.. సామాజిక శాస్త్రవేత్త!

» టిస్‌నెట్‌-2023 దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం
» ఆర్ట్స్, హ్యూమానిటీస్‌లలో పీజీ, పీజీ డిప్లొమా కోర్సులు
» ఈ కోర్సులతో ఉపాధి, ఉజ్వల భవిష్యత్తుకు భరోసా

టాటా ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ సోషల్‌ సైన్సెస్.. సంక్షిప్తంగా టిస్! సామాజిక ప్రగతికి దోహదపడే సోషల్‌ వర్క్‌ మొదలు.. గవర్నెన్స్, పాలసీ తదితర వినూత్న విభాగాల్లో.. ప్రత్యేక పీజీ ప్రోగ్రామ్‌లను అందిస్తున్న సంస్థ ఇది! టిస్‌ తనకు దేశ వ్యాప్తంగా ఉన్న నాలుగు క్యాంపస్‌ల్లో పీజీ ప్రోగ్రామ్‌ల్లో ఆన్‌లైన్‌ పరీక్ష, ఇంటర్వ్యూల ద్వారా ప్రవేశం కల్పిస్తోంది. ఇందుకోసం టిస్‌ నెట్‌-2023 నోటిఫికేషన్‌ విడుదల చేసింది!! దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో.. టిస్‌ ప్రత్యేకతలు, ప్రవేశ ప్రక్రియ వివరాలు, అర్హతలు, పరీక్ష విధానంపై ప్రత్యేక కథనం...



సోషల్‌ సైన్స్‌ కోర్సులు అనగానే టక్కున గుర్తొచ్చే విద్యాసంస్థ.. టాటా ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ సోషల్‌ సైన్సెస్(టిస్). ఈ ఇన్‌స్టిట్యూట్‌ అందించే సోషల్‌ వర్క్, హ్యూమన్‌ రిసోర్సెస్‌ మేనేజ్‌మెంట్‌ పీజీ ప్రోగ్రామ్‌లు ఎంతో ప్రత్యేకమైనవి. ఈ కోర్సుల ద్వారా విద్యార్థులను సామాజిక ప్రగతిలో పాలుపంచుకునేలా తీర్చిదిద్దుతారు.

4 క్యాంపస్‌లు.. 60 ప్రోగ్రామ్‌లు

- టిస్‌కు ముంబై ప్రధాన క్యాంపస్‌తోపాటు తుల్జాపూర్, హైదరాబాద్, గువహటిల్లోనూ క్యాంపస్‌లు ఉన్నాయి. ఇవి 57 పీజీ ప్రోగ్రామ్‌లు, మూడు పీజీ డిప్లొమా ప్రోగ్రామ్‌లు ఇలా మొత్తం 60 ప్రోగ్రామ్‌లు అందిస్తున్నాయి.
- ముంబై క్యాంపస్‌లో పీజీ స్థాయిలో ఎంఏ సోషల్‌ వర్క్(క్రిమినాలజీ అండ్‌ జస్టిస్), ఎంఏ–అప్లైడ్‌ సైకాలజీ(క్లినికల్‌ అండ్‌ కౌన్సెలింగ్‌ ప్రాక్టీస్), ఎంఏ–సోషల్‌ వర్క్(పబ్లిక్‌ హెల్త్), మాస్టర్‌ ఆఫ్‌ పబ్లిక్‌ హెల్త్, ఎంఏ–సోషల్‌ వర్క్(చిల్డ్రన్‌ అండ్‌ ఫ్యామిలీస్), మాస్టర్‌ ఆఫ్‌ లైబ్రరీ సైన్స్, మాస్టర్‌ ఆఫ్‌ పబ్లిక్‌ హెల్త్(హెల్త్‌ అడ్మినిస్ట్రేషన్), మాస్టర్‌ ఆఫ్‌ 'లా'స్(యాక్సెస్‌ టు జస్టిస్), ఎంఏ–డెవలప్‌మెంట్‌ స్టడీస్, ఎంఏ–మీడియా అండ్‌ కల్చరల్‌ స్టడీస్, ఎంఏ/ఎమ్మెస్సీ(డిజాస్టర్‌ మేనేజ్‌మెంట్), ఎంఏ/ఎమ్మెస్సీ(అర్బన్‌ పాలసీ అండ్‌ గవర్నెన్స్), ఎంఏ–ఎడ్యుకేషన్, ఎంఏ–సోషల్‌ వర్క్(దళిత్‌ అండ్‌ ట్రైబల్‌ స్టడీస్‌ యాక్షన్), ఎంఏ–సోషల్‌ వర్క్(డిజేబిలిటీ స్టడీస్‌ అండ్‌ యాక్షన్), ఎంఏ–ఆర్గనేజేషన్‌ డెవలప్‌మెంట్, ఛేంజ్‌ అండ్‌ లీడర్‌షిప్, ఎంఏ/ఎమ్మెస్సీ(రెగ్యులేటరీ పాలసీ అండ్‌ గవర్నెన్స్), ఎంఏ–గ్లోబల్‌ మెంటల్‌ హెల్త్, మాస్టర్‌ ఆఫ్‌ పబ్లిక్‌ హెల్త్(సోషల్‌ ఎపిడమాలజీ), ఎంఏ–ఎడ్యుకేషన్(ఎడ్యుకేషన్‌ టెక్నాలజీ), ఎంఏ–సోషల్‌ వర్క్ (లైవ్‌లీహుడ్‌ అండ్‌ సోషల్‌ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్),ఎంఏ/ఎమ్మెస్సీ(ఎన్విరాన్‌మెంట్). తదితర మొత్తం 38 ప్రోగ్రామ్‌లు ఉన్నాయి.
- **తుల్జాపూర్‌ క్యాంపస్‌లో..** సోషల్‌ వర్క్‌ అండ్‌ రూరల్‌ డెవలప్‌మెంట్‌లో ఎంఏ, డెవలప్‌మెంట్‌ పాలసీ, ప్లానింగ్‌ అండ్‌ ప్రాక్టీస్; సస్టెయినబుల్‌ లైవ్‌లీహుడ్స్‌ అండ్‌ నేచురల్‌ రిసోర్సెస్, సోషల్‌ ఇన్నోవేషన్‌ అండ్‌ ఎంట్రప్రెన్యూర్‌షిప్, గవర్నెన్స్‌లో ఎంఏ /ఎమ్మెస్సీ కోర్సులున్నాయి.
- **గువహటి క్యాంపస్‌లో..** పబ్లిక్‌ హెల్త్, లేబర్‌ స్టడీస్‌ అండ్‌ సోషల్‌ ప్రొటెక్షన్; కమ్యూనిటీ ఆర్గనైజేషన్‌ అండ్‌ డెవలప్‌మెంట్‌ ప్రాక్టీస్; ఎకాలజీ, ఎన్విరాన్‌మెంట్‌ అండ్‌ సస్టెయినబుల్‌ డెవలప్‌మెంట్; లైవ్‌లీహుడ్స్‌ అండ్‌ సోషల్‌ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్; కౌన్సెలింగ్, పీస్‌ అండ్‌ కన్‌ఫ్లిక్ట్‌ స్టడీస్; సోషియాలజీ అండ్‌ సోషల్‌ ఆంత్రోపాలజీ స్పెషలైజేషన్లతో ఎంఏ సోషల్‌వర్క్‌ ప్రోగ్రామ్స్‌ అందుబాటులో ఉన్నాయి.
- **హైదరాబాద్‌ క్యాంపస్‌లో..** పీజీ డిప్లొమా ఇన్‌ సిటీస్‌ అండ్‌ గవర్నెన్స్, పీజీ డిప్లొమా ఇన్‌ పబ్లిక్‌ పాలసీ అండ్‌ గవర్నెన్స్, ఎంఏ(సిటీస్‌ అండ్‌ గవర్నెన్స్),ఎంఏ(ఉమెన్‌ స్టడీస్), ఎంఏ–ఎడ్యుకేషన్, ఎంఏ–రూరల్‌ డెవలప్‌మెంట్‌ అండ్‌ గవర్నెన్స్, ఎంఏ–పబ్లిక్‌ పాలసీ అండ్‌ గవర్నెన్స్, పీజీ డిప్లొమా ఇన్‌ నేచురల్‌ రిసోర్సెస్‌ అండ్‌ గవర్నెన్స్, ఎంఏ–నేచురల్‌ రిసోర్సెస్‌ అండ్‌ గవర్నెన్స్.

అర్హత

బ్యాచిలర్‌ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి. చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. కొన్ని ప్రోగ్రామ్‌లకు ప్రత్యేక అర్హతలు నిర్దేశించారు.

ప్రవేశాలు ఇలా

- జాతీయ స్థాయిలో నిర్వహించే టిస్‌–నెట్‌లో చూపిన ప్రతిభ ఆధారంగా షార్ట్‌లిస్ట్‌ చేసి.. తదుపరి దశలో టిస్‌ప్యాట్, పర్సనల్‌ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు.
- టిస్‌–నెట్‌ పరీక్షను మొత్తం మూడు విభాగాల్లో వంద మార్కులకు నిర్వహిస్తారు. ఇంగ్లిష్‌ ప్రొఫిషియన్సీ 30 ప్రశ్నలు–30 మార్కులు, మ్యాథమెటిక్స్‌ అండ్‌ లాజికల్‌ రీజనింగ్‌ 30 ప్రశ్నలు–30 మార్కులు, జనరల్‌ అవేర్‌నెస్‌ 40 ప్రశ్నలు–40 మార్కులకు పరీక్ష ఉంటుంది. పరీక్ష సమయం ఒక గంట 40 నిమిషాలు. పరీక్ష పూర్తిగా ఆన్‌లైన్‌ విధానంలోనే జరుగుతుంది.

తదుపరి దశలో టిస్‌-ప్యాట్

టిస్‌–నెట్‌లో చూపిన ప్రతిభ ఆధారంగా మెరిట్‌ జాబితా రూపొందించి.. తదుపరి దశలో ప్రోగ్రామింగ్‌ ఆప్టిట్యూడ్‌ టెస్ట్(పీఏటీ)ను నిర్వహిస్తారు. ఇది ఆన్‌లైన్‌ విధానంలో 50 మార్కులకు రెండు విభాగాలుగా ఉంటుంది. అభ్యర్థులు ఎంచుకున్న స్పెషలైజేషన్‌కు అనుగుణంగా పరీక్షలో ప్రశ్నలు ఉంటాయి. టిస్‌ ప్యాట్‌ సెక్షన్–ఎలో ప్యాసేజ్‌ ఆధారిత ప్రశ్నలు ఉంటాయి. ఒక ప్యాసేజ్‌ ఇచ్చి దానికి సంబంధించి అడిగే మూడు ప్రశ్నలకు సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. ఇలా మొత్తం 30 మార్కులకు సెక్షన్–ఎలో పరీక్ష ఉంటుంది. సెక్షన్–బిలో ఒక ఎస్సే రాయాల్సి ఉంటుంది. దీనికి కేటాయించిన మార్కులు 20. ఇలా మొత్తం 50 మార్కులకు టిస్‌ ప్యాట్‌ను నిర్వహిస్తారు. కొన్ని స్పెషలైజేషన్లకు సెక్షన్–ఎలోనే ఎస్సే రైటింగ్, సెక్షన్–బిలో స్టేట్‌మెంట్‌ ఆఫ్‌ పర్పస్‌ రాయాల్సి ఉంటుంది.

పర్సనల్‌ ఇంటర్వ్యూ

- ఎంపిక ప్రక్రియలో చివరి, మూడో దశలో పర్సనల్‌ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఈ ప్రక్రియ 20 నుంచి 30 నిమిషాల వ్యవధిలో ఉంటుంది. ఆయా కోర్సులను అభ్యసించేందుకు అభ్యర్థులకున్న ఆసక్తి, సరితూగే తత్వాన్ని పరీక్షిస్తారు. ముగ్గురు సభ్యుల కమిటీ ఈ ప్రక్రియ నిర్వహిస్తుంది. ఇందులో అభ్యర్థుల నైపుణ్యాలు, ఆసక్తి, సన్నద్ధత తదితర అంశాలను పరిశీలిస్తారు. ఈ మూడు దశల్లోనూ విజయం సాధిస్తే సీటు ఖరారు చేస్తారు.

వెయిటేజీ విధానం

- మొత్తం మూడు దశలుగా ఉండే ఎంపిక ప్రక్రియలో భాగంగా.. తుది విజేతలను ఖరారు చేసేందుకు ఆయా దశల్లో చూపిన ప్రతిభకు వెయిటేజీ ఇచ్చే విధానాన్ని అమలు చేస్తున్నారు.
- టిస్‌–నెట్‌కు 50 శాతం వెయిటేజీ, ఆన్‌లైన్‌ అసెస్‌మెంట్‌ టెస్ట్‌కు 20 శాతం వెయిటేజీ, పర్సనల్‌ ఇంటర్వ్యూకు 30శాతం వెయిటేజీ కల్పిస్తున్నారు.
- హ్యూమన్‌ రిసోర్స్‌ మేనేజ్‌మెంట్‌ అండ్‌ లేబర్‌ రిలేషన్స్; ఆర్గనైజేషనల్‌ డెవలప్‌మెంట్‌ అండ్‌ ఛేంజ్‌ కోర్సులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు రెండో దశలో ప్రోగ్రామింగ్‌ ఆప్టిట్యూడ్‌కు బదులు ప్రత్యేకంగా నిర్వహించే మేనేజ్‌మెంట్‌ ఆప్టిట్యూడ్‌ టెస్ట్(టిస్‌ మ్యాట్)కు హాజరవ్వాల్సి ఉంటుంది.
- 45 నిమిషాల వ్యవధిలో ఉండే టిస్‌ మ్యాట్‌లో.. మూడు విభాగాల్లో (కాంప్రహెన్షన్‌ – 10 ప్రశ్నలు, బిజినెస్‌ అవేర్‌నెస్–10 ప్రశ్నలు, మేనేజ్‌మెంట్‌ డేటా ఇంటర్‌ప్రిటేషన్‌ –15 ప్రశ్నలు) పరీక్ష ఉంటుంది. ఈ మూడు విభాగాల నుంచి ఆబ్జెక్టివ్‌ విధానంలో ప్రశ్నలు అడుగుతారు. దీంతోపాటు డిస్క్రిప్టివ్‌ రైటింగ్‌ పేరుతో ఒక ఎస్సే రాయాల్సి ఉంటుంది. దీనికి 16 మార్కులు కేటాయించారు. ఇలా మొత్తం 50 మార్కులకు టిస్–మ్యాట్‌ ఉంటుంది.

ఉజ్వల కెరీర్స్

టిస్‌లో పీజీ ప్రోగ్రామ్‌లు పూర్తి చేసుకున్న విద్యార్థులకు క్యాంపస్‌ రిక్రూట్‌మెంట్‌ డ్రైవ్స్‌తోనే కెరీర్‌ అవకాశాలు లభిస్తున్నాయి. కార్పొరేట్‌ కొలువులు సొంతమవుతున్నాయి. యూనిసెఫ్, యూఎన్‌డీపీ వంటి ఐక్యరాజ్యసమితి అనుబంధ విభాగాలతోపాటు సేవ్‌ చిల్డ్రన్, ప్రదాన్‌ వంటి సామాజిక సేవా సంస్థల్లో కొలువులు లభిస్తున్నాయి. వీటితో పాటు రిలయన్స్‌ ఫౌండేషన్, కేపీఎంజీ, టాటా క్లాస్‌ ఎడ్జ్, పీడబ్ల్యూసీ, ఉబెర్‌ వంటి కార్పొరేట్‌ సంస్థలు సైతం క్యాంపస్‌ రిక్రూట్‌మెంట్‌ డ్రైవ్స్‌లో పాల్గొని ఆఫర్లు ఖరారు చేస్తున్నాయి. సగటున రూ.5 లక్షల వార్షిక వేతనం లభిస్తోంది.

సిలబస్‌ అంశాలు ఇవే

- **ఇంగ్లిష్‌ ప్రొఫిషియన్సీ:** అభ్యర్థుల్లోని ఇంగ్లిష్‌ నైపుణ్యాలను పరిశీలించే ఈ విభాగంలో రాణించడానికి సెంటెన్స్‌ కరెక్షన్, అనాలజీస్, సినానిమ్స్, యాంటానిమ్స్, గ్రామర్, వెర్బల్‌ రీజనింగ్, రీడింగ్‌ కాంప్రహెన్షన్‌లపై పట్టు సాధించాలి.
- **మ్యాథమెటికల్‌ అండ్‌ లాజికల్‌ రీజనింగ్:** ఈ విభాగంలో మెరుగైన మార్కులు సాధించడానికి అర్థమెటిక్, జామెట్రీ, ట్రిగ్నోమెట్రీ, స్టాటిస్టిక్స్, నంబర్‌ సిరీస్, డేటా ఇంటర్‌ప్రిటేషన్, లాజికల్‌ రీజనింగ్‌లను ప్రాక్టీస్‌ చేయాలి.
- **జనరల్‌ అవేర్‌నెస్:** ఈ విభాగానికి సంబంధించి రాజకీయాలు, సోషల్‌ స్టడీస్, సైన్స్‌ అండ్‌ టెక్నాలజీ, ఎన్విరాన్‌మెంట్, స్పోర్ట్స్, ఆర్ట్‌ అండ్‌ కల్చర్, భారత చరిత్ర అంశాలపై దృష్టి పెట్టాలి.
- ఇంగ్లిష్, మ్యాథమెటిక్స్‌కు సంబంధించి అభ్యర్థులు పదో తరగతి స్థాయి పుస్తకాలను అభ్యసనం చేయడం ద్వారా అవగాహన పొందొచ్చు.
- జనరల్‌ అవేర్‌నెస్‌కు సంబంధించి సమకాలీన అంశాలు, 12వ తరగతి వరకు ఎన్‌సీఈఆర్‌టీ సోషల్‌ పుస్తకాలను అధ్యయనం చేయడం ఉపయుక్తంగా ఉంటుంది.

టిస్ -నెట్-2023 ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌ ద్వారా.
- **ఆన్‌లైన్‌ దరఖాస్తు చివరి తేదీ:** 2023, జనవరి 15
- **టిస్–నెట్‌ ఆన్‌లైన్‌ టెస్ట్‌ తేదీలు:** 2023 జనవరి 28– 2023 ఫిబ్రవరి 28.
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** విశాఖపట్నం, హైదరాబాద్
- **వెబ్‌సైట్:** https://admissions.tiss.edu


పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో మహిళకు సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి


నెల్లూరు జిల్లా కంపసముద్రంలో సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

గడప గడపకు మన ప్రభుత్వం


కర్నూలు జిల్లా పర్వతాపురంలో సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి


విజయనగరం జిల్లా జామి మండలం అలమండలో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

క్లుప్తంగా

6న విజయవాడలో కోస్తాంధ్ర కలెక్టర్లతో రెవెన్యూ సదస్సు

సాక్షి, అమరావతి: కోస్తాంధ్ర జిల్లా కలెక్టర్లతో ఈ నెల 6వ తేదీన రెవెన్యూ శాఖ విజయవాడలో సదస్సు నిర్వహించనుంది. ఇప్పటికే రాయలసీమ జిల్లాల సదస్సును తిరుపతిలో నిర్వహించింది. భూముల రీ సర్వే, రెవెన్యూ శాఖకు సంబంధించిన పలు అంశాలపై చర్చించేందుకు ఈ సదస్సు నిర్వహిస్తున్నారు. రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు, సీసీఎల్‌ఏ ఉన్నతాధికారులు సదస్సులో పాల్గొననున్నారు. ఈ సమావేశం తర్వాత ఉత్తరాంధ్ర జిల్లాల సదస్సును నిర్వహించనున్నారు.

రేపటి నుంచి కుప్పంలో చంద్రబాబు పర్యటన

కుప్పం/చిత్తూరు అర్బన్: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఈ నెల నాలుగో తేదీ నుంచి మూడు రోజులు కుప్పం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఆయన బుధవారం ఉదయం బెంగళూరు నుంచి శాంతిపురం మండలం 121 పెద్దూరు గ్రామానికి చేరుకుని తన పర్యటనను ప్రారంభిస్తారని టీడీపీ నాయకులు తెలిపారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా చంద్రబాబు కుప్పం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో రోడ్ షోలు, నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తారని వెల్లడించారు.


చేపల సాగు పేరుతో బ్యాంకుకు బురిడీ

రూ.20.31కోట్ల ఆస్తుల జప్తు

సాక్షి, అమరావతి: చేపల సాగు పేరిట బ్యాంకులను మోసం చేసి కిసాన్ క్రెడిట్ కార్డు రుణాలు తీసుకున్న కేసులో గుంటూరు జిల్లాకు చెందిన నలుగురు నిందితులకు సంబంధించిన రూ.20.31కోట్ల ఆస్తిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సోమవారం జప్తు చేసింది. గుంటూరు జిల్లాకు చెందిన మాద సుబ్రహ్మణ్యం, మాద శ్రీనివాసరావు, గండూరి మల్లికార్జునరావు, ఏలూరి ప్రసాదరావు ఐడీబీఐ బ్యాంకును మోసం చేసి రుణాలు పొందినట్లు సీబీఐ 2002లో కేసు నమోదు చేసింది. ఆ నలుగురు నిందితులు తమ కుటుంబసభ్యులు, తమ వద్ద పని చేసే సిబ్బందిని చేపల సాగు రైతులుగా చూపిస్తూ కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా రుణాలు పొందినట్లు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. అప్పటి ఐడీబీఐ గుంటూరు శాఖ మేనేజర్ చెన్నపగారి శంకర్ హరీశ్ సహకారంతో మొత్తం 247మంది పేరుతో రూ.57.10కోట్ల రుణాలు పొందారని నిర్ధారించింది. ఆ రుణ మొత్తంతో నిందితులు నలుగురు పలుచోట్ల స్థిరాస్తులను కొనుగోలు చేసినట్లు గుర్తించింది. కాగా మనీ ల్యాండరింగ్‌కు సంబంధించి చట్టాలు కూడా ఉల్లంఘించిన ఈ కేసులో నిందితులకు చెందిన రూ.20.31కోట్ల విలువైన 47 స్థిరాస్తులను జప్తు చేసినట్లు ఈడీ సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది.

నేడు గోదావరి బోర్డు భేటీ

- గెజిట్ నోటిఫికేషన్‌పై ఏకాభిప్రాయ సాధనకు ప్రయత్నం
- నిబంధనలకు విరుద్ధంగా మూడు ప్రాజెక్టులకు అనుమతి
- అనుమతి లేని ప్రాజెక్టుల డీపీఆర్‌ల మదింపు
- పునఃసమీక్ష చేయాలని డిమాండ్ చేయనున్న ఏపీ



సాక్షి, అమరావతి: అనుమతి లేకుండా చేపట్టిన ప్రాజెక్టుల సమగ్ర ప్రాజెక్టు నివేదికల (డీపీఆర్) మదింపు, గెజిట్ నోటిఫికేషన్‌పై ఏకాభిప్రాయ సాధనకు గోదావరి బోర్డు భేటీ అవుతోంది. మంగళవారం హైదరాబాద్‌లో బోర్డు చైర్మన్ ఎంకే సిన్హా అధ్యక్షతన జరిగే 14వ సర్వ సభ్య సమావేశంలో ఏపీ, తెలంగాణ జలవనరుల శాఖ ఉన్నతాధికారులు పాల్గొంటున్నారు. గోదావరిలో నీటి లభ్యతను శాస్త్రీయంగా తేల్చి, రెండు రాష్ట్రాలకు పంపిణీ చేసే వరకు తెలంగాణ చేపట్టిన ఆ ప్రాజెక్టులకు అనుమతి ఇవ్వకూడదని గతేడాది ఏప్రిల్ 27న జరిగిన బోర్డు సర్వసభ్య సమావేశంలో ఆంధ్రప్రదేశ్ డిమాండ్ చేసింది. ఎగువ రాష్ట్రమైన తెలంగాణ ప్రాజెక్టులకు అనుమతి ఇస్తే దిగువ రాష్ట్రమైన ఏపీ హక్కులకు విఘాతం కలిగించినట్టవుతుందని ఏపీ అధికారులు స్పష్టం చేశారు. ఏపీ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా తెలంగాణ చేపట్టిన చనకా–కొరటా, చిన్న కాళేశ్వరం, గుత్ప ఎత్తిపోతల పథకాలకు గతేడాది నవంబర్ 29న సీడబ్ల్యూసీ సాంకేతిక సలహా మండలి (టీఏసీ) సమావేశంలో ఏకపక్షంగా సాంకేతిక అనుమతి ఇవ్వడంపై ఏపీ తీవ్ర అభ్యంతరం తెలిపింది. ఆ మూడు ప్రాజెక్టులకు ఇచ్చిన సాంకేతిక అనుమతులను పునఃసమీక్షించాలని గోదావరి బోర్డు సమావేశంలో డిమాండ్ చేయనుంది.

నిబంధనలు బేఖాతరు

అనుమతి లేని ప్రాజెక్టులకు ఆరు నెలల్లోగా అనుమతి తెచ్చుకోవాలని గోదావరి బోర్డు పరిధిని నిర్దేశిస్తూ 2021 జూలై 15న జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో కేంద్ర జల్ శక్తి శాఖ రెండు రాష్ట్రాలను ఆదేశించింది. అనుమతి పొందిన ప్రాజెక్టుల డీపీఆర్‌లను రెండు రాష్ట్రాలు బోర్డుకు సమర్పించాలి. డీపీఆర్‌లను మదింపు చేసి, రెండు రాష్ట్రాల అభిప్రాయాలను తెలుసుకుని వాటిపై సీడబ్ల్యూసీకి బోర్డు నివేదిక ఇస్తుంది. దాని ఆధారంగా సీడబ్ల్యూసీ టీఏసీ ప్రాజెక్టులకు సాంకేతిక అనుమతి ఇవ్వాలి. చనకా–కొరటా, చిన్న కాళేశ్వరం, గుత్ప ఎత్తిపోతలపై ఏపీ అభ్యంతరాలను గోదావరి బోర్డు తన నివేదికలో స్పష్టంగా పేర్కొంది. మరోపక్క ట్రిబ్యునల్ కేటాయింపులు లేదా ఒప్పందం ద్వారా నీటి కేటాయింపులు ఉన్న ప్రాజెక్టులను మాత్రమే రెండు రాష్ట్రాలు చేపట్టాలని విభజన చట్టం స్పష్టంగా చెబుతోంది. చనకా–కొరటా, చిన్న కాళేశ్వరం, గుత్ప ఎత్తిపోతలకు ట్రిబ్యునల్ నీటిని కేటాయించలేదు. ఏపీ, తెలంగాణ మధ్య ఒప్పందమూ జరగలేదు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకోకుండానే ఆ ఆ మూడు ప్రాజెక్టులకు సీడబ్ల్యూసీ అనుమతినిచ్చిందని, ఇదే అంశాన్ని గోదావరి బోర్డు సమావేశంలో స్పష్టం చేయాలని ఏపీ అధికారులు నిర్ణయించారు. దిగువ రాష్ట్రమైన ఏపీ హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత గోదావరి బోర్డుపై ఉందనే అంశాన్ని మరోసారి గుర్తు చేయనున్నారు. శ్రీరాం సాగర్ నుంచి సీతమ్మసాగర్ వరకు అన్ని ప్రాజెక్టులను బోర్డు పరిధిలోకి తెస్తేనే గెజిట్ నోటిఫికేషన్ అమలుకు అంగీకరిస్తామని ఏపీ అధికారులు స్పష్టం చేయనున్నారు.

మద్యం అమ్మకాలపై ‘పచ్చ’ పైత్యం

- కొత్త సంవత్సర సంబరాల్లో మద్యం విక్రయాల కట్టడి
- లిక్కర్ అమ్మకాలు 31 శాతం, బీరు అమ్మకాలు 65 శాతం తగ్గుదల
- టీడీపీ హయాంలో కంటే తగ్గిన మద్యం అమ్మకాలు



ఫ్యాక్ట్ చెక్

సాక్షి, అమరావతి: నూతన సంవత్సర వేడుకలు పురస్కరించుకుని రాష్ట్రంలో మద్యం విక్రయాలపై టీడీపీ, ఆ పార్టీకి కొమ్ముకాసే పచ్చ మీడియా మరోసారి దుష్ప్రచారానికి తెగబడ్డాయి. 2023 వేడుకల సందర్భంగా రాష్ట్రంలో గతంలో కంటే ఎక్కువగా మద్యం విక్రయాలు జరిగాయంటూ అసత్యాలను వండి వార్చాయి. కానీ, వాస్తవం మాత్రం అందుకు పూర్తి విరుద్ధంగా ఉంది. కొత్త సంవత్సర వేడుకల సందర్భంగా డిసెంబర్ 29 నుంచి డిసెంబర్ 31 వరకు మూడ్రోజులపాటు మద్యం విక్రయాలను పరిగణనలోకి తీసుకుంటారు. ఆ ప్రకారం చూస్తే 2014–19లో ఐదేళ్లపాటు ఆ మూడ్రోజుల్లో జరిగిన మద్యం అమ్మకాల కంటే 2020 నుంచి మద్యం అమ్మకాలు తగ్గుతూ వచ్చాయి. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో 2018 డిసెంబర్ 29, 30, 31 తేదీల్లో లిక్కర్ అమ్మకాల కంటే 2022 డిసెంబర్ 29, 30, 31 తేదీల్లో లిక్కర్ అమ్మకాలు 31శాతం తగ్గాయి. ఇక బీరు అమ్మకాలు అయితే ఏకంగా 65శాతం తగ్గడం విశేషం. టీడీపీ హయాంలో 2018 డిసెంబర్ 29, 30, 31 తేదీల్లో రాష్ట్రంలో 4.88 లక్షల కేసుల లిక్కర్ అమ్మారు. అదే 2022 డిసెంబర్ 29, 30, 31 తేదీల్లో లిక్కర్ 3.40 లక్షల కేసులే విక్రయించారు. అలాగే, టీడీపీ పాలనలో 2018 డిసెంబర్ 29, 30, 31 తేదీల్లో 3.62 లక్షల కేసుల బీరు అమ్మితే తాజాగా.. 2022, డిసెంబర్ 29, 30, 31 తేదీల్లో బీరు అమ్మకాలు 1.26 లక్షల కేసులకు తగ్గింది. అంటే రాష్ట్రంలో మద్యం అమ్మకాలు తగ్గుతున్నాయన్నది సుస్పష్టం.

2014 నుంచి 2022 వరకు డిసెంబర్ 29, 30, 31 తేదీల్లో మద్యం విక్రయాలు ఇలా.. (కేసులు లక్షల్లో)

టీడీపీ ప్రభుత్వ హయాంలో..

ఏడాది	లిక్కర్	బీరు
2014	5.65	1.38
2015	5.68	1.68
2016	5.87	1.89
2017	4.15	2.36
2018	4.88	3.62

వైఎస్సార్‌సీపీ హయాంలో..

ఏడాది	లిక్కర్	బీరు
2019	3.25	1.25
2020	2.54	0.88
2021	3.16	1.02
2022	3.40	1.26

స్మార్ట్ మీటర్లపై ఇంధన శాఖకు అభ్యంతరం లేదు

▶ మొదటి పేజీ తరువాయి

చదివితే వాస్తవాలు బోధపడతాయని తెలిపారు. ఆయన సోమవారం విజయవాడలో విలేకరులతో మాట్లాడుతూ.. అన్ని రాష్ట్రాల్లోనూ స్మార్ట్ మీటర్లు అమర్చాలని కేంద్రం నిర్ణయించిందని, రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కాదని తెలిపారు. ఇప్పటికే 15 రాష్ట్రాల్లో వీటి ఏర్పాటు మొదలైందని చెప్పారు. రాష్ట్రంలో తొలి దశలో 18.57 లక్షల వ్యవసాయ, 27.54 లక్షల వ్యవసాయేతర (నెలకు 200 యూనిట్లుపైన విద్యుత్ వినియోగం ఉన్నవి) సర్వీసులకు ఈ మీటర్లు అమర్చనున్నట్లు తెలిపారు. వ్యవసాయేతర సర్వీసుల్లో 4.72 లక్షలు మాత్రమే గృహ సర్వీసులని, అవి కూడా అమృత్ నగరాలు, జిల్లా కేంద్రాల్లోనే ఉన్నాయని చెప్పారు. రెండో విడతలో 13.54 లక్షల సర్వీసులకు అమర్చాలని అనుకుంటున్నప్పటికీ, వాటికి ఇంతవరకు టెండర్లు పిలవలేదన్నారు. తొలి దశ ఫలితాలను బట్టి మిగతా వారికి మీటర్లు అందిస్తామన్నారు. కొత్త సాంకేతికత అందుబాటులోకి వచ్చినప్పుడల్లా విద్యుత్ మీటర్లను మారుస్తున్నామని, దానికి వినియోగదారుల నుంచి చార్జీలు తీసుకోవడం కూడా సర్వసాధారణంగా జరిగేదేనని తెలిపారు. కానీ ఇప్పుడే కొత్తగా స్మార్ట్ మీటర్ల భారం వినియోగదారుల మీద వేస్తున్నట్లు, మీటర్లతో బిల్లులు పెరుగుతాయంటూ అసత్య ప్రచారం చేయడం తగదని, ప్రజలపై ఆర్థిక భారం పడదని అన్నారు. రాష్ట్రంలో ఎన్నో ఏళ్లుగా వ్యవసాయ, గృహ విద్యుత్ సర్వీసులు కలిపి ఉన్న ఫీడర్లు, ఓవర్‌లోడ్ అయిన ట్రాన్స్‌ఫార్మర్లలో తొలి విడతగా 9 వేలను తొమ్మిది నెలల్లో మార్చి, ఆధునీకరిస్తున్నట్లు వివరించారు. దీనివల్ల నష్టాలు తగ్గుతాయన్నారు. ఈ పనులకు, స్మార్ట్ మీటర్లకు కలిపి రూ.13,252 కోట్లు ఖర్చవుతుందని, అందులో మీటర్లకు 22 శాతం, ఫీడర్లు, ట్రాన్స్‌ఫార్మర్ల పనులకు 60 శాతం.. మొత్తం రూ.5,484 కోట్లను కేంద్రం గ్రాంట్‌గా ఇస్తుందని వెల్లడించారు. పాడైన వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయకపోవడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఇకపై విద్యుత్ ప్రమాదాలు జరగకూడదని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించడంతో వ్యవస్థను పటిష్టం చేస్తున్నామని చెప్పారు.


ఇంధన శాఖకు వచ్చిన అవార్డులను చూపిస్తున్న స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్ తదితరులు

కేంద్రం రూపొందించిన బిడ్ డాక్యుమెంట్‌తోనే టెండర్లు

కేంద్రం రూపొందించిన ‘స్టాండర్డ్ టెండర్ బిడ్ డాక్యుమెంట్’నే స్మార్ట్ మీటర్ల టెండర్లలో అనుసరిస్తున్నామని విజయానంద్ చెప్పారు. దానిలో ఒక్క అక్షరం మార్చేందుకు తమకు అధికారం లేదన్నారు. టెండర్ డాక్యుమెంట్లను న్యాయ సమీక్షకు కూడా పంపించాకే టెండర్లు పిలిచామన్నారు. ఏ ఒక్కరికో, ఏ ఒక్క సంస్థకో ప్రయోజనం చేకూర్చేలా టెండర్ నిబంధనలు మార్చడం అసాధ్యమని గుర్తించాలన్నారు. బహిరంగ పోటీ ద్వారా అన్ని అర్హతలు ఉన్న సంస్థకే టెండర్లు ఇస్తామని, ఎలాంటి అపోహలకూ తావు లేదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఏపీట్రాన్స్‌కో సీఎండీ బి. శ్రీధర్, జేఎండీలు ఐ. పృథ్వీతేజ్, బి.మల్లారెడ్డి, సెంట్రల్ డిస్కం సీఎండీ జె.పద్మాజనార్దనరెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ సంస్థల ఉన్నతాధికారులకు సీఎం అభినందనలు

ఇటీవల జాతీయ అవార్డులు గెలిచిన ఏపీ విద్యుత్ సంస్థలు

సాక్షి, అమరావతి: ఏపీ విద్యుత్ సంస్థలు జాతీయ స్థాయిలో పలు అవార్డులు గెలుచుకున్నందుకు.. ఆ సంస్థల ఉన్నతాధికారులను సీఎం జగన్ అభినందించారు. విద్యుత్ సమర్థ వినియోగంలో ఏపీ విద్యుత్ సంస్థలు ఇటీవల మూడు అవార్డులు గెలుచుకున్నాయి. ఎనర్జీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, డెవలప్‌మెంట్ విషయంలో దేశంలోనే అత్యుత్తమ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఎంపికైంది. దేశంలోనే అత్యుత్తమ ట్రాన్స్‌మిషన్ యుటిలిటీగా ఏపీ ట్రాన్స్‌కో ఎంపికైంది. న్యూ అండ్ రెన్యువబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఉత్తమ పునరుత్పాదక కార్పొరేషన్‌లలో ఒకటిగా ఎనర్షియా అవార్డును గెలుచుకుంది. ఈ అవార్డులను సోమవారం ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో సీఎం జగన్‌కు ఇంధన శాఖ ఉన్నతాధికారులు అందించారు. వారిని అభినందించిన సీఎం జగన్.. భవిష్యత్‌లో మరిన్ని అవార్డులు గెల్చుకునేలా కృషి చేయాలని సూచించారు. ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, ఏపీ ట్రాన్స్‌కో సీఎండీ బి.శ్రీధర్, ఎన్‌ఆర్‌ఈడీసీ, ఏపీ వీసీ ఎండీ ఎస్.రమణారెడ్డి, ట్రాన్స్‌కో జేఎండీ (హెచ్‌ఆర్‌డీ) ఐ.పృథ్వీతేజ్, ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పద్మాజనార్ధన్‌రెడ్డి, చీఫ్ సెక్రటరీ డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి, ఏపీ ట్రాన్స్‌కో జేఎండీ(విజిలెన్స్) బి.మల్లారెడ్డి పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు మంత్రుల శుభాకాంక్షలు

పలువురు మంత్రులు, ఉన్నతాధికారులు సీఎం జగన్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మంత్రులు బొత్స సత్యనారాయణ, ఆదిమూలపు సురేశ్, ఆర్కే రోజా, జోగి రమేశ్‌తో పాటు ఉన్నతాధికారులు సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛాలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

నామినేషన్ల గడువుకు 10 రోజుల ముందువరకు ఓటర్ల నమోదు

- ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు త్వరలో ఎన్నికలు
- గుర్తింపు రాజకీయ పార్టీల అభ్యంతరాలను పరిశీలించండి
- కలెక్టర్లు, ఎలక్షన్ ఆఫీసర్లకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఆదేశాలు

సాక్షి, అమరావతి: త్వరలో ఎన్నికలు జరగనున్న ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు సంబంధించి నామినేషన్ల దాఖలు గడువుకు పదిరోజుల ముందువరకు ఓటర్ల నమోదుకు అవకాశం కల్పిస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముకేష్‌కుమార్ మీనా చెప్పారు. ఎన్నికలు జరగనున్న మూడు పట్టభద్రుల, రెండు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు సంబంధించిన తుది ఓటర్ల జాబితాపై గుర్తింపు పొందిన రాజకీయపార్టీలతో ఆయన సోమవారం సచివాలయంలో సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన సీపీఐ, సీపీఎం, వైఎస్సార్‌సీపీ ప్రతినిధులకు తుది ఓటర్ల జాబితా అందచేశారు. ఈ సందర్భంగా మీనా మాట్లాడుతూ అర్హత ఉండి తుది జాబితాలో పేరులేని ఓటరు నమోదుకు అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. నామినేషన్ల దాఖలు గడువుకు పదిరోజుల ముందువరకు సంబంధిత ధ్రువపత్రాలను సమర్పించి పేరు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. తుది ఓటర్ల జాబితాపై గుర్తింపు పొందిన జాతీయ, ప్రాంతీయ పార్టీలు లేవనెత్తిన అభ్యంతరాలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. దీనికి సంబంధించి రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. శ్రీకాకుళం–విజయనగరం–విశాఖపట్నం పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ పి.వి.ఎన్.మాధవ్, ప్రకాశం–నెల్లూరు–చిత్తూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ వై.శ్రీనివాసులరెడ్డి, కడప–అనంతపురం–కర్నూలు పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ గోపాలరెడ్డి వెన్నపూస పదవీకాలం మార్చి 29తో ముగియనుంది. ప్రకాశం–నెల్లూరు–చిత్తూరు టీచర్ల నియోజకవర్గ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం, కడప–అనంతపురం–కర్నూలు టీచర్ల నియోజకవర్గ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి పదవీకాలం కూడా మార్చి 29తో ముగుస్తోంది. దీంతో ఈ ఐదుస్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం కసరత్తు మొదలుపెట్టింది.

తెలంగాణ

వెలుగు జిలుగుల భారత్ సృష్టిస్తాం: కేసీఆర్

- బీఆర్‌ఎస్‌లో చేరిన పలువురు ఏపీ నేతలు
- ఏపీ శాఖ అధ్యక్షుడిగా తోట చంద్రశేఖర్ నియామకం


ఏపీ నేతలను బీఆర్‌ఎస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న తెలంగాణ సీఎం కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: దేశంలో గుణాత్మక మార్పు కోసం ప్రజల ఆలోచన సరళిని మార్చేందుకు ఆలోచనపరులను ఏకం చేస్తామని, మహోజ్వల భారత్ నిర్మాణం కోసం భారత్ రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్) ఏర్పాటైందని ఆ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు అన్నారు. తమాషా, చక్కిలిగింతల కోసం బీఆర్‌ఎస్‌ను ఏర్పాటు చేయలేదన్నారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తే రెండేళ్లలో వెలుగు జిలుగుల భారత్‌ను సృష్టిస్తామని కేసీఆర్ ప్రకటించారు. ఏపీకి చెందిన రిటైర్డు ఐఏఎస్ అధికారి తోట చంద్రశేఖర్, మాజీమంత్రి రావెల కిషోర్‌బాబు, ఐఆర్‌ఎస్ మాజీ అధికారి చింతల పార్థసారథి, టీజీ ప్రకాశ్ తదితరులు సోమవారం ఇక్కడి తెలంగాణ భవన్ వేదికగా కేసీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశవ్యాప్తంగా ఏటా రూ.1.45లక్షల కోట్లు ఖర్చుచేసి రైతులకు ఉచిత విద్యుత్ ఇస్తామని, ఏటా 2.5లక్షల కోట్లతో 25లక్షల దళిత కుటుంబాలకు దళిత బంధు అమలుచేస్తామని ప్రకటించారు. ప్రధాని మోదీ విధానం ప్రైవేటీకరణ అయితే తమ విధానం జాతీయాకరణగా పేర్కొంటూ విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటుపరం చేసినా తాము అధికారంలోకి వస్తే వెనక్కి తీసుకుని జాతీయాకరణ చేస్తామన్నారు. అలాగే, ఇప్పటికే అమ్మకం జరిగిన ప్రభుత్వరంగ సంస్థలను వాపస్ తీసుకుంటామని కేసీఆర్ ప్రకటించారు. ఇక దేశంలో 40 కోట్ల ఎకరాల సాగుకు యోగ్యమైన భూమి, 40వేల టీఎంసీల నీరు, పనిచేసే మానవ వనరులు అందుబాటులో ఉన్నా అనుకున్న రీతిలో అభివృద్ధి జరగలేదన్నారు. ఈ దుస్థితిని నివారించేందుకు ప్రజా జీవితంలో ఉన్న ప్రతీవ్యక్తి ఆలోచించాలన్నారు. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, పంజాబ్, హర్యానా, ఒడిశా వంటి ఏడెనిమిది రాష్ట్రాల్లో సంక్రాంతి తర్వాత బీఆర్‌ఎస్ కార్యక్రమాలను ఉరుకులు పరుగులు పెట్టిస్తామని.. భారత్‌ను ఉజ్వలంగా తయారుచేసే మహా యజ్ఞంలో ఆంధ్రప్రదేశ్ కూడా భాగస్వామి కావాలని కేసీఆర్ ఆకాంక్షించారు. మరోవైపు.. భారత్ రాష్ట్ర సమితి ఏపీ శాఖ అధ్యక్షుడిగా తోట చంద్రశేఖర్‌ను నియమిస్తున్నట్లు కేసీఆర్ ప్రకటించారు. దళితుల సమస్యల పట్ల అవగాహన కలిగిన మాజీ మంత్రి రావెల కిషోర్‌బాబు సేవలను జాతీయస్థాయిలో వినియోగించుకుంటామని చెప్పారు. ఈ సందర్భంగా ఏపీకి చెందిన తాడివాక రమేశ్‌నాయుడు (కాపునాడు జాతీయ అధ్యక్షుడు), గిద్దల శ్రీనివాస్‌నాయుడు (కాపునాడు ప్రధాన కార్యదర్శి), రామారావు (ఏపీ ప్రజాసంఘాల జేఏసీ అధ్యక్షుడు), భారతి (మంగళగిరి) తదితరులకు కూడా కేసీఆర్ గులాబీ కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు.

డీజే ముసుగులో డ్రగ్ పెడ్లింగ్

- ఎన్సీబీకి పట్టుబడిన మోహిత్ అగర్వాల్.. అతడు సినీనటి నేహా దేశ్‌పాండే భర్త
- దేశంలోనే పేరున్న డీజే నిర్వాహకుడు.. డ్రగ్ డాన్ ఎడ్విన్‌తోనూ సంబంధాలు

సాక్షి, హైదరాబాద్: దేశంలోనే ఘరానా ఈవెంట్ల డీజే సప్లయర్ మోహిత్ అగర్వాల్ అలియాస్ మైరోన్ మోహిత్‌ను డ్రగ్స్ కేసులో హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్‌– న్యూ) అధికారులు ఆదివారంరాత్రి అరెస్టు చేశారు. ఆయన భార్య నేహా దేశ్‌పాండే పలు టాలీవుడ్, బాలీవుడ్ చిత్రాల్లో హీరోయిన్‌గా నటించారు. అతడు డీజే నిర్వాహకులతోపాటు ఈవెంట్లలో మాదకద్రవ్యాలు సరఫరా చేసేవాడని, గోవాకు చెందిన డ్రగ్స్ డాన్ ఎడ్విన్ నుంచి వీటిని ఖరీదు చేసేవాడని అధికారులు గుర్తించారు. హైదరాబాద్ కొండాపూర్ ప్రాంతానికి చెందిన మోహిత్ 2014లో ‘ది అన్‌స్క్రిప్టెడ్’పేరుతో సంస్థను ఏర్పాటు చేసి హైదరాబాద్, ముంబై, గోవా, బెంగళూరుల్లో జరిగే అనేక ఈవెంట్లు, పబ్స్‌కు డీజేలు సరఫరా చేస్తున్నాడు. గోవాలో సన్‌బర్న్ బీచ్ క్లబ్ సహా అనేక భారీ ఈవెంట్స్ నిర్వహించాడు. ఆయా పబ్స్ నిర్వాహకులతో కలిసి వాటిలో ప్రత్యేకంగా రేవ్ పార్టీలు నిర్వహించే వాడు. దీనికోసం ఎడ్విన్‌సహా దాదాపు 50 మంది డ్రగ్ పెడ్లర్లతో సంబంధాలు ఏర్పాటు చేసుకుని వారి నుంచే కొకైన్ ఖరీదు చేసి సరఫరా చేసేవాడు.

‘క్రూయిజ్’లో ఆధారాల్లేక..

గతేడాది అక్టోబర్ 2న ఎన్సీబీ అధికారులు ముంబై క్రూయిజ్ డ్రగ్ పార్టీపై దాడి చేసి షారూఖ్‌ఖాన్ కుమారుడు ఆర్యన్‌ఖాన్ సహా పలువురిని డ్రగ్స్ కేసులో అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఆ సమయంలో మోహిత్ కూడా అదే క్రూయిజ్‌లో ఉన్నా ఇతడి వద్ద ఎలాంటి డ్రగ్స్ దొరక్కపోవడం, ఆర్యన్‌తో సంబంధాలపై ఆధారాలు లేకపోవడంతో అధికారులు విడిచిపెట్టారు. గోవాకు చెందిన డ్రగ్స్ డాన్ ఎడ్విన్‌ను హెచ్‌–న్యూ అధికారులు గతేడాది నవంబర్ 5న అరెస్టు చేసి విచారించగా మోహిత్ పేరు వెలుగులోకి వచ్చింది. అప్పటి నుంచి పరారీలో ఉన్న అతడు గోవా, ముంబైల్లో తలదాచుకున్నాడు. హెచ్‌–న్యూ ఇన్‌స్పెక్టర్ పి.రాజేశ్ నేతృత్వంలోని బృందం అతడి కోసం వివిధ ప్రాంతాల్లో గాలించింది. మోహిత్ ‘డిసెంబర్ 31’న గోవాలో రూ.2 కోట్లు వెచ్చించి భారీ ఈవెంట్ నిర్వహించినట్లు సమాచారం అందుకున్న హెచ్‌–న్యూ బృందం అక్కడికి వెళ్లగా త్రుటిలో తప్పించుకుని విమానంలో హైదరాబాద్ వచ్చేశాడు. వేట కొనసాగించిన హెచ్‌–న్యూ ఎట్టకేలకు అతడిని పట్టుకుంది. అతడి వద్ద నుంచి గ్రాము కొకైన్ స్వాధీనం చేసుకుంది. రామ్‌గోపాల్‌పేట ఠాణాలో ఉన్న ఎడ్విన్ కేసులోనూ రిమాండ్‌కు తరలించింది. విచారణలో నగరానికి చెందిన అనేక మంది సినీ, రాజకీయ ప్రముఖులతో అతడికి ఉన్న సంబంధాలు బయటపడ్డాయి. అయితే వారిలో ఎందరు డ్రగ్స్ ఖరీదు చేశారు? ఏఏ పబ్స్ నిర్వాహకులతో అతడికి ఒప్పందాలు ఉన్నాయనే వివరాల గురించి పోలీసులు ఆరా తీస్తున్నారు. దీనికోసం వారం రోజులు తమ కస్టడీకి అప్పగించాల్సిందిగా కోరుతూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. డ్రగ్స్ దందాలో మోహిత్ భార్య నేహా దేశ్‌పాండేకు ఏమైనా లింకు ఉందా? అనే అంశాన్నీ పరిగణనలోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు. నేహా దేశ్‌పాండే ‘ది కిల్లర్, దిల్ దివానా, బెల్స్’ తదితర సినిమాల్లో హీరోయిన్‌గా నటించారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed at Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Amar Ujala Publications Limited, C-21-22, Sector -59, Noida, Gautam Buddhanagar, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd., 22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943